తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 2

# అధ్యాత్మ సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)


పరిష్కర్త

**కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ**



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

**1998**

ప్రథమ ముద్రణ : 1981
ద్వితీయ ముద్రణ : 1998

© తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

ప్రతులు : 2,000

ప్రచురణ :
శ్రీ M.K.R. వినాయక్, I.A.S.
కార్యనిర్వాహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

ముద్రణ :
త్రివేణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్
14/264, ఈడేపల్లి
మచిలీపట్నం - 1
ఆంధ్రప్రదేశ్

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు. ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి. వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు.

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి.

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది. తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు.

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి.

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు.

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి.

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి. ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు. పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి. తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది.

ప్రథమతః తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యుమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A.,Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము.

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం.

**M.K.R. వినాయక్**

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి, ప్రపత్తి, దేహాత్మేశ విచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు; జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు. సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు. శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు. శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు.

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు. తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి.

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు. అన్నమయ్య గ్రాంథిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు. జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు.

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు. వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు.

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి.

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది. మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది.

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి. మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది. తిరుమల-తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి.

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింప బడుచున్నాయి. పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి. తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి. సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది.

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది.

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి.

ఈ సంపుటాల ముద్రణకు అధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.కె.ఆర్.వినాయక్ I.A.S. గారికి కృతజ్ఞతాంజలి.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A., Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు.

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం. లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి.తి.దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి. సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు.

డా॥ మేడసాని మోహన్ M.A., Ph.D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

తేది : 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయ బడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి. వివిధ దశలలో 5, 6, 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి. వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

# పీఠిక

రామానుజీయసిద్ధాంతరక్షావిహారణవ్రతం ।
ఆత్మసాత్కృతశేషాద్రినాయకం తం భజేఽన్నమమ్ ॥

పాతకాలమున 50 రేకుల కొకసంపుటముగ ముద్రణమంది చెల్లిపోయిన అధ్యాత్మకీర్తనలసంపుటములలో, ఇప్పుడు వందరేకుల కొకసంపుటముగ వెలువరించువానిలో రెండవసంపుట మిది. ఇందులో అధ్యాత్మకీర్తనముల 101 రేకునుండి 150 రేకుల వరకుగల 50 రేకుల లోని 284 సంకీర్తనములను, 6-వ సంపుటముగా శ్రీ అర్చకం ఉదయ గిరి శ్రీనివాసాచార్యులవారు 1951 లో ప్రచురించిరి. ఈ 50 రేకు లలో 121 నుండి 130 వరకుగల 10 రేకులు నాడూ నేడూ కూడ దొరకలేదు.

అదేసంవత్సరమున 151 నుండి 200 రేకుల వరకుగల 50 రేకుల-లోని 285 పాటలను, పూజ్యపాదులు కీర్తిశేషులు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారూ, శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులును కలిసి 7-వ సంపుటముగా వెలయించిరి. ఆ రెండుసంపుటములకు చెందిన 100 రేకులలోని 519 అధ్యాత్మకీర్తనలు ఇప్పు డీరెండవసంపుట-మున సుపరిష్కృతపద్ధతిలో వెలువరింపబడుచున్నవి.

పూర్వపరిష్కరణమునకు ఇప్పటి పరిష్కరణమునకు ఏవైన భేదములున్నచో అవియన్నియు, పాదదీపికలో (Foot notes) ౧,౨,౩ వగైరా గుర్తులతో సూచించియున్నాను.

నేను పరిష్కరించిన ప్రతిసంపుటమునందు పీఠికలో ఏదోవొక వ్యాకరణ విశేషమును చర్చించుచూ వచ్చితిని. అధ్యాత్మసంకీర్తనల-సంపుటములందుమాత్రము వేదాంతవిషయములకే పీఠికలో ప్రాధాన్య మివ్వదలచితిని. అధ్యాత్మకీర్తనల తొలివందరేకులకు సంబంధించిన-

మొదటిసంపుటములో, 'అన్నమయ్య వేదాంతము' అను విషయ-ముపై సంగ్రహముగ చర్చ సాగించితిని. ప్రకృత సంపుటమునందు ప్రపత్తి - శరణాగతి - పంచసంస్కారముల*ను గూర్చి లఘువుగ చర్చింపదలచితిని. తొలుత శరణాగతినిగూర్చి విచారింతము.

## శరణాగతి

'శరణం యథాతథా ఆగతిః' అని విగ్రహవాక్యము కావచ్చు. ఆగతిః అను పదము విరువనిచో శరణాగతి యను దీర్ఘము కుదురదు. శరణశబ్దము అకారాంతము గదా! "శరణం గృహరక్షిత్రోః" అని అమరము గృహమును, రక్షకుడైన వానిని ఈ శబ్దము చెప్పు చున్నది. కాని పాంచరాత్రమునకు సంబంధించిన సంహితలలో

"ఉపాయే గృహరక్షిత్రోశ్శబ్దః శరణమిత్యయం
వర్తతే, సాంప్రతం చైష ఉపాయార్థైకవాచకః"

(అహిర్బుధ్న్యసంహిత. 3—7—28)

ఉపాయమునకుగూడ ఈశబ్దము వాచకమనీ, శరణాగతి శబ్దము నందు ఉపాయమే ప్రధానముగ గ్రహింపబడినదనీ తెలియుచున్నది. భక్తుని పరమపదమునకు తీసికొనిపోవుటకు, భగవంతు డొకడే సాధనము అని దాని అర్థము. ఈ శరణాగతి ఆరువిధములుగ పేర్కొనబడినది.

---

* శరణాగతి పంచసంస్కారములనుగూర్చి నాకు సతీర్థ్యులు, సహోపాధ్యాయులుగ నుండినవారు, సహృదయులు నగు శ్రీమాన్ టి. ఏ. కృష్ణమాచార్యుల నుండి, ప్రపత్తిని గూర్చి శ్రీమాన్ కందాడై-శేషాచార్యుల ఆంధ్రీకృతియగు 'రహస్యత్రయసారము' నుండి, శ్రీమాన్ కుంటిమద్ది శేషశర్మగారి 'శ్రీమద్రామాయణ వ్యాఖ్యావలోకనము' నుండియు విషయములు గ్రహింపబడినవి.

ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం।
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా।
ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః॥

అని వచనము. ఈ ఆరింటియందును ఆత్మనిక్షేపము అంగిగా, తక్కినవి ఐదును దానికి అంగములుగా చెప్పబడుచున్నవి. యోగమునకుకూడ యమ - నియమ - ఆసన - ప్రాణాయామ - ప్రత్యాహార ధ్యాన - ధారణ - సమాధులు అష్టాంగములుగా పేర్కొనబడినను, వానిలో సమాధి అంగిగా, తక్కినవి దానికి అంగములుగా పేర్కొనబడినట్లే, షడ్విధశరణాగతిలో కూడ మనము గ్రహింపవలసియున్నది.

1. ఆనుకూల్య సంకల్పము :

"శ్రుతిః స్మృతిః మమైవాజ్ఞా" అను భగవద్వచనాను సారము, శ్రుతిస్మృతులలో చెప్పబడిన నిత్యనైమిత్తికములందు, భగవద్విషయమునందు మాత్రమే శ్రద్ధ గలిగియుండునటుల సంకల్పించుకొనుట.

2. ప్రాతికూల్య వర్జనము :

భగవద్వ్యతిరిక్తములు, భగవద్విరుద్ధములు అగు విషయములను పరిత్యజించుట.

3. రక్షిష్యతీతి విశ్వాసము :

భగవంతుడు తప్పక నన్ను రక్షించును, అను గాఢశ్రద్ధ.

4 గోప్తృత్వ వరణము :

నీవుతప్ప నాకు వేరు రక్షకుడు లేడు అని, భగవంతునివే తనకు రక్షకుడుగా నిర్ణయించుకొనుట.

**5. ఆత్మ నిక్షేపము :**

తనకు సంబంధించిన సర్వభారమును (పోషణము, రక్షణము, ఆపదలనుండి కాపాడుట, పరమగతికి తీసికొనిపోవుట వగైరాలను) స్వామికే సమర్పించుట.

**6. కార్పణ్యము :**

నేను అకించనుడను, అనన్యథా గతిలేనివాడను. నాకు నీవే దిక్కు. నన్ను తప్పక కాపాడవలెను అని, తన దీనత్వమును చాటుకొనుట.

ఈ ఆరింటిలోను పైన చెప్పినట్లు ఆత్మనిక్షేపము అంగిగా, తక్కినవి అంగములుగా పరిగ్రహించవలెను.

> నిక్షేపాపరపర్యాయః న్యాసః పంచాంగసంయుతః ।
> సన్న్యాసస్త్యాగ ఇత్యుక్తః శరణాగతిరిత్యపి ॥

అను వచనముతో స్పష్టమగుచున్నది. దీనిని భరన్యాసమని కూడ వ్యవహరించుచున్నారు. అందు కనిరయే సన్న్యాసము = ఇహాముత్ర ఫలభోగవిరాసము అని వ్యవహరించుచుందురు. ఇతరమతములలో సన్న్యాసాశ్రమమునకు పెద్దవిలువ కలదు. శ్రీవైష్ణవసంప్రదాయము-నందు సన్న్యాసులకు అంత పెద్దవిలువ కానరాదు. శ్రీవైష్ణవుడుగ పుట్టినప్రతిప్రాణియు శరణాగతి పొందినవాడుగనే చెప్పబడు-చున్నాడు. గృహస్థాశ్రమమును వదలియుండుటమాత్రమే శ్రీవైష్ణవసన్న్యాసులలో విశిష్టత. "ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్" అను మనువచనము ప్రకారము దేవర్షిపితౄణములు మూడును చెల్లిన వెనుక సన్న్యాసము వీరిలో పద్ధతి. ఇతర-మతములందు నైష్ఠికబ్రహ్మచారిగనే ఉండి "యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్" అను వచనము ప్రకారము బ్రహ్మచర్యాశ్ర

మమునుండియే సన్న్యసించి పీఠాధిపతులగుట కలదు. ఇతరులలో కూడ గృహస్థాశ్రమమునుండి సన్న్యసించిన వారికి అంత పెద్దవిలువ లేదనియే చెప్పవచ్చును.

❋

# శరణాగతి పద్ధతి

"అహమస్మ్యపరాధానా మాలయోఽకించనోఽగతిః
త్వమేవోపాయభూతో మే భవేతి ప్రార్థనామతిః
శరణాగతి రిత్యుక్తా సా దేవేఽస్మిన్ ప్రయుజ్యతామ్"
(అహిర్బుధ్న్య సంహిత 37—30)

అను వచనము ప్రకారము అకించనః = ఉపాయరహితః (ఏ ఉపాయము లేనివాడను), అగతిః = రక్షకాంతరరహితః (నన్ను రక్షించు వేరు దిక్కెవ్వడు లేని వాడను) అను భావముతో నీవే నన్ను దరి చేర్చుటకు ఉపాయభూతుడవు అని ప్రార్థించి శరణు పొందుటయే శరణాగతి. ఇట్లు శరణాగతుడైనప్పుడే. వీడు ఏదిక్కు లేని వాడు నన్నే నమ్ముకొన్న వాడు నేనే వీనిని తప్పక ఉద్ధరించవలెను అను భావముతో, స్వామి ఆ భక్తుని తప్పక ఉద్ధరించును అని శ్రీ వైష్ణవ సిద్ధాంతము. ఇందు కుదాహరణముగ గజేంద్రమోక్ష కథా వగైరాదులను ఉదాహరించుచుందురు. గజేంద్రుడు కొన్ని యేండ్లు మకరితో పోరాడి, తన బలముచేతనే మకరిని జయించి, తన్ను రక్షించుకొనగలనను ఉద్దేశముతో తాను పోరాడినంతకాలమూ, స్వామి తనకు పట్టనట్లే వుండినాడు. రానురాను ఆ గజేంద్రుడు క్షీణబలుడై, తనశక్తికి మించిన ప్రభుశక్తియే ఈ మకరిని చంపి నన్ను రక్షించగలదు

అను ఉద్దేశముతో భగవంతుని స్వరూపమును, శ్రుతిస్మృతులలో పేర్కొన్నదానిని గానము చేసినాడు. ఫలములేదు. తుదకు

నాయం వేద స్వమాత్మానం యచ్ఛక్త్యాహంధియా హతః
తం దురత్యయమాహాత్మ్యం భగవంతమితోఽస్మ్యహమ్॥
(భాగవతము 8–3–29)

అను వచనముతో స్వామిని శరణాగతి పొందినాడు. అప్పుడే స్వామి కరుణించి, గజేంద్రుని తనవానినిగా స్వీకరించి పరుగెత్తి వచ్చినాడు. మకరిని చంపి కాపాడినాడు. ఈఘట్టమునందు పోతన స్పష్టముగ

ఓ కమలాప్త! యోవరద! యో ప్రతిపక్షవిపక్షదూర! కు-
య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! యోశరణాగతామరా-
నోకహ! యో మునీశ్వరమనోహర! యోవిమలప్రభావ! రా
వే, కరుణింపవే, తలఁపవే, శరణార్థిని నన్నుఁ గావవే॥
(ఆంధ్రమహాభాగవతము 8–92)

అను పద్యములో 'శరణార్థిని' అను పదమును ప్రయోగించి శరణాగతికి ఉన్న మహిమను చాటినాడు. సంస్కృత భాగవతములోని అహం=నేను; ఇతః=శరణంగతః, అస్మి=ఉన్నాను అను అర్థమునకు స్పష్టప్రతీకమిది.

★

# ప్రపత్తి

ప్రకృష్టం యథాతథా పద్యతే ఇతి ప్రపత్తిః అని విగ్రహము.

సాధనం భగవత్ప్రాప్తౌ స ఏవేతి స్థిరా మతిః
సాధ్యభక్తిః స్మృతా, సైవ ప్రపత్తిరితి గీయతే॥

అని భగవచ్ఛాస్త్రము.

ప్రపత్తిః = మానసికాధ్యవసాయాత్మకజ్ఞానము. భగవంతు డొక్కడే నాకురక్షకుడు అనుగట్టివిశ్వాసము.

"అభీష్టే దుష్ప్రాపే స్వత ఇతరతో వా క్వచన తత్
భరన్యాసం యాచ్ఞాన్విత మభివదంతి ప్రపదనం।
ఇతః పశ్చా దస్మద్యతనవిరపేక్షేణ భవతా
సమర్థ్యోఽపావర్త్య స్త్వితి మతివిశేషం తదవిదుః॥

— రహస్యత్రయసారము, సాంగప్రపదనాధికారం—1.

దీనితో జీవుడు స్వామికి తనసర్వస్వమును సమర్పించుకొనుట నే ప్రపత్తి అని తెలియుచున్నది.

అహం మద్రక్షణభరో మద్రక్షణఫలం తథా।
నమమ శ్రీపతేరేవే త్యాత్మానం నిక్షిపేద్బుధః॥

— న్యాస దశకము.

ఇత్యాదులతో అహం = [భగవంతుని అపరప్రకృతియగు పంచభూతములతో సృష్టింపబడి, సుఖదుఃఖములకు లోనవుతూ మోహాబద్ధుడగు సంసారిజీవుడు, అనంతసంసారములో తెలిసి తెలియక చేసినపనుల వలన కల్గినఆచార్యకృపావిశేషమువలన, ముక్తికి ఉపాయముగా ప్రపత్తినే గ్రహించదలచిన జీవుడు, నారాయణేతర దైవములను

ఆశ్రయింపనివాడు, ఇతర దైవతములకు బంటుకానివాడు, ప్రపత్తి తప్ప ఇతరోపాయములను ఆశ్రయింపని జీవుడు.] అగు నేను; న మమ=నాకుగా కాను, శ్రీపతేరేవ=లక్ష్మీపతికే నేను దాసుడను. అని ఆత్మానం=తనను నిక్షిపేత్ = సమర్పించుకోవలెను. అట్లనే మద్రక్షణభరః = నన్ను రక్షించుకొనే భారముకూడ, న మమ = నాకు కాదు; మద్రక్షణఫలం = నన్ను రక్షించినదానివల్ల లోకమునకు గాని, స్వామికిగాని, ఏదైనాకలిగే ఫలితముంటే అదికూడ, న మమ= నాకు కాదు; శ్రీపతేరేవ=ఇవన్నియు లక్ష్మీపతికే సమర్పితములగు చున్నవి. అని భరన్యాసమును చేయుటయే ప్రపత్తి అని వడగల సంప్రదాయమువారు చెప్పుచుందురు. పైవిధముగ శరణాగతి పొంది ఇట్లు భరన్యాసము చేసినవానిని, స్వామి తప్పక కటాక్షించి కడతేర్చు నని వీరిభావము. జీవునికి స్వరక్షణశక్తిగాని పరరక్షణశక్తిగాని శాత్తిగా లేదనియే

"స్వయం మృత్పిండభూతస్య పరతంత్రస్య దేహినః।
స్వరక్షణే ప్యశక్తస్య కోహేతుః పరరక్షణే॥

— రహస్యత్రయసారము 168 పుట.

ఇత్యాది శ్లోకములలో స్పష్టముగ అర్థమగుచున్నది. శరణాగతిలో చెప్పిన ఆత్మనిక్షేపమే "ఆత్మాత్మీయ భరన్యాసోహ్యాత్మనిక్షేప ఉచ్యతే" ఇత్యాదివాక్యములతో విశేషమగు భరన్యాసమునే ప్రపత్తిగా ఈతెగవారు భావించుచుందురు

వపురాదిషు యోపికోపివా గుణతోసాని యథాతథావిధః।
తదయం తవపాదపద్మయో రహ మద్యైవ మయా సమర్పితః॥

— రహస్యత్రయసారము 171 పుట.

అను ఆళవందార్ స్తోత్ర పద్యముకూడ ఈ ప్రపత్తికే ఎక్కువగ సహాయపడుచున్నది. ఒక్కమాటలో చెప్పవలెనంటే తనను, తన

సర్వస్వమునూ స్వామికే సమర్పించి నేటినుండి, నేను నీవాడ ననుటయే శరన్యాసపరమార్థముగ కనబడుచున్నది శరణాగతికి ప్రపత్తికి పెద్దభేదము లేదని తెంగలవైష్ణవులు. శరణాగతి యున్నను ప్రపత్తి విశిష్టమైనదని వడగలవాండ్లును వ్యవహరించుకొనుచుందురు. మా అన్నమయ్య శరణాగతిని, ప్రపత్తిని రెండింటిని పలుతావుల వాడి యున్నందున ఈయన తెంగలవాడో వడగలవాడో నిర్ధరించుట కష్టమనిపించుచున్నది.

నాదరామక్రియ

ప్రపన్నులకు విది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు ॥ పల్లవి ॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేశాంతరము మాని
వగధరు శరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము ॥ ప్రప ॥

దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతుల పొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

(ఈ సంపుటము పాట—317)

ఇంతకూ ఈ వ్యవహారములో దూరముగ నుండుటయే మంచిదని నాభావము.

నేటి తాళ్ళపాక వంశీయులు మాత్రము వడగల నామము నే ధరించుచున్నారనుట నిర్వివాదము.

# పంచ సంస్కారములు

శ్రీ వైష్ణవమతదీక్ష పుచ్చుకొనువారికి పంచ సంస్కారములు అతిప్రధానములు

తాపః పుండ్రః తథా నామ మంత్రో యాగశ్చ పంచమః
అమీ పరమసంస్కారా పారమైకాంత్య హేతవః ॥

1. తాపము :

తాపము = ముద్రాధారణము. రెండు భుజములందును శంఖ చక్రములు కాల్చి ముద్రించుకొనుట. దీనినే సమాశ్రయణమనియు- నందురు.

2. పుండ్రము :

ముఖమున ఊర్ధ్వపుండ్రము ధరింతురు. శ్రీ వైష్ణవమతదీక్ష ఇచ్చునపుడు ఆదీక్ష ఇచ్చుగురువే, ముఖముననున్న ఊర్ధ్వపుండ్ర- ములు కాక భుజములు, వక్షస్థలము, ఉదరము, కంఠము మొదలగు- స్థలములయందు మరి పదకొండు ఊర్ధ్వపుండ్రములు, దీక్షపొందు వానికి ధరింపజేతురు. ముఖమునందున్న దానితోకూడ ఈపదకొండు కలిసి ద్వాదశోర్ధ్వపుండ్రములుగా ప్రసిద్ధికెక్కినవి.

3. నామము :

నామకరణసమయమున తల్లిదండ్రులు పెట్టినపేరుకాక, దీక్షా సమయమున దీక్షానామముగ 'రామానుజదాసః' 'శ్రీనివాసదాసః' ఇత్యాది పేర్లుంచి వ్యవహరింతురు. 'దీక్షాఖ్యా తృతీయం స్యాత్.' అని మంత్రశాస్త్రముగూడ.

4 మంత్రము :

వీరికి ప్రధానమంత్రము "ఓం నమోనారాయణాయ" అను అష్టాక్షరియే. ఇదికాక ద్వయమని రెండు మంత్రములను కూడ ఉపదేశింతురు.

1. శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే
2. ఓం నమో భగవతే నారాయణాయ

అనునవి. ఈమంత్రములను నిత్యమూ యథాశక్తి జపించుచుండుట శ్రీవైష్ణవదీక్షలో ఒక భాగము.

5. యాగము :

ఈ శబ్దము 'యజ దేవపూజాయాం' అను ధాతువునుండి పుట్టినది. శ్రీ వైష్ణవమతసిద్ధాంతముప్రకారము భగవదారాధన పద్ధతినుపదేశింతురు. ఈ పంచసంస్కారములు పరమైకాంతులుగ (భగవంతునికి చాలసన్నిహితులుగ) నగుటకు కారణములని శ్రీ వైష్ణవ సిద్ధాంతము.

మన అన్నమయ్య ఈ పంచసంస్కారములను విష్ణువామక యతిచే పొందినట్లు చిన్నన్న తెలిపినాడు. వీరికి శరణాగతి, ఆశరణాగతి పొందినదానికి ఫలితముగా కూడా శ్రీమద్రామాయణ, భారత, వరాహపురాణములనుండి మూడు చరమశ్లోకములను ఉదాహరించుచుందురు.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యః దదామ్యేత ద్వ్రతం మమ॥"

— శ్రీమద్రామాయణము.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వ పాపేభ్యః మోక్షయిష్యామి మాశుచః॥"

— మహాభారతము.

స్థితే మనసి, సుస్వస్థే శరీరే సతి, యోనరః
ధాతుసామ్యే స్థితే స్మర్తా విశ్వరూపం చ మామజం।
తతస్తం మ్రియమాణంతు కాష్ఠపాషాణసన్నిభమ్
అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్॥

— వరాహపురాణము.

ఇది వరాహపురాణ చరమశ్లోకముగా ప్రసిద్ధము.

శరణాగతి పొంది, నిరంతరము అష్టాక్షరిమంత్ర-ద్వయోపాసకునకు అవసానకాలమందు భగవన్నామస్మరణము అత్యవసరము, తప్పక కలుగవలెనుకూడ. కాని అవసానకాలమున, వాతకఫాదులతో అడ్డగింపబడిన కంఠముకలిగి, స్మృతిదప్పి పడియున్నవానికి భగవన్నామస్మరణము కలుగకపోవచ్చును. అట్టి యవసానస్థితిలోకూడ వానిని నే నుద్ధరించుచున్నాను. బాగున్నకాలమున నన్ను స్మరించిన-నాభక్తుని, కొయ్యవలెనో - రాతివలెనో అపస్మారస్థితిలోనున్నవానిని నేనే స్మరింతును. నేనే వానిని పరమగతికి తీసికొనిపోవుదును. అను భగవద్వచనముగలవరాహచరమశ్లోకము స్వామికరుణను ఎంత గొప్పగ చాటుచున్నదబ్బా.

మన అన్నమయ్య పై చెప్పిన పంచసంస్కారములను తాను పొందినట్లు, గురుముఖముగ విశిష్టమైన యాగమును తాను చేయించుకొనినట్లు ఈ క్రిందిపాటలవలన అర్థమగుచున్నది.

ధన్నాసి

జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము
నానార్థములు విన్నె నడపె మాగురుఁడు ॥పల్లవి॥

అలరి దేహమనేటియాగశాలలోన
బలువై యజ్ఞానపుపశువు బంధించి
కలసివైరాగ్యపుకత్తుల గోసి కోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు ॥జ్ఞాన॥

మొక్కుచు వైష్ణవులనేమువిపత గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థసోమపానము[1] నించి
చక్కగాఁ పంకీర్తనసామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెఁటో మాగురుఁడు ॥ జ్ఞాన ॥

తదియ్యగురుప్రసాదపుపురోడాశ మిచ్చి
కొదదీర ద్వయమనుకుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షముచేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మా గురుఁడు ॥ జ్ఞాన ॥

(౹౪ సంపుటము పాట - 148)

దేసాళం

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ॥ పల్లవి ॥

యీతనికరుణనేకా యిల వైష్ణవులమైతి -
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతఁడేకా వుపదేశమిచ్చె నష్టాక్షరిమంత్ర -
మీతఁడే రామానుజులు యిహపరదైవము ॥ గతు ॥

వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము ॥ గతు ॥

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశునగమెక్కెవాకిటను
దయఁజూచి మమ్ము నిట్టే తల్లిదండ్రిదైవము ॥ గతు ॥

(౹౪ సంపుటము పాట - 372)

---

1. ఈ శ్రీ పాదతీర్థవర్ణన వడగల వారికి లేదందురు.

ఈపంచసంస్కార-శరణాగతి-ప్రపత్తులను నమ్మినవాడు నిత్య-నైమిత్తిక కర్మలను తప్ప, కామ్యకర్మలను అచరింపరాదు. ఇతర-దేవతలను కొలువరాదు అను వైష్ణవసిద్ధాంతమును అన్నమయ్య ఈసంపుటము 22వ పాటలో చాటుకొన్నాడు.

గుజ్జరి

కలదిదివో సుఖము గలిగినను గర్వము విడువక మానవా
మలసి కామ్యకర్మములకుఁ జొచ్చిన మగుడఁ బుట్టువులు
మానవా ॥పల్లవి॥

పరగ నింద్రజిత్తుఁడు హనుమంతుని బ్రహ్మాస్త్రంబునఁ గట్టి
అరయ నందుపై మోకులుగట్టిన నల్బ్రహ్మాస్త్రము వదలె
పరిపరివిధముల నిటువలెనే హరిఁ బ్రపత్తి నమ్మినవరుఁడు
తిరుగఁ గర్మమార్గమునకుఁ జొచ్చిన దేవుఁడు దనవాత్సల్యము
వదలు ॥కల॥

అలరినసంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపున నొక యిఱ్ఱిఁ బెంచినంతనే తనకును నారూపు దగిలె
ములుగుచు లంపటములు దెగవిడిచి మోక్షము వెదకెటివరుఁడు
వలవనిదుస్సంగతులు పెంచినను వానిని లంటక మానవా
॥కల॥

అటుగన కొఁబట్టినవ్రత మొండఁగ నన్యమతము చేపట్టినను
నటనల నెందునఁ బొందక జీవుఁడు నడుమనె మోహుఁడై నట్లు
తటుకన శ్రీవేంకటపతి నొక్కనిదాస్యము తఱియించినవరుఁడు
ఘటనల నాతనికైంకర్యములకు కడుఁబాత్రుఁడుగాక మానవా
॥కల॥

(ఈ సంపుటము పాట—22)

ఈ దీక్షపొందిన వారలలో నారద సనక సనందనాదులు ముఖ్యులని, వారితోపాటు వైకుంఠముననున్న అన్నమయ్యను కలిపి, పెద తిరుమలయ్యయో లేదా చినతిరుమలయ్యయో పాడినపాటగ ఈ సంపుటములో 24-వ పాటగా ప్రకటింపబడుచున్నది.

లలిత

శరణంటి మాతనిసమ్మంధమున నే
 మరిగించి మమునేలి మన్నించవె ॥పల్లవి॥

సకలవేదములు సంకీర్తనలు చేసి
 ప్రకటించి విను(ఁ బాడి పావనుఁడైన–
 అకలంకుఁడు తాళ్ళపాకన్నమాచార్యుల
 వెకలితై యేలిన శ్రీవేంకటనిలయ ॥శర॥

నారదాది సనకసనందనాదులవలె
 పేరుపడి విన్నుఁబాడి పెద్దలైనట్టి–
 ఆరీతిఁ దాళ్ళపాకన్నమాచార్యుల
 చేరి యేలినయట్టి శ్రీవేంకటనిలయ ॥శర॥

సామవేదసామగానసప్తస్వరములను
 బాముతో నీపతి విన్నుఁ బాడినయట్టి–
 ఆముకొన్న తాళ్ళపాకన్నమాచార్యుల
 వేమరు మెచ్చిన శ్రీవేంకటనిలయా ॥శర॥

(ఈసంపుటము పాట—24)

వారందరూ నిత్యసూరులని వ్యవహరింపబడుచుందురు. వారిని గూర్చి ఈ క్రింది పాటలో ఘనముగ కొనియాడినాడు.

వరాళి

అదివో నిత్యసూరులు అచ్యుత నీదాసులు
 యెదురులేనివారు యేకాంగవీరులు ॥పల్లవి॥

రచ్చల సంసారమనేరణరంగములోన
తచ్చి కామక్రోధాలతలలు గొట్టి
అచ్చపుతిరుమంత్రపుటారుపుటొబ్బులతోడ
యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

మొరపి పుట్టుగులనేముచ్చుఁబోఁజుల కురికి
తెరలి నడుములకుఁ దెగవేసి
పొరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటులఁ దూరి
మొరగావి తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

వొడ్డినదేహములనేవూళ్ళలోపల చొచ్చి
చెడ్డయహంకారమను(మునః?)చెఱలు వట్టి
అడ్డమై శ్రీవేంకటేశు నండనుండి లోకులనే -
యొడ్డలఁ జూచి నవ్వేరు యేకాంగవీరులు ॥ అది ॥

(ఈ సంపుటము. పాట—25)

ఇది అన్నమయ్యదే.

తప్త చక్రాంకమును పరిహసించేఇతరమతస్థులకు తెలిపిడిగాఁ ఆ చక్రాంకనము వేద ప్రసిద్ధమని అన్నమయ్య 485-వ పాటలో స్పష్టము చేసినాడు.

రామక్రియ

అదె శిరశ్చక్రములేనట్టిదేవర లేదు
యిదె హరిముద్రాంకిత మిందే తెలియరో ॥ పల్లవి ॥

"అనాయుధాసో అసురా అదేవా" యని
వినోదముగ ఋగ్వేదము దెలిపెడి
సనాతనము విష్ణుచక్రధారణకును
అనాదిప్రమాణ మందే తెలియరో ॥ అదె ॥

"యచ్చ యింద్రే" యని "యచ్చ సూర్యే" యని
అచ్చుగ తుదకెక్కె (క్క?) నదె పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందునిముద్రాధారణకు
అచ్చమయినప్రమాణ మందే తెలియరో ॥ అదె ॥

మును "నేమినా తప్తముద్రాం ధారయే" త్తని
వెనువెంటశ్రుతి యదె వెల్లవిరివేసీని
మొనసి శ్రీవేంకటేశు ముద్రాధారణకు
అనువుగఁ బ్రమాణ మందే తెలియరో ॥ అదె ॥

(ఈ సంపుటము పాట 485)

'అనాయుధాసో' అను ఋక్కును గూర్చి మాదేవస్థానములో వేద-పారాయణమును చేయు బ్రహ్మశ్రీ వేదమూర్తులు సుబ్బావధానుల-వారి నడుగగా, ఈక్రింది ఋక్కును వారు వ్రాసి ఇచ్చినారు. దానినే ఇందు చూపుచున్నాను.

"తిగ్మ మాయుధీం మరుతా మనీకం క స్త ఇంద్రవతి వజ్రం దదర్ష।
అనాయుధాసో అసురా అదేవా శ్చక్రేణ తాం అపవపఋజీషిన్ ॥
మహఉగ్రాయ తవసే సువృక్తిం ప్రేరయ శివతమాయ పశ్వః।
గిర్వాహసే గిర ఇంద్రాయ పూర్వీర్దేహి తన్వే కువిదంగ వేదత్ ॥
ఉక్థవాహసే విభ్వే మనీషాం"

(ఋగ్వేదము–8వ అష్టకము, 8వ అధ్యాయము—33–వర్గము)

దీనియర్థము ఋగ్వేదభాష్యముతో తెలియదగినది. దీనివలన మన అన్నమయ్య వేదప్రమాణసిద్ధమైనవిగా తెలిసికొనియే, పంచ-సంస్కారములతో శ్రీవైష్ణవమతదీక్షను పుచ్చుకొన్నాడని తెలియు-చున్నది. అందువలననే ఆమతదీక్షయందు గాఢశ్రద్ధ గలిగి, ఆ సంప్ర-దాయానుసారముగనే స్వామినారాధించి, సిద్ధి పొందినాడని తెలియు-చున్నది.

ఆహిరి

విడువరా దెంతైనా వెట్టివాడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును ॥ పల్లవి ॥

జ్ఞానము నే నెఱఁగ నజ్ఞానమూ నే నెఱఁగను
మానను విషయములు మరిగెంతైనా
నీనామము నొడిగి నీదాసుఁడ ననుకొందు
దీనికే వహించుకొని తిద్దుకో నన్నును ॥ విడు ॥

అకర్మము నెఱఁగను సుకర్మము నెఱఁగను
ప్రకటసంసారముపై పాటు మానను
వొకపనివాఁడనై వూని ముద్రధారినైతి
మొకమోడి యిందుకే గోమున నేలు నన్నును ॥ విడు ॥

వెనకఁ గానను ముందు విచారించి కానను
వినుపై దేహధారినై నీకు మొక్కేను
ఘనుఁడ శ్రీవేంకటేశ కన్నులెదుటఁ బడితి
కని పోవిడువరాదు కరుణించు నన్నును ॥ విడు ॥

(ఈసంపుటము పాట 2)

అందుకనియే ఈ రెండవపాటలో 'కడవారు' నవ్వకుండా అను పద-ముతో, నేనొకమతమువారిలో పుట్టి నీమతము స్వీకరించితిని. వాఙన్మ-మతమువారు నన్ను నవ్వకుండునట్లు నన్ను కాపాడుము అని స్వామికి నివేదించుకొన్నాడు. ఈపాట రెండవచరణములోని "ఒకపనివాడనై వూని ముద్రధారినైతి" అనుదానితో, అనితరలభ్యసులభోపాయ-ముతో దివ్యమోక్షసిద్ధిని గోరి నేను ముద్రాధారినైతిని అని స్పష్టము చేసికొనినాడు.

సాళంగనాట

దొరకె మాపాలికిఁ గందువయర్థము
దరిదాపై యుండినతత్వార్థము ॥పల్లవి॥

తిరముగ నల్లదివిఁ దెచ్చినయర్థ మిదివో
విరజవోడరేవున వెళ్లినర్థము
పరమభాగవతులు పాఁతినర్థ మిదివో
పురుషోత్తముఁడనేటిపురుషార్థము ॥దొర॥

చందపువేదముఁ(లు?) శాసనము వేసినర్థము
ముందు సముద్రలకెల్లా మొదలర్థము
అందరియాత్మలనేటిఅంగళ్లలోనియర్థము
యెందు సహస్రనామపుటెన్నికర్థము ॥దొర॥

కొలచి బ్రహ్మాండముల కొప్పెరలోనర్థము
యిల నిహపరముల కెక్కినర్థము
యెలమి హీనునినైన యెక్కుడు సేసేయర్థము
అలరి శ్రీవేంకటేశుఁడైనయర్థము ॥దొర॥

(ఈ సంపుటము పాట-3)

ఈ మూడవపాటలో, "ముందు సముద్రలకెల్లా మొదలర్థము" అనుచానితో ఈ ముద్రాధారణమునకు ప్రధానార్థము పురుషోత్తమ-సాన్నిధ్యమే అని చాటినాడు. ఈ పంచసంస్కారముల నంది, శ్రీ-వైష్ణవమతసంప్రదాయానుసారము నడచుకొను తనయందు చిల్లర-మల్లర దోషములు ఏవైనా కనపడితే, అవి ఆయారజస్తమోగుణ-ములప్రభావమేకాని, వాఆత్మ పరివర్తనము చెందినదనికాదు. అని గట్టిగా గద్దించి తెలిపినాడు. నేను నీమతదీక్ష బొంది నీవు నన్ను దరిచేర్తువని, గురుముఖముగ శరణాగతుడనై నడచుకొనుచున్న

నాయందు, దోషములేవైన ఉన్నచో అవి నాగురుని జూచియైన మన్నించవయ్యా అని, పరమవిధేయుడై వేడుకొనుచున్నాడు. తుదకు 'నీభక్తుడనైన నాకు ఏదైన ఆపద సంభవించినట్లైతే అది నీకే చెడ్డపేరు స్వామీ. కావున 'నిన్నుఁ జూచుకొని నన్ను నీవే ఏలవయ్యా' అని సూటిగా అడిగినాడు. చూడుడు:—

సాళంగనాట

నాకు వలదు కేమి వోదు నన్ను నీ వేమిచూచేవు
  నీ కరుణ గలిగితే వించి చూపవయ్యా ॥ పల్లవి ॥

ఘోరమైనదేహపు దుర్గుణ మేమి గలిగిన
  ఆరసిఁ బ్రకృతిఁ బోయి నడుగవయ్యా
  నేరవినాజన్మముతో (లో?) నేరుపేమిగల్లా నన్ను
  ధారుణిఁ బుట్టించినవిధాత నడుగవయ్యా ॥ నాకు ॥

పంచేంద్రియములలోని పాప మేమి గలిగినా
  అంచెలఁగామునిఁబోయి అడుగవయ్యా
  ముంచిననాకర్మములో మోస మేమి గలిగినా
  మంచితనానఁ జేయించేమాయ నడుగవయ్యా ॥ నాకు ॥

అన్నిటా నా వెనకటి అపరాధ మేమిగల్లా
  మన్నించి నాగురుఁ జూచి మానవయ్యా
  మిన్నక శ్రీ వేంకటేశ మీఁదిపనులేమిగల్లా
  నిన్నుఁజూచుకొని నన్ను నీవే యేలవయ్యా ॥ నాకు ॥

(ఈ సంపుటము పాట—28)

ఈపాటలో " కామోకార్షీత్ మన్యుర—కార్షీత్ " అను శ్రుత్యర్థము నిగూఢమైయున్నదని భావింపవలసియున్నది.

భూపాళం

ఇవి సేయఁగ నే నలఁసుద యెటువలె మోక్షం బడిగెదను
వివరముతోఁదుత నీవు సులభుఁడవు విష్ణుఁడ విన్నే కొలిచెదఁగాక ॥ పల్లవి

జపయజ్ఞదానకర్మంబులు యెంచఁగ చిరకాలఫలంబులు
యెపుడుఁ బుణ్యతీర్థస్నానములు యిల పాపవిమోచనములు
అపరిమితదేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
వుపవాసాదినియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు ॥ ఇవి ॥

రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
తవిలినపంచేంద్రియనిగ్రహంబులు తనుధరులకు దుర్లభములు
అవిరళధర్మార్థకామంబులు మతియైశ్వర్యములకు మూలములు
అవలగ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు అకామయము ॥ ఇవి ॥

పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికివి సంసారభోగము
హరి నరహరి శ్రీవేంకటేశ్వరా అఖిలము నొసఁగెడిదాతవు
సరుగన నీవే దయతో రక్షించఁజాలుదు నేకాలమును మమ్మును ॥ ఇవి ॥

(౪ సంపుటము పాట-౩౨౮)

కాని ఈపాటతో అన్నమయ్య సోమరివాడై, ఉపవాస వ్రతములు, తపోనిష్ఠలు మొదలైనవి సాగింపలేక, శరణాగతి సులభమని, ఆపద్ధతి నవలంబించినాడేమో అని అనుకొనవచ్చు. స్వామియే దిక్కని అతనిపైననే సర్వభారము నిడి, మనసా-వాచా-కర్మణా అతనినే సేవించుచు, ఇతరభోగములకు అఱ్ఱులు సాచక, తక్కువకాలములో ఫలమిచ్చు ఇతర దేవతల నారాధింపక, జీవితాంతము శ్రీహరినే నమ్మి, తనను అతనిబంటుగనే భావించి, అతని-సంకీర్తనములందే మునిగి కాలముతోయుట ఇతరులకు సాధ్యమా? ఏదో దెబ్బతిన్నవాడు, బలవంతునిచే పీడింపబడినవాడు, తన ప్రాణ-

రక్షణకు ఒక దొడ్డవానిని తాత్కాలికముగ శరణని అనవచ్చు గాని, సర్వకాలమూ స్వామియందే మనసు నిలిపి, మోక్షార్థియై అతనిపరిచర్యాయందే కాలముగడుపుచుండుట అనెడిశరణాగతికి, ప్రాణరక్షణకోసరము శరణమశరణాగతికిని భేదములేదా. ఈపై రెండు శరణాగతులకు, పూటగడచుటకు పడుపువృత్తి చేకొను పడతికిని, పతినే దైవముగా భావించి కాలముదోయుమహాపతివ్రతకును గలఅంతరువుగలదు

ఎంత శరణాగతిపొందినా, ఎంతప్రపత్తిచేసినా, ఎంతయోగినైనా పరిపూర్ణజ్ఞానముగలిగి, పరమాత్మ సాన్నిధ్యము సిద్ధించువంత వరకు లోకధర్మములను పాటింపవలసినదే అను భావమునూ, తన గురుభక్తిని ఈక్రింది పాటలలో చాటుకొన్నాడు చూడుడు.

ధన్నాసి

హరిదాసులతోడ నల్పులు వెదకరాదు
గురుఁడు శిష్యుఁడనేగుఱి దప్పుఁగానా ॥పల్లవి॥

కోరి ముత్యపుఁజిప్పలఁ గురిసినవానయు
సారెఁజెంకులలోనాన సరియౌనా
శ్రీరమణుఁ డిన్నిటాను జేరియుండే సందేఁగాక
సారెకుఁ బాత్రాపాత్ర సంగతింతా లేదా ॥హరి॥

మలయాద్రి మాఁకులును మహిమీఁదిమాఁకులును
చలమున నెంచిచూడ సరియౌనా
అలరి దేవుఁడు అంతర్యామియైతే నాయఁగాక
తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా ॥హరి॥

అమరులజన్మములు నమర్త్యలజన్మములు
జమళిఁ బుట్టినంతలో సరియౌనా
అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతేనాయఁగాక
తమితో నధికారిభేదములు లేవా ॥హరి॥

([illegible] పా—44)

మలహరి

అన్నిటాను హరిదాసు లధికులు
కన్నులవంటివారు కమలజాదులకు ॥ పల్లవి ॥

అందరును సమమైతే సరుహాసరుహము లేదా
అందరిలో హరియైతే నౌఁగాక
బొందితో విప్రునిఁదెచ్చి పూజించినట్టు వేరే -
పొందుగావిశువకముఁ బూజించఁదగునా ॥ అన్ని ॥

అన్ని మతములు సరియైతేను వాసిలేదా
చెన్నగుఁబురాణాలు చెప్పఁగాక
యెన్నఁగ సౌర్ణటంక మింతటానుఁ జెల్లినట్లు
సన్నపుఁదోలుబిళ్లలు సరిగాఁ జెల్లునా ॥ అన్ని ॥

గక్కునఁ బైరు విత్తఁగా గాదము మొలచినట్టు
చిక్కువకర్మములెల్లాఁ జెలఁగెఁగాక
తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్టు
యెక్కుడా మోక్షోపాయ మిఁకఁ జెప్పనున్నదా ॥ అన్ని ॥

([illegible]సంపుటము పాట–17[illegible])

భక్తిబలముకలిగినప్రాణి, జంతువైనను, మనుజుడైనను భేదములేదు. భక్తిబలము లేనివాడు దొడ్డరాజైనను ప్రయోజనము లేదనువిషయమును ఈ 181 వ కీర్తనలో గొప్పగ చెప్పినాడు.

లలిత

ఇహమేకావి యిఁకఁ బరమేకావి
బహుళమై హరి నీపైభక్తే చాలు ॥ పల్లవి ॥

యెందు జనించిన నేమి యెచ్చోటనున్న నేమి
కందువనీదాస్యము గలిగితేఁ జాలు
అంది స్వర్గమేకావి అలనరకమేకావి
అందపునీనామము నా కబ్బితే చాలు ॥ ఇహ ॥

దొరయైనఁ జాలుఁ గడుఁ దుచ్ఛపుఁబంట్లైనఁ జాలు
కరఁగి విన్నుఁదలఁచఁగలితేఁ జాలు
పరులు మెచ్చినమేలు పమ్మిదూషించినమేలు
హరినీసేవాపరుఁడౌటే చాలు ॥ ఇహ ॥

యిలఁ జదువులురాసి యిటు రాతమానసీ
తలఁపు నీపాదములతగులే చాలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను విట్టె
చలపట్టి నాకు నీశరణమేచాలు ॥ ఇహ ॥

(ఈ సంపుటము పాట–181)

దీనికి

"దివివా భువివా మమాస్తువాసః
నరకేవా నరకాంతక ప్రకామమ్।
అవధీరితశారదారవిందౌ
చరణౌ తే మరణేఽపి సంశ్రయామి ॥"

అని కులశేఖరాళ్వార్ ప్రతిపాదించిన ముకుందమాలా స్తవమును జ్ఞప్తికి తెచ్చుచున్నది ఈ పాట.

శరణాగతి పొందినవారికి సర్వోపాయములు శ్రీలక్ష్మీనాథుడే అన్న విషయమును, తననిత్యానుష్ఠానములో నున్న దానిని, ఎంత చక్కగ ఈ 182 వ పాటలో చెప్పుకొన్నాడో గమనింపుడు.

మలహరి

సర్వోపాయముల (లు?) జగతి నా కితఁడే
పూర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే ॥ పల్లవి ॥

సకలగంగాదితీర్థస్నానఫలము లివి స్వామిపుష్కరిణిజలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాసయాత్ర లివి సరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చటఁ జాతువడికైంకర్య
మిదియే ॥ సర్వో ॥

ఉపవాసతపము లివి యితనిప్రసాదంబు లొగి భుజింపుటే నాకు
దినదినంబు
జపరహస్యోపదేశంబు లితనిపాదజలంబులు శిరణనేటిసేవయొకటే
ఉపమింపఁ బుణ్యపురుషులదర్శనము నాకు నొగినిచటిబహువృక్ష
దర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటియెన్నఁగలబహుపక్షి
కలకలంబు ॥ సర్వో ॥

తలఁపుగలయోగంబులందు శ్రీవైష్ణవులఁ దగులుసంవాసనహయోగంబు
వెలయ విందుమహోత్సవంబు లిన్నియు నితనివిభవంబులెసఁగు
తిరునాళ్లు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనంతయు నాకు శ్రీవేంకటేశ్వరుని
శరణాగతి
అలరునాసంపదలు యితని పట్టపురాణి అలమేలుమంగకడకంటి
చూపు ॥ సర్వో ॥

(ఈ సంపుటము పాట—132)

ఇంతగాభక్తిగలశరణాగతునికి మోక్షమివ్వక శ్రీవేంకటేశ్వరుడు తప్పించుకొనగలఁడా?

బొమ్మగానున్న స్వామికి జరిగెడి ప్రత్యుత్సవముమా, ఆయన "యేవిధములుగ సాక్షాత్పరమపురుషునికి జరిగినట్లుగ భావించినాడో ఈ 148 పాట గొంతెత్తి చాటుచున్నది. చూడుడు :—

లలిత

ఎందు నీకుఁ బ్రియమో యీతెప్పతిరుణాళ్ళు
దిందువడె సిరులతో తెప్పతిరుణాళ్ళు ॥ పల్లవి ॥

పాలజలవిధిలోఁ బవ్వళించి పాముతెప్పఁ
దేలుచున్న దది దెప్పతిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్కమఱ్ఱియాకుమీఁద
తేలుచున్న దది తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

అమృతము దచ్చునాఁడు అంబుధిలో మందరము
తెమలఁ దేలించుతెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగునంగపుపడిగెమీఁద
తిమిరి తొక్కిన తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

అప్పుడు పదారువేలుఅంగనలచెమటల
తెప్పలఁ దేలిన తెప్పతిరుణాళ్ళు
వొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతిఁ గోనేటిలోన
తెప్పిరిల్లె నేఁటనేఁట తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

(ఈ సంపుటము పాట–143)

ప్రతివ్రతాధర్మముతో వేంకటేశ్వరునితప్ప ఇతరులను సేవింపని— అన్నమయ్య లోకులను రాజులను మనసులో వుంచుకొని, ఎవ్వరిని లెక్కసేయని విధముగ ఎట్లు ఎత్తిపోయుచున్నాడో ఈ 144 వ పాట చెప్పుచున్నది. చూడుడు :—

లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగిన దిది మాకాఁపురము ॥ పల్లవి ॥

నరహరికీర్తన నానినజిహ్వా
వొరుల నుతింపఁగనోపదు జిహ్వా
మురహరు పదముల మొక్కినశిరము
పరులవందనకుఁ బరగదు శిరము ॥ తలఁ ॥

శ్రీపతినే పూజించినకరములు
చోఁపి యాచనకుఁ జొరవు కరములు
యేపున హరికడ కేఁగినకాళ్ళు
పాపులయిండ్లకుఁ బారవు కాళ్ళు ॥ తలఁ ॥

శ్రీవేంకటపతిఁ జింతించుమనసు
దావతి వితరముఁ దలఁచదు మనసు
దేవుఁ దతనియాధీనపుతనువు
తేవల వితర్రాధీనము గాదు ॥ తలఁ ॥

(ఈ సంపుటము పాట–144)

ఈయన పాటలలో శ్రుత్యర్థము సాహిత్యరూపము ధరించి, ఎంతచక్కగ రూపకాలంకారముగ ఇముడుచున్నదో గురుతింపవచ్చు.

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు
బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహ ఏవచ ।
ఇంద్రియాణి హయానాహుః విషయాన్ స్తేషు గోచరాన్
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ॥

— కఠోపనిషత్తు

ఈ శ్రుతికి వన్నెలు దిద్ది, పూర్ణరూపణము చేసినాడు అన్నమయ్య. ఇందులో శ్రుత్యర్థము ఛాయగా మాత్రమే తీసికొని, దానికి మంచి అలంకార సంస్కారము చేసినాడు.

మాళవి

గుఱ్ఱాలఁ గట్టవితేరు కొంక కెంధైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ దీసీవి వేడుకతో జీవుఁడు ॥ పల్లవి ॥

సరి పిఱుఁదే రెండు జంటబండికండ్లు
సరవితోఁ బాదాలు చాఁపునొగలు
గరిమఁ జూపులు రెండు గట్టినపగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలుటెక్కెలు
మించైన శిరసే మీఁదనున్న శిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పాపపుణ్యములు రెండు పక్కనున్న చీలలు
తోపులయన్నపానాలు దొబ్బుఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీధుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

(ఈ సంపుటము పాట-152.)

## అద్వైతదూషణము - ఖావనము

అన్నమయ్య నందవరీకస్మార్తబ్రాహ్మణకుటుంబములో జన్మించుటచే ఆయన పుట్టుకతో అద్వైతి. ఇతనికాలము నుండి ఆ-ఇంటిపేరుగల వీరి కుటుంబమునందు మాత్రము, విశిష్టాద్వైతము కాపు చేసికొన్నది. పరతత్వవిషయములో అద్వైతవిశిష్టాద్వైతములకు ఏమంత పెద్దభేదము కానరాదు. కాని ఈయనది మధ్యావైష్ణవము గదా. కావున కొన్ని పాటలయందు సాక్షాత్తుగ అద్వైతమునే ఖండనచేసినపట్టులు కానవచ్చుచున్నవి.

బౌళి

పురుషుండని శ్రుతి వొగడీనట ఆపురుషుఁడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి విని వింటే నసంబద్ధములు ॥పల్లవి॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట ఆమూరితి అవయవరహితుఁడట
తగుబాహువులను రాజులట ఆతత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యులట ఆబ్రహ్మము దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతనిరూపము లేదట ॥పురు॥

తనవందనమునఁ గలదట దైవము తనఁ జూడఁ గన్నులు లేవట
తనవిన్నపమునఁ జేయునట ఆతనికివి వీనులు లేవట
తనయిచ్చినదే నైవేద్యంబట దైవమునోరే లేదట
తనయిచ్చేటిధూపంబును గలదట దైవము ముక్కున
లేదట ॥పురు॥

అంతాఁ దానే దైవమటా; యజ్ఞము లొరులకుఁ జేయుటట
పంతతముసుఁదా స్వతంత్రుఁడటా జపముల వరముల చేకొంటట
చింతింపఁ దానే యోగియటా చేరువ మోక్షము లేదట
పంతపుశ్రీవేంకటపతి మాయలు పచారించిన వివియట ॥పురు॥

(ఈ సంపుటము పాట-252.)

శంకరాభరణం

ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యలాల ॥పల్లవి॥

పాప మొక్కఁడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున వొకరిపుణ్య మిందరికి రావలదా
కోపించి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁ డొక్కఁడైతే సుర లిందరుఁ గావలదా ॥ఏకా॥

ఒకఁ డపవిత్రుఁడైతే నొగి నిందరుఁ గావలదా
ఒకఁడు శుచై వుండితే నోడ కిందరుఁ గావలదా
ఒకవిరతిసుఖ మంటే యిందరును నొనరఁ బొందవలదా
ఒకవిదుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా ॥ఏకా॥

అకట నొకఁడు ముక్తుఁడయితే నందరుముఁగావలదా
దీకొని యొకఁడు బంధుఁ(బద్ధు)డయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి -
లోకపుమునులనుఁ దెలుసుకోవలదా ॥ఏకా॥

(ఈ సంపుటము పాట 253)

లలిత

దోమటి వింతెరఁగరా తొల్లిటివారు
వామదేవవసిష్ఠవ్యాసాదులు ॥పల్లవి॥

తానే దైవమైతే తపమేల జపమేల
పూని సారెఁ బూజించేపూజలేల
కూసు వంగి యింటింటఁ గోరనేల వేఁడనేల
యీనెపాన లోకమెల్లా నేలరాదా తాను ॥దోమ॥

తగఁ దా స్వతంత్రుఁడైతే దరిద్రదుఃఖములేల
నొగిలి వ్యాధులచేత నొవ్వనేల
వగుబాటులైన జననమరణములేల
ముగురువేల్పులదండ మొనచూపరాదా ॥దోమ॥

శ్రీవేంకటేశుఁడే శేఖరపుదైవమని
సావధానుఁ డితనికి శరణుచొచ్చి
భావములోపలఁ దనపాపబంధములఁ బాపి
కాపుల నాతనికృప దండ చేరరాదా ॥దోమ॥

(ఈ సంపుటము పాట-415)

పై ఖండనలోని విషయములుకూడ అంత పెద్దశాస్త్రీయములూ కావు, దుస్సమాధేయములూ కావు. అన్నమయ్యకు వైష్ణవమతము, ఆమతదీక్ష, దానికి సంబంధించిన సంప్రదాయసిద్ధములగు అర్చనాదులు ఉన్నట్లు స్పష్టముగ తెలియుచున్నవి. కాని ఎన్నోజన్మలనుండి వెంబడించినఅద్వైతవాసన ఈతనిలో పూర్తిగ మాసినట్లు కానరాదు. ఆమాపు పెదతిరుమలాచార్యాదులందు స్పష్టముగ కానవచ్చుచున్నది. ఒక్కొక్క పట్టునందు తనకు తెలియకనే అద్వైత భావన ఇతని పాటలలో దొరలుచున్నట్లు కానవచ్చుచున్నది.

శ్రీరాగం

ఇంతయు నీమాయామయ మేగతిఁ దెలియఁగవచ్చును
దొంతిఁబెట్టినకుండలు తొడరినజన్మములు ॥ పల్లవి ॥

కలలోపలిసంభోగము ఘనమగుసంపద లివ్నియు
వలలోపలివిడిపరువులు వన్నెలవిభవములు
తలఁపన గలిగియు నిందునే తగులకపోదెవ్వరికివి
తెలిపినఁ దెలియదు యిదివో దేవరహస్యంబు ॥ ఇంత ॥

అద్దములోపలినీడలు అందరిదేహపురూపులు
చద్దికివండినవంటలు జంటఁగర్మములు
పొద్దొకవిధమయి తోఁచును భువి వర్షానాంబుధిలో—
నద్దిన దిది దెలియఁగరా దంబుదములమెఱుఁగు ॥ ఇంత ॥

మనమునఁ దాగినపాలివి మదిఁగలకోరిక లిన్నియు
యినుమున విగిరిననీళ్ల యిల నాహారములు
పనివడి శ్రీ వేంకటగిరిపతి నీదాసు లివిన్నియు
కని మని విడిచిన మనుజులకాయపుమర్మములు ॥ ఇంత ॥

(ఈ సంపుటము పాట-133)

పాడి

చూచే చూపొకటి సూటి గురి యొకటి
　　కాచి రెండు నొకటైతే దైవమే సుండీ　　　　॥ పల్లవి ॥

యేనుగఁ దలఁచితే యేనుగై పొడచూపు
　　మాను దలఁచిన నట్టే మానై పొడచూపు
　　పూని పెద్దకొండ దలపోయఁ గొండై పొడచూపు
　　తానే మనోగోచరుఁడు దైవమే సుండీ　　　　॥ చూచే ॥

బట్టబయలు దలఁచ బయలై పొడచూపు
　　అట్టె యంబుధి దలఁచ నంబుధియై పొడచూపు
　　పట్టణము దలఁచిన పట్టణమై పొడచూపు
　　తట్టి మనోగోచరుఁడు దైవమే సుండీ　　　　॥ చూచే ॥

శ్రీ వేంకటాద్రిమీఁది శ్రీపతిఁ దలఁచితేను
　　శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతై పొడచూపు
　　భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ
　　తావు మనోగోచరుఁడు దైవమే సుండీ　　　　॥ చూచే ॥

(ఈ సంపుటము-పాట-141)

గుజ్జరి

అందాఁకాఁ దాఁ దానే అంతకెక్కుడు గాఁడు
　　ముందువెనకెంచేనా ముఖ్యుఁడే యతఁడు　　　　॥ పల్లవి ॥

చిత్తమంతర్ముఖము సేసుకొనవేర్చెనా
　　అత్తల నతఁడు యోగియనఁబడును
　　సత్తసత్తనెడిసువిచారంబు గలిగెనా
　　వుత్తమవివేకియని వూహింపఁబడును　　　　॥ అందాఁ ॥

భావము నభావమును పరికించి తెలిసెనా
కైవల్యనిలయుఁడపి కానఁబడును
దైవంబుఁ దన్ను మతిఁ దలపోయనేర్చెనా
జీవన్ముక్తుఁడని చెప్పఁబడు నతఁడు ॥ అందాఁ ॥

అదరి వైరాగ్యధన మార్జించనోపెనా
దిడువై జితేంద్రియస్థిరుఁ డాతఁడు
జడియు శ్రీవేంకటేశ్వరు దాసుఁ డాయనా
బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు ॥ అందాఁ ॥

(ఈ సంపుటము పాట-452)

ఈ భావములు పరికించినపుడు ఈతడు మహాయోగియై విష్ణుభక్తుడై పరమార్థమున ఏమతమునకు చెందనియోగివలె కన్పించుచున్నాడు.

బౌళి

ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచిచూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు ॥ ఎంత ॥

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు(లఁ)మిము నానావిధులను తలఁపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలఁచినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచినఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ ఎంత ॥

నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁదితామెరవు
ఆవల భాగీరథిదరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్నదైవమని
యీవలనే నీశరణనియెదను యిదియే పరతత్త్వము నాకు॥ఎంత॥
(ఈ సంపుటము పాట-393)

అద్వైతులభక్తిలో శివకేశవ భేదము లేదనుట సుస్పష్టమే కదా. అందులకనియే అప్పయ్యదీక్షితులవారి పద్యములుగా ఈ క్రింది రెండు పద్యముల నుదాహరించుచుందురు.

"మారమణ ముమారమణం
ఫణధరతల్పం ఫణాధరాకల్పం।
పురమథనం మురమథనం
వందే బాణారి మసనుబాణారిమ్॥

వాసుదేవ ఇతి వామదేవ ఇ-
త్యస్తికల్పక మహీరుహద్వయం।
యద్యపీహ 'సుమ'భేదసంభవః
నాస్త్యథాపి ఫలభేద సంభవః॥

ఒక చర్చాసందర్భమున వీనిలో మొదటిపద్యమును నేనుదాహరింపగా, పూజ్యులు కీర్తిశేషులు మద్గురువర్యులు పండితరాజ డి. టి. తాతాచార్యస్వాములవారు రెండవపద్యము నుదాహరించిరి. రెండును మనోహరములే. ఉత్తరహరివంశాదులందలిపద్యములు అందరకు తెలిసినవే.

## దేవునిలో లోపము

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుణ్ని తననెచ్చెలికానిగా తనప్రాణవిభునిగా భావించి తరించినాడు. ఆ స్నేహగుణము స్వామిని ఎత్తిపొడుచుటకు గూడ వెనుకాడదు. భక్తునికి ప్రత్యక్షదైన్యము,

పరోక్షదైన్యము అను రెండుగుణములు సహజములే. ప్రత్యక్ష దైన్యముతో నేను అకించనుఁడను, జడప్రాయుడను, దిక్కులేనివాడను ఇత్యాదిగా వాపోవుచుండును. పరోక్షదైన్యముతో స్వామిదోషము లనే యెత్తిచూపి దెప్పుచుండుటయు అది ఒకవిధమైన సరదాశక్తి. భక్తునికి స్వామియందుగల చనవునకు గురిగా సాగుచుండును.

నాదరామక్రియ

పరులకైతే నిదే పాసముగాదా
పురిగొని నీవంటఁ బుణ్యమాయఁగాక ॥ పల్లవి ॥

పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధింపఁగ
దొరసి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు ॥ పరు ॥

నారాయణుఁడ నీవు నడపినదే తగవు
ఆరూఢి నీవౌనన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో చండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు ॥ పరు ॥

శ్రీవేంకటేశ నీవుచేసినదే నీతి
చేవతో నీవాడఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
ఆవేళ నడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు ॥ పరు ॥

ఇందు తండ్రికొడులకు విరోధము పెట్టుట, అన్నదమ్ములను విడదీ: యుట, మనుమనిచే తాతను చంపించుట మొదలగునవి సాధారణ లోకధర్మముతో పాపకార్యములు. కాని స్వామి ప్రహ్లాదహిరణ్య— కశిపులకు విరోధము కల్పించుట, వాలి సుగ్రీవులను విడదీయుట, అరు

నునిచే భీష్ముని చంపించినాడనుట పురాణప్రసిద్ధము. దీని అంతరార్థ మును పరిశీలింపక పై లౌకికార్థములు మాత్రమే పరిగ్రహించి తిట్టదలచినవారు నోరార తిట్టవచ్చు. అదే ఈ పాటలో జరిగినపని. స్వామితో చనవుబలియనిసామాన్యభక్తుడు ఈమాట లనలేడు. అందుకనియే కూరత్తాళ్వాన్ అను వైష్ణవభక్తుడు అతిమానుష స్తవ మునందు

> యత్త్వత్ప్రియం తదిహపుణ్య మపుణ్యమన్యత్
> నాన్య త్తయో ర్భవతి లక్షణ మత్ర జాతు।
> ధూర్తాయితం తవ తు యత్కిల రాసగోష్ఠ్యాం
> తత్కీర్తనం పరమపావన మామనంతి॥

అని స్వామిని కీర్తించినాడు. 'స్వామీ నీకిష్టమైనపని పుణ్యకార్యము. నీవు సమ్మతింపనిది పాపము. ఈ పుణ్యపాపములు రెంటికిని ఇక వేరు లక్షణము లేదు. రాసగోష్ఠియందు నీవు చేసినధూర్తకృత్యము పరమపావనముగ కీర్తింపదగినదని వ్యాసాదులగు పెద్దలందరు వాపోవుచున్నారు' అని దీనిభావము.

### తప్పుచేసి తప్పించుకొనే పద్ధతి.

ఈ పద్ధతినికూడ మన అన్నమయ్య ధారాళముగనే చాటి నాడు. కామాదులను యథేచ్ఛముగ ననుభవించి అవి నాకు సంబంధించినవికావు అని అంటే పోతాయట, పాముకాటు చీరతో తుడిస్తే పోతుందా? అని మన మడుగవచ్చు. మనము ఈ ప్రశ్న ఎవ్వరి నడుగుచున్నాము. మన మెంతటివారము అని ముందు పరామర్శించుకోవలెను. మనలో ఉన్న అంతర్యామిని పరమాత్మగ భావించి తన్మయముగ మారినమహానుభావులు, ఇంచుమించు అత్యాశ్రమి ధర్మముగలవారు ఏపని చేసినా చెల్లుతుంది. శ్రీకృష్ణుడు గోపికలను సత్కరించినాడని మనమూ అట్టిపనికి అఱ్ఱులు సాచ —

వచ్చుగాని, ఆతడుచేసిన గోవర్ధనోద్ధరణము, దావానలకబళనము, విశ్వరూపప్రదర్శనము మనకు సాధ్యములా? ఆ కార్యములతో ఆతనిఅంతస్తును గుర్తెరిగి, అట్టివాడు ఎన్నిపనులు చేసినా చెల్లును కాని, మనము అట్టికార్యములు చేసిన తప్పునుండి బయట పడలేము అనినోరుమూసికొని పడియుండుట మనబోంటి వారికి తగినపని.

"ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యో అభిచాకశీతి॥

అను శ్రుత్యర్థమునే అన్నమయ్య ఈ రెండు కీర్తనములందును విపులముగ వివరించినాడని తలపోయవలసియున్నది. చూడుడు.

మాళవిగౌళ

ఇన్నిటికిఁ బ్రేరకుఁడు యీశ్వరుఁ డింతే
పన్ని యీతనిఁ దెలిసి బ్రదుకుటే జ్ఞానము ॥ పల్లవి ॥

మనసునఁ బుట్టిన మంకుఁగామక్రోధాలు
పసిలేవు తనకంటేఁ బాపమంటదు
పనివి తొడిమ నూడి పండు వీఁగె నంటదు
జనులకెల్లాఁ బ్రకృతిసహజ మింతే ॥ ఇన్ని ॥

చేతులారఁజేసేటిచేకొన్నకర్మానకు
ఘాతలఁ గర్తఁ గానంటే కట్టువడఁడు
ఆతల నవికముంచినట్టివేఁడి చెయ్యంటదు
జాతి దేహము మోఁచినసహజ మింతే ॥ ఇన్ని ॥

వాకునవాడినయట్టివట్టిపల్లదాలనెల్లా
దాకొని పొరయనంటే తప్పులే లేవు
పైకొని శ్రీవేంకటేశుబంటుకు వళకులేదు
సైకమైన హరిభక్తిసహజ మింతే ॥ ఇన్ని ॥

(ఈ సంపుటము పాట-288)

రేవగుప్తి

నీ వెఱఁగనిది లేదు నీ యాజ్ఞ మోఁచితి నింతే
నీవాఁడ నింతె హరి నే ననఁ జో·· ॥పల్లవి॥

కన్నుల కెంపైనఁ జూపుకలది స్వభావము
యెన్నఁగ నాయందుఁ బాప మెంచఁ జోటేది
విన్ననై చెవుల కింపు వినుట స్వభావము
పన్నినకర్మాలు నన్నుఁ బైకొనఁ జోటేది ॥నీవె॥

నాలికకుఁ జవియైతే నమలుటే సహజము
నాలి అభోజ్యపునింద నాకుఁ బనేమి
మూల వాసనగొనేది ముక్కుకు సహజము
జోలిబంధములు నన్నుఁ జుట్టఁగఁ జోటేది ॥నీవె॥

కాయము కాయముపొంత గరఁగుటే ఆ గుణము
నేయవిచేఁతలు నాపైఁ జెప్పఁ జోటేది
యీయెడ శ్రీ వేంకటేశ యిన్నిటిలో నన్నుఁ బెట్టి
పాయక నాలో నుండువు పట్టఁగఁ జోటేది ॥నీవె॥

( సంపుటము—పాట 388)

## పెదతిరుమలాచార్యుల వచనములు — వానికి మూలము

తాళ్ళపాకకవులందరిసారస్వతమునకు అన్నమయ్యసారస్వతమే బీజముగా, భిక్షగా మనము తలపోయ వలసియున్నది. అన్నమయ్య పెట్టిన భిక్షనే ఆతనితనయులు మనుమలు శాఖోపశాఖలుగ నానాఛందస్సులలో పండించినారనుట సత్యము.

మాళవిగౌళ

నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టిపరమాత్మునికి ॥పల్లవి॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుఁగొనచూపులే ఘనదీపములట
తనలోపలియంతర్యామికిని ॥ నిత్య ॥

పలుకే మంత్రమట పాదైననాలికే
కలకల మనుపిడిఘంటయట
నలువైనరుచులే నైవేద్యములట
తలఁపులోపలమన్నదైవమునకు ॥ నిత్య ॥

గమనచేష్టలే యంగరంగగతియట
తమిగలజీవుఁడే దాసుఁడట
అమరినపూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికిని ॥ నిత్య ॥

(ఈ సంపుటము పాట-82)

## గుజ్జరి (ఏకతాళి)

శ్రీ వేంకటగిరిదేవా నా దేహంబు నీవుండెడి నిత్యనివాసంబు
నాజ్ఞానవిజ్ఞానంబులు నీయుభయ పార్శ్వంబుల దీపంబులు
నాముకుఁ జెలిమలయూర్పులు నీయిరుదెసలం బట్టెడియాలవట్టంబులు
నామనోరాగంబు నీకుం జంద్రకావివలువ
నీకుమొక్క నెత్తినచేతులు రెండును మకరతోరణంబులు
నాభక్తియే నీకు సింహాసనంబు
నా మేనం బొడమిన పులకలు నీకు గుదులుగ్రుచ్చి యర్పించినపూదండలు
నే మిమ్ము నుతించిననుతులయక్షరరవంబుల
భేరీభాంకారఘంటికానినాదంబులు
నాపుణ్యపరిపాకఫలంబులు నీకు నైవేద్య తాంబూలాదులు

మదీయనిత్యసేవాసమయనిరీక్షణఁబులు నీసర్వాంగఁబుల
నలఁదిన తట్టుపునుంగు
నాసాత్వికగుణంబు నీకు ధూపపరిమళంబు నీవు దేవదేవుఁడు
నే నర్చకుండను
ఈరీతి నిత్యోత్సవఁబు నాయందు నవధరింప శ్రీవేంకటేశ్వర
రా మఱియును

(–పెదతిరుమలయ్య-వేంకటేశ్వరవచనములు-౧)

## విఠలునిచరిత్ర

### బౌళిరామక్రియ

వసుధఁ జూడఁ జిన్నవానివలె నున్నవాఁడు
వెస నన్ని విద్యలాను వెలసె విట్ఠలుఁడు ॥ పల్లవి ॥

పరగ నేడునూటడెబ్బదియేడుగురిచేత–
నిరవై పాడించుకొన్నాఁ డీవిట్ఠలుఁడు
సరస నైదులక్షలిండ్లజవ్వనపుగొల్లెతల
మరిగించుకొన్నవాఁడు మఱి యీ విట్ఠలుఁడు ॥ వసు ॥

(ఈ సంపుటము పాట-217)

ఈ విట్ఠలుని చరిత్రము అన్నమయ్య పలుతావుల పలుకీర్తనలలో గానముచేసినాడు. కాని ఈపాటలోని కొన్నివిశేషములు నేటి కింకను బయల్పడవలసియున్నవి. అన్నమయ్య నాటికే 770 మందిచేత పాడించుకొన్నాడట విఠలుడు. ఐదులక్షలజవ్వనపు–గొల్లెతలను మరిగించుకొన్నాడట. ఈ రెండుచిట్టాలు చరిత్రకారులు, శ్రీమద్భాగవతపరిశీలకులు తేల్చవలసియున్నది.

## పరమార్థ గ్రంథములు

అన్నమయ్యకు భారత భాగవత రామాయణములు పరమ ప్రామాణిక గ్రంథములు. శృంగార సంకీర్తనలలో భాగవతమునందలి

గోపికలచరిత్రమే అడుగడుగున పట్టిచూపుచుండును. అధ్యాత్మ కీర్తనలందన్నచో భారత, భాగవత, రామాయణాలు మూడును సమప్రధానముగ వాడుకొనుచుండును. ఇందుకు దృష్టాంతముగ ఈ క్రిందిపాట నుదాహరింపవచ్చు.

లలిత

వాదులేల చదువులు వారు చెప్పినవేకావా
వాదులేల మీమాట వారికంటే నెక్కుడా ॥ పల్లవి ॥

నాలుగువేదాలబ్రహ్మ వలి నెవ్వనిసుతుఁడు
వాలినపురాణాలవ్యాసుఁ డెవ్వని దాసుఁడు
లీల రామాయణపువాల్మీకివసిష్ఠులు
ఆలకిం చెవ్వనిఁ గొల్చి రాతఁడే పో దేవుఁడు ॥ వాదు ॥

భారత మెవ్వనికథ భాగవతము చెప్పిన-
ధీరుఁడైన శుకుఁడు యేదేవుని కింకరుఁడు
సారపుశాస్త్రాలు చూచి సన్యసించి మడిగేటి -
నారాయణనామపునాథుఁడేపో దేవుఁడు ॥ వాదు ॥

విష్ణువాజ్ఞయని చెప్పేవిధి సంకల్ప మేదది
విష్ణుమాయయని చెప్పే విశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ" మనేవేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవేంకటాద్రి విభుఁడే ఆదేవుఁడు ॥ వాదు ॥

(ఈ సంపుటము పాట-404)

## లోకపరిశీలనము - ఆత్మపరిశీలనము

అన్నమయ్య లోకములోనిప్రాణులందరిని ఎంత చక్కగ పరిశీలించి చూచినాడో మనమీపాటలో గురుతింపవచ్చు.

రామక్రియ

పాపెల్లా నొక్కచో నుండు; భాగ్య మొక్కచోనుండు
యీటువెట్టి పెద్దతనా లెంచఁబనిలేదు ॥పల్లవి॥

సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు
గరిమ నీకృప విన్నుఁ గను నొకఁడు
ధరఁ బ్రయాసముతోడఁ దపముసేయు నొకఁడు
శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు ॥పాపె॥

వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు
వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు
వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షముగను
యెక్కడా నీకల్పన కేమి సేయవచ్చును ॥పాపె॥

భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము
యేవలనైనా నీవు యిచ్చితేఁగద్దు
జీవులు విన్నెఱఁగక చీఁకటి దవ్వఁగనేల
శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేతువు ॥పాపె॥

(ఈ సంపుటము పాట - 182)

అట్టులే శ్రీ వేంకటేశపాదార్పితమైనచిత్తముగలిగిన — అన్నమయ్య, తనను — తనవారినీ — తనభోగములను అన్నింటినీ స్వామికే సమర్పించి గాఢప్రపత్తిని చూపి, తుదకు నీ ఇష్టమువచ్చి - నప్పుడు నీ యిష్టము వచ్చిన వరము నాకీయవయ్యా అని నిర్దాక్షిణ్యముగ శరణాగతి చేసినాడు.

సాళంగం

చేకొంటి విహమే చేరినపరమని
కైకొని నీవిందు కలవేకాన ॥పల్లవి॥

జగమునఁ గలిగిన సకలభోగములు
తగిన నీ ప్రసాదములే యివి
అగపడునేఁబదియక్షరపంక్తులు
నిగమగోచరపునీమంత్రములే ॥ చేకొం ॥

పొదిగొని సంసారపుత్రదార లిల
వదలని నీదాసవర్గములే
చెదరక యేపొద్దుఁ జేయునాపనులు
కదిసిన నీయాజ్ఞాకైంకర్యములే ॥చేకొంటా॥

నలుగడ మించిననాజన్మాదులు
పలుమరు లిటు నీపంపు లివి
యెలమిని శ్రీవేంకటేశ్వర నీనీఁక
వలసినప్పు డీ వరములు నాకు ॥ చేకొం ॥

(ఈసంపుటము పాట - 517)

ఈపాట విన్నప్పుడు పదిహేనుపర్వముల మహాభారతమును ఏకదీక్షతో రచించిన తిక్కన చెప్పినమాట జ్ఞాపకమునకు వచ్చుచున్నది.

చ॥ పరమపదాప్తిహేతువగుభారతసంహిత శౌనకాది భూ–
సురవరు లింపునం గరఁగుచొప్పునఁ జెప్పిన, వారు మోదసం–
భరితతఁ బొంది యక్కథకు బ్రాఁతిగ నర్చితుఁ జేసి రర్మిలిన్;
హరిహరనాథ సర్వభువనార్చిత నన్దయఁజూడు మెప్పుడున్

(-భారతము - స్వర్గా - 94)

ఈ మాటను పలికిన తిక్కనభావము అన్నమయ్య భావము ఒకటిగనే తోచుచున్నవి. ఆ దయకు ఫలితమేదో కూడా ఆయన పేర్కొనలేదు. ఇంత నిరీహముగ రచన సాగించిన తిక్కనయే అన్నమయ్యకు భాషావిషయములందును, భావసంపదయందును మార్గదర్శకుడై వాడని మనమూహింపవచ్చు.

## స్వామి పుష్కరిణి

దైవమును, క్షేత్రమును, తీర్థమును దర్శించినపుడు సాధారణులకు ఏదోచెప్పరాని ఆనందము మనసులో మెదలాడునేకాని, దాని స్వరూపమును – గొప్పదనమును నలుగురి మనసులకు పట్టునట్లు చెప్పలేరు. అదే ఒక మహాకవియో, అంతకంటె మించిన – మహాభక్తుడో పైవస్తువుల మూడింటిని చూచినప్పుడు, అతని మనసులో దివ్యభావములు పరువెత్తి, ఆవస్తువును అతిలోకముగ అందరి – కండ్లకు కట్టునట్లు వర్ణింపగలడు. దానికి మనము నిత్యము చూచుచూ తీర్థమాడుచున్న స్వామిపుష్కరణిని గూర్చి, అన్నమయ్యకుగలిగిన భావనము, వర్ణనమే సాక్షి.

గుండక్రియ

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥ పల్లవి ॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోపానాలు
అర్మిలి నాలుగువేదా లదె నీదరులు
నిర్మలపునీజలము నిండునప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వోకోనేరమ్మా ॥ దేవు ॥

తగినగంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మునులోయమ్మా ॥ దేవు ॥

వైకుంఠనగరము వాకిలే నీయాకారము
చేకొను పుణ్యములే నీజీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీవునికి
దీకొని నీ తీర్థ మాడితిమి కావవమ్మా ॥ దేవు ॥

(ఈసంపుటము–పాట–428)

## అన్నమయ్య – పోతన

కడపమండలమునకు భూషలుగా ఇంచుమించు ఒకే కాలమున ఇద్దరు తీవ్రభక్తులు ఉద్భవమందినారు. ఒకరు అన్నమయ్య. మరి యొకరు పోతనామాత్యులు. వీరిద్దరూ ఎంతభక్తులో అంత శృంగారప్రియులుకూడ. ఆ శృంగారముకూడ శ్రీమన్నారాయణ-మూర్తికే పరిమితము. అన్నమయ్యది తాళ్లపాక. పోతన్నది ఒంటిమిట్ట. ఆ ఇద్దరిభావములు ఎట్లు ఏకముగా సాగుచున్నవో ఈ క్రింది పాటలో పద్యములో గుర్తింపగలరు.

### దేసాళి

ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
  పంచితముగ నితనిశరణంటే సర్వఫలప్రద మిందరికి ॥ పల్లవి ॥

హరిఁ గొలువని కొలువులు మఱి యడవిఁగాసినవెన్నెలలు
  గరిమల నచ్యుతు విననికథలు భువి గజస్నానములు
  పరమాత్మునికిఁ గానితపంబులు పాతాళములనిధానములు
  మరుగురునికిఁగానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు

వైకుంఠుని నుతియించనివినుతులు వనవిధిఁ గురిసినవానలు
  ఆకమలోదరుఁ గోరనికోరికె లందనిమానిఫలంబులు
  శ్రీకాంతునిపైఁ జేయనిభక్తులు చెంబుమీఁదికనకపుఁబూఁత
  దాకొని విష్ణుని తెలియనితెలువులు తగ నేటినడిమిపైరులు

వావిరిఁ గేశవునొల్లనిబదుకులు వరతఁగలపుచింతపండు
  గోవిందుని కటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు
  భావించి మాధవుపైలేనితలఁపులు వలుమేఘములవికారములు
  శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు॥ ఎంచి ॥

(ఈ సంపుటము పాట –235)

సీ॥ కంజాక్షునకుఁ గానికాయంబు కాయమే
పవనగుంఫితచర్మభస్త్రిగాక
వైకుంఠుఁబొగడనివక్త్రంబువక్త్రమే
ఢమఢమధ్వనితోడిఢక్కగాక
హరిపూజనములేనిహస్తంబు హస్తమే
తరుశాఖనిర్మితదర్విగాక
కమలేశుఁ జూడనికన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములుగాక

చక్రిచింతలేనిజన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబుగాక
విష్ణుభక్తిలేనివిబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక।

(భాగ-7-170)

## యథావాక్కులఅన్నమయ్య

ఈ యథావాక్కుల అన్నమయ్య మనఅన్నమయ్యకు దాదాపు 200 ల సంవత్సరముల ముందువాడు. ఈతని కృతి సర్వేశ్వర శతకము. ఈతను ఆరాధ్యశైవుడు. ఈ యిద్దరన్నమయ్యలమధ్యగల భేదమంతా శైవవైష్ణవమతములకు సంబంధించినది మాత్రమే. యథావాక్కుల అన్నమయ్య మంచిప్రౌఢకవి, సర్వేశ్వరునియందు గాఢభక్తిగలవాడు. వీరిద్దరికి పోలికగల భావములు పెక్కుతావుల గలవు. మచ్చునకొకటి:—

మ॥ అమరంగా స్ఫుటభక్తినాటకము భాషాంగక్రియాంగాభిరమ్యముగాఁ జూపిన మెచ్చి మీరలు పురే యన్నంతకున్, యోపిగేహములన్ రూపులు వన్నుకొంచును నటుండై వచ్చి సంసారరంగములోనం బహురూపమాడు వెలయంగా జీవి సర్వేశ్వరా.॥

(సర్వేశ్వరశతకము–ప–20)

రామక్రియ

మెచ్చు: మెచ్చకుండే మాను; మించి నే నాడకమాన
అచ్చపునీసూత్రధారి నవధారు దేవ ॥ పల్లవి ॥

వొక్కఁడ నే జీవుఁడను వోహో హరి
పెక్కుబహురూపాలే పెంచియాడితి
తక్కినయింద్రియములే తగుమేళము
అక్కజపువిద్యవాఁడ నవధారు దేవ ॥ మెచ్చు ॥

సూటి నించుకంతవాఁడఁ జూడవే హరి
పీటిసంసారపుబారి విద్య లాడితి
పాటి నాకర్మమే క్రియాభాషాంగము
ఆటవాఁడ నింతె నేను అవధారుదేవ ॥ మెచ్చు ॥

చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేఁడు
మేరతో భక్తినే మోకుమీఁద నాడేను
యీరానిపదవులు యిచ్చితి నాకు
ఆరితేరి గెలిచితి నవధారు దేవ ॥ మెచ్చు ॥

(ఈ సంపుటము—పాట 150)

యథావాక్కులవారి పద్యరచనలోని సంగ్రహభావము, మన అన్నమయ్య విస్తారరచనయగు గేయములో విశేషాకారమును సంతరించుకొన్నది. క్రియాభాషాంగము, భాషాంగక్రియాభిరమ్యముగా, మెచ్చు ధాతుప్రయోగము, బహురూపమాడుట ఇత్యాదులు ఉభయత్ర సమానములు; ఈ భావములు సమానాభిప్రాయములు గలభక్తులకు ఒకరివాఙ్మయము మరొకరు చూడకయేకూడ కలుగవచ్చు. అయినను మన అన్నమయ్యకు సనామధేయుఁడ ఇతనికంటే ప్రాచీనుడు, ఈతనివలెనే గట్టిగా పరమేశ్వరుని వాడు ఒకడు కలడు అని తెలుపుటకుమాత్రము ఈ ఇద్దరి

తమ్యము లుదాహరించితిని. మనఅన్నమయ్యలో విష్ణువు ప్రధాన-మైతే, ఆ అన్నమయ్యలో శివుడు ప్రధానము. ఇంతే వీరికిగలభేదము దానివలన నానావర్ణనలయందు, ఇరువురియందును ఆ యామతాను సారముగ ఉచ్చనీచభావములు సాగుట సహజమే.

## అన్నమయ్య కీర్తనలసంఖ్య

అన్నమయ్య ముప్పదిరెండువేల కీర్తనములను రచించినట్లు "పరమతంత్రములు ముప్పదిరెండువేలు" అను చిన్నన్న మాటవలన తెలియుచున్నది. ఈ ముప్పదిరెండువేలే ఏల వ్రాసినారు? అని పరా-మర్శింపవలసియున్నది. ఆయన జీవితము, 32 వేల కీర్తనలు రచించు-నాటికి ముగిసిపోయినది కావున, ముప్పదిరెండు వేలు రచించినారు; అని చెప్పుట సహజము. కాని అన్నమయ్య సాక్షాత్తుగ అహోబల-మున నుండియే విశిష్టాద్వైత వేదాంతాధ్యయనము చేసి, అక్కడనే ఆదివన్ శఠగోపయతిచే మంత్రోపదేశము పొంది, ఆ మంత్రమునే జీవితాంతము వేంకటేశ్వరమూర్తిపై గురిచేసి ఉపాసించుచుండినా-రనుట నిర్వివాదమైన విషయము. ఆదివన్ శఠగోపయతి అహోబల మఠముజీయరు. ఆయన నృసింహోపాసకుడు. వారున్నది అహో బలక్షేత్రము కావున తప్పక నృసింహోపాసకులే. అన్నమయ్యను బాగా పరీక్షించిన ఆదివన్ శఠగోపయతి, ఆ మంత్రమునే అన్న మయ్య కుపదేశించి యుందురనుట త్రిసత్యమైనమాట. ఆ మంత్రము ద్వాత్రింశదక్షరము. దానికి మంత్రరాజమనికూడ ప్రసిద్ధి. ముప్పై రెండు అక్షరములుగల ఆ మంత్రమునే జపించుచూ, నిత్యమూ వేంకటేశ్వరునిపై ఒక కీర్తనకు తక్కువకాకుండ కీర్తనలు రచించిన అన్నమయ్య, అక్షరమునకు వేయివంతున ఆ మంత్రాక్షరసంఖ్యతో ముప్పైరెండువేల కీర్తనలను రచించినారని స్పష్టముగ చెప్పవచ్చు. అన్నమయ్య రచించినఅహోబలపతిపైనికీర్తనల సంఖ్యకూడ దీనికి

ఉదాహరణము కావచ్చు. శ్రీవేంకటేశ్వరునిపై రచించిన కీర్తనలను పక్కకు పెడితే, అహోబలపతిపై రచించినన్ని కీర్తనలు మరి ఏ-దైవముపైనను రచింప లేదనుట సుప్రసిద్ధము. ఏ దైవమును పేర్కొన్నను అందరినీ తుదిచరణములో వేంకటేశ్వరునితో ముడి వెట్టుట ఆయనజీవితసిద్ధాంత లక్ష్యము.

ఇట్లు వలు విషయములకు పలుపాటలను ఉదాహరణముగ ఎత్తి చూపవచ్చును. కాని విస్తరభీతిచే ఆ భారము సహృదయులగు పాఠకులకే వదలితిని.

శబ్దచర్చ

1) గోసమాణే: (పాట: 374)

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥ పల్లవి ॥

మీనకూర్మవరాహా మృగపతిఅవతారా
దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక ॥ డోలా ॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ ॥ డోలా

దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా
శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి నిలయ ॥ డోలా ॥

(ఈసంపుటము పాట 374)

ఈ పాటలోని 'గోసమాణే' అనుపదము 'ఘోషమణే' అనుటకుబదులుగ పడినదా అనిపించుచున్నది. ఇదిఇంకను విచార్యము.

2) హా సమీచీన ............... (పాట: 368)

హాసమీచీనసుపహాసంతే
దాసై ప్రకాశితం దరిదంతులోకే ॥పల్లవి॥

ద్వారకా పట్టణే త్వం పురాచ స్వయదీక్షితస్తు ప్రియః కేశముష్టిఃకథం
సారస కురువంతి సరసవేళాయాం ॥హాస॥

వర శిశోరక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారి అథోచే స్తదేతిగోప
తరుణయః కిమితి వా తద్వసతి త్వం ॥హాస॥

తత్ర బృందావనే త్వం పురా చ శ్రియో వేంకటాద్రౌ ఇదం విద్వి
భాసి ఇదం
చిత్ర మిత్యమరాశ్చ దిసేవంతి సర్వే ॥హాస॥

(ఈసంపుటము పాట 368)

ఇది సవరించుటకు వలనుపడనిపాట. రేకులపాఠ మొక్కటే ఆధారమైనందున పాఠాంతరముకూడ లేదు.

3) జుంటీఁగ (పాట: 29)

భూమెల్ల మేసినా నాఁబోతుకు బందెలేదు
నేమపుఁ బ్రపన్నునికి నిందలేదు
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని
సోమరి కర్మమంటితే జుంటీఁగకతవును ॥మతి॥

(ఈ సంపుటము పాట 29)

జున్ను + ఈఁగ. ఔపవిభక్తికకార్యములు జుంటీఁగ తేనెలో బడిన ఈఁగ అన్న అర్థము ప్రకరణమును బట్టి వచ్చుచున్నది. కాని ఆ యర్థమున జుంటీఁగ రూపము సిద్ధించునా? జున్ను చేసెడి ఈఁగరయే కదా 'జుంటీఁగ'. 'సోమరి కర్మమంటితే జుంటీఁగ కతవును' = శరణా-

గతుడు (కర్మలను వదలినవాడు) మరలా కర్మలజోలికిపోతే; అనే అర్థములో 'తేనెలో బడినఈగ' అనే అర్థమే సబబని తోచుచున్నది. తేనెటీఁగల చరిత్రలో తల్లిఈఁగ, రాణిఈఁగ ఇత్యాదుల విషయమేమైన సంబంధించియున్నదా అని విచారింపవలసియున్నది.

4) బ్రహ్మ మనుకోనేరము: (పాట: 30)

నేమే బ్రహ్మ మనుకోనేరము: నేము
కామించిన స్వతంత్రము గదు లేదుగాన ॥ పల్లవి ॥

(పాట—30)

పూర్వముద్రితములో 'బ్రహ్మ మనుకోనేరము=బ్రహ్మము అనుకొందుము' అను నర్థమున ఆ పాఠము గ్రహించినట్లున్నది. ప్రకరణమును బట్టి అనుకోనేరము = అనుకొనుటకు చాలము అని తోచుచున్నది. ఈ రేకులపాఠములో హ్రస్వదీర్ఘములకు ఒకేలిపి కావున ఇటువంటి పాఠభేదములు అక్కడక్కడ దొర్లుచుండవచ్చు.

5) కాకి జున్ను (పాట: 167)

అనరాదు వినరాదు ఆతనిమాయలు నేఁడు
దినదినకొత్తలాయ ద్రిష్ట మిదే మాకు ॥ పల్లవి ॥

ఆడెడిబాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁగాను యిందరముఁ గూడిపోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయనమ్మా ॥ అన ॥

తీఁటతీగెలు సొమ్మంటా దేహమువిండాఁ గట్టి
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేను
కోటికోటిసొమ్ములాయ కొత్తలోయమ్మా ॥ అన ॥

కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
అకట శ్రీవేంకటేశుఁ డాబాలులకంటిపీరు
జోకగ ముత్యాలు నేసెఁ జూడఁగానే నేము ॥ అన ॥

(ఈ సంపుటము పాట 167)

ఈ పదము నిఘంటులలో కానరాదు. 'కాకివెండి, కాకి బంగారము, కాకియెంగిలి' 'కాకి వెదురు' 'కాకి చిప్ప' ఇత్యాదులు ప్రసిద్ధములుగా నున్నవి. వెండికానిదానిని వెండిగా వ్యవహరించే టప్పుడు కాకివెండి. అట్లులే పైవికూడ. కాని జున్ను కానిదానిని జున్నుగా వ్యవహరించినట్లు ఇక్కడ కావలెను. 'కాకిజున్ను' యేదో అర్థము కాలేదు. పలువురు విద్వాంసుల నడిగియు ప్రయోజనము లేకపోయినది.

1. ఈ పీఠిక సిద్ధమైనవెనుక శ్రీ వి. వి. శేషాచార్యులు (70 సంవత్సరములు) అనంతపురము వారు మాయింటికి వచ్చియుండిరి. వారిని విచారింపగా, వర్షాకాలమున చెట్లవెంబడి బుడగలుబుడగలుగా నురుగుమాదిరిగ జారేవస్తువును, నీళ్ల పారుదలతో పాచిపట్టినబండల వెంబడి ఆ పాచికి పక్కగా తెల్లగా, ఎఱ్ఱగా, రంగు రంగులలో బుడ గలుగా తయారయ్యే వస్తువును కాకిజున్ను అని వ్యవహరిస్తుండగా నా చిన్నతనములో విన్నాను. అది పట్టుకొంటే చేతికి రాదుకూడా. మూతికి రాస్తే జిల్ అని అవుతుంది. దానికి పిల్లలుపడుస్తారు: అని సెలవిచ్చిరి.

2. తాళ్ళపాకలోనే నివసిస్తున్న బంగా సుబ్బయ్యగారిని (దాదాపు 70 ఏండ్ల వయస్సువారు) ఉత్తరముతో విచారించగా, వారు "కాకి జున్ను అను పదమును గూర్చి మా గ్రామ పరిసరప్రాంతము లలో విచారించగా తెలిన సారాంశము:—పాలు అముదము రంగలించి అందులో మసాంబరము మాత్రను పొదివ ఉగ్గును పిల్లలకు పెట్టుట

అనాదిగా ఆచారము. పిల్లలు పాలు త్రాగుట మాన్పించుటకు ఈ ఉగ్గును పెట్టెదరు. ఈ ఉగ్గును త్రాగునపుడు పిల్లలకు బాధాకరంగా ఉంటుంది. కారణం ఆ ఉగ్గు చేదు పదార్థము. కాకిజున్ను= ముసాంబరము. కలబంద పాలతో ముసాంబరమును తయారు చేయు దురు. కాకిజున్ను-జున్ను (తేనె) కానిది కాకి జున్ను. ఈ పదము "ఆయుర్వేద వైద్యశాస్త్రంలో సాంకేతిక పదముగా వాడబడు చున్నది" అని సమాధానమిచ్చిరి. ఈ రెండును కూడ ప్రకరణము నకు అంతగా అతుకునట్లు తోచదు.

అదికాక పై రెండు చరణములలో దుమ్మే చక్కెరగా, తీంట-దీగెలు సొమ్ములుగా మారినట్లు వర్ణింపబడినవి. ఇక్కడ కాకిజున్నే ముత్యములుగా మారలేదు. కాకిజున్ను తిన్న వారి కన్నీళ్లు ముత్య-ములుగామారినవి. చక్కెర అని దుమ్మువేస్తే చక్కెరగామారింది. సొమ్ములు అని తీంటతీగెలు వేస్తే సొమ్ములుగా మారినవి. జున్ను కాని కాకిజున్ను తినిపిస్తే, వాండ్లు పడిస్తే, వాండ్ల కన్నీళ్లు ముత్యా లుగా అయినాయి. ఇక్కడ ప్రక్రమభంగముకూడ నున్నది. ఈ శబ్దము యొక్క అర్థము ఇంకనూ తెలిసినవారివలన తెలుసుకోదగి యున్నది.

6) ఎంచీనా ; తలంగీనా ; మాపీనా (పాట : 168)

దేసాళి

విజము దెలియవిమానేరమేకాక
భజన నీవు చేపట్టినందుఁ గడమా ॥ పల్లవి ॥

అంచలఁ బరుసము లోహపుఁగాశికల నెల్ల
యెంచీనా పసిఁడి గావించుఁగాక
పించిన విన్నాతుమఁ జింతించువారిపాతకాలు
మించవిచ్చేవా మేలే మెరయింతుగాక ॥ విజ ॥

నలువంక రవికిరణాలు మేలగిదని
తలఁగీనా యిన్నిటిలోఁ దానేకాక
యిల నీదాసుఁడు జాతి నెవ్వఁడైనా నీకృపఁ
జెలఁగి పావనుఁజేసి చేకొనుఁగాక ॥ నిజ ॥

పూసిన దిక్కులగాలి పొందుగ నీదాదవి
మానీనా లోకమెల్లా మరయుఁగాక
మావక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే-
దేనెలవైనా నీకిరవేకాదా ॥ నిజ ॥

(పాట-168)

ఈపాట ప్రతిచరణము రెండవపాదమునందు " యెంచీనా, తలఁగీనా, మానీనా " ఇత్యాదిగ సవరింపబడినవి. పూర్వముద్రణము నందు "యెంచినా, తలఁగినా, మానినా," ఇత్యాదిగా కలదు. ప్రకరణమును బట్టి చూస్తే నీవు చేపట్టినందుఁ గడమా అనే పల్లవిలోని దీర్ఘము ప్రశ్నార్థకముగా స్పష్టము. యెంచినా, ఇత్యాదిగావుంటే 'ఎంచినను' ఇత్యాదిగా అర్థము వచ్చునేకాని ప్రశ్నార్థకము రాదు. "పరుసము లోహాపుఁ గాళికలనెల్ల యెంచీనా" అన్న స్థలములో లోహపుముక్కలను ఇది పలానా ఇది పలానా జాతికి చెందినది; అని లెక్కపెడుతుందా? అంటే లెక్కపెట్టదు అని అర్థము. తాను సోకిన ముక్కలనన్నిటిని బంగారుగా చేయుటయే దానిపని. ఇట్లనే తక్కిన స్థలములయందుకూడ. ఇక్కడగూడ హ్రస్వదీర్ఘములకు ఒకేలిపి యుండుటే కారణము.

7) సహజి పాట : 212

మహి నుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు
సహజివలెనుండేమీ సాధింపలేఁడు ॥ పల్లవి ॥

'సహజః' ఈ శబ్దము విశేష్యనిఘ్నము. సహజము కలవాఁడు సహజి. పుట్టినవాడు పుట్టినట్లే (ఏ ప్రయత్నము చేయక) వుండుట. అను నర్థమున ప్రయోగించినట్లున్నది. 'సహజః స్వభావః అస్త్యస్య ఇతి- సహజీ' పుట్టిననాటి స్వభావమే కలవాడు. ఏమీ యెరుగనివాడు శబ్దము వ్యాకరణ విరుద్ధము కాదుగాని, బహుళప్రయోగ ప్రహతము కాదనిమాత్రమే మనవి.

8) యతిస్థానంలో చర్చ: (పాట 419)

యీతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునుఁగఁ డీతఁడు గాలిఁ బోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁ డేమిటను
యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు ॥ దేహి ॥

ఇక్కడ 'చలియించు' అను తత్సమపదము యతిస్థానములో 'చెలియించు' అని ప్రయోగింపబడియుండుట, వీరి వ్యావహారిక భాషాదృష్టికి తార్కాణము కాగలదు. ఇట్టి వింకను అక్కడక్కడ గలవు.

9) యద్భావం తద్భవతి : (పాట 435)

ధరలో "నెద్భావం తద్భవ" తనెఁగాన
హరిమయమే జగమంతాను ॥ పల్లవి ॥

ఈ 'యద్భావం' అనుదానికి Foot note లో అప్పటికి తోచిన జాసీని ఇచ్చినాను. 'యద్భావ్యం తద్భవతి' అనుటసముచితమేమో అనిపించుచున్నది.

10) సందడించేరు : (పాట 436)

హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతముగ వాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాఇత్తపడి సందడించేరు ॥ ఎందాఁ ॥

సందడించేరు = సందడిచేయుచున్నారు. "సందడివిడువుము సాసముఖా"లో శ్రీగీత కలిగిన పదమును వ్యాఖ్యానించునపుడు అధ్యాత్మకీర్తనల సంపుటము 1 (1981) నందు 12వ పాటలో సందడి శబ్దమును వ్యాఖ్యానించలేదు. ఈ అన్నమయ్య వాఙ్మయములో సందడి, సందడించు శబ్దములు 'తొందరపెట్టు' 'అంటుకొనియుండు' ఇత్యాద్యర్థములలో వాడినట్లు ఇక్కడ ప్రయోగమునుబట్టి ఊహించుచున్నాను.

11) రాచాజ్ఞ : (పాట 447)

రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన
యేచి నీకు శరణంటి నిది మానుపవే ॥ పల్లవి ॥

రాచాజ్ఞ = రాజాజ్ఞ. రాజ్ఞః ఆజ్ఞా అని విగ్రహము. ఇది సమాసైకదేశము తద్భవీకరించిదైనా కావచ్చు. 'రాచవారియొక్క ఆజ్ఞ' అని తద్భవ శబ్దముతోనే స్వతంత్రముగ సమసించిన సమాసమైనా కావచ్చు.

27 వ సంపుటములో 'సమాసములు' అను విషయముపై సాగించిన నా చర్చను చూచిన డా॥ సరస్వతీపుత్ర శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారు, "వ్యావహారికభాషను యథేచ్ఛగ వాడిన అన్నమాచార్యుల కృతులలో వ్యాకరణచర్చ పలక్కా" అన్నారు. కాని "ఆ కృతులలోనే అరసున్నలు శకటరేఫలు స్థానపతి

తములు, అస్థానపతితములు దండిగ నుండుటచే, ఆ భాషను శిష్టవ్యావహారికముగనో, అశిష్టవ్యావహారికముగనో గ్రాంథిక సన్నిహితమైన-దానిని విమర్శించక ఎట్లుంటేదిస్వామీ" అన్నాను. 'సరే నీయిష్టము' అన్నారు.

12) సాసముఖా (పాట: 471)

సామంతం

సింగారమూరితివి చిత్తజగురుఁడవు
సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా ॥ పల్లవి ॥

పూవులతెప్పలమీఁద పొలఁతులు నీవు నెక్కి
పూవు లాకసము మోవఁ బూఁచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధానమగు నీకు సాసముఖా ॥ సింగా ॥

అంగరంగపై భవాల నమరకామినులాడ
నింగినుండి దేవతలు నిన్నుఁ జూడఁగా
సంగీతతాళవాద్యచతురతలు మెరయ
సంగడిఁదేలేటిమీకు సాసముఖా ॥ సింగా ॥

పరగఁ గోనేటిలోన పసిఁడిమేడనుండి
అరిది నిందిరయు నీవారగించి
గరిమ శ్రీ వేంకటేశ కన్నుల పండువగాఁగ
సరవి నోలాడుమీకు సాసముఖా ॥ సింగా ॥

అధ్యాత్మ కీర్తనల సంపుటము — 1 యందు 12 వ పాటలో 'సాసముఖా' శబ్దమును 'సముఖ సముఖ' అను రెండు పదముల ఆమ్రేడిత సంధిగా వ్యాఖ్యానించియుంటిని. దానికి మరొకపాట కూడ 9 సంపుటము 97 వ దానిని ఉదాహరణమని చూపియుంటిని.

ప్రకృతము ఈపాటలో 'సొసముఖా' శబ్దము 'జోహారు' అను అర్థ-ములో ప్రయోగించినట్లు ప్రకరణమునుబట్టి తెలియుచున్నది.

## పూర్వోత్తర ముద్రణములు

6 వ 7 వ సంపుటములందు పూర్వముద్రణపరిష్కర్తలు చూపిన పాఠములకు కొన్నిటికి భిన్నముగ నేను పాఠములను చూపి, వారి పాఠములను పూర్వముద్రణపాఠము అని పాదదీపిక (Foot note) లో చూపియున్నాను. అందులో పూజ్యులు కీ॥ శే॥ శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారును, శ్రీఅర్చకం ఉదయగిరి శ్రీనివాసా చార్యులును కలిసి పరిష్కరించిన 7 వ సంపుటములో, 'సంస్కరణ-ములు' అను శీర్షికతో తప్పొప్పుల పట్టిక నొకదానిని చూపి, కొన్ని పాఠములకు మాత్రము సవరణలు చూపినారు. 6 వ సంపుటములో మాకు ముద్రణమునకు ఇచ్చిన పుస్తకములో ఆ తప్పొప్పులపట్టిక కానరాలేదు. 7 వ సంపుటములో మాత్రము పేజి వరుసనంబరుకూడ ఇచ్చిన తప్పొప్పులపట్టిక ఉన్నది. కాని ఆ తప్పొప్పుల పట్టికలోకూడా మేముచూపిన పాఠాంతరములన్నీ లేవు, కావున నేను ఆ తప్పొప్పుల పట్టికను లెక్కకు తీసికొనకయే 'పూర్వముద్రితపాఠము' అని ఇత్యా దిగా చూపియున్నాను. దీనివలన పూర్వముద్రణపరిష్కర్తలను లక్ష్యము చేయలేదని భావింపరాదు, ఇట్టి పరిష్కరణములలో తప్పులు సర్వసహజములని అందరకు తెలిసిన విషయమే. వానిలో ఎక్కువ తక్కువలు మాత్రమే సూక్ష్మజ్ఞతకు గురుతు. మేముమాత్ర మేమి తక్కువతిన్నామా? అన్నట్లు ఈ పరిష్కరణములోకూడ రేకు పాఠ ములు కొన్ని తొలగిన ఘట్టములు కలవు. వానిలో మేము గమ నించినవాని సవరణలిందు చూపుచున్నాను.

| పాట | ఉన్నపాఠము | ఉండవలసినపాఠము |
|---|---|---|
| 21 (3-2) | మూటగరాట్టదు | మూటగట్టరాదు. |
| 74 (2-3) | బెడిదవుఁ | బేడిదవుఁ |

| | | |
|---|---|---|
| 81 (2–4) | వికిరణా | వికిరణా |
| 88 పల్లవి | కేళవాత్సరమహా | కేళవాత్సరమహో |
| 212 పల్లవి | సాధింపలేడు | సాధింపలేఁడు |
| 243 (2–4) | పాలించేప్రతాప | పాలించేశత్రులప్రతాప |
| 244 (1–1) | మాయాదేవిపట్టిన | మాయాదేవి పుట్టిన |
| 245 (1–2) | కాఁగినపోట్లు | కాఁడినపోట్లు |
| 246 (3–2) | సోదించేరటాఁ | సోదించేరంటాఁ |
| 323 (1–1) | నాతరతమ్య | నాతారతమ్య |
| 387 (2–2) | నెప్పుగా | నొప్పుగా |
| 408 (3–1) | తనివోని ఘోరతప | తనివోనిఘనహోరతప |
| 409 (3–1) | నెవ్వరైనానేమి | నెవ్వరైనానేమి |
| పాటల అకారాది సూచికలో పుట 363 లో ఎంత మాత్రము | 159 | 398 |

నా యీ పీఠికవెనువెంటనే పూర్వముద్రణ పరిష్కర్తల పీఠికలనుకూడ జతచేసి ప్రకటించుచున్నాను.

ఈ తాళ్లపాకకవుల వాఙ్మయమును త్వరత్వరగ గడ్డకు తేవలెనను సంకల్పముతో, ఆయవ్యయములతో జమకట్టక మాకు వలసిన వసతులను ఏర్పాటుచేయుచున్న తి. తి. దే. కమిటీచైర్మన్ శ్రీ వి. యన్. రెడ్డిగారికి, వారి సంకల్పమును మూడుపూవు లారుకాయలుగ పండింపగల సంకల్పసిద్ధులు, ఎంతపనినైన అవలీలగ నెరవేర్పగల కార్యదక్షత పండి నిండిన తి. తి. దే. కార్యనిర్వహణాధికారులు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ఐ. ఏ. ఎస్., గారికిని నా కృతజ్ఞతాభివాదములు. సుద్రణకార్యమునందు మాకు చేదోడు వాదోడుగా తోడ్పడుచున్న తి. తి. దే. ప్రెస్ మేనేజరు శ్రీ యమ్. విజయకుమార్ రెడ్డిగారికిని, ఈ పనులలో చాల మెలుకువగల తి. తి. దే. పౌరసంబంధశాఖాధికారి శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి ఎం.ఏ.

గారికి, ప్రతిక్షణమును మావనులకు వలసినట్లు సాయపడుచున్న తి. తి. దే. సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావు ఎం.ఏ., గారికిని నాధన్యవాదములు. ఈ పరిష్కరణకార్యములో నాకు కుడి-చేయిగ పనిచేయుచున్న చి॥ జె. బాలసుబ్రమణ్యం ఎం. ఏ, కు నా మంగళాశాసనములు. వేగముగా సాగుచున్న అచ్చుపనిలోకూడ మెలకువపీడనిఅచ్చుకూర్పరులకు మనస్ఫూర్తిగ నామంగళాశాస-నము అందించుటతప్ప నేను వారికిచేయు నుపకారమేమున్నది? పెద్దల పరిష్కరణములను మరలా పరిష్కరించుటలో నావలన ఏర్పడిన గుణదోషములను మరల పుస్తకములు చదివిన సహృదయులు ఎత్తి చూపిన, విధేయతతో స్వీకరించి, పైపై పరిష్కరణములలో జాగ్రత్త వహింపగలను.

శ్లో॥ మైసూరురాజధానీనగరకళాశాలికాబుధం మాన్యం।
సంగీతసాహితీవీథీసంచారం నమామి తం కృష్ణమ్ ॥

ఇట్లు బుధవిధేయుడు,
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
స్పెషల్ ఆఫీసరు,
తాళ్లపాకవాఙ్మయపరిష్కరణశాఖ,
అన్నమాచార్య ప్రాజెక్టు.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

తిరుపతి,
2–7–81

# పీఠిక

తామ్రఫలకములలోఁ దలుపుచాటున దాగియుండిన తాళ్ళపాక వారికవిత ప్రభాకరులకరస్పర్శమున వెలుగుమొగము చూచినది. ప్రథమమున తాళ్ళపాకవారిసంకీర్తనలయోగ్యతనుగుర్తించి, పైయధికారులకు తెలియజేసి, సంకీర్తనములు లోకమున ప్రచారముఁ జెందుటకై యన్నమాచార్యోత్సవమును వెలయింపించినవారు గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. తిరుపతిలో నన్నమాచార్యోత్సవము ప్రతి సంవత్సరము జరుగుచుండుటతో వారిరచనలలోని కవితాసౌందర్యము, సాహితీగౌరవము, సంగీతసారస్యము, భక్తిపారమ్యము, గుఱుతింపఁబడుచున్నవి. తెలుఁగున ముడులు విడనిపదములకుఁ, బ్రయోగములకు, నెన్నిటికో యర్థము, నన్వయము కుదురుటతో భాషాపరిశోధకుల దృష్టి వీరిరచనములపైఁ బడుచున్నది. ప్రాఁతపాటలతో విసుగుజెందుచున్న భావుకుల వినోదమునకై క్రొత్తదనముఁగోరుచున్న సంగీతవిద్వాంసుల యాదరమును వీనికి లభించుచున్నది. తాళ్ళపాకవారి రచనముల సత్వర ముద్రణమునకై శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన ప్రధానాధికారులు చూపుచున్న ఆదరాభిమానములకు, భాషాభిరుచికి, భక్తితత్పరతకు జోహారులు.

శ్రీ తాళ్ళపాకవారి రచనముల సంపుటము లైదు ఇంతదనుక ప్రకటితము లయినవి. ఇది యారవసంపుటము. తాళ్ళపాక అన్నమాచార్యుల (100-వ రేకునుండి 160-వ రేకు వరకుగల) అధ్యాత్మ సంకీర్తనము లిందు ముద్రితములయినవి. ఇకపై నేఁబదిరేకుల కొకసంపుటముగా వీరిరచనములు ప్రకటింపఁబడగలవు.

మద్గురుదేవులు కీర్తిశేషులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పర్యవేక్షణమున నేతత్సంకీర్తనముల ముద్రణకార్యమున నుద్యోగించుచుండి నేనీసంపుటమును వారి యాదేశముల మేరకుఁ బరిష్కరించితిని. తప్పొప్పులకు సహృదయులు ప్రమాణము.

తాళ్ళపాకవారిరచనము లెల్లఁ ద్వరలోఁ బ్రకటింపఁబడవలయు ననెడి వారిసంకల్పము నెఱవేర్పుభారము పై యధికారులది, శ్రీ వేంకటేశ్వరులవారిది.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
19—2—51.

విద్వద్విధేయుఁడు
ఉదయగిరి శ్రీనివాసాచార్యులు.

శ్రీః

# పీఠిక

ఇది శ్రీ అన్నమాచార్యకీర్తనల యేడవసంపుటము. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఐదవసంపుటము శోధించి ప్రకటించి అకాలమున పరమపదమలంకరించిరి. ఆరవసంపుటమును దీనిని రేకులనుండి సవరించి యెత్తి వ్రాసినవారు శ్రీ శాస్త్రిగారి శిష్యులై వారికి చేదోడు వాదోడుగా నుండిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులే. ఈ కీర్తనల శోధనకార్యమునకై శ్రీవేంకటేశ్వర దేవాలయాల అధ్యక్షులచే నియమింపఁబడి నేను వచ్చి చేయివేయునరికి ఈ సంపుటము బహుభాగము ముద్రితమైనది. కడపటి రెండు మూఁడు ఫారములు మాత్ర మునేను పరిచూడఁగల్గితిని. ఈ సంపుటమున ౧౫౧- వ రేకు మొదలు ౨౦౦- వ రేకు వఱకునుఁగల ఆధ్యాత్మకీర్తనలు కలవు.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వేసిన పథమున, శ్రీ శ్రీనివాసాచార్యుల నిష్కళంక భక్తిశక్తులు తోడుగా, ఇఁకముందు తాళ్ళపాకకృతుల శోధన ప్రకటనములు త్వరగా జరుగఁగలవని యాశంసించుచున్నాను. కాని యీ మహాకార్యము పూర్తియగుటకు ఆ శ్రీనివాసుని మహాసంకల్పమే సాధనమై మమ్ము నడపవలసియున్నది.

ఈ కైంకర్యమునకు నాకవకాశముఁగల్పించిన శ్రీవేంకటేశ్వర దేవాలయాధికారులందరు నా కృతజ్ఞతాశక్తిని మించిన బరువు.

శ్రీవేంకటేశ్వరప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
తిరుపతి
30-11-51.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

శుభమస్తు

## శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు-నేఁటి క్రోధిసంవత్సరమందు, తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన-పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను. అదిమొదలుగాను శాలివాహనశకవరుషంబులు ౧౪౨౪ అగుఁ నేటిదుందుభిసంవత్సర ఫాల్గుణ-బహుళ ౧౨ విరుధానకు[1] (విరోధానకు? తిరోధానానకు?) తిరువేంగళనాథుని-మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన-అధ్యాత్మ సంకీర్తనలు.

రేకు 101 కాంబోది

విచారించు హరి నావిన్నప మవధరించు
  పచారమే నాదిగాని పనులెల్లా నీవే ॥ పల్లవి ॥

తనువు ౧నాదెందుఁగాని ౨తనువులోనింద్రియములు
  అనిశము నాచెప్పినట్టు సేయవు
  మనసు నాదెందుఁగాని మర్మము నాయిచ్చ రాదు
  పవివడి దూరు నాది పరులదే భోగము ॥ విచా ॥

---

1. ఈశబ్దము 'విరోధ' 'విరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాడు కడపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన "సరియగు" అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అనునర్థములో "ఈ విరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమీవారి-విష్ణుపారిజాతము ౪౯ పుట. నేనీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ-శర్మగారు. "విఱుత్తం" అనుఅరవపదముకూడ 'విరుపు' అనునర్థముతో దీనికి సహాయపడునవని. ౧. నాది+అందుఁగాని. ౨. తనువులోని+ఇంద్రియములు. ఇట్టిసంధు లీవాఙ్మయమున గలవు.

అలరి నానిద్దుర నాదెందుఁగాని, ౧సుఖమెల్ల
కలలోని ౨కాఁపిరాలకతలపాలె
తెలివి నాదెందుఁగాని దినాలు కాలముసొమ్ము
యెలమిఁ బేరు నాది యెవ్వరిదో బలువు ॥ విచా ॥

కర్మము నాదెందుఁ గాని కర్మములోఫలమెల్ల
అర్మిలి నాజన్మముల ౩ఆధీనమె
ధర్మపుశ్రీవేంకటేశ దయానిధివి నీవు
నిర్మితము నీ దింతే నేరుపు నీమాయది ॥ విచా ॥ 1

ఆహిరి

విడువరా దెంతైనా వెట్టివాఁడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును ॥ పల్లవి ॥

జ్ఞానము నే నెఱఁగ సజ్ఞానము నే నెఱఁగను
మానను విషయములు మఱిగెంతైనా
నీనామము నొడిగి నీదాసుఁడ ననుకొందు
దీనికే వహించుకొని దిద్దుకో నన్నును ॥ విడు ॥

అకర్మము నెఱఁగను సుకర్మము నెఱఁగను
ప్రకటసంసారముపై పాటు మానను
వొకపవివాఁడనై వూని ముద్రధారినైతి
మొకమోడి యిందుకే గోమున నేలు నన్నును ॥ విడు ॥

వెనకఁ గాన ముందు విచారించి కానను
వినుపై దేహధారినై నీకు మొక్కేను
ఘనుఁడ శ్రీవేంకటేశ కన్నులెదుటఁ బడితి
కవి పోవిడువరాదు కరుణించు నన్నును ॥ విడు ॥ 2

---

౧. 'యాసుఖమెల్ల' పూ.ము.పా. రేకులో లేదు. ౨. 'కాఁపురాల' పూ.ము.పా.
౩. 'అధీనమె' పూ.ము.పా.

### సాళంగనాట

దొరకె మాపాలికిఁ గంటివయర్థము
దరిదాపై యుండినతత్త్వార్థము ॥ పల్లవి ॥

శిరముగ [౧]నల్లదీవిఁ దెచ్చినయర్థ మిదివో
విరజవోడరేవున వెళ్లినర్థము
పరమభాగవతులు పాఁతినర్థ మిదివో
పురుషోత్తముఁడనేటిపురుషార్థము ॥ దొర ॥

చందపువేదముల(లు ?) శాసనము వేసినర్థము
ముందు సముద్రలకెల్లా మొదలర్థము
అందరియాత్మలనేటిఅంగళ్ల లోనియర్థము
యెందు సహస్రనామపు పెన్నికర్థము ॥ దొర ॥

కొలచి బ్రహ్మాండముల [౨]కొప్పెరలోనర్థము
యిల నిహపరముల కెక్కినర్థము
యెలమి హీనునినైన యెక్కుడుసేసేయర్థము
అలరి శ్రీవేంకటేశుఁడైనయర్థము ॥ దొర ॥ ౪

### భైరవి

దైవమా [౩]నీమాయ తలమొలెఱుఁగనీదు
కావరపువిషయాలకట్లు వదలవు ॥ పల్లవి ॥

గక్కనఁ దిరిగివచ్చీ కాలము మీఁదమీఁద
వొక్కనాఁటి కొక్కనాఁటి కొత్తు కొత్తుక
నిక్కీ తుమ్మిదలవంటినెరులెల్లాఁ దెల్లనాయ
కక్కరమాయ మేను కాంతులూ నుడుగవు ॥ భైర ॥

---

౧. 'వల్లదివిం' వ్రా.ము.పా. నల్లదీవి='జంబూద్వీపము' కావచ్చు.
౨. కొప్పెరలోని+అర్థము. ౩. 'నీమాయతలమొలెఱుఁగ నీదు' వ్రా.ము.పా.

చిన్ననాఁడు మోహించినచెలులు నేఁ జూడఁగానే
పన్నినవయసుమీరి ప్రౌఢలైరి
వన్నెకుఁబెట్టినసొమ్ము వడి [1]రాసి యెత్తుదీసె
మున్నిటివే వెనకాయ ముచ్చటాఁ దొలఁగదు ॥ దైవ ॥

సిగ్గులెల్లాఁ బెడఁబాసె చేరి యవ్వరు నవ్వినా
యెగ్గుపట్టదు మనసు యెఱుకతోనే
విగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్ను నేలుకొంటి
దగ్గరి నాలోనుండఁగా తలపూఁ గైవాలదు ॥ దైవ ॥ 4

ముఖారి

[2]పులుఁగు చెప్పేది నదె పొంచి మాగురుఁడు నీకు
తలఁచుకో నేఁడు నీవు దాఁచినర్థము ॥ పల్లవి ॥

యిలమీఁద తమసొమ్ము లెవ్వరివద్ద నుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాఁడ
వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే ॥ పులు ॥

చేరి తమవూరివారి చెఱవట్టుకొని పోతే
[3]కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు
వూరక నీకుక్షిలోనవున్న నన్ను నీమాయ
వీరానఁ జెఱవట్టెను విడిపించుకొనవే ॥ పులు ॥

బడిదప్పి తిరిగేటిపసులను తమవారు
తడయక తెచ్చుక ఆదరించినట్టు
వెడబుద్ధిఁ దిరిగేను వెఱ్ఱిని శ్రీవేంకటేశ
విడువక అజ్ఞానినన్ను విడిపించుకొనవే ॥ పులు ॥ 5

---

౧. రాసి=రాచుకొని. ౨. 'పులుఁగు' మూ.ము.పా. పులుగు=అబద్ధము, 'పుకహం' తమిళము. ౩. ఈ పాదమున యతిభంగమా? 'తెచ్చుకొన్నట్టు' లోని 'కొ' కో?

ఆహిరి

ఇందులో మొదలికర్త యెవ్వఁడు లేఁడుగాఁబోలు
ముందు కరివరదుఁడే ముఖ్యుఁడుగాఁబోలు ॥ పల్లవి ॥

ఆడితిఁబో బహురూపా లన్నియోమలఁ బుట్టి
తోడనె బ్రహ్మాదులనేదొరలెదుటా
జాడలు మెచ్చాలేరు చాలునన్నవారు లేరు
వేడుక నడవిఁగాసేవెన్నెలాయ బ్రదుకు ॥ ఇందు ॥

అన్నికర్మములుఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతి—
నన్ని వేదములనేటియంగడివీధి
నన్నుఁ జూచేవారు లేరు నవ్వేటివారు లేరు
వన్నెలసముద్రములో వానలాయ బ్రదుకు ॥ ఇందు ॥

సంసారపునాటకసాలలో బ్రతిమనైతి
కంసారి శ్రీవేంకటపతిమాయలోన
౧ యింస లిన్నియుఁ దేరె నిందరుఁ జుట్టములైరి
హంసచేతిపాలునీరునట్లాయ బ్రదుకు ॥ ఇందు ॥ 6

రేకు 102 లలిత

ఒల్లఁడుగాక దేహి వుద్యోగించఁడుగాక
కొల్లలైనమేలు తనగుణములో నున్నది ॥ పల్లవి ॥

తలఁచుకొంటేఁ జాలు దైవమేమి దవ్వా
నిలుచుక తనలోనే నిండుకున్నాఁడు
చలపట్టితేఁ జాలు ౨ సర్గ మేమి బాఁతా
చలివేఁడినాలికపై సత్యములో నున్నాఁడు ॥ ఒల్లి ॥

౧. 'హింస' కు వికృతియా. ౨. సర్గము 'స్వర్గము'నకు వికృతియా?

ఆయమెఱిఁగితేఁ జాలు నాయుష్యము గరవా
కాయపుటూపిరిలోనే గని వున్నది
చేయఁబోతే పుణ్యుఁడుగా జీవునికిఁ దడవా
చేయారఁ గర్మము తనచేతిలోనే వున్నది ॥ ఒల్ల ॥

మొక్కనేరిచితేఁ జాలు మోక్షమేమి లేదో
యెక్కువశ్రీవేంకటేశుఁ డిదె వున్నాఁడు
దక్కఁగొంటేఁజాలు పెద్దతనమేమి యరుదా
తక్కక శాంతముతోడిదయ లోన నున్నది ॥ ఒల్ల ॥ 7

సామంతం

మాఁతలు దవ్వఁగఁబోతే బేతాళములు వుట్టె
కాఁతాళపులోకులాల కంటిరా యీసుద్దులు ॥ పల్లవి ॥

మీఱినపుత్రకామేష్టి మించి లంకకుఁ బై వచ్చె
ఆఱడి రామావతార మసురబాధ
తూఱి సీతపెండ్లి హరుదొడ్డం వింటిపండుగాయ
పాఱి పాఱి నమ్మ ౨నెటువలెవచ్చు పిరివి ॥ మాఁతు ॥

చూడ కేకయరాజ్యము చుప్పనాతిపాపమాయ
వేడుక మాయామృగము వేఁటాయను
వాడికె సుగ్రీవుమేలు వాలికి గండాన వచ్చె
౩ యీడుగావిరాచపుట్టు యెట్టు నమ్మవచ్చును ॥ మాఁతు ॥

వుమ్మడిఁ గోఁతులకూట ముదధికిఁ గట్లు వచ్చె
తమ్ముఁవిబుద్ధి రావణుతల వోయను
నమ్మి శ్రీవేంకటేశునిపట్టానకే యింతానాయ
యిమ్ముల విట్టిదేవర నెట్టు నమ్మవచ్చును ॥ మాఁతు ॥ 8

---

౧. 'విండి' పూ.ము.పా, ౨. 'నెటువలె' రేకు,
౩. 'యీడుగా విరాచపుట్టు' పూ.ము.పా.

సాళంగనాట

అన్నిటి కెక్కుడుయీవి హరియిచ్చేది
మన్నించునాతనికంటే మఱి లేరు దొరలు ॥ పల్లవి ॥

తగుబ్రహ్మలోకముదాఁకా నెక్కిచూచిన
మగుడఁ బుట్టేలోకాలే మనుజులకు
తెగి [1] యిచ్చే యింద్రాదిదేవతలవరములు
మొగువదిగువలను యీసందివే ॥ అన్ని ॥

మాయలోనఁ బుట్టేది మాయలోనఁ బెరిగేది
[2] కాయదారులకు నెల్లాఁ గలిగినదే
సేయరానిపుణ్యమెల్లాఁ జేసి గడించుకొనేది
చాయల బహురూపపుసంసారమే ॥ అన్ని ॥

చెడనివైకుంఠ మిచ్చుఁ జేటులేనిపర మిచ్చు
వెడమాయఁ బెడఁబాపు విష్ణుఁ డితఁడే
యెడయక శ్రీవేంకటేశుఁడై వున్నాఁడు వీఁడె
జడియ కితఁడే కాచు శరణంటేఁ జాలును ॥ అన్ని ॥ 9

మలహరి

అతిసులభం బిది యందరిపాలికి
గతియిది శ్రీపతికైంకర్యంబు ॥ పల్లవి ॥

పాలసముద్రము బలిమిఁ దచ్చికొని —
రాలరిదేవత లమృతమును
నాలుక నిదె హరినామపుటమృతము
యేల కానరో యిహపరసుఖము ॥ అతి ॥

---

౧. 'యింద్రాదిదేవతలు యిచ్చేవరములు' అనుట సహజము,
౨. 'కాయధారులు' కావచ్చు.

అదరి బాఁతిపడి యవని దేవతలు
బడివాయరు యజ్ఞ భాగాలకు
విడువక చేతిలో విష్ణుప్రసాదము
కడిగడియైనది కానరుగాని ॥ అతి ॥

యెక్కుడురు దిగుదు రేడులోకములు
పక్కనఁ దపముల బడలుచును
చిక్కినాఁడు మతి శ్రీవేంకటేశ్వరుఁ-
డిక్కడితుదిపద మెఱుఁగరుగాని ॥ అతి ॥ 10

సామంతం

ఏమి సేయుదు నింక నిందిరాధీశ్వరుఁడా
నీమఱుఁగు చొచ్చితిని నెరవేర్తుగాక ॥ పల్లవి ॥

కడి వోనిజవ్వనము కలిమిలేమెఱుఁగునా
బడినుండి మిగుల రుణపరచుఁగాక
అడియాసలెల్లాఁ బుణ్యముఁబాప మెఱుఁగునా
వెడగుఁదనలో దయ విడిపించుఁగాక ॥ ఏమి ॥

వలపువెఱ పెఱుఁగునా వాఁడిమొనలకు నైన
బలిమిఁ దూరించఁ జలపట్టుఁగాక
చలనమందినమనసు జాతి నీ తెఱుఁగునా
కలిసి హేయమున కొడిగట్టించుఁగాక ॥ ఏమి ॥

యెలమి రతిపరవశము యెగ్గుసిగ్గెఱుఁగునా
బలిమిఁ దిట్లకు నొడఁబఱచుఁగాక
యిలలోన శ్రీవేంకటేశ నీమాయ లివి
తలఁగించి యేలితివి దయసేతుగాక ॥ ఏమి ॥ 11

భైరవి

అయ్యో మాయలఁ బొంది అందు నిందు నున్నవాడు
యియ్యగొనఁ గర్తలుగా రెఱఁగరు జడులు ॥ పల్లవి ॥

చుక్కలై యుండినవారు సురలై యుండినవారు
యిక్కడనుండిపోయినయీజీవులే
దిక్కుల వారి నిందరు దేవతలంటా మొక్కేరు
యెక్కుడైనహరి నాత్మ నెఱఁగరు జడులు ॥ అయ్యో ॥

పాతాళవాసులును పలులోకవాసులును
యీతరవాతనుండినయీజీవులే
కాతరాన వారిపుణ్యకతలె వినేరుగాని
యీతల శ్రీహరికత లెఱఁగరు జడులు ॥ అయ్యో ॥

యిరవెఱిఁగినముక్తు లెఱఁగని[౧] బద్ధులు
యిరవై మనలోనున్నయీజీవులే
సిరుల మించినవాఁడు శ్రీవేంకటేశ్వరుఁడే
శరణాగతులు దక్క చక్కఁగారు జడులు ॥ అయ్యో ॥ 12

రేకు 103 శుద్ధవసంతం

ఛీ ఛీ వివేకమా చిత్తపువికారమా
యేచి హరిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు ॥ పల్లవి ॥

బతికేనంటాఁ బోయి పయిఁడి వుచ్చుక తన-
పతియవసరములఁ బ్రాణమిచ్చీని
బతు కందులోన నేది పసిఁడి యెక్కడ నుండు
గతిహరిఁ గొలువక కట్టువడె జీవుఁడు ॥ ఛీఛీ ॥

౧. 'బుద్ధులు' వ్రా.ము.పా.

దొడ్డవాఁడనయ్యేనని దొరలఁ గొలిచి వారి-
కడ్డము నిడుపు మొక్కి నలిదీనుఁడై
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాఁడు
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుఁడు ॥ చీచీ ॥

చావనేల నోవనేల సారెఁ గిందుపడనేల
యీవల శ్రీవేంకటేశుఁ డింట నున్నాఁడు
దేవుఁ డాతఁడే నేఁడు తెలిసి కొలిచేఁగాని
భావించ కిన్నాళ్ళదాఁకా భ్రమఁ బడె జీవుఁడు ॥ చీచీ ॥ 13

రామక్రియ

అనుచు నిద్దరునాడే రమడలవలెనే
మొనసి యివెల్లాఁ జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు ॥ పల్లవి ॥

రాముఁడ పండ్లు నాకు [1]రందు వెట్టరా
యేమిరా యిట్లానె నాకు యిత్తువా నీవు
ప్రేమపుతమ్ముఁడఁగాన పిన్ననే నీకు
యీమాట మఱవకు యిందరా కృష్ణుఁడా ॥ అను ॥

యెక్కిన [2]పుట్టిపై నన్ను నెక్కించరా వోరి
పుక్కనఁ బడేవు రాకు వద్దురా నీవు
పక్కన మొక్కేరా నీపయిఁడికాళ్లకు వోరి
అక్కతోఁ జెప్పేఁగాని అందుకొనే రారా ॥ అను ॥

[3]యెవ్వరు వాడవో సరి నిటు నిలుతమురా వోరి
నివ్వటిల్ల నీ వింత నిక్కవొద్దురా
రవ్వల శ్రీవేంకటాద్రిరాయఁడనేరా, అయితే —
యివ్వల నీకంటేఁ [4]బెద్ద యిది నీ వెఱఁగవా ॥ అను ॥ 14

1. 'రెండు' కు రూపాంతరము 2. 'పుట్టి' రేవు.
3. ఎవ్వరు+వాడవో. 4. పెద్ద=పెద్దవాడను; యిది=ఈ విషయము.

ధన్నాసి

పెట్టినసి వెఱఁగుదు పెనుదిక్కు-
ఇట్టిగా శ్రీహరి నీకు శరణు చొచ్చితిమి ॥పల్లవి॥

కర్మమూలమైనట్టికాయము మోచి నేను
కర్మము విడువఁబోతే కడుసంగతా
మర్మమెఱిఁగినసీవే మాయలఁ [1]గట్టుండఁగాను
పేర్మి నే విడువఁబోతే బిగియదా కట్టు ॥పెట్టి॥

బంధమూలమైనట్టిప్రపంచమందు నుండి
బంధముఁ బాసేనంటేఁ బాసునా అది
అంధకారమైనట్టిఅజ్ఞానానఁ దోసితివి
అంధకారమున వెలుఁ గరసితేఁ గలదా ॥పెట్టి॥

నిచ్చలు నీసంసారపునీరధిలోన ముఁగి
చొచ్చి వెళ్లి చేరేనంటేఁ జోటు గలదా
యిచ్చట శ్రీవేంకటేశ యిహమందే పరమిచ్చి
అచ్చు మోపి యేలఁగా నే నన్నియుఁ దెలిసితి ॥పెట్టి॥ 15

ముఖారి

వెనకేదో ముందరేదో వెఱ్ఱి నేను నా-
మనసుమరులు దేర మందేదొకో ॥పల్లవి॥

చేరి మీఁదటిజన్మముసిరులకు నోమేఁగాని
యేరూపై పుట్టుదునో యెఱఁగ నేను
కోరి విఁద్రించఁ బరచుకొన నుద్యోగింతుఁగాని
సారె లేతునో లేవనో జాడ దెలియ నేను ॥వెన॥

---

1. కట్టు+ఉండఁగాను.

తెల్లవారినప్పుడెల్లా తెలిసితివనేఁగాని
కల్లయేదో నిజమేదో కాన నేను
వల్లె చూచి కామినుల వలపించేఁగాని
మొల్లమై నామేను ముదిసిన దెఱఁగ ॥ వెవ ॥

పాపాలు చేసి మఱచి బ్రదుకుచున్నాఁడఁగాని
వైపుగఁ జిత్రగుప్తుఁడు వ్రాయు టెఱఁగ
యేపున శ్రీవేంకటేశు నెక్కడో వెతకేఁగాని
నాపాలిదైవమని నన్నుఁ గాచు టెఱఁగ ॥ వెవ ॥ 16

మలహరి

అంతరుమాలినయట్టి అధములాల
[౧]పొంత సంతకూటమి పొరిచూపు గాదా ॥ పల్లవి ॥

కనక మిత్తడితోడ కలయ సరిదూఁచితే
[౨]అనువవునా అది దోష మవుఁగాక
ఘనుఁడైనహరితోఁ గడుహీనదేవతల
నెవిచి సరివెట్టితే నెయ్య మవునా భువిని ॥ అంత ॥

పట్టభద్రుఁడు గూర్చుండేబలుసింహాసనముపై
వెట్టిబంటుఁ బెట్టేవారు వెఱ్ఱులేకారా
గట్టిగా శ్రీహరితోడ కలగంపదేవతలఁ
బెట్టి కొలుచుట విందువెట్టి పగగాదా ॥ అంత ॥

కొంచక సింహముండేటిగుహ నుండవచ్చునా
పొంచి నక్కలకెల్ల బొక్కలేకాక
అంచెల శ్రీవేంకటేశుఁ డాత్మలోనే వుండఁగాను
కొంచపుదైవాల పలువంచలనేకాక ॥ అంత ॥ 17

౧. 'పొంతసంత కూటమిపో రిచూపు గాదా' వ్రా.ము.ప్ర. అర్థము విచార్యము.
౨. 'అను' వ్రా.ము.ప్ర. యతిభంగము.

దేవగాంధారి

కల్లమాడ దొడ్డముద్ర కటకటా
చెల్లుబడికల్లలు చెప్పేరు లోకులు ॥పల్లవి॥

యిప్పుదేలే బ్రహ్మదేవు డిట్టే వుండగ మీదటి-
వొప్పగు బ్రహ్మపట్టము వొకరికి వెచ్చపెట్టి
అప్పటి మూడుమూర్తులయందులో నీతవి సరి-
చెప్పఁబొయ్యే రీమాట చెల్లునా లోకులకు ॥కల్ల॥

కైలాసము రుద్రుఁడుగల బ్రహ్మాండకోట్లు
పోలించి విష్ణుఁడు కడుపున నించుకుండఁగాను
చాలి మూఁడుమూర్తులలో సరి యీతఁ డంటాను
తూళులై యాదేరుగాక కూడునా లోకులకు ॥కల్ల॥

ఘనుఁడీతనిపాదము గడిగె బ్రహ్మదేవుఁడు
మొనముట్టి శిరసున మోఁచె శివుఁడు
వొనర మూఁడుమూర్తులం దొకఁడు శ్రీవేంకటేశు-
డనుమాట యిది తగవవునా లోకులకు ॥కల్ల॥ 18

రేకు 104 పాడి

తెలిసితే మోక్షము తెలియకున్న బంధము
కలవంటిది బదుకు ఘనునికిని ॥పల్లవి॥

అనయము సుఖమేడ దవల దుఃఖమేడది
తనువుపై నాసలేనితత్త్వమతికి
పొనిఁగితేఁ బాపమేది పుణ్యమేది కర్మమందు
వొనర ఫలమొల్లనియోగికిని ॥తెలి॥

తగినయమృతమేది తలఁపఁగ విషమేది
 తెగి విరాహారియైనధీరునికిని
పగవారనఁగ వేరి బంధులనఁగ వేరీ
 వెగటుప్రపంచమెల్ల విడిచేవివేకికి ॥ తెలి ॥

వేవేలువిధులందు వెఱపేది మఱపేది
 దైవమునమ్మినయట్టిధన్యునికిని
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
 యీవలేది యావలేది యితనిదాసునికి ॥ తెలి ॥ 19

భైరవి

నీదాస్యమొక్కటే విలిచి నమ్మఁగలది
 శ్రీదేవుఁడవు నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

అనుష్ఠానములు ౧ గతియని నమ్మి చేసితినా
 తనువిది మలమూత్రములప్రోగు
జనులలో నుత్తమపుజన్మమే నమ్మితినా
 వొనరఁ గర్మమనేవోఁదానఁ బడినది ॥ నీదా ॥

చదువులశాస్త్రములజాడలు నమ్మితినా
 పొదలినమతములపోరాట మది
మదిమదినుండిననామనసే నమ్మితినా
 అదియును నింద్రియాల కమ్ముడువోయినది ॥ నీదా ॥

పుత్రదారధనధాన్యభూములు నమ్మితినా
 పాత్రమగురుణానుబంధము లవి
చిత్రముగ నను గావు శ్రీవేంకటేశ నీవే
 పత్రపుష్పమాత్రమే నాభక్తియెల్లా నీకు ॥ నీదా ॥ 20

౧. "గతి యని చేసి నమ్మితినా" పూ.ము.పా.

### మలహరి

౧ కంచూఁగాదు ౨ పెంచూఁగాదు కడుఁబెలుచు మనసు
యెంచరాదు పంచరాదు యెట్టిదో యీమనసు ॥ పల్లవి ॥

పట్టఁ బసలేదు చూడ బయలుగా దీమనసు
నెట్టనఁ బారుచునుండు నీరూఁ గా దీమనసు
చుట్టి చుట్టి పాయకుండుఁ జుట్టమూఁ గా దీమనసు
యెట్టనెదుటనే వుండు నేఁటిదో యీమనసు ॥ కంచూ ॥

రుచు లెల్లాఁ గానుపించు రూపు లేదు మనసు
పచరించు నాసలెల్లాఁ బసిఁడిగా దీమసు
యెచటాఁ గరఁగదు రాయీఁగాదు మనసు
యిచటా నచటాఁ దానే యేఁటిదో యీమనసు ॥ కంచూ ॥

తప్పక నాలో నుండు దైవముఁ గాదు మనసు
కప్పి మూఁటగట్టరాదు గాలీఁ గాదు మనసు
చెప్పరానిమహిమల శ్రీవేంకటేశుఁ దలఁచి
యిప్పు డివ్విటా గెలిచె నేఁటిదో యీమనసు ॥ కంచూ ॥ 21

### గుజ్జరి

కలదిదివో సుఖము గలిగినను గర్వము నిలువక మానునా
మలసి కామ్యకర్మములకుఁ జొచ్చినమగుడఁ బుట్టువులు మానునా ॥ పల్లవి ॥

పరగ నింద్రజిత్తుఁడు హనుమంతుని బ్రహ్మాస్త్రంబునఁ గట్టి
అరయ నందుపై మోకులు గట్టిన నల్ల బ్రహ్మాస్త్రము వదలె
పరిపరివిధముల నిటువలెనే హరిఁ బ్రపత్తి నమ్మిననరుఁడు
తిరుగఁ గర్మమార్గమునకుఁ జొచ్చిన దేవుఁడు దనవాత్సల్యము
వదలు ॥ కల ॥

---

౧. ౨. "కంచుఁగాదు పెంచుఁగాదు" పూ.ము.పా.

ఈ పాటలో మూడవచరణము 'దైవము' తప్ప తక్కిన సముచ్చయార్థకస్థలములందంతటా దీర్ఘములే కలవు. పూ.ము.పా.లలో అదీర్ఘములు హ్రస్వములైనవి. మూడవచరణము రెండవపాదము తప్పిపోయినది. మూడవ చరణము మూడవపాదము ఏమీవ్రాయకయే ప్రశ్నచిహ్నముతో నిలిచినది.

అలరినసంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపుచు నొకయిఱ్ఱిఁ బెంచినంతనే తనకును నారూపు దగిలె
ములుగుచు లంపటములు దెగ విడిచి మోక్షము వెదకెడివరుఁడు
వలవనిదుస్సంగతులు పెంచినను వాసన లంటక మానునా ॥కల॥

అటుగన తాఁ బట్టినవ్రత ముండఁగ నన్యమతము చేపట్టినను
నటనల నెందునుఁ బొందక జీవుఁడు నడుమనె మోరుఁడై నట్లు
తటుకన శ్రీవేంకటపతిఁ[౧] నొక్కని దాస్యము భజియించినవరుఁడు
ఘటనల నాతనికైంకర్యములకు కడుఁబాత్రుఁడుగాక మానునా
॥కల॥ 22

శ్రీరాగం

చెల్లఁబో యీజీవు లిలఁ జేసినపాప మెంతో
వుల్లమున నున్నహరి వూరకే దవ్వాయ ॥పల్లవి॥

కన్నచోటనే హరి కలఁడన్నవారికి
విన్నచోటనే విష్ణుడు వివేకులకు
వున్నతిఁ గొలువలేక వొద్దనుండఁగాఁ గొందరు
మిన్నుమీఁద వెదకేరు మితిమీఱఁ జదివి ॥చెల్ల॥

పట్టినదే బ్రహ్మము పరమార్థవేత్తలకు
తిట్టులోనా దైవము దివ్యులకును
ముట్టి చేత మొక్కలేరు ముందటనే వుండఁగాను
బట్టబయలు పాకేరు బహుకర్మవిదుల ॥చెల్ల॥

ఊపిరిలో దేవుఁడున్నాఁడు యోగీంద్రులకు
దాపున నున్నాఁడు హరిదాసులకును
యేపున శ్రీవేంకటేశు నేచి శరణనలేక
చాపలాన వెదకేరు సకలదేవతల ॥చెల్ల॥ 23

౧. 'పతియొక్కని' కావోలు. ఇది సమాసము. ద్రుతము విచార్యము. లేదా దాస్యము అనునది 'సుఖముండి' ఇత్యాదులవలె తృతీయార్థకము కావోలు.

లలిత

౧ శరణంటి మాతని ౨ సమ్మంధమునఁ జేసి
మరిగించి మము నేలి మన్నించవే ॥ పల్లవి ॥

సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి నినుఁ బాడి పావనుఁడైన-
అకలంకుఁడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీవేంకటనిలయ ॥ శర ॥

నారదాదిసనకసనందనాదులవలె
పేరుపడి నిన్నుఁ బాడి పెద్దలై ౩ నట్టి-
అరీతిఁ దాళ్లపాకన్నమాచార్యుల
చేరి యేలినయట్టిశ్రీవేంకటనిలయ ॥ శర ॥

సామవేదసామగానసప్తస్వరములను
బాముతో నీసతి విన్నుఁ బాడినయట్టి-
ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చినశ్రీవేంకటనిలయా ॥ శర ॥ 24

రేకు 105 వరాళి

అదివో నిత్యశూ(సూ?)రులు అచ్యుత నీదాసులు
యెదురులేనివారు యేకాంగవీరులు ॥ పల్లవి ॥

రచ్చలసంసారమనేరణరంగములోన
తచ్చి కామక్రోధాలతలలు గొట్టి
అచ్చపుతిరుమంత్రపుటారుపుబొబ్బలతోడ
యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

---

౧. ఈ పాట పెదతిరుమలయ్యదో, చినతిరుమలయ్యదో కావలసియున్నది. అన్నమాచార్యుల సంబంధముతో మేము గొప్పవారమైతిమని చెప్పకొనుచున్నారు.

౨. సంబంధ: పూ.ము.పా ౩ 'అట్టి' అను విశేషణము పై పాదములోని-తాళ్లపాకఅన్నమాచార్యులతో సమసింపవలసియున్నది. సమాస మధ్యమున "అరీతిఁ" అనుపదము చొచ్చుకొన్నది. ఇట్టివికటసమాసములు ఈవాఙ్మయమున కోకొల్లలు,

మొరసి పుట్టుగులనేముచ్చుఁబోఁజుల కురికి
తెరలి నడుములకుఁ దెగవేసి
పొరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటులఁ దూరి
యెరగొని తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

వొడ్డినదేహములనేవూళ్లలోపల చొచ్చి
చెడ్డ[1]యహంకారమును చెఱలుపెట్టి
అడ్డమై శ్రీవేంకటేశు నండ నుండి లోకులనే-
యెడ్డల జూచి నవ్వేరు యేకాంగవీరులు ॥ అది ॥ 25

సాళంగం

[2]జ్ఞానులాల యోగులాల సకలవిరక్తులాల
నానావిధాల నివి నమ్మేరు సుండీ ॥ పల్లవి ॥

ఆలరియింతులయధరామృతము లివియెల్ల
కాలకూటవిషములకరణి సుండీ
శీలముతో వీరలచెట్టఁవట్టుటలెల్లా
బాలనాగాలఁ దొడికి పట్టుట సుండీ ॥ జ్ఞాను ॥

కాంతలు నవ్వుచునైనాఁ గన్నులఁ జూచినచూపు
పంతమున నలుగులపాఁతర సుండీ
బంతుల నెదుటనున్నపడఁతులచన్ను లివి
కంతల నొడ్డినబడిగండ్లు సుండీ ॥ జ్ఞాను ॥

జవ్వనపుఁగామినులసరసపుమాటలెల్లా
మవ్వమైనయట్టిచొక్కుమంత్రాలు సుండీ
యివ్వలను శ్రీవేంకటేశ్వరుదాసుల కివి
చివ్వనఁ జెప్పినట్టు చేసేవి సుండీ ॥ జ్ఞాను ॥ 26

---

౧. 'అహంకారమును' కావచ్చు. ౨. 'జ్ఞానులార' ఇత్యాదికి బదులుగ 'జ్ఞానులాల' ఇత్యాదిగనే ఈరేకులలో పెక్కుతావుల సంబోధనము కానవచ్చుచున్నది.

కాంబోది

సంతలే చొచ్చితిఁగాని సరకుఁ గాననైతి
యింతట శ్రీహరి నీవే యిటు దయఁజూడవే ॥ పల్లవి ॥

కాంతచన్నుఁగొండలు కడకు నెక్కితిఁ గాని
యెంతైనా మోక్షపుమెట్లు యెక్కలేనైతి
అంతట జవ్వనమనేఅడవి చొచ్చితిఁగాని
సంతతహరి[1]భక్తైనేసంజీవి గాననైతి ॥ సంత ॥

తెగి సంసారజలధిఁ దిరుగులాడితిఁగాని
అగడై వైరాగ్యరత్న మది దేనైతి
పొగరుజన్మాలరణభూములు చొచ్చితిఁగాని
పగటుఁగామాదులపగ సాధించనైతి ॥ సంత ॥

తనువనియెడికల్పతరువు యెక్కితిఁగాని
కొనవిజ్ఞానఫలము గోయలేనైతి
ఘనుఁడ శ్రీవేంకటేశ కమ్మర నీకృపచేతఁ
దవిసి యేవిధులనుఁ దట్టువడనైతి ॥ సంత ॥ 27

సాళంగనాట

నాకు నందు కేమివోదు నన్ను నీ వేమిచూచేవు
నీకరుణ గలిగితే నించి చూపవయ్యా ॥ పల్లవి ॥

ఘోరమైనదేహపుదుర్గుణ మేమిగలిగిన
ఆరసిఁ బ్రకృతిఁబోయి అడుగవయ్యా
నేర[2]నాజన్మముతో నేరుపేమిగల్లా నన్ను
ధారుణిఁ బుట్టించినవిధాత నడుగవయ్యా ॥ నాకు ॥

౧. 'భక్తనే' వ్రా.ము;పా. భక్తి+అనే=భక్తైనే. ఇట్టిసంధులు తాళ్లపాకవాఙ్మయమున కోకొల్లలు. ౨. 'విదుల' రేకు.

పంచేంద్రియములలోవిపాప మేమిగలిగినా
అంచెలఁ గామునిఁబోయి అడుగవయ్యా
ముంచిననాకర్మములో మోసమేమి గలిగినా
మంచితనానఁ జేయించేమాయ నడుగవయ్యా ॥ నాకు ॥

అన్నిటా నావెనకటిఅపరాధ మేమిగల్లా
మన్నించి నాగురుఁ జూచి మానవయ్యా
మిన్నక శ్రీవేంకటేశ మీఁదిపను లేమిగల్లా
నిన్నుఁ జూచుకొని నన్ను నీవే యేలవయ్యా ॥ నాకు ॥ 28

దేసాక్షి

మఱి హరిదాసుఁడై మాయలఁ జిక్కువడితే
వెఱపించఁబోయి తానే వెఱచినట్లవును ॥ పల్లవి ॥

శూరుఁడైనవాఁ డేడఁజొచ్చిన నడ్డము లేదు
ఆరీతిజ్ఞానికి విధు లడ్డము లేవు
కారణాన నప్పటినీఁ గలిగెనా నది మరి
తేరినసీళ్ల వందు దేరిన ట్లవును ॥ మఱి ॥

సిరులరాజైతే నేమిసేసిన నేరమి లేదు
పరమాధికారియైతేఁ బాపము లేదు
అరసి తనకుఁదానే అనుమానించుకొనెనా
తెరువే పో సుంకిరిఁ దెలిపిన ట్లవును ॥ మఱి ॥

ఘూమెల్ల మేసినా నాఁబోతుకు బందె లేదు
నేమపుఁబ్రపన్నునికి నింద లేదు
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని
నోమరి కర్మమంటితే జుంటీఁగ కతవును ॥ మఱి ॥ 29

ముఖారి

నేమే బ్రహ్మమను[౧]కోనేరము; నేము-
కామించిన[౨]స్వతంత్రము గడు లేదుగాన ॥ పల్లవి ॥

క్షణములోపలనె సర్వజీవావస్థలూను
గణుతించేవాఁ డొకఁడు గలఁడు వేరే
అణుమహత్త్వములందు నంతర్యామైనవాని
ప్రణుతించి దాసులమై బ్రదికేముగాని ॥ నేమే ॥

పవిగొని యేలుటకు బ్రహ్మాదిదేవతలఁ
గనిపించేవాఁ డొకఁడు గలఁడు వేరే
ననిచి సిరుల లక్ష్మీనాథుఁడైనవాని-
పనులవారము నేము బ్రదికేముగాని ॥ నేమే ॥

సతతరక్షకుఁడయి శంఖచక్రధరుఁడయి
గతి శ్రీవేంకటపతి గలఁడు వేరే
అతనిమఱఁగు చొచ్చి యానందపరవశానఁ
బ్రతిలేక యిందరిలో బ్రదికేము గాని ॥ నేమే ॥ ౩౦

రేకు 106 శంకరాభరణం

ఇందుకేపో వెరగయ్యీ నేమందును
కందులేనినీమహిమ కొనియాడఁగలనా ॥ పల్లవి ॥

అటు దేవతలకెల్ల నమృతమిచ్చిననీవు
యిటు వెన్న దొంగిలుట కేమందును
పటుగతి బలీంద్రుని బంధించినట్టినీవు
పట రోలఁగట్టువడ్డచందాన కేమందును ॥ ఇందు ॥

౧. 'కానేరము' పూ.ము.పా. ౨. 'స్వతంత్రముడుగ లేదు గాన' పూ.ము.పా. ఇక్కడ 'స్వతంత్ర'శబ్దము భావప్రధాననిర్దేశము.

కలిగి యాకరిరాజుఁ గరుణఁ గాచిననీవు
యిల నావులఁ గాచుట కేమందును
తలఁప బ్రహ్మాదిదేవతలకుఁ జిక్కనినీవు
చెలులకాఁగిళ్లకుఁ జిక్కితి వేమందును ॥ ఇందు ॥

భావించ నన్నిటికంటేఁ బరమమూర్తివి నీవు
యీవల బాలుఁడవైతి వేమందును
కావించి బ్రహ్మాండాలు కడుపున నిడుకొని
శ్రీవేంకటాద్రి నిలిచితి వేమందును ॥ ఇందు ॥ 31

పాడి

వెన్నలుదొంగిలునాటివెట్టివా నీవు
విన్నకన్నజాడ గాదు వెట్టివా నీవు ॥ పల్లవి ॥

చేరి విన్నునొల్లనట్టిజీవుల నీవుదరాన
వీరుఁడవై మోఁచేవు వెట్టివా నీవు
వారపేరు నడిగితే నాపేరంటాఁ దగిలేవు
వీరానఁ జుట్టమవై వెట్టివా నీవు ॥ వెన్నె ॥

బంటులైనవారికిఁ బరతంత్రుఁడవై యీ—
వెంటవెంట దిరిగేవు వెట్టివా నీవు
అంటే ననరాదు రెఁడుఅడుకులకే చొచ్చేవు
వింటే మాటు నవ్వువచ్చీ వెట్టివా నీవు ॥ వెన్నె ॥

పావనులయి లోకమెల్లా బదుకుమంటాఁ వేళ్ల
వేవేలు వెట్టుకొంటివి వెట్టివా నీవు
శ్రీవేంకటేశుఁడవై చెంది వరము లిచ్చేవు
వేవేగ నెవ్వరికైనా వెట్టివా నీవు ॥ వెన్నె ॥ 32

## రామక్రియ

అయ్యో వారిభాగ్య మంతేకాక
నెయ్యపువెన్న వట్టుక నెయ్యి వెదకేరు ॥ పల్లవి ॥

దేవుఁడు వెల్లవిరై దిక్కులెల్లా నిండుండఁగా
నోవల నాస్తికునకు శూన్యమై తోఁచు
యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా
కావరపుజీవునకు ౧గతుగతుకే ॥ అయ్యో ॥

హరి శరణంటేఁ గాచేఅట్టియుపాయమే వుండఁగ
విరసానకుఁ గర్మమే వెగ్గళమాయ
పరగ నరులకెల్లాఁ బట్టపగలై యుండఁగా
అరయఁ గొన్నిజంతుల కంధకారమాయను ॥ అయ్యో ॥

యిక్కడ శ్రీవేంకటేశుఁ డెదుటనే వుండఁగాను
అక్కటా మూఢున కెందు ననుమానమే
మక్కువ నింతా నమృతమయమైనఁ గోడికి
తెక్కులఁ దవ్వఁబొయ్యేది తిప్పపెంటలే ॥ అయ్యో ॥ 33

## లలిత

కరుణించు మిఁకనైన కాఁపురమా
కరికరిఁ బెట్టకుమీ కాఁపురమా ॥ పల్లవి ॥

కలలోనిసుఖమైనకాఁపురమా
కలుషమేచవియైనకాఁపురమా
కలను బేహారపుకాఁపురమా
కలఁడు మా కిదే హరి కాఁపురమా ॥ కరు ॥

---

౧. 'గతుకు+గతుకు=గతుగతుకు' కావచ్చు.

౧ గంటవేఁటలో తగులుకాఁపురమా
కంటవత్తివెట్టికాచేకాఁపురమా
గంటుగిందుగాఁ బొరలేకాఁపురమా
కంటిమి శ్రీపతికృప కాఁపురమా ॥కరు॥

కావిరి వెట్టిచేరాయి కాఁపురమా
కావలసినట్లయ్యేకాఁపురమా
శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్ను నన్ను నొక్క-
కై వశము ౨ నేసెఁగదో కాఁపురమా ॥కరు॥ 34

పాడి

వేసరకు వీఁ దేల యనకుము విడువ నిన్నిఁక శరణు చొచ్చితి
నీసరెవ్వరు లేరు వెదకిన నిందుబందికిఁ జేట పేఁగా ॥పల్లవి॥

మీరు నాకుఁ గలరు నేనేమి సేసినఁ గాతురనియెడి -
ధీరతను జము సరకు గొనకే తివిరిఁ జేసితిఁ బాపము;
వోరసేయుచు నెంతలేదని వూరకే మీరుంటిరేనియు
వారికివిఁ గొరగాను; నే నెవ్వరిని నెఱఁగను మిమ్మేకాని ॥వేస॥

మిమ్ముఁగొలిచినగర్వమున నేమీఁ జేయక కాలమందే,
నమ్మి కర్మములెల్ల మాపితి నాకునాకే వేసరి;
దొమ్మి కోపక మీకు నాకును దూరమనుచుఁ బరాకుచేసిన,
యిమ్మలను నన్నవియు రోసును యేల నా కవి పీవేకాక ॥వేస॥

నీకు మొక్కినమందె మేళము నే నొక కొండ సేసుక
లోకములదేవతలకెల్లను లోను వెలిగా నైతి;
యీకడను శ్రీవేంకటేశుఁడ యిప్పుడిటు ననుఁగరుణఁజూచితి
చేకొనుచు వారె మెత్తురు చెలఁగి నీకింకరుఁడననుచు ॥వేస॥35

౧. 'గంట వెంటగ' పూ. ము. పా. ౨. నేసెఁ గదె + ఓకాపురమా'

వరాళి

ఏమందురు యీమాటకు నిందరూ నిన్ను
నీమాయ యెంతైనా నిన్ను మించవచ్చునా ॥పల్లవి॥

నేను నిన్నుఁ గొలిచితి నీవు నన్ను నేలితివి
¹పాని పంచేంద్రియాలేల పనిగొనీని
కానిలేనిబంట్లఁ దేరకాండ్లు వెట్టిగొనఁగ
దానికి నీకూరకుండ ధర్మమా సర్వేశ్వరా ॥ఏమం॥

పుట్టించినాఁడవు నీవు పుట్టినవాఁడను నేను
పట్టి కర్మమేల నన్ను బాధపెట్టీని
వొట్టినసొమ్ముకు వేరొకరు చేయిచాఁచితే
తట్టి నీవు వహించుకోఁదగదా సర్వేశ్వరా ॥ఏమం॥

యెదుట నీవు గలవు యిహములో నేఁ గలను
చెదరినచిత్తమేల చిమ్మిరేఁచీని
అదన శ్రీవేంకటేశ ఆరితేరినట్టినన్ను
వదలక రక్షించుకో వన్నెగా సర్వేశ్వరా ॥ఏమం॥ 38

రేకు 107 సాళంగనాట

ఆమీఁదినిజసుఖ మరయలేము
పామరపుదాయలకే భ్రమసితిమయ్యా ॥పల్లవి॥

మనసునఁ బాలు దాగి మదియించివున్నట్టు
నసిచి గిలిగింతకు నవ్వినయట్టు
యెనసి సంసారసుఖ మిది నిజము నేసుక
తనివొంది యిందులోనే తడఁబడేమయ్యా ॥ఆమీఁ॥

౧. 'పాని' క్త్వాంత'పూను' ధాతువు వ్యావహారికమా?

బొమ్మలాట నిజమంటాఁ బూఁచి చూచి మెచ్చినట్టు
తెమ్మగా శివమాడి తా దేవరైనట్టు
కిమ్ముల యీజన్మమందు కిందుమీఁదు ౧నేఱక
పమ్మి భోగములనే తెప్పలఁ దేలేమయ్యా ॥ అమీఁ ॥

బాలులు యిసుకగుళ్ల పసఁ గట్టు కాడినట్టు
పీలి వెఱ్ఱివాఁడు గంతువేసినయట్టు
మేలిమి శ్రీవేంకటేశ మిమ్ముఁ గొలువక నేము
కాల మూరకే యిన్నాళ్లఁ గడపితిమయ్యా ॥ అమీఁ ॥ 37

దేసాక్షి

దేవ నీదయ యెంతునో దివ్యసుఖ మెంతునో
కావించి గంటగట్టుక కాచుకుండే విదివో ॥ పల్లవి ॥

వెదక నావసమా వేగుదాఁకా నిన్ను నేను
కదిసి నీమూరితి కానవసమా
యెదుట శంఖచక్రాల ౨యెట్టిదైవము నేనని
పొదుగుచు నీకునీవే పొడచూపేవుగాక ॥ దేవ ॥

పొగడ నావసమా పురుణించి నీగుణాలు
తగుల నావసమా నీతలఁపెఱిఁగి
నిగిడి వేదశాస్త్రాల నిన్ను నీవే చెప్పుకొని
పగటుమాయజ్ఞానము పాపే వింతేకాక ॥ దేవ ॥

కొలువ నావసమా గుఱుతెఱిఁగి నీవెంట
చెలఁగి నాచేతులఁ బూజించవసమా
నిలిచి శ్రీవేంకటేశ నీవే నాయెదలో నుండి
మలసి పెరరేఁపుచు మన్నించేవుగాక ॥ దేవ ॥ 38

---

౧. 'నెఱ(గ)క' పూ.ము.పా. ౨. 'యెట్టిదైవ మనేనని' పూ.ము.పా. 'యిట్టి దైవము' కావచ్చు.

కన్నడగౌళ

నన్ను వింతగా గడించి నాయమా దిగవిడువ
అన్నిటా రక్షించకపో దంతర్యామి ॥ పల్లవి ॥

౧ సొమ్ము వోవేసినవాఁడు చుట్టిచుట్టి వీధులెల్లా
కమ్మక వెదకీనట కన్నదాఁకాను
నమ్మినఅజ్ఞానములో నన్నుఁ బడవేసుకొని
అమ్మరో వూరకుందురా అంతర్యామి ॥ నన్ను ॥

వోడబేరమాడేవాఁడు వొకదరి చేరిచి
కూడినయర్థము గాచుకొనీనట
యీడనే ప్రపంచములో నిట్టె నన్ను దరిచేర్చి
వోడక కాచుకోరాదా వోయంతర్యామి ॥ నన్ను ॥

చేరి పుప్పమ్మేవాఁడు చిల్లు వేఁ గనఁడట
వూరకే శ్రీవేంకటేశ వోపికతోడ
అరయ నన్నుఁ బుట్టించినట్టివాఁడవు నాభార-
మేరీతి నైన మోవు మిఁక నంతర్యామి ॥ నన్ను ॥ 39

భూపాళం

హరివారమైతిమి మ మ్మవుఁగాదనఁగరాదు
తరముగా దిఁకను మాతప్పులు లోఁగావరో ॥ పల్లవి ॥

వెన్నడించిసూడువట్టీవిష్ణుమాయ నీకు నేము
యిన్నిటాఁ బంతమిచ్చేము యింకఁ గావరో
సన్నల వెట్టిగొనేటిసంసారబంధము నీకు
మున్నె కిందుపడితిమి మించి దయఁజూడవో ॥ హరి ॥

---

౧ 'సొమ్ము + వో వేసిన' కావచ్చు.

ఆడించేటికామక్రోధాదిజూజరులాల
వోడితిమి మీకుఁ దొల్లె వోరయకురో
పీడవికర్మమ నీకు వెఱచి పూరి గఱచే-
మీఁదనే ధర్మదార మా కిఁకనైనాఁ బట్టవో ॥హరి॥

దక్కఁగొన్నమాలోవితసుభోగములాల
మొక్కితిమి మాకుఁ గొంత మొగమోడరో
యెక్కువ శ్రీవేంకటేశుఁ దేలె మాజన్మములాల
గక్కన వేఁడుకొంటిమి కపటాలు మానరో ॥హరి॥ 40

బౌళి

అతిసులభం బిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి
ప్రతిలే దిదియే నిత్యానందము బహువేదంబులె యివే సాక్షి ॥పల్లవి॥

వేసరకుమీ జీవుఁడా వెదకివెదకి దైవమును
ఆసపాటుగా హరి యున్నాఁ డిదె అందుకుఁ బ్రహ్లాదుఁడు సాక్షి
మోసపోకుమీ జన్మమా మంచినయనుమానములను
సేసినభక్తికిఁ జేటు లేదు యీ సేఁత కెల్ల ధ్రువుఁడే సాక్షి ॥అతి॥

తమకించకుమీ దేహమా తగుసుఖదుఃఖంబుల నలసి
అమితము నరహరికరుణ నమ్మితే నందుకు నర్జునుఁడే సాక్షి
భ్రమయకుమీ వివేకమా బహుకాలంబులు యీఁదీఁది
తమితో దాస్యము తను రక్షించును దానికి బలీంద్రుఁడే సాక్షి ॥అతి॥

మరిగివుండుమీ వోజిహ్వా మరి శ్రీవేంకటపతినుతుల
అరయఁగ నిదియే యీడేరించును అందుకు వ్యాసాదులె సాక్షి
తిరుగకుమీ విజ్ఞానమా ద్రిష్టపుమాయలకును లోఁగి
సరిలే దితనిపాదసేవకును సనకాదులబ్రదుకే సాక్షి ॥అతి॥ 41

లలిత

తుద సమస్తమును దుర్లభమే
అదె సులభుఁడు మాహరి యొకఁడే ॥ పల్లవి ॥

సురలును నరులును సొంపగుసిరులును
వొరసిన విన్నియు నుపాధులే
నిరుపాధికుఁడును నిజకరుణానిధి
అరయఁగ నిదె మాహరి యొకఁడే ॥ తుద ॥

అందరియావులు నఖిలకర్మములు
అందఁగరానిప్రయాసములే
యిందిరారమణి నేచిననే విదిం
చెందరు సుజనులు చెప్పంగలదే ॥ తుద ॥

యితరోపాయము లేవి చూచినా
శ్రుతివిరహితములు శూన్యములే
రతి శ్రీవేంకటరమణునిమతి యిది
హితపరిపూర్ణం బిది యొకటే ॥ తుద ॥ 42

రేకు 108 లలిత

ఎవ్వరిభాగ్యం బెట్టున్నదో
దవ్వు చేరువకు తానే గురుతు ॥ పల్లవి ॥

పరమమంగళము భగవన్నామము
సురలకు నరులకు శుభకరము
యిరవుగ నెఱిఁగిన యెదుటనె వున్నది
వెరుసల మఱచినవారికి మాయ ॥ ఎవ్వ ॥

౧. 'శేవధి' కావచ్చు.

వేదాంతసారము విష్ణుభక్తి యిది
ఆదిమునులమత మయినది
సాధించువారికి సర్వసాధనము
కాదని తొలఁగినఁ గడుశూన్యంబు ॥ఎవ్వ॥

చేతివిధానము శ్రీవేంకటపతి
యేతలఁ జూచిన నిందరికి
నీతియు నిదియే నిజసేవకులకు
పాతకులకు నది భవసాగరము ॥ఎవ్వ॥ 43

ధన్నాసి

హరిదాసులతోడ నల్పులు[౧] సరెనరాదు
గురుఁడు శిష్యుఁడననే గుఱి దప్పఁగాన ॥పల్లవి॥

కోరి ముత్యపుఁజిప్పలఁ గురిసినవానయు
సారెఁ బెంకులలోవాన సరియౌనా
శ్రీరమణుఁ దిన్నిటానుఁ జేరియుంటే నుండెఁగాక
సారెకుఁ బాత్రాపాత్రసంగతింతా లేదా ॥హరి॥

మలయాద్రి[౨] మాఁకులును మహిమీఁది మాఁకులును
చలమున నెంచిచూడ సరియౌనా
అలరి దేవుఁడు అంతర్యామియైతే నాయఁగాక
తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా ॥హరి॥

అమరులజన్మములు నసురలజన్మములు
జమళిఁ బుట్టినంతలో సరియౌనా
అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతే నాయఁగాక
తమితో నధికారిభేదములు లేవా ॥హరి॥ 44

౧. 'సరవరాదు' పూ.ము.పా. సరి+అనరాదు=సరెనరాదు.
ఈ వ్యావహారికసంధులను పనిపూని ప్రయోగించినట్లున్నది ఈ వాఙ్మయమున.
౨. 'మాకు' రేకు.

దేసాళం

నే నన(గా నెంతవా(డ నెయ్యపుజీవులలోన
యీనెపాన రక్షించీ నీశ్వరు(డేకాక ॥ పల్లవి ॥

యెవ్వరు బుద్ధిచెప్పిరి యిలపై( జీమలకెల్లా
నెవ్వగ( బుట్టల( గొల్చు నించుకొమ్మని
అవ్వల సంసారభ్రాంతి అనాదినుండియు లోలో(
దవ్వించి తలకెత్తీ యంతర్యామేకాక ॥ నేన ॥

చెట్టుల కెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలాన(
బుట్టి కాచి పూచి పిండా( బొదలుమని
గుట్టుతో జైతన్యమై గుణములన్నిటికిని
తిట్టపెట్టి రచించినదేవు( డింతేకాక ॥ నేన ॥

బుద్ధు లెవ్వరు చెప్పిరి పుట్టినట్టిమెకాలకు
తిద్ది చన్నుదాగి పూరి దినుమని
వొద్దువొద్దు లోన నుండి భోగములు మఱపిన-
విద్దపుశ్రీవేంకటాద్రినిలయుం డేకాక ॥ నేన ॥ 45

రామక్రియ

తెలిసినవా(డా( గాను తెలియనివా(డా( గాను
యిల నొకమాట నీ కెత్తిచ్చితి(గాని ॥ పల్లవి ॥

పుట్టించేవా(డవు నీవే బుద్ధిచ్చేవా(డవు నీవే
యెట్టున్నా నపరాధ లేవి మాకు
అట్టూ నన్నువారముగా మన(గా నీచిత్తమెట్టో
కిట్టి వొకమాట నుడిగితి నింతేకాని ॥ తెలి ॥

మనసులోపల నీవే మరి వెలుపల నీవే
యెనసి అపరాధాలు యేవి మాకు
నిను నొఁగాదవలేము నీసరివారముఁ గాము
అనవలసినమాట అంటి మింతేకాని ॥ తెలి ॥

అంతరాత్మవును నీవే అన్నిటాఁ గావఁగ నీవే
యెంతైనా నపరాధా లేవి మాకు
వింత లేక శ్రీవేంకటవిభుఁడ నీబంట వింతే
వంతుకు నే నొకమాట వాకుచ్చితిఁగాని ॥ తెలి ॥ 46

సాళంగనాట

నీయంతటివా రెవ్వరు నీకు నెదురేది యెందు
చాయల నీసుద్ది విని శరణంటి నేను ॥ పల్లవి ॥

కావలెనంటేఁ దొల్లి కంభము చించుక వెళ్లి
కైవశమై ప్రహ్లాదుఁ గావవా నీవు
తేవలనంటే బ్రహ్మదేవునికి వేదములు
నోవల సముద్రమయిన చొచ్చి తేవా నీవు ॥ నీయం ॥

పట్టియెత్తవలెనంటేఁ బాతాళానఁ బడ్డకొండ
తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు
మట్టుపెట్టవలె నంటే మరి భూమి బాపగాఁగ
చుట్టుకపోతేఁ దెచ్చి సొంపుగ నిలుపవా ॥ నీయం ॥

పక్షపాతమయ్యేనంటేఁ బాండవుల గెలుపించి
యీక్షితి యేలించి చనవియ్యవా నీవు
రక్షించేనంటేఁ గాతరాన శ్రీవేంకటాద్రిఁ బ్ర-
త్యక్షమై మావంటివారిఁ దగఁ గరుణించవా ॥ నీయం ॥ 47

సామంతం

అందరివలెనే వున్నాఁ డాతఁడా వీఁడు
యిందుముఖులఁ గూడినాఁ డీతఁ డానాఁడు ॥పల్లవి॥

యిందరూ నేఁ డేఁటఁ జేసేయింద్రయాగపుముద్దలు
అందుకొని యారగించినాతఁడా వీఁడు
చెంది మునులసతులసతఁ దెప్పించుక మంచి-
విందు లారగించినాఁడు వీఁ డానాఁడు ॥అంద॥

తొలుత బ్రహ్మదాఁచినదూడలకు బాలులకు
అలరి మారుగడించినాతఁడా వీఁడు
నిలుచుం దేడుదినాలు నెమ్మది వేలఁ గొండెత్తి
యిల నావులఁ గాచినాఁ డీతఁ డానాఁడు ॥అంద॥

బాలుఁడై పూతనాగుల బలురక్కసులఁ జంపి
అలరియాటలాడినయాతఁడా వీఁడు
యీలీల శ్రీవేంకటాద్రి యెక్కినాఁడు తొలుతే
యేలెను బ్రహ్మదుల నీతఁ డానాఁడు ॥అంద॥ 48

రేకు 109 దేసాక్షి

ఏపీ సహాయాలుగావు యెక్కువ భక్తికాని
దావతిఁ బడక యిది దక్కితే సులభము ॥పల్లవి॥

మంటిపై సుఖమందుట ముక్కున నూరుపువట్టి
దంటవాయువు గెలువఁదలఁచేదెల్లా
వెంటికవట్టుక పోయి వెసఁ గొండ వాఁకుట
వెంటఁ గర్మమార్గమున విష్ణువి సాధించుట ॥ఏపీ॥

ధేనుగుతోఁ బెనఁగుట యిల నిరాహారియై
కానవిపంచేంద్రియాలఁ గట్టఁబోవుట
నానిం చినుపగుగిళ్ల నమలుట బలిమిని
ధ్యానించి మనసుఁబట్టి దైవము సాధించుట ॥ ఏపి ॥

దప్పికి నెండమావులు దాగ దగ్గరఁబోవుట
తప్పుఁజదువులలోఁ దత్త్వము నెంచుట
పిప్పిచవి యడుగుట పెక్కుదైవాలఁ గొలిచి
కప్పిన శ్రీవేంకటేశుకరుణ సాధించుట ॥ ఏపి ॥ 49

7

శంకరాభరణం

అప్పఁడు దైవాలరాయఁ డాదిమూల మీతఁడు
యిప్పు డిట్టిమహిమల నెక్కుడాయ నీతఁడు ॥ పల్లవి ॥

చేకావి వాతఁలుతె చేసినపన్నీరుకాపు
జోకఁ గాలువలై సొరిది జార
సైకపునీలాద్రినుండి జలజలబారేటి-
రేకలనెలయేరులరీతి నున్న దిదివో ॥ అప్ప ॥

తెప్పలుగా గుప్పినట్టితెల్లనికప్పురకాపు
చిప్పిలుచు వెన్నెలలై చిందఁగాను
పుప్పొడిఁదోఁగినకల్పభూజము నిలుచున్న -
చొప్పున నున్నాఁడిదివో సొంపులు మీరుచును ॥ అప్ప ॥

పొందుగ నంతటిమీఁదఁ బూసినపునుగుకాపు
కందువ మాణిక్యముల గనియైనట్టు
అంది శ్రీవేంకటేశ్వరు కదె యలమేలుమంగ
చెంది యురతఁ గట్టఁగా శ్రీవిభుఁడై నిలిచె ॥ అప్ప ॥ 50

మలహరి

ఏమి సేసే మిఁక నేము యెంతని దాఁచుకొందుము
నీమహిమ యింతంతననేరము నేమయ్యా ॥ పల్లవి ॥

అంది నిన్ను నొకమాటు హరి యని నుడిగితే
పొందినపాతకమెల్లాఁ బొలిసిపోయ
మందలించి మఱి యొకమాటు నుడిగినఫల-
మందె నీ కప్పగించితి మదిగోవయ్యా- ॥ ఏమి ॥

యిట్టె మీకు రెండుచేతులెత్తొకమాటు మొక్కితే
గట్టిగా విహపరాలు గలిగె మాకు
దట్టముగ సాష్టాంగదండము వెట్టినఫల-
మట్టె నీమీఁద నున్నది అదిగోవయ్యా ॥ ఏమి ॥

సరుగ నీకొకమాటు శరణన్నమాత్రమున
సిరులఁ బుణ్యుఁడ నైతి శ్రీవేంకటేశ
ధరలోన నే నీకు దాసుఁడనైనఫల-
మరయ నీమీఁద నున్న దదిగోవయ్యా ॥ ఏమి ॥ 51

సాళంగం

ఎక్కడిమతము లింక నేమి సోదించేము నేము
తక్కక శ్రీపతి నీవే దయఁజూతుగాక ॥ పల్లవి ॥

కాదనఁగ నెట్టువచ్చు కన్నులెదిటిలోకము
లేదనఁగ నెట్టువచ్చు లీలకర్మము
నీదాసుఁడ ననుచు నీమరఁగు చొచ్చుకొంటే
యేదెసనైనాఁ బెట్టి యీడేరింతుగాక ॥ ఎక్క ॥

తోయ నెట్టువచ్చు మించి తొలఁకేటినీమాయ
పాయ నెట్టువచ్చు యీభవబంధాలు
చేయార నిన్నుఁ బూజించి చేరి నీముద్రలు మోఁచి
యీయెడ నుండఁగా నీవే యీడేరింతుగాక ॥ ఎక్క ॥

తెలియఁగ నెట్టువచ్చు ద్రిష్టమైననీమహిమ
తలఁచఁగ నెట్టువచ్చు తగునీరూపు
నెలపై శ్రీవేంకటేశ నీవు ౧ గలవనుండఁగా
యిలమీఁద మమ్ము నీవే యీడేరింతు గాక ॥ ఎక్క ॥ 52

శుద్ధవసంతం

పురుషోత్తముఁడ నీవు పురుషాధముఁడ నేను
ధరలో నాయందు మంచితన మేది ॥ పల్లవి ॥

అనంతాపరాధములు అటు నేము సేసేవి
అనంతమయినదయ అది నీది
వినుఁ నెఱఁగకుండేటినీచుగుణము నాది
నను నెడయకుండేగుణము నీది ॥ పురు ॥

సకలయాచకమే సరుస నాకుఁ బని
సకలరక్షకత్వము సరి నీపని
ప్రకటించి నిన్ను దూరేపనికే నా కెప్పుడూను
వెకలినై నను గాచేవిధము నీది ॥ పురు ॥

నేర మింతయును నాది నేరు పింతయును నీది
సారెకు నజ్ఞాని నేను జ్ఞానివి నీవు
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
ధారుణిలో నిండెను ప్రతాపము నీది ॥ పురు ॥ 53

---

౧. 'కలవు+అని+ఉండగా' ౨. 'నీవు' లేదు.

గుండక్రియ

నారాయణాచ్యుతానంత గోవిందా
నేరరాదు విజ్ఞానము నీ వియ్యక లేదు ॥పల్లవి॥

నిగమాంతవిదులైతే నిన్నెఱఁగుదురుగాక
మృగసమానులకేల మీమీఁదిభక్తి
వెగటుగాఁ గృపతోడ విశ్వరూపు చూపినాను
పగటుదుర్యోధఁనుడు బహురూప మనఁడా ॥నారా॥

చిరపుణ్యులైతే మీసేవలు సేతురుగాక
దురితచిత్తులకు మీత్రోవ యేఁటికి
గరిమఁ బ్రత్యక్షమై కంబములోఁ గలిగినా
హిరణ్యకశిపుఁడు మి మ్మెంచి శరణనెనా ॥నారా॥

దేవతలయితే మిమ్ముఁ దెలియనేర్తురుగాక
యేవల నసురలు మిమ్మెఱిఁగేరా
శ్రీవేంకటాద్రిమీఁద సిరితో నీ వుండఁగాను
కేవలసంసారు లెఱిఁగియును మఱవరా ॥నారు॥ 54

రేకు 110 శంకరాభరణం

లేదు భయము మఱి కాదు భవము
ఆదియు నంత్యముఁ దెలిసిన హరియాజ్ఞేకాన ॥పల్లవి॥

తలఁపులుగడుగక వొడలటు తాఁ గడిగిన నేమి
వెలుపలికాంతలు వుడుగక విధులుడిగిన నేమి
అలరుచు శ్రీహరిదాస్యము అతుమఁ గలిగినయాతఁడు
చెలఁగుచు పసులైనా సేసిన మరి యేమి ॥లేదు॥

హించినకోపము విడువక భోగము విడిచిన నేమి
పంచేంద్రియములు ముదియక ౧పైము దిసిన నేమి
వించినదైవము నమ్మిన విర్భరుఁడంబువయాతఁడు
యెంచుక యేమార్గంబుల నెట్టుండిన నేమి ॥ లేదు ॥

వేగమె లోపల గడుగక వెలి గడిగిన నేమి
యోగము దెలియక పలుచదువులు దెలిసిన నేమి
యీగతి శ్రీవేంకటపతి నెఱిఁగి సుఖించేటియాతఁడు
జాగుల ప్రపంచమందును సతమైనా నేమి ॥ లేదు ॥ 55

గుండక్రియ

హరిభక్తివోడ యెక్కినట్టివారలే కాని
తరఁగుమొరఁగులను దాఁటలే రెవ్వరును ॥ పల్లవి ॥

నిండుఁజింతాజలధికి నీళ్లు దనచిత్తమే
దండిపుణ్యపాపాలే దరులు
కొండలవంటికరళ్లు కోరికె లెందు చూచినా
తండుముండుపడేవారే దాఁటలే రెవ్వరును ॥ హరి ॥

ఆపదలు సంపదలు అందులోనిమకరాలు
కాఁపురపులంపటాలే కై యొత్తులు
చాపలపుగుణములే సరిఁజొచ్చేయేరులు
దాపుదండ చేకొని దాఁటలే రెవ్వరును ॥ హరి ॥

నెలపై ౨పుబ్బుసగ్గులే నిచ్చలుఁ బోటునుఁ బాటు
బలుపై నయాశే బడబాగ్ని
యెలమి శ్రీవేంకటేశుహితులకే కాల్నడ
తలఁచి యితరులెల్ల దాఁటలే రెవ్వరును ॥ హరి ॥ 56

౧. పైః=శరీరము. ౨. 'పుబ్బుసగ్గు లేవిచ్చలుఁ' పూ.ము.పా.

గౌళ

ఈతనిఁ గొలిచితేనే యిన్ని ¹గొలలునుఁ దీరు
²చేతనఁబెట్టుపుణ్యాలు చేరువనే కలుగు ॥పల్లవి॥

పట్టి కాళింగునిఁ దోలి పాముకొల దీర్చినాఁడు
బట్టబాయిటనే రేపల్లెవారికి
అట్టె పూతనఁ జంపి అఁడుఁగొల దీర్చినాఁడు
గట్టిగాఁ గృష్ణుఁడు లోకమువారికెల్లను ॥ఈత॥

బలురావణుఁ జంపి బాఁపనకొల దీర్చినాఁడు
యిలమీఁదఁ గలిగినఋషులకెల్లా
కొలఁదిమీరినయట్టికోఁతికొల దీర్చినాఁడు
నొలసి రాఘవుఁ డదె సుగ్రీవునికిని ॥ఈత॥

వొలిసి పురాలు చొచ్చి వూరఁ గొల దీర్చినాఁడు
అల తనదాసులైనఅమరులకు
సిలుగుఁగొలలు దీర్చి సేన వరా లిచ్చినాఁడు
చెలఁగి పరుషలకు శ్రీవేంకటేశుఁడు ॥ఈత॥ 57

శ్రీరాగం

వివేకించ వేళ లేదు విజ్ఞానమార్గమందు
భవసంపదలపెద్దపొఁజు చూచీ జీవుఁడు ॥పల్లవి॥

చిత్తమనియెడిమహాసింహాసనం బెక్కి
హత్తిబహుపరాకాయ నదె జీవుఁడు
గుత్తపుదేహమనేటికొలువుకూటములోన
జొత్తుఁ బ్రకృతినాట్యము చూచీవి జీవుఁడు ॥వివే॥

---

౧. గొలలు' పూ.ము.పా ౨. 'చేతనంబెట్టు' పూ.ము.పా "చేతనన్ = బుద్ధి యందు; పెట్టు=వుంచుకొన్న" కావచ్చు "ప్రతిపత్జ్ఞప్తి చేతనాః" అని అమరము.

పంచేంద్రియములనేటీలు తేజీలపై నెక్కి
అంచల వయ్యాళిదోలీ నదె జీవుఁడు
ముంచినకర్మములనేముద్రలపెట్టెలు దెచ్చి
పంచముగా లెక్కవెట్టి సరి దాఁచీ జీవుఁడు ॥వివే॥

యిచ్చఁ గామక్రోధాలనే హితమంత్రులునుఁ దారు
తచ్చి తలపోసుకొనీఁ దగ జీవుఁడు
అచ్చపుశ్రీవేంకటేశుఁ డంతరాత్మయై యుండఁగా
పచ్చిగా నాతనిఁ జూచి భ్రమసీవి జీవుఁడు ॥వివే॥ 58

సామంతం

చెల్లఁబో తియ్యనినోరఁ జేఁ దేఁటికి యీ-
పల్లదపుఁగోరికలపాలు సేయవలెనా ॥పల్లవి॥

ఆసలకు నాదేహ మమ్ముకొంటి వింటింట
దాసునిఁగా నాపాలిదైవమా నీవు
వోసరించి భూమిలోనఁ బుట్టించి రక్షించి
యీసులేక భంగపెట్టు టిది గొంత వలెనా ॥చెల్లఁ॥

పామరపుటింద్రియాలబారిఁ దోసితివి నన్ను
దామెనకట్టుగాఁ గట్టి తత్వమా నీవు
దోమటి నామతిలోనఁ దోడునీడవై యుండి
పామేటిసుఖములనే భ్రమయించవలెనా ॥చెల్లఁ॥

గక్కన నింతట నన్నుఁ గరుణించితివి నేఁడు
మొక్కితి శ్రీవేంకటాద్రిమూలమా నీకు
దిక్కుదెసవై నాకు దేవుఁడవై యేలికవు
చొక్కి నామన సింత సోదించవలెనా ॥చెల్లఁ॥ 59

భూపాళం

చూపఁజెప్పఁగలభక్తసుజనుఁడవు మాకు
దాపైనహరి యిట్టె తప్పేఁ దారెననక ॥పల్లవి॥

కోరి పాండవులయింటఁ గూర లారగించినట్టు
సారపుళబరివిందు చవిగొన్నట్టు
వూరకే మాయింట నీవు వాదవినపాటి నీ-
వారగించవయ్య చవు లౌఁగాములెంచక ॥చూపఁ॥

తొల్లియు రేపల్లె గొల్లదోమటి దొడికినట్టు
తల్లిఅనసూయపాలఁ దనిసినట్టు
చిల్లరైనమాయింటఁ జేసినపా టారగించు
చల్లతోడిబోనమైన చాలుఁజాలదనక ॥చూపఁ॥

అంకెల శ్రీవేంకటాద్రి నారగించినయట్టు
కొంకులేక సిరితోడఁ గోనేటిరాయ
లెంకవయిననాయింటిలేశమైన నారగించు
౧అంకించి నీనాలోవిఅంతరము లెంచకా ॥చూపఁ॥ 60

రేకు 111 లలిత

ఏగతి ౨నుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము
భోగపుఁగోరికలచేఁ బొలిసెఁబో పనులు ॥పల్లవి॥

పరగి నాలుకసొంపు ప్లరసిపోయ
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁబాపములవివికిచే పీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటికులాచారములు ॥ఏగ॥

---

౧. 'లంకించి' పూ.ము.పా. యతిభంగము. ౨. 'వన్నుద్ధరించే' పూ.ము.పా.

మొక్కలానఁ బరధనమునకుఁ జాఁచి చాఁచి
యెక్కువఁ జేతులమహి మెందో పోయ
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటిముందరిపుణ్యములు ॥ఏగ॥

యెప్పుడు నీచులఇండ్ల కెడ తాఁకి పాదములు
తప్పనితపములెల్లాఁ దలఁగిపోయ
యిప్పుడే శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁ జేసినట్టి౧ నేరమెల్లా నడఁగె ॥ఏగ॥ 61

ముఖారి

పాప మెఱఁగను పుణ్యఫల మెఱఁగను
యేపనులు నీకు ౨ సెల విన్నియునుఁ గావా ॥పల్లవి॥

మునుప నీవిషయముల ముద్ర౩ మానసులఁగా-
నునిచితివి నామీఁద నొకటొకటినే
అనిశంబు నవి చెప్పినట్లఁ జేయకయున్న
ఘనుఁడ నీయాజ్ఞ నేఁ గడచుటే కాదా ॥పాప॥

కలిమిగలయింద్రియపుఁగాఁపులుండినవూరు
యెలమి నా కొసఁగితివి యేలు మనుచు
అలసి వీరల నేను నాదరించక కినిసి
తొలఁగఁద్రోచిన నదియు ద్రోహమే కాదా ॥పాప॥

కుటిలములఁ బెడఁబాపి కోరినవనవులెల్ల
ఘటనఁ జెల్లించితివి; ఘనుఁడ నేను:
అటుగనక శ్రీవేంకటాద్రీశ నీదాసి-
నెటుచేసినా నీకు హితవేకాదా ॥పాప॥ 62

౧. 'నేరము లెల్లా' వ్రా.ము.పా. ౨. 'శల' రేకు, ౩. 'మానసులఁగా' కావచ్చు.

శుద్ధవసంతం

చిక్కువడ్డపనికిఁ జేసినదే చేఁత
లెక్కలేనియప్పునకు లేమే కలిమి ॥ పల్లవి ॥

తగవులేమి కెదిరిధనమే తనసొమ్ము
జగడగానికి విరసమే కూడు
తెగుదెంపులేమికి దీనగతే దిక్కు
నిగువుఁగూటికి వట్టిబీరమే తగవు ॥ చిక్కు ॥

పతిలేనిభూమికి బలవంతుఁడే రాజు
గతిలేనికూటికిఁ గన్నదే కూడు
సతిలేనివానికి జరగినదే యాలు
కుతదీరుటకు రచ్చకొట్టమే యిల్లు ॥ చిక్కు ॥

యెదురులేమికిఁ దమకేదైనఁ దలఁపిది
మదమత్తునకుఁ దనమఱపే మాట
తుదిపదమునకుఁ జేదొడై నవిభవము
పదిలపుశ్రీవేంకటపతియే యెఱుక ॥ చిక్కు ॥ 63

శ్రీరాగం

అన్నిటికి నొడయఁడవై వశ్రీపతివి నీవు
యెన్నరాదు మాబలఁగఁ మెంచుకో మాపాఁజు ॥ పల్లవి ॥

జ్ఞానేంద్రియము లైదు శరీరిలోపల
ఆనక కర్మేంద్రియము లైదు
తానకపుకామక్రోధాలవర్గము లారు
యీనెలవు పంచభూతా ౧లెంచు మాపాఁజు ॥ అన్ని ॥

---

౧. 'లేఁచు' రేకు.

తప్పనిగుణాలు మూఁడు తనువికారము లారు
అప్పటి మనో[౧] బుద్ధ్యహంకారాలు
వుప్పతిల్లువిషయము లుదివోని వొకఅయిదు
యిప్పటి మించేకోపము యెంచుకో మాపొఁజు ॥ అన్ని ॥

ఆఁకలి దప్పియును మానావమానములును
సోఁకివశీతోష్ణాలు సుఖదుఃఖాలు
మూఁకగమికాఁడ నేను మొక్కెద శ్రీవేంకటేశ
[౨]యేఁకటారఁ[౩] గడపేవా నెంచుకో మాపొఁజు ॥అన్ని॥ 64

లలిత

ఈడ నుండె విందాఁకా నింటిముంగిట
ఆడ నెందుఁ బోఁడుగద అప్పుదే యీకృష్ణుఁడు ॥ పల్లవి ॥

యేడ పూతకిఁ జంపె నింతపిన్నవాఁడంటా
ఆడుకొనే రదే వీధి నందరుఁ గూడి
వేడుకతో మనగోవిందుఁడు గాఁడుగదా
చూడరమ్మ వీఁడు గడుచల్లరీఁడు పాపఁడు ॥ ఈడ ॥

మరలి యప్పటివాఁడె మద్దులు విఱిచెనంటా
పరువులు వెట్టేరు పడఁతులెల్లా
కరికరించఁగ రోలఁ గట్టితే నప్పుడు మా-
హరి గాఁడుగదా అడనున్న బిడ్డఁడు ॥ ఈడ ॥

వింతగాఁగ నొకబండి విఱిచె నప్పటినంటా
రంతు సేసే రదివో రచ్చలు నిండి
అంత యీశ్రీవేంకటేశుఁ డైనమనకృష్ణుఁడట
యింతేకాక యెవ్వరున్నా రిటువంటిపాపఁడు ॥ ఈడ ॥ 65

౧. బుద్ధిహంకారాలు' రేకు ౨. 'ఏఁకట + అరవ్' ౩. గడపేవా + అవి + ఎంచుకో' 'అని' కి ముందు మధ్యమపురుష వింత.

పాడి

విభుఁడ వింతటికి వెరవుతో ననుఁగావు
అభయహస్తముతోడిఆదిమూలమా ॥పల్లవి॥

పలులంపటాలచేతఁ బాటువడి పాటువడి
అలసితిఁ గావవే వోఆదిమూలమా
చలమరి యితరసంసారభ్రాంతిఁ జిక్కితి న-
న్నలరించి కావవే వోఆదిమూలమా ॥విభుఁ॥

యెంతకైనా నాసలచే యేఁగేఁగి వేసరితి-
నంత కోపఁ గావవే వోఆదిమూలమా
సంతలచుట్టరికాల జడిసితి నిఁకఁ గావు
అంతరాత్మ నాపాలిఆదిమూలమా ॥విభుఁ॥

౧రంటదెప్పుటింద్రియాల రవ్వైతిఁ గావవే వో-
అంటినశ్రీవేంకటాద్రిఆదిమూలమా
గెంటక ముమ్మాటికిని నీకే శర-
ణంటిఁ గావవేవో ఆదిమూలమా ॥విభుఁ॥ 66

రేకు 112 శ్రీరాగం

ఏఁటిమాట లివి విన వింపయ్యీనా మది-
౨నేఁటవెట్టి దాసుఁడౌ టిదివరియా ॥పల్లవి॥

జీవుఁడే దేవుఁడని చెప్పుదురు గొందరు
దైవముచేఁతలెల్లాఁ దమ కున్నవా
ఆవలఁ గొందరు కర్మ మది బ్రహ్మ మందురు
రావణాదు లవి సేసి రతికెక్కిరా ॥ఏఁటి॥

౧. 'రంటదెప్పు టింద్రియాల' పూ.ము.పా. రంటఁ దిప్పు వింద్రియాల కావచ్చు. రంటన్=పుణ్యపాపముల రెండింటియందు. లేక సుఖదుఃఖములందు కావచ్చు.

౨. 'నేఁటి' పూ.ము.పా. 'ఏఁటవెట్టి'. అర్థము విచార్యము.

మిగులఁ గొందరు దైవమే ౧లేదనెందురు
తగ నీప్రపంచమెల్లాఁ దనచేఁతలా
గగన మతఁడు నిరాకార మందురు గొంద-
రెగుపఁ బురుషసూక్త మెఱఁగరా తాము ॥ ఏఁటి ॥

యెవిమిదిగుణములే యితని వందురు గొంద-
రనయము మిగిలిన వవి దమవా
యెనయఁగ శ్రీవేంకటేశ్వరుదాసులై
మనుట నిత్యముగాక మరి యేమినేలా ॥ ఏఁటి ॥ 67

రామక్రియ

అన్నిటా శ్రీహరిదాసుఁడగువానికి
కొన్నిదైవములఁ గొలువఁగఁ దగునా ॥ పల్లవి ॥

విహితకర్మము సేసి వెదకేటిహరి విట్టె
సహజమై కొలచేటిసరసునికి
గహనపుఁగర్మాలు కడమలైన నేమి
మహిఁ గనకాద్రికి మరి పైఁడి వలెనా ॥ అన్ని ॥

పలుదానములకెల్ల బలమైనహరి విట్టె
బలువుగఁ జేకొన్న భక్తునికిని
నెలకొని యాతఁ దన్నియుమఁ జేసినవాఁడె
తెలిసి సూర్యునిఁ జూడ దీపాలు వలెనా ॥ అన్ని ॥

౨వేదవేద్యుఁడు శ్రీవేంకటపతినామ-
మాదిగాఁ బఠియించే యధికునికి
ఆదైనచదువులు అఱచేతి వతనికి
మేదినిఁ దిరుగాడ మెట్లు వలెనా ॥ అన్ని ॥ 68

౧. 'లేదనందురు' పూ.ము.పా. 'లేదని + అందురు' ఈ వ్యావహారిక సంధులీ వాఙ్మయమున కొల్లలు. ౨. 'వేవేదద్యుఁడు' పూ.ము.పా.

### మలహరి

[1]ఈహీ శ్రీహరిఁగంటే యింత లేదుగా వట్టి-
దాహపుటాసల వెఱ్ఱి దవ్వు టింతేకాకా ॥ పల్లవి ॥

పలుమారు నిందరిసి భంగపడి వేఁడేది
యిలపై దేహమువెంచేయిందు కింతేకా
కలికికాంతలచూపుఘాతలకు భ్రమసేది
చెలఁగి [2]మైమఱచేటిచేఁత కింతేకా ॥ ఈహీ ॥

పక్కన జన్మాలనెల్లాఁ బాటువడేదెల్లాను
యెక్కడో సంసారాన కిందు కింతేకా
వొక్కరిఁ గొలిచి తిట్టు కొడిగట్టేదెల్లాను
చక్కుముక్కునాలికెపై చవి కింతేకా ॥ ఈహీ ॥

గారవాన ధనములు గడియించేదెల్లాను
ఆరయ నాదని వీఁగేయుందు కింతేకా
చేరి శ్రీవేంకటపతి సేవకుఁ జేరనిదెల్లా
భారపుఁగర్మపుబాధఁ బట్టువడికా ॥ ఈహీ ॥ 69

### బౌళి

ఎంత బాఁపనా [3]సోద మింత గలదా
అంతయు నీమహిమే హరిభట్లూ ॥ పల్లవి ॥

సూరిభట్లొకవంక చొరనిచోట్లు చొచ్చి
వారబియ్య మెత్తి యెత్తి వడదాఁకి
నీరువట్టుగాని భూమి నీళ్లెల్లా వారవట్టి
కేరికేరి నగవయ్య క్రిష్ణభట్లూ ॥ ఎంత ॥

---

౧. 'ఈహి' పూ. ము. పా. ఈ 'ఈహీ' ఎగతాళి చేసి నవ్వుటకు అనుకరణ శబ్దము. ౨. 'మైమఱచేది చేఁత' పూ.ము.పా, రేకు. ౩. 'సోద(ద్య ?)' పూ.ము.పా. 'అసోద' శబ్దము 'ఆస్వాద్య' శబ్ద భవము కావచ్చు. పూ.ము.పా. లో '(ద్య ?)' సూచన మక్కరలేదేమో.

దేవరాజ్య లోకవంక దిక్కులలోఁ బొలగూడు
    దీవెనతో నారగించి తీపుమరిగి
    యీవలఁ బెట్టినవారి కేమైనా నొసఁగిని
    వేవేలుమాయలవిష్ణుభట్లూ ॥ ఎంత ॥

౧సోమయాదు లోకవంక సొరిది సురలకెల్లా-
    నామనితో విందువెట్టీ ననుదినము
    హోమపువిప్రులసొమ్ము లొడిసి తాఁ బుచ్చుకొనీ
    వేమరు శ్రీవేంకటాద్రివెన్నుభట్లూ ॥ ఎంత ॥ 70

గుండక్రియ

అటుగన నే రోయఁగఁ దగవా
    నటనల శ్రీహరి౨నటమింతే ॥ పల్లవి ॥

చిదుముడి మూఁగినజీవులలోపల
    కడఁగి నే నొక్కఁడ వింతే
    విడువక పక్షులు వృక్షము లిలపై
    వెదఁగుభోగములు వెదకీనా ॥ అటు ॥

తనువులు మోచినతగుప్రాణులలోఁ
    గనుఁగొన నొకమశకమ వింతే
    మొనకొని కీటకములుఁ జీమలు నిల
    చెనకి దొరతనము సేసీనా ॥ అటు ॥

శ్రీవేంకటపతిసేవవారిలో
    నోవల నొకదాసుఁడ నేను
    భావించి సురలు బ్రహ్మాదు లతని-
    దైవపుమాయలు దాఁటేరా ॥ అటు ॥ 71

---

౧. 'సోమయాజి' కావచ్చు. ౨. 'నట=నటనము' కావచ్చు. అచ్ప్రత్యయాంతము?

రామక్రియ

సేయనివాఁ ౧ దెవ్వఁడు చేరి చిల్లరదోషాలు
యేయెడ జీవులజాడ లీశ్వరకల్పితమే ॥ పల్లవి ॥

దేవునినమ్మినయట్టిదేహియట యాతనికి
యీవల నెంతటిపాప మేమిసేసును
భావించి యన్ని నేరాలు పరిహరించు నతఁడే
ఆవటించుసూర్యునికి నంధకార మెదురా ॥ సేయ ॥

పూజింపించుకొనేవాఁడు భువనరక్షకుఁడట
తేజముతో దురితాలు తెంచఁగలేఁడా
రాజు సేసినయా ౨ జ్ఞ రాజుకంటే నెక్కుడా
వోజతో వజ్రాయుధాన కోపునా పర్వతాలు ॥ సేయ ॥

చేతనాత్మకుఁడట శ్రీవేంకటేశ్వరుఁడు
జాతిలేనిజీవునికి స్వతంత్ర మేది
కాతరపుజన్మానకుఁ గార్యకారణ మేది
యేతున గరుడనికి నెదురా పాములు ॥ సేయ ॥ 72

రేకు 113 మాళవి

ధ్రువవరదా సంస్తుతవరదా
నవమైనయార్తుని నన్నుఁ గావవే ॥ పల్లవి ॥

కరిరాజవరదా కాకాసురవరదా
శరణాగతవిభీషణవరదా
సిరుల వేదాలు విన్నుఁ జెప్పఁగా ౩ వినీని
మరిగి మఱఁగుచొచ్చే మమ్ముఁ గావవే ॥ ధ్రువ ॥

౧. 'దెవ్వఁడు చేరి' ఈ 'చేరి' పూ.ము.పా. లో తప్పిపోయినది.

౨. 'యా(యా?)జ్ఞ' పూ.ము.పా. 'అన+అజ్ఞ' కలిసి వ్యావహారికముగానో, వ్రాతతప్పుగనో 'అనాజ్ఞ' అని యుండవచ్చు. అన=అజ్ఞ ఏకార్థములైనను కలిపి వాడుట నేటికీ వ్యవహారములో సుప్రసిద్ధమే. ౩. 'వినీని=వినియును' కావచ్చు 'వినిన్ని' అని లోక వ్యవహారము ఈనాటికిని కలదు.

అక్రూరవరదా అంబరీషవరదా
శక్రాదిదివిజనిచయవరదా
విక్రమించి యిన్నిటా నీవే ఘనమని నీకు
చక్రధర శరణంటి సరిఁ గావవే ॥ ధ్రువ ॥

ద్రౌపదీవరదా తగ నర్జునవరదా
శ్రీపతీ ప్రహ్లాదశిశువరదా
యేపున శ్రీవేంకటాద్రి నిటు నేను నాగురుఁడు
చూపఁగాఁ గొలిచే నచ్చుగఁ గావవే ॥ ధ్రువ ॥ 73

గుండక్రియ

నమ్మిన దొకటే నాకు నీశరణము
యెమ్మెలసంసార మింతే యిం దేమిగలదు ॥ పల్లవి ॥

యేఁటికర్మము నా కేఁటిధర్మము
యేఁటిదో నేఁ జేయఁగా నీ కేమి గూడెను
నాఁటకపుతొంటివారు నడిచినమార్గమని
౧ యీఁటుకుఁ జేసేఁగాక యిందేమి గలదు ॥ నమ్మి ॥

యేడతపము నా కేడజపము నే
వాదికఁ జేయఁగ నీకు వచ్చినదేమి
బెదిదపుఁబెద్దలెల్లాఁ బెట్టినతిట్టములంటా
యీడుకుఁ జేసెఁగాక యిం దేమి గలదు ॥ నమ్మి ॥

యెక్కడిపుణ్యము నా కెక్కడిభోగములు
యిక్కువ వ న్నిట్లఁ జేసి యేమిగంటివి
నిక్కపుశ్రీవేంకటేశ నిన్నుఁ గనుటగాక
యెక్కడి కెక్కడిమాయ లిం దేమి గలదు ॥ నమ్మి ॥ 74

౧. 'యీటు' వ్రా.ప్ర.పా. ఇక్కడ 'యీఁటు'లో అరసున్న విచార్యము.

### బౌళి

అన్నియును హరిసేసేయటమటాలే యివి
పన్నినెసుజ్ఞానికి బయలై తోఁచు ॥పల్లవి॥

తిరుపై యవ్వలవ్వలఁ దిరుగుచుండేటివేళఁ
దిరిగినట్ల నుండు దిక్కులెల్లాను
సిరులసంసారభ్రమఁ జిక్కినజీవునికివి
పరగ నైహికమే పరమై తోఁచు ॥అన్ని॥

సొగిసి యద్దమునీడ చూచినవేళఁ దనకు
మగుడ వేఱొకరూపు మతిఁ దోఁచును
తగిలి యిట్లానేపో తమఁదా నెఱఁగకున్న
నిగిడినపుట్టువులు నిజమై తోఁచు ॥అన్ని॥

కదిసిసకలాంధకార మంతటాఁ గప్పి
పుదయమైతే నన్నీ నొదిగినట్టు
హృదయపుశ్రీవేంకటేశుఁడు వెల్లవిరైతే
మదిలో ౧ నజ్ఞానము మాయమై తోఁచు ॥అన్ని॥ 75

### లలిత

అవి యటు భావించినట్లాను
కవగొని యిందుకుఁ గలఁగరు ఘనులు ॥పల్లవి॥

అరయఁగ నేఁబదియక్షరములె పో
ధరలోపల నిందాస్తుతులు
సరిఁ బురాణములు శాస్త్రవేదములు
యిరవుగ విన్నియు నిందే పొడమె ॥అవి॥

---

౧. 'విజ్ఞానము' పూ.ము.పా.

వొక్క దేహమున నున్నయంగములు
పెక్కువిధములై బెరసినవి
చిక్కులఁ గొన్నిటి సిగ్గుల దాఁతురు
యెక్కువయతులకు నివ్వి యు సమము ॥ అవి ॥

అంతరాత్మలో నంతర్యామై
బంతులఁ దిరిగేటిబంధువులు
చింతింప నతఁడే శ్రీవేంకటేశ్వరుఁ -
డింతకుఁ గర్తవి యెంతురు బుధులు ॥ అవి ॥ 76

మాళవి

బలువుఁడు హరిఁ జేపట్టితివి
తలఁచినదెల్లా దక్కెను నాకు ॥ పల్లవి ॥

దురిత ౧ ధ్వంసుఁడు దుఃఖవిదారుఁడు
అరిభయంకరుఁ డచ్యుతుఁడు
సిరివరుఁ డితనివిఁ జేకొని కొలిచిన
పరమసుఖమెపో భయ మెక్కడిది ॥ బలు ॥

దానవాంతకుఁడు దైవశిఖామణి
మానరక్షకుఁడు మాధవుఁడు
నానాముఖముల నాపాలఁ గలఁడు
యేనెపముల నా కెదురే లేదు ॥ బలు ॥

అనయము నిర్మలుఁ డఖిలానందుఁడు
ఘనుఁ డీశ్రీవేంకటవిభుఁడు
కనుకొని మము నిటు గాచుక తిరిగీ
యెనయఁగ నేలికె యితఁడే మాకు ॥ బలు ॥ 77

---

౧. 'ధ్వంసుఁడు' రేకు.

దేవగాంధారి

మేలు లేదు తీలు లేదు మించి ఇదే హరిమాయ
కాలమందే హరిఁ గంటే కైవల్య మొకటే ॥పల్లవి॥

సురలను జీవులే నసురలును జీవులే
ధర ఇందుఁ బ్రకృతిభేదమేకాని
సురలకు స్వర్గ మసురలకు నరకము
పరగ నీరెంటిగతి పాపపుణ్యములే ॥మేలు॥

పొలఁతులు జీవులే పురుషులు జీవులే
తలఁప భావభేదములేకాని
బలిమి స్వతంత్రముఁ బరతంత్ర మొకరికి
యెలమి ఇందులోఁ జెల్లె హీనాధికములే ॥మేలు॥

రాజులును జీవులే రాసిబంట్లు జీవులే
వోజతో సంపద చెల్లే దొకటే వేరు
సాజపుశ్రీవేంకటేశు శరణ మొక్కటే గతి
బాజుఁ గర్మ[౧] మొండొకటి బంధమోక్షములు ॥మేలు॥ 78

రేకు 114 సాళంగనాట

అదె వచ్చె ఇదె వచ్చె నచ్యుతుసేనాపతి
పదిదిక్కులకు ఇట్టె పారరో యసురలు ॥పల్లవి॥

గరుడధ్వజం బదె ఘనశంఖరవ మదె
సరుసనే విష్ణుదేవుచక్ర మదె
మురవైరిపంపు లవె ముందరిసేన లవె
పరచి గగ్గుల[౨] కాడై పారరో దానవులు ॥అదె॥

౧. 'మందొకటి' పూ.ము.పా. ౨. 'కాతై' కావచ్చు.

తెల్లని ౧గొడుగు లవె దేవదుందుభులు నవె
యెల్లదేవతలరథా లింతటా నవె
తెల్లురేఁగి విక్క హరికీర్తి భుజము లవె
పల్లపుపాతాళానఁ బడరో దనుజులు ॥ అదె ॥

వెండిపైఁడిగుదె లవె వెంజామరము లవె
మెండగుకైవారాలు మించిన వవె
దండి శ్రీవేంకటపతి దాడిముట్టె నదె యిదె
బఁడుబండై ౨జజ్జరించి పారరో దైతేయులు ॥ అదె ॥ 79

లలిత

అయ్యో నేనేలా అన్నిటికంటెఁ దీలు
గయ్యాళినై వృథా గర్వింతుఁగాని ॥ పల్లవి ॥

తడిపివుదికినట్టిధౌతవస్త్రములు నా-
యొడలు మోఁచినమీఁద యోగ్యము గావు
పుడివోక వనములో వొప్పైనవిరులు నే-
ముడిచివేసినంతనే ముట్టరాదాయను ॥ అయ్యో ॥

వెక్కసపురచనలవేవేలురుచులు నా-
వొక్కనాలు కంటితేనే యోగ్యముగావు
పక్కనదేవార్హపుఁబరిమళగంధములు నా-
ముక్కుసోఁకినంతలోనే ముట్టరాదాయను ॥ అయ్యో ॥

గగనానను౦డి వచ్చేగంగాజలములైన
వొగి నాగోరంటితేనే యోగ్యము గావు
వగుశ్రీవేంకటపతి నన్నే రక్షించినదాఁక
మొగడై యెరుకతుది ముట్టరాదాయను ॥ అయ్యో ॥ 80

౧. 'గొడగు' లేఖ. ౨. 'జర్ఝరించి' కి వ్యావహారికము గావచ్చు.

నాట

మర్ద మర్ద మమబంధాని
దుర్దాంతమహాదురితాని ॥ పల్లవి ॥

చక్రాయుధ రవిశత ౧ తేజోఽంచిత
సక్రోధసహస్ర ౨ ప్రముఖా
విక్రమక్రమా విస్ఫులింగకణ
నక్రహరణ హరిసవ్యకరాంకా ॥ మర్ద ॥

కలితసుదర్శన ౩ కఠినవిదారణ
కులిశకోటిభవ ఘోషణా
ప్రళయానలసంభ్రమవిభ్రమకర
రళితదైత్యగళరక్తకీరణా ॥ మర్ద ॥

హితకరశ్రీవేంకటేశప్రయుక్త
సతతపరాక్రమజయంకర
చతురోఽహం తే శరణం గతోఽస్మి
యితరాన్ విభజ్య యిహ మాం రక్ష ॥ మర్ద ॥ 81

మాళవిగౌళ

౫ నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టిపరమాత్మునికి ॥ పల్లవి ॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుఁగొన చూపులే ఘనదీపము లట
తనలోపలియంతర్యామికిని ॥ నిత్య ॥

---

౧. 'తేజాంచిత' రేకు. ౨. 'ప్రముఖ' శబ్దమునకు 'ముఖమే' అర్థముకాబోలు. ౩. 'కఠిన' రేకు. ౪. ఈ సంస్కృత కీర్తనములో సంబోధనములు దీర్ఘాంతముగా నుండుట సంగీతప్రభావముతోనేమో. అన్నమయ్య సంస్కృత రచన ఒక స్వతంత్రమైన తీరుగా నుండును. ౫. ఈ పాటలోని భావమే పె. తి. వచనరచనలో కన్పట్టునది.

పలుకే మంత్రమట [౧]పాదైననాలికే
కలకలమనుపిడిఘంటయట
నలువైవరుచులే నైవేద్యములట
తలఁపులోపల నున్నదైవమునకు ॥ నిత్య ॥

గమనచేష్టలే యంగరంగగతియట
తమిగలజీవుఁడే దాసుఁడట
అమరినవూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికివి ॥ నిత్య ॥ 82

ముఖారి

కిన్నజానేఽహం కేశవాత్పర మహో
సన్నుతాకర మమాచరణాయ తస్మై ॥ పల్లవి ॥

వేదాంతవేద్యాయ విశ్వరూపాయ నమో
ఆదిమధ్యాంతరహితాధికాయ
భేదాయ పునరప్యభేదాయ నమో నమో
నాదప్రియాయ మమ నాథాయ తస్మై ॥ కిన్న ॥

పరమపురుషాయ భవబంధహరణాయ నమో
నిరుపమానందాయ నిత్యాయ
దురితదూరాయ కలిదోషవిధ్వస్తాయ
[౨]హరియచ్యుతాయ మమ [3]ఆత్మాయ తస్మై ॥ కిన్న ॥

కాలాత్మకాయ నిజకరుణాకరాయ నమో
శ్రీలలామకుచాశ్రితగుణాయ
హేలాంక శ్రీవేంకటేశాయ నమోనమో
పాలితాఖిల మమాభరణాయ తస్మై ॥ కిన్న ॥ 83

౧. 'పాదైన' పూము.పా., ౨. 'హరయేఽచ్యుతాయ' కావచ్చు. ౩. 'ఆత్మనే' కావచ్చు. అన్నమయ్య సంస్కృతరచన ఒక స్వతంత్రమైనదని ముందే వ్రాసియుంటిమి.

### కాంబోది

౧చెల్ల నెక్కఁకొంటివిగా జీవుఁడ యీబలుకోటా
బల్లిదుఁడ నీకు నేఁడు పట్టమాయఁ గోటా ॥ పల్లవి ॥

తొమ్మిదిగవనులైనదొడ్డతోలుఁగోటా
కొమ్మలచవులమూలకొత్తళాలకోటా
వమ్ములేనిమెదవంపువంకదారకోటా
పమ్మి పగవారినెల్లా పట్టుకొన్నకోటా ॥ చెల్ల ॥

తలవాకిలిదంతపుతలుపులకోటా
తలిరుఁజేతులపెద్దదంతెనాలకోటా
వెలియాసలనేదండువిడిసినకోటా
గులుగై యింద్రియములు కొల్లగొన్నకోటా ॥ చెల్ల ॥

నడచప్పరములనేనలువైనకోటా
జడిసినచెవుల మించుసవరణకోటా
పడవిపాట్లఁ బడి ఫలియించెఁ గోటా
యెడమిచ్చి శ్రీవేంకటేశుఁ దేలెఁ గోటా ॥ చెల్ల ॥ 84

రేకు 115

### శంకరాభరణం

౨నాటికి నాఁడు గొత్త నేటికి నేఁడు గొత్త
నాటకపుదైవమవు నమోనమో ॥ పల్లవి ॥

సిరుల రుక్మాంగదుచేతికత్తిధారఁ దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ
హరి నీకృపకలిమి నట్లనే అరులచే
కరిఖడ్గధార నాకుఁ గలువదండాయ ॥ నాటి ॥

---

౧ ఇందు దీర్ఘాంతమైన 'కోట' శబ్దము సంగీతానుబంధి కావచ్చు.

౨. అన్నమయ్య జీవితచరిత్ర మిందులో కానవచ్చుచున్నది.

మునుప హరిశ్చంద్రుమొనకత్తిధారఁ దొల్లి
పొనఁగి చంద్రమతికిఁ బూవుదండాయ
వనజాక్ష నీకృపను వరశత్రులెత్తినట్టి-
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ॥నాఁటి॥

చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేసి
కలుషముఁ బెడఁబాపి కాచినట్టు
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి
యిల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ ॥నాఁటి॥ 85

సాళంగనాట

కంటిమి రెంటికి భూమిఁ గలుగుదృష్టాంతము
గొంటరిరావణునందు గుహునియందు ॥పల్లవి॥

నీదాస్యముగలనీచజన్మమైన మేలు
యేదియునెఱఁగనట్టియెక్కువజన్మానకంటే
వాదపుగర్వము లేదు వట్టియాచారము లేదు
సాదించి నైచ్యానుసంధానమేకాని ॥కంటి॥

మిమ్ముఁ దలపుచుఁ జేయుమృగయానమైన మేలు
సొమ్ముపోక మీకుఁగానిసుకృతము సేయుకంటె
దిమ్మరిజన్మము లేదు తెగనికోరిక లేదు
పమ్మి నీపైఁ బెట్టినట్టిభారమేకాని ॥కంటి॥

దిక్కులు సాధించుకంటె తెలిసి శ్రీవేంకటేశు-
౧దిక్కు నీనామమే కా సాధించుటే మేలు
యెక్కువ తక్కువ లేదు యెఱుకెఱఁగమి లేదు
చక్కజాడతో నీకు శరణంటేఁగాని ॥కంటి॥ 86

౧. ఈపాద మనన్వితము. లేక 'కా' శబ్దమును 'మేలు'తో చేర్చ వచ్చునా?

### లలిత

కామధేనువై కలిగె నీచరణి
వాములు వలసినవారికి విధులు ॥పల్లవి॥

అందరు జీవులే ఆయాకర్మముఁ
బొంది బుద్ధు లెప్పుడు వేరు
కొందరు స్వర్గము గోరి సుఖింతురు
కొందరు నరకానఁ గూలుదురు ॥కామ॥

దేవుఁ డిందరికి దిక్కై యుండును
భావాభావమే బహువిధము
దేవత లమృతాధీనమై మనిరి
౧ తోవనె దనుజులు దురిత మందిరి ॥కామ॥

పుట్టు గందరికి పొంచి కలిగినదె
దట్టపుమనసులే తమకొలఁది
యిట్టే శ్రీవేంకటేశుఁడు సేసిన-
యట్టా నాతఁడు అదివో యెదుట ॥కామ॥ 87

### గుండక్రియ

ఏపురాణముల నెంత వెదకినా
శ్రీపతిదాసులు చెడ రెన్నఁడును ॥పల్లవి॥

హరివిరహితములు అవి గొన్నాళ్లకు
విరసంబులు మరి విఫలములు
నరహరిఁ గొలిచిటు నమ్మినవరములు
నిరతము లెన్నఁడు నెలవులు చెడవు ॥ఏపు॥

౧. తోవనై. పూ.ము.పా.

కమలాక్షుని మతిఁగాననిచదువులు
    కుమతంబులు బహుకుపథములు
    జమళి నచ్యుతునిసమారాధనలు
    విమలములే కావి వితథముగావు ॥ ఎవు ॥

శ్రీవల్లభుగతిఁ జేరనిపదవులు
    దావతులు కపటధర్మములు
    శ్రీవేంకటపతి సేవించుసేవలు
    పావనము లధికభాగ్యపుసిరులు ॥ ఏవు ॥ 88

ముఖారి

ఏలోకమందున్నా నేమీ లేదు
    కాలిమి నందుకుఁదగ్గదావతేకాని ॥ పల్లవి ॥

సురల కసురలకు సూడునుఁబాడునే కాని
    పొరసి సుఖించఁగఁ బొద్దు లేదు
    ధరలో ఋషులకును తపము సేయనేకాని
    మరిగి భోగించఁగ మరి పొద్దు లేదు ॥ ఏలో ॥

గక్కన సిద్ధులకైనా గంతయు బొంతయేకాని
    చిక్కుపరుపము గలిగి నెలవులేదు
    రెక్కలు గలపక్షికి రేసుతిమ్మటలేకాని
    చక్క వైకుంఠాన కెగయ సత్తువ లేదు ॥ ఏలో ॥

సకల[౧]జంతువులకు జన్మాదులేకాని
    అకటా నిత్యానంద మందలేదు
    వెకలి శ్రీవేంకటేశువిష్ణుదాసులకే మంచి-
    సుకములెల్లాఁ గలవు సుడివడలేదు ॥ ఏలో ॥ 89

౧. 'జంతువులకును' వూ ము.పా.

దేవగాంధారి

అన్నియును దనఆచార్యాధీనము
చెన్నుమీఱ హరిపాదసేవసేయు మనసా ॥ పల్లవి ॥

దైవమూఁ గొంచము గాఁడు తానూ గొంచము గాఁడు
భావించికొలిచేవారిపరిపాటి
చేవలఁ బత్తిముదుగు చేనిముదుగూ లేదు
వావిరిఁ బోఁగెత్తేటివారివారినేరుపు ॥ అన్ని ॥

కాలము కడమలేదు కర్మము కడమలేదు
కేలి విశ్వాసముగలిగినపాటి
వ్రాలకు మదిమీ లేదు వక్కాణ మదిమీ లేదు
పోలించేటివిద్వాంసులబుద్ధిలోనినేరుపు ॥ అన్ని ॥

జ్ఞానానకుఁ దప్పు లేదు జన్మానకుఁ దప్పు లేదు
నానాటికి వివేకించి నడచేపాటి
పానిపట్టి శ్రీవేంకటపతి యింతకు మూలము
అనక యీతని శరణనేవారినేరుపు ॥ అన్ని ॥ 90

రేకు 116 సాళంగనాట

వితిగిరి దానవపీచు లదె
అతిముతి దేవత లాదే రదె ॥ పల్లవి ॥

పరగుకంభ మదె పగిలె పగిలె నదె
హరినరసింహంబాయ నదె
గరుడధ్వజ మదె ఘనచక్రం బదె
మొరసేటిశంకపుమోత లవె ॥ వితి ॥

వెదలె వెడలె నదె వెనుకొని హిరణ్యుఁ
  దొడికిపట్టె నదె తొడమీఁద
విడువక చించిన వేయిచేతులవె
  కడపమీఁదనే కదలఁ డదె ॥ విఱి ॥

అదె వామాంకంబందు లక్ష్మి యదె
  కదిసి శాంతమదే కరుణ యదె
వుదుటున బ్రహ్లాదు నూరడించె నదె
  యిదె శ్రీవేంకట మెక్కె నదె ॥ విఱి ॥ 91

సామంతం

ఇద్దరు దేహసమ్మంధ మిదివో మాయ
  గద్దించి ౧యాదవుఁడునో కదసారీ తాను ॥ పల్లవి ॥

తోడఁబుట్టినమమత తొడఁగి కొన్నాళ్లకు
  వాడికె పుత్రులమీఁదవలె నుండదు
వేడుక వారెవ్వరో వీరెవ్వరో కావి
  ౨కూడపెట్టీ వీరికే కొట్లాడీ వారికే ॥ ఇద్ద ॥

తల్లిమీఁదఁ గలభక్తి తనకే కొన్నాళ్లకు
  యిల్లాలుమీఁదవలె నింత వుండదు
వెల్లవిరి నది యెంత విచారించ నిది యంత
  యిల్లుముంగి లొక్కరిది యొరవు వొక్కరిది ॥ ఇద్ద ॥

సీతతో శ్రీవేంకటేశునిత్యసేవ కొన్నాళ్ల -
  కీతల సంసారమంత యితవు గాదు
ఆతఁడెట్టు యివియెట్టు అందరూ నెఱిఁగినదే
  చేతు లొకటిమీఁదట చిత్త మొకయందు ॥ ఇద్ద ॥ 92

౧. 'యాదవుండు నొకదు నారితాను', వ్రా. ము. పా. అర్థము చింత్యము.
౨. 'కూడపెట్టి వీరికి కొట్లాడేవారికి', వ్రా. ము. పా. అర్థము చింత్యము.

నాట

దేవశిఖామణి దివిజులు వొగడఁగ
వేవేలుగతుల వెలసీ వాఁడే ॥ పల్లవి ॥

వీదుల వీదుల వెసఁ దురగముపై
భేదిల బల్లెము బిరబిరఁ దిప్పుచు
మోదముతోఁడుత మోహనమూరితి
యేదెసచూచిన నేఁగీ వాఁడే ॥ దేవ ॥

కన్నులు దిప్పుచు కర్ణములు గదల
సన్నల [1] రాగెలు చౌకళింపుచును
అన్నిటఁ దేజీ యాడఁగ దేవుఁడు
తిన్నఁగ వాగెలు దిప్పీ వాఁడే ॥ దేవ ॥

వలగొనఁ దిరుగుచు వాలము విసరుచు
నిలిచి గుఱ్ఱ మటు నేర్పులు చూపఁగ
బలుశ్రీవేంకటపతి యహోబలపుఁ-
బొలమున సారెకుఁ బొదలీ వాఁడే ॥ దేవ ॥ 93

రామక్రియ

ఇందరి బుద్ధులు యీశ్వరేచ్ఛకు సరిరావు
గొందినున్నమానుషము కొలుప దెంతైనా ॥ పల్లవి ॥

తనంతఁ దా నూరకున్న దైవమే తోడౌను
కివిసి తాఁ బదరితే కిందుమీఁదౌను
తనుఁదానే చేరె హరి దధివిభాండకునకు
కొసకెక్కఁ [2] బోయి సీవి కొంచపడెఁ దొల్లి ॥ ఇంద ॥

---

౧. 'రాగాలు' పూ.ము.పా.

౨. 'బోయి నివి' పూ.ము.పా. సీవి=పందెమొడ్డిన ధనము.

౧ వొక్కటివాఁడు దానైతే వున్నచోనే మేలు చేరు
పెక్కుబుద్ధులఁ బోతేను పిరివీకాము
పక్కన నంబరీషుఁడు పట్టినవ్రతాన గెల్చె
దిక్కులెల్లా దూర్వాసు తిరిగి బడలెను ॥ ఇంద ॥

శ్రీవేంకటేశ్వరుచేతి ౨ లోఁపిజగములు
భావించి యాతఁడు నడపక మానఁడు
వావిరి నిదెఱఁగక వట్టియలమటఁబడి
జీవులేల బడలేరు చింత లిట్టె పాయరో ॥ ఇంద ॥ 94

శ్రీరాగం

ఎంత ౩ పాటువడె నీశ్వరుఁడు
జంతువుల కేది సతమో కాని ॥ పల్లవి ॥

వోముచు లోలో ౪ నొకదేహమునకై
యేమి రచించెను యీశ్వరుఁడు
కామించి మోక్షసుఖమునకునైతే
వోమినస్రిష్టులు ౫ వొకటీఁ గావు ॥ ఎంత ॥

భోగించబుట్టినభూతకోట్లను
యేగతి మోఁచీ నీశ్వరుఁడు
చేగదేర తనసేవకుఁ జొచ్చిన-
యోగము సులభం బొకటొకటికివి ॥ ఎంత ॥

పన్నినజగముల ప్రాణాధారము
యెన్నిట నున్నాఁ డీశ్వరుఁడు
కన్నుల శ్రీవేంకటపతి యని కని
వున్నవేళ తమవునికే సుఖము ॥ ఎంత ॥ 95

౧. ఒక్కటివాఁడు = ఒక్కవిశ్వాభిప్రాయమునకు వచ్చినవాడు. ౨. 'లోని జగములు' వూ.ము.పా. ౩. 'పాటువడె' వూ.ము.పా. ఎంత+పాటు+వడె. ౪. 'నొక దేహము నకే' వూ.ము.పా. ౫. 'సృష్టు' లకు వ్యావహారికరూపము.

దేసాక్షి

నమ్మలేము కానలేము నరులాల మనమింతే
సమ్మతించి యేలేవాఁడు సర్వేశుఁడేసుండీ ॥ పల్లవి ॥

కంటికిఁ గంటిరెప్ప కాచుకవుండినయట్టు
వొంటి దేహమెల్లాఁజేవొద్దుకొన్నట్టు
అంటుక దేహి నేపొద్దు అంతరాత్మయై వుండీ
జంటయై కాచుకున్నాఁడు సర్వేశుఁడేసుండీ ॥ నమ్మ ॥

చీఁకటి నోటికిఁ [1] గడి చేసే కొంటవచ్చినట్టు
ఆఁకటికి గుక్కిళ్లు ఆసయినట్టు
పీఁకల జంతువులకు వెలుపల లోననుండి
సాఁకుచునున్నాఁ డిదివో సర్వేశుఁడేసుండీ ॥ నమ్మ ॥

తమదేహ మెంతైనా తానే యింపయి మోచినట్టు
తెమలి ప్రాణ మిన్నిటాఁ దీపయినట్టు
అమరినభోగమోక్ష లడిగినవారి కిచ్చీ
సమఁడు శ్రీవేంకటాద్రి సర్వేశుఁడేసుండీ ॥ నమ్మ ॥ 96

రేకు 117 [2] రామక్రియ

ఇట్టిజీవుల కింక [3] నేది వాటి
దట్టమై దేవుఁడ నీవే దయఁజూతుగాకా ॥ పల్లవి ॥

తనజన్మవిదు(ధు?)లనుఁ దలఁచు నొక్కొకవేళ
వొనర మఱచు నట్టె వొక్కొకవేళ
వినుఁ బురాణకథలు వివరించి యొకవేళ
పెనచి సందేహములె పెంచు నొకవేళ ॥ ఇట్టి ॥

---

[1]. 'గడిచే యేకొంట' పూ.ము.పా. [2]. 'శ్రీరాగం' పూ. ము. పా.
[3]. నేటిపాటి పూ.ము.పా.

విసిగి సంసారమందు విరతుఁడౌ నొకవేళ
వొసఁగి యందె మత్తుఁడౌ నొకవేళ
పసిగొని యింద్రియాలబంట్లై వుండు నొకవేళ
[౧]ముసిపితో దైవానకు మొక్కు నొక్కవేళ ॥ ఇట్టి ॥

కోరి తపములు చేసి గుణియౌ తా నొకవేళ
వూరకే అలసివుండు నొక్కవేళ
యీరీతి శ్రీవేంకటేశ యెదలో నీ వుండఁగాను
బీరాన నీకే మొఱవెట్టు నొకవేళ ॥ ఇట్టి ॥ 97

సామంతం

ఎంత చదివి చూచిన నీతఁడే ఘనముగాక
యింతయు నేలేటిదైవ మిఁక వేరే కలరా ॥ పల్లవి ॥

మొదల జగములకు మూలమైనవాఁడు
తుదఁ బ్రళయమునాఁడు తోఁచేవాఁడు
కదిసి నడుమ నిండి కలిగివుండెడివాఁడు
మదనగురుఁడేకాక మఱి వేరే కలరా ॥ ఎంత ॥

పరమాణువైనవాఁడు బ్రహ్మాండమైనవాఁడు
సురలకు నరులకుఁ జోటయినవాఁడు
పరమైనవాఁడు ప్రపంచమైనవాఁడు
హరి యొక్కఁడేకాక అవ్వలనుఁ గలరా ॥ ఎంత ॥

పుట్టుగులయినవాఁడు భోగమోక్షాలైనవాఁడు
యెట్టనెదుర లోనను యిన్నిటివాఁడు
గట్టిగా శ్రీవేంకటాద్రి కమలాదేవితోడి-
పట్టపుదేవుఁడేకాక పరు లిఁకఁ గలరా ॥ ఎంత ॥ 98

---

౧. 'ముసిపితోదై వానకు' పూ.ము.పా.

పాడి

భోగసహాయులె పొరుగెల్లా
ఆగమవిదు(ధు?)లును ననంతములు ॥ పల్లవి ॥

కులమునఁ జుట్టాలు కోటానఁగోట్లు
కలిమిలేమి కొక్కఁడనే గురి
పలులంపటములప్రజలే యింవరు
విలిచినచోటికి నే నొక్కఁడనే ॥ భోగ ॥

చెట్టడిచిన విదె చేటఁడుపండ్లు
గుట్టు దెలుసుకొన గురి నేను
వొటుక సంసార మూరల్లా విదె
పుట్టినప్పటికి భువి నొక్కఁడనే ॥ భోగ ॥

చనవుమనవులకు జగమెల్లా నిదె
కొనకు మొదలికిని గురి నేను
యెనయుచు శ్రీవేంకటేశుఁ దేలెఁగన
౧ వినుపుగమికాఁడ నే నొక్కఁడనే ॥ భోగ ॥ 89

శ్రీరాగం

౨ హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురుఁ డీతఁ డన్నమయ్య ॥ పల్లవి ॥

వైకుంఠనాధునివద్ద వడిఁ బాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్లపాక అన్నమయ్య
3 ఆకశపువిష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥

---

౧. 'వినుపుగ మీవాఁడ' పూ.ము.పా. ౨. ఈపాటగూడ పె.తి.లయ్యదో చి.తి.లయ్యదో అయ్యుండవచ్చు. ౩. 'ఆకసపు' పూ.ము.పా.

క్షీరాబ్ధిశాయి విట్టే సేవింపుచునున్నవాఁడు
అరితేరి తాళ్లపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు
ఆరీతులఁ దాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

యీవల సంసారలీల యిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్లపాక అన్నమయ్య
భావింప శ్రీవేంకటేశుపాదములందె వున్నవాఁడు
ఆ(హా?)వభావమై తాళ్లపాక అన్నమయ్య ॥హరి॥ 100

మలహరి

కోరి మాభుజముల డాగులు మోచుకున్నారము
ధారుణిలోపల మమ్ము దయఁజూచుఁగాక ॥పల్లవి॥

సతతము హరిచేతిశంఖచక్రములే
గతియై మాపాలనుండి కాచుఁగాక
అతిరయమైనట్టిఅచ్యుతునిఆయుధాలే
హితవుగ మమ్ము నిట్టె యేలుఁగాక ॥కోరి॥

కమలాపతిచేతులగదాపద్మములు
మమకారముతో మము మన్నించుఁగాక
సమరవిజయమైనశార్ఙ్గాదిశరములు
తమితోడ మాకు దాపుదండై వుండుఁగాక ॥కోరి॥

మంచి శ్రీవేంకటేశుఁడు మొలఁగట్టినకఠారు
అంచెల మాకెల్ల రక్షై అమరుఁగాక
అంచ నీతనికైదువులమరినహస్తములు
పంచల మాకిట్టే వజ్రపంజరా లవుఁగాక ॥కోరి॥ 101

లలిత

ఎన్నఁడొకో బుద్దెరిఁగి యీడేరేది జంతువులు
యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి ॥ పల్లవి ॥

కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది
పావనులై యిందరిని బ్రదుకుమని
లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది
వేవేలుపాతకాలెల్ల విదళించుమనుచు ॥ ఎన్నఁ ॥

చింతల నీమూర్తులు శిలాశాసనాలైనవి
పంతముతోఁ గొలిచిట్టై బ్రదుకుమని
బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి
దొంతులై నభవముల తుదగనుమనుచు ॥ ఎన్నఁ ॥

అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి
బందె దీర నీకు మ్రొక్కి బ్రదుకుమని
అందపుశ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ-
వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు ॥ ఎన్నఁ ॥ 102

రేకు 118 దేసాళం

జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు
కావక పోరాదు మాకుఁగలయంతర్యామివి ॥ పల్లవి ॥

పైపై నెదురుకట్లఁ బంచదార వుండఁగాను
చేపట్టి యడిగి తెచ్చి చేఁదు దిన్నట్లు
పూప లైనచేతిలోనే పుణ్యములు వుండఁగాను
పాపములు చవియంటాఁ బట్టఁబొయ్యీ జీవుఁడు ॥ జీవు ॥

యింటిలోనే నవరత్నా లెన్నియైనా నుండఁగాను
కంటగించి గాజుఁబూస గట్టుకొన్నట్లు
వెంటనే హరినామాలు వేయివేలై వుండఁగా
జంట వితరమంత్రాలు జపియించీ జీవుఁడు ॥ జీవు ॥

చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండఁగాను
వేసరక వెలయాలి వెతకినట్లు
మేసుల శ్రీవేంకటేశ మీదాస్యమే వుండఁగా
వాసిఁ బరులఁ గొలువనే వడిఁ గోరీ జీవుఁడు ॥ జీవు ॥ 103

గౌళ

ఊరకే దొరకునా వున్నతోన్నతసుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట ॥ పల్లవి ॥

తలఁపులోపలిచింత దాఁటినప్పుడుగదా
అలరి దైవంబు ప్రత్యక్షమౌట
కలుషంపుదుర్మదము గడచినప్పుడుగదా
తలకొన్న మోక్షంబు తనకుఁ జేపడుట ॥ ఊర ॥

కర్మంబుకసటు వోఁ గడిగినప్పుడుగదా
నిర్మలజ్ఞానంబు నెరవేరుట
మర్మంబు శ్రీహరి నీమఱఁగుచొచ్చినఁగదా
కూర్మిఁ దనజన్మ మెక్కుడు కెక్కుడౌట ॥ ఊర ॥

తనశాంత మాత్మలోఁ దగిలినప్పుడుగదా
పనిగొన్నతనచదువు ఫలియించుట
యెనలేని శ్రీవేంకటేశ్వరునిదాస్యంబు
తనకు నబ్బినఁగదా దరిచేరి మనుట ॥ ఊర ॥ 104

భైరవి

ఏమిసేతు దైవమా యెన్నఁడు గరుణించేవో
దామెనసంసారములోఁ దట్టువడీ మనసు ॥పల్లవి॥

యెక్కడిపగయొకో ఇంద్రియాలు నన్నుఁబట్టి
చక్కుముక్కు[2] సేసి యెంచి సాదించీని
గుక్కక యేమిసేసినకోలయొకో వెంటవెంట
వెక్కసపు[3] పుట్టువులై వెనుతగిలీని ॥ఏమి॥

యెన్నాళ్లపాపమొకో యెదతెగక నాలోన
వున్నతపుఁగోపమై పుమ్మగిలీని
తిన్ననై యెవ్వరిచేతితిట్లు[4]దాఁకినవిధమో
విన్ననై విజ్ఞానమెల్లా వీటఁబోయఁ దుదిని ॥ఏమి॥

యేవేళగుణమో యెదతెగనికర్మాలు
రావిమానిజిగురై వూరక యంటీని
శ్రీవేంకటేశుఁడ నీవు చిత్తములోపల నుండి
కావఁగఁగదా నీవే గతి యనవలసె ॥ఏమి॥ 105

ముఖారి

నిరుహేతుకదయానిధివి నీవు
కరుణించు నీకు నొక్కటి విన్నపము ॥పల్లవి॥

దేవా నీమహిమ తెలియనెవ్వరివశ -
మీవల నీవే[5]గతెను టింతేకాక
భావించలేరు నిన్ను బ్రహ్మాదులుసహితము
నీవేడ నేనేడ నే నొక జంతువను ॥నిరు॥

౧. 'ఏఁచి' కావచ్చు ౨. 'సేసినా కోలయొకో' పూ.ము.పా. రేకు. ౩. 'పుట్టువులే' పూ.ము.పా. ౪. 'దాకినా విధమో' పూ.ము.పా. రేకు. ౫. గతి+అను 'గతను' పూ.ము.పా.

౧ చిత్తాహరి నాదిక్కు చేకొని యవలోకించవే
యిత్తల సంసారవార్ధి యీఁదుచున్నాఁడ
హత్తి చూచేవారేకాని అడ్డగించేవారు లేరు
పొత్తుల నాధర్మము పుణ్యము నీచేతిది ॥ విరు ॥

అవధారు శ్రీవేంకటాధీశ నాజన్మము
కవిసి యింద్రియములఁ గట్టువడ్డాఁడ
జవళి నీపాదములే శరణము చొచ్చినాఁడ
తవిలి నీచిత్తమింతే తరవాత నిఁకను ॥ విరు ॥ 106

బౌళి

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి విజయముఁ బొంది
దేవతలు చూడ దశదిక్కులకు నేసెను ॥ పల్లవి ॥

అరికమ్ము వేసెనట్టి అల్లనరకాసురుపై
మేరమీరి రావణునిమీఁద నేసెను
సారపుజలధిమీఁద జలములింకఁగ నేసె
దారి దప్పకుండ నేడుదాళ్ల దెగనేసె ॥ శ్రీవేం ॥

పగదీర మింటిమీఁదిబాణునిమీఁద నేసె
మిగుల మెరసి మాయామృగము నేసె
జగములో రాక్షసుల సంహారముగ నేసె
విగిడి ౨రక్తగుండాలు వింద నేసెను ॥ శ్రీవేం ॥

ఖరదూషణాదుల కడిఖండలుగ నేసె
సరుసఁ గుంభకర్ణునిఁ జావనేసెను
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
గరుడనిమీఁద నెక్కి కంటువాయ నేసెను ॥ శ్రీవేం ॥ 107

౧. 'చిత్తములోమన్నహరి' తాబోలు. ౨. ఇటువంటిచిల్లరసమానదోషములకు ఈ వాఙ్మయమున పట్టింపు లేదు.

బౌళి

అర్పులు బొబ్బలు నవె వినుఁడు
యేర్పడ నసురల పిటువలె గెలిచే ॥ పల్లవి ॥

కూలినతలలును గుట్టపుడొక్కలు
నేలపైఁ బారిననెత్తురులు
వోలిఁ జూడుఁ డిదె ¹వుద్ధగళలీరణ(?)
కేలిని విష్వక్సేనుఁడు గెలిచె ॥ అర్పు ॥

పడిసరథంబులు బాహుదండములు
కెడసినగజములు గొడగులును
అడియాలము లివె అక్కడ నిక్కడ
చిదుముడి విష్వక్సేనుఁడు గెలిచె ॥ అర్పు ॥

పగుల పగుల వృషభాసురునిఁ జంపె
పగ నీఁగె అతనిబలములతో
అగపడి శ్రీవేంకటాధిపుపంపున
జిగి గలవిష్వక్సేనుఁడు గెలిచె ॥ అర్పు ॥ 108

రేకు 119 లలిత

సకలబలంబులు నీవే సర్వేశ్వర నాకు
అకలంకంబగుసుఖమే అన్నిట నిదే నాకు ॥ పల్లవి ॥

పొందుగఁ జక్రాంకితమే భుజబల మిదె నాకు
అందినహరి నీచింతే ఆత్మబలము నాకు
సందడిఁ బేరుబలము కేశవనామము నాకు
యిందును నందును భవభయ మిఁక లేదిదే నాకు ॥ సక ॥

---

౧. చూడుఁడిదె, వుద్దగళలు=పైకెగసినకళలు కావచ్చు. 'ఈరణకేలిని' అని విఱచవచ్చునా? ప్రశ్నచిహ్నము పూ. ము. పా.

అంగపుఁదిరుమణు లివి పంచాంగబలము నాకు
సంగతి నీపై పాటలె స్వరబలి మిదే నాకు
రంగుగ నీగుణరాసులే రాసిబలము నాకు
యింగితముగ నిహపరముల ౧కెదురే దిదే నాకు ॥సక॥

కనుఁగొను నీవిగ్రహమే గ్రహబలి మిదె నాకు
విను నీదాసులసేవే వెనుబలి మిదె నాకు
తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు
ఘనమే చెప్పఁగ నింతటఁ గలిగెటో యిదే నాకు ॥సక॥ 109

సాళంగనాట

ఇదివో వీడివీదుల నీతనితేరు
యెదుట శ్రీవేంకటాద్రివితేరు ॥పల్లవి॥

చట్టువడఁ దోలె నాఁడు సముద్రాలపైఁ దేరు
ఘుట్టుగాఁ దోలెను పౌండ్రకునిపైఁ దేరు
జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు
కొట్టి తోలె హంసడి ౨ధిక్తులపై తేరు ॥ఇది॥

ఘోరమై కుంగఁగఁ దోలె కులగిరులపైఁ దేరు
కౌరవసేనపైఁ దోలె గక్కనఁ దేరు
కోరి మధురమీఁద నక్రూరుఁ గూడి తోలెఁ దేరు
ఆరసి సంధిమాటలు ఆడఁదోలెఁ దేరు ॥ఇది॥

తచ్చి శిశుపాలాదిదైత్యులపైఁ దోలెఁ దేరు
పెచ్చుగాఁ దోలె రుక్మిణి పెండ్లితేరు
అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చెచ్చెరఁ దోలె దిక్కుల సింగారపుఁదేరు ॥ఇది॥ 110

౧. 'కెదురేటిదే' పూ.ము.పా. ౨. 'దిమతుల' రేకు.

పాడి

అనుచు లోకములెల్ల నదె జయవెట్టేరు
నినుఁ గొల్చితిఁ గావవే నీరజాక్షుఁడా ॥ పల్లవి ॥

అదివో కోనేటిలోన నదివో సర్వతీర్థములు
అదివో పైఁడిమేడలహాతినగరు
పొదలి పరుషలెల్లా పొదిగి సేవించేరు
యిదివో వరము లిచ్చె నిందిరానాథుఁడు ॥ అను ॥

అదివో వేదఘోషము అదివో సురలమూఁక
అదివో విశ్వరూపము అద్భుతమందె
గుదిగొనెఁ బుణ్యములు కోట్లసంఖ్యలు చేరె
యిదివో దయదలఁచె నీశ్వరేశ్వరుఁడు ॥ అను ॥

అదివో శ్రీవేంకటేశుఁ దక్కున నలమేల్మంగ
అదివో నిత్య౧శూరులు అనువారలు
నిఖలశేషాచలము నిక్కి పైపైఁ బొడచూపె
యిదివో కొలువున్నాఁడు హృదయాంతరాత్ముఁడు ॥అను॥ 111

నాట

అహోబలేశ్వరుఁ డరికులదమనుఁడు
మహామహిమలను మలసీ వాఁడె ॥ పల్లవి ॥

కదలుఁగన్నులును కరాళవదనము
గుదిగొనుభయదపుఁగోరలును
అదరుమీసములు నలరఁగ నవ్వుచు
వుదుటుతోడఁ గొలువున్నాఁడు వాఁడె ॥ అహో ॥

---

౧. 'సూరులు' కావచ్చు.

అతిసితనఖములు ననంతభుజములు
వితతపరాక్రమవేషమును
అతులదీర్ఘ[1]జిహ్వయుఁ గడు మెరయఁగ
మితిలేనికరుణ మెరసీ వాఁడే ॥ అహో ॥

పందడిసొమ్ములు శంఖచక్రములు
పొందుగ దివిజులు పొగడఁగను
యిందిరఁ దొడపై నిడి శ్రీవేంకట-
మందు నిందుఁ గడు నలరీ వాఁడే ॥ అహో ॥ 112

సాళంగనాట

సిరిఁ దొడపై నిడి శ్రీనర[2]సింహుఁడు
యిరవుగ వరముల నిచ్చీని వాఁడే ॥ పల్లవి ॥

ఘనమగుకోరలు కరాళవదనము
చెనకుచు గొడ[3] నెటిజిహ్వయును
[4]వినువుఁగటమరలు వికటలోచనము
నొనరఁగ గొలుపై యున్నాఁడు వాఁడే ॥ సిరిఁ ॥

చటులచక్రకరంబును [5]శార్ఙకరంబును
అటు వరదాభయహస్తములు
పటుతరయోగపుపట్టబంధమును
కటితటిఁ జెలఁగఁగఁ గడఁగీ వాఁడే ॥ సిరిఁ ॥

పరపగుశేషునిపడగలనీడల
అరుదగురవిచంద్రాంకముల
సిరులగద్దెపై శ్రీవేంకటేశుఁడు
పరిపూర్ణుఁడై పరగీ వాఁడే ॥ సిరిఁ ॥ 113

౧. 'జింహ్వ' రేకు. ౨. 'సింహ్వుఁ' రేకు ౩. 'నేటి' వూ.ము.పా.
౪. 'వినుఫుఁగ టమరలు(?)' వూ.ము.పా. ౫. 'శార్ఙ' రేకు.

శ్రీరాగం

నిర్మలులు వీరు నిత్యసుఖులు
కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు ॥ పల్లవి ॥

పరమజ్ఞానసంపన్నులగువారికిని
అరుదుగా దిచటిమహా[1] దైశ్వర్యము
హరికృపాధనము చేనబ్బినమహాత్ములకు
సరకుగాకుండు పంచల విధానములు ॥ నిర్మ ॥

బలిమిని వేదాంతపట్ట[2]భద్రులకు నిల
బలురాజ్యపదవు లిరుగడబంట్లు
లలిమీరి హరిచక్రలాంఛనపుశూరులకు
యెలమి విజయములెల్ల నింటిలో నుండు ॥ నిర్మ ॥

యీవలను శ్రీవేంకటేశుశరణాగతుల-
కావటించినపుణ్య [3] మడువుగాదు
దైవజ్ఞులయినయాధర్మస్వరూపులకు
వేవేలుభోగములు వెనుతగులుచుండు ॥ నిర్మ ॥ 114

రేకు 120 శంకరాభరణం

చీచీ వో జీవుఁడా చింతించుకో జీవుఁడా
ఆచందాన కీచందము అరుహమా జీవుఁడా ॥ పల్లవి ॥

వుత్తముఁ డయినహరివుండేటియాతుమలోన
తత్తరపుఁగాంతలను తలపోసేదా
వొత్తి నారాయణనామ ముచ్చరించేనోరను
రుత్తయధరపుఁదోలు రుచిగొనేదా ॥ చీచీ ॥

---

౧. 'మహదైశ్వర్యము' వంటివిల్లరవమానదోషములు మావాఙ్మయమున తెక్కుకు రానివి. ౨. 'బద్ధు' రేకు. ౩. 'అడుగు' లోని గకారము వకారమైనదేమో.

పొందుగా గోవిందునిఁ బూజించేటిచేతులను
సందడిఁ జన్నులమీఁదఁ జాఁచఁబొయ్యేదా
కందువ దేవునిరూపు కనుఁగొనేచూపులు
ముందరి మర్మపుటంగములమీఁదఁ బెట్టేదా ॥ చీచీ ॥

వేవేలు విష్ణుకథలు వినియేటి చెవులను
ఆవటించి యాడసుద్దులాలకించేదా
శ్రీవేంకటేశ్వరుని సేవించేయీజీవనము
భావించక విషయాలపాలు సేసేదా ॥ చీచీ ॥ 115

దేసాక్షి

ఇంతదేవుఁ డింక వేఁడీ యెంచి చూపుఁడా
చెంతనుండితే రక్షించు చేకొని కొలువరో ॥ పల్లవి ॥

వేసితే వేయురూపులు విశ్వరూప మితఁడు
శ్రీసతీశుఁ డిందరిలో శ్రీమంతుఁడు
భాసురపుభూమిమోచేబలవంతుఁ డిన్నిటాను
దాసులైతే మన్నించు నీదైవముఁ గొలువరో ॥ ఇంత ॥

గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాఁడు
అట్టె దేవతలమొర లాలించేవాఁడు
చిట్టకపుదానవుల చించిచెండాడేటివాఁడు
ఇట్టె శరణంటేఁ గాచు నీతనిఁ గొలువరో ॥ ఇంత ॥

కాలముఁ గర్మము మాయ గల్పించినయట్టివాఁడు
ఆలించి సర్వజీవులఅంతర్యామి
వాలి శ్రీవేంకటపతై వరములిచ్చేటివాఁడు
యేలీఁ గొల్చిన మెచ్చు నీవిభుఁ గొలువరో ॥ ఇంత ॥ 116

భూపాళం

అప్పుడు చూచేదివో అధికుల నధముల
తప్పక యెచ్చరి యిదే తలఁచవో మనసా ॥పల్లవి॥

కొండలవంటిపనులు కోరి ముంచుకుంటే నూర-
కుండి కై కొనవివాఁడే యోగీంద్రుఁడు
నిండినకోపములకు నెపములు గలిగితే
దండితోఁ గలఁగవియాతఁడే ధీరుఁడు ॥అప్పు॥

సూదులవంటిమాటలు సొరిదిఁ జెవి సోఁకితే
వాదులువెట్టుకొవనివాఁడే దేవుఁడు
పాదుకొన్నసంసారబంధము నోరూరించితే
ఆదిగొవి మత్తుఁడు౧ గానెట్టివాఁడే పుణ్యుఁడు ॥అప్పు॥

గాలాలవంటియాసలు కడుఁ దగిలి తీసితే
తాలిమితోఁ గదలనాతఁడే ఘనుఁడు
మేలిమి శ్రీవేంకటేశుమీఁద భారము వేసుక
వీలక తనలో విఱ్ఱవీఁగువాఁడే నిత్యుఁడు ॥అప్పు॥ 117

మలహరి

కొన మొద లేదో గుఱిగాన రొరులు
ముసుకొనుసంసారమోహాంధమందు ॥పల్లవి॥

తలఁచును బ్రహ్మాండశతులకు నవ్వల
తలఁచేటిజీవుఁడు తా నణువు
అలరినయాసల ననలునుఁ గొనలును
వెలసీ సంసారవృక్షములోన ॥కొన॥

౧ 'మత్తుఁడుగా వద్దైవాఁడే' పూ.ము.పా. కాని+అట్టి=కానెట్టి. ఇది వ్యావహారిక సంధి.

పుట్టును బొదలును భువి బహురూపుల
పుట్టేటియాతఁడు పొరి నొకఁడే
వొట్టుక యీఁడును వుభయకర్మముల
చట్టెడుసంసారసాగరములను ॥ కొన ॥

తగులు నన్నిటా తనుభోగంబుల
తగిలేటిపురుషుఁడు తా ఘనుఁడు
విగిడి శ్రీవేంకటనిలయుఁడు ౧గతైతే
అగపడ సంసారానందమందు ॥ కొన ॥ 118

ఆహిరి

కలిదోషములాల కడు నేల మీరేరు
యిలధరుఁ డుండుగాను యిఁక నేఁటిసుద్దులు ॥ పల్లవి ॥

జగములేలెడువాఁడు సర్వాంతరాత్ముఁడు
జిగి నింక నీకీబుద్ధి చెప్పనోపఁడా
నిగిడి పుట్టించేటివాఁడు నిందుక వుండేటివాఁడు
తెగవికర్మము లెల్ల తిద్దకేల మానును ॥ కలి ॥

దనుజులఁ గొట్టేవాఁడు ధర్మము నిలిపేవాఁడు
పనిగొన్న దురితాలు పాపనేరఁడా
కొనమొదలైనవాఁడు గురి దానైనవాడు
వునికి మనికి ౨సేయ కూరకుండీనా ॥ కలి ॥

స్వతంత్రుడైనవాఁడు స్వామియైనవాఁడు
గతియై దాసులనెల్లఁ గావకుండీనా
యితఁడే శ్రీవేంకటేశుఁ డిందిరాపతైనవాఁడు
సతతము మాకు నిట్టే సంపద లొసఁగఁడా ॥ కలి ॥ 119

---

౧. ఈ రేకు రెండవప్రక్క బాగా చిలుమెక్కినది. అక్షరములు సరిగా కానవచ్చుట లేదు. 'గతైతే' అనుపాఠము అక్షరసందర్భమును జూచి నే నూహించినదే. 'గతై' పూ.ము.పా. ౨. 'కాయ' రేకు.

దేసాళం

వాదమేల సారెసారె వసి ముక్తి లేదంటా
వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసిరా ॥ పల్లవి ॥

అరయ జీవులకెల్లా నభేదమైతే
గురుఁడు శిష్యుఁడు లేఁడు కూడ దర్మము
సొరిది నాతుమలోన సోహంభావనయైతే
సరి మునులదేవపూజలు చెల్లవు ॥ వాద ॥

సహజలీలానుభూతి సర్వము మిథ్య యైతే
బహుయాగాదికర్మా[1] పని లేదు
మహిలోఁ జననాలు మరణాలు మాయయైతే
విహితాచారాలు నేము విధే లేదు ॥ వాద ॥

ఘటనబ్రహ్మము నిరాకారమైతేఁ దరియింప
యిటు పురుషసూక్తాదు[1]లవి మరేల
అటు శ్రీవేంకటేశుదాస్యము లేక బిగిసితే
[2]సటలాడుకొనెడిరాక్షసమత మవును ॥ వాద ॥ 120

121 నుండి 130 వరకు గల 10 రేకులు లేవు.

రేకు 131 పాడి

ఇదివో సుజ్ఞానము 'సూత్రే మణిగణా యివ' గాన
మది సతమే లేదు మాయల '[3] యద్భావం తద్భవతి' ॥పల్లవి॥

యెదుటఁగను యీజగము యిది సిపన వెఱతును
అది విపరీతజ్ఞానము [4] 'యద్దృష్టం తన్నష్టము' గాన
పొడలుచుండేటియీజగము పొసఁగ నీవు గావన వెఱతు
యిది విపరీతజ్ఞానము 'సదసచ్చాహం' బంటివి గాన ॥ ఇది ॥

౧. 'లవి' పూ.ము.పా. యతిభంగము. ౨. 'సటలాడు గొనెడి రాక్షసమత మవును' పూ.ము.పా. దీని అర్థము విచార్యము. ౩. 'యాద్భావే' కావచ్చు. అన్నమయ్య లోకవ్యవహారమును ఉదాహరించి నట్లున్నది. ౪. 'యదృష్టం' రేకు.

నిండినయీజీవులు నీవేయన వెఱతును
దండనే * బద్దులు వీరు 'వ్యాసపర్ణ' వున్నది గాన
మెండగుయీజీవులను మీరు గారన వెఱతును
వుండెడివీరలు నిత్యులు వొగి 'సహమాదిశ్చమధ్యము'గాన॥ ఇది॥

యిది మునుపె నీచిక్కు. యిందుకు ద్రిష్టం బొక్కటె
తుదఁ దొల్లె నీదాసులు గలరు తుదఁ దొల్లియే నీవుఁ గలవు
వెదకు మా శ్రీవేంకటపతి నిను సేవించఁగ నిను సేవించఁగను
అదన నిన్నంటినవారలు నీయంతలు సేతువుగాన ॥ ఇది ॥ 121

ముఖారి

ఏదుపాయము యే నిన్నుఁ జేరుటకు
ఆదినంత్యములేనిఅచ్యుతమూరితివి ॥ పల్లవి ॥

వెలయ నీగుణములు వినుతించేనంటే
తెలియ నీవు గుణాతీతుఁడవు
చెలరేఁగి నిను మతిఁ జింతించేనంటే
మలసి నీ వచింత్యమహిముఁడవు ॥ ఏదు ॥

పొదిగి చేతుల నిన్నుఁ బూజించేనంటే
కదిసి నీవు విశ్వకాయుఁడవు
అదన నేమైన సమర్పించేనంటే
సదరమై అవాప్తసకలకాముఁడవు ॥ ఏదు ॥

కన్నులచేత నిన్నుఁ గనుఁగొనేనంటే
సన్నిధి దొరక నగోచరుఁడవు
యిన్నిటాను శ్రీవేంకటేశ నీవు గలవని
వన్నెల శరణనేవాక్యమే చాలు ॥ ఏదు ॥ 122

---

*. 'బద్ధులు' కావచ్చు.

పాడి

వేఱొకభావనలేల వీనితోఁ బెనఁగనేల
తూఱినందే హరిఁగూర్చి ౧తుదగంటగాక ॥పల్లవి॥

చూచేకన్నుల నేమీఁ జూడకుండవచ్చునా
చూచినందెల్లా హరిఁ జూచుటగాక
వేచినవీనుల నేమీ వినకుండవచ్చునా
కాచి యవే హరికథగా వింటగాక ॥వేఱొ॥

కోరేటిచవుల జిహ్వ గోరకుండవచ్చునా
కోరినచవుల హరిఁ గూర్చుటగాక
ఆరీతిబారేమనసు అడఁచఁగవచ్చునా
అరితేరి అన్నిటాను హరిఁ గంటగాక ॥వేఱొ॥

వాదలు మోచినదేహి వోమకుండవచ్చునా
వాదలు శ్రీహరిదనే వోముటగాక
బదినే శ్రీవేంకటేశుఁ బాసివుండవచ్చునా
యెదయ కందె సుఖియించుటగాక ॥వేఱొ॥ 123

గౌళ

ఏదనుండురో తాము యెన్నికెపోఁజాలు దాఁటి-
రాదకాదే పొదచూపే రాహా మేలు ॥పల్లవి॥

యెలమి స్వప్నమనేయెదపుఁజావడిలో
వాలిసి జీవుఁడు కొలువున్నపుడు
వెలినున్న చైతన్యవిధులదొరలచేతి -
యలబలము గాన మాహా మేలు ॥ఏద॥

౧. 'తుదగట్ట' వ్రా.ము.పా.

ఉప్పదమయి దేహమనేవూరఁ బెద్దచావడి
ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు
చప్పుడుతో నింద్రియవిషయపరివారము
అప్పుడు ౧పారాడుదురు అహో మేలు ॥ ఏడ ॥

అక్కడ నిద్దురలనేఅంతఃపురాల కేఁగి
పుక్కన భోగాన నాత్మ వున్నపుడు
యెక్కవశ్రీవేంకటేశ యెవ్వరూ నాడకుఁ బోరు
అక్కడా నీవే వుందు వాహో మేలు ॥ ఏడ ॥ 124

బౌళి

౨నానామార్గముల నాఁటుకొను నొకయోగి
మానిమీఁదితపసి సామూష్యఁ డాయోగి ॥ పల్లవి ॥

పున్నమనమాసఁ గూడఁ బొదిగి నొక్కొకయోగి
కన్నులచూపులు సరిగాఁ దూఁచు౩ నొకయోగి
మిన్నునూయి చేఁతాటఁ జేఁది మెచ్చు మింగు నొకయోగి
వెన్న సన్నముగ నూరి వీఁగు నొకయోగి ॥ నానా ॥

గాలి ముడియగఁ గట్టి కలుగుదిగట్టుయోగి
నాలిమింటివిత్తు నెట్టి నగు నొకయోగి
మూలనిధానము గని మందు గానఁ డొకయోగి
నేల దలకిందుసేసి నిక్కు నొకయోగి ॥ నానా ॥

గతజలములకెల్లఁ గట్టగట్టు నొకయోగి
తతిఁ బూవులమాటల దడిగట్టు యోగి
యితవైనశ్రీవేంకటేశునిమఱఁగు చొచ్చి
గతిగనె నాతఁ డొక్కఁడే యోగి ॥ నానా ॥ 125

౧. 'పారేడుదురు' రేకు. ౨. ఈపాటలోని భావము స్పష్టమగుట లేదు.
౩. 'జూఁచు' పూ.ము.పా.

ముఖారి

హరియే సకలక్రియలై తృప్తి యిచ్చుఁగాక
యెరవులవారిచేఁత లెందాఁకా వచ్చీని ॥ పల్లవి ॥

సిరులకు నరులే పరలోకక్రియలు
సిరిమోహాచారాలఁ జేతురుగాక
తరుపాషాణపశుతతుల కెవ్వరు సేసే-
రరయఁగ భ్రమగాక అవి పస్తులున్నవా ॥ హరి ॥

కొడుకులుగలవారు కోరి పితృముఖ౧మున
కుడుపులు దమవారిఁ గూర్చిపెట్టఁగా
అడరి శ్రీహరియే అన్నియుఁ దాఁ జేకొని
తడవి వారిఁ గొంత దయఁజూచుఁగాక ॥ హరి ॥

తారేడ వారేడ దైవము శ్రీవేంకటేశుఁ-
డారయ నంతరాత్ముఁ డని తెలిసి
ధారతో యాతనియాజ్ఞఁ దప్ప కాదివసాన
చేరువఁ జేసేవెల్లాఁ జేయుఁడీ యాతనికి ॥ హరి ॥ 126

రేకు 132 గుండక్రియ

హరిహరి నీమాయాజగ మిది అందనే చూచుచు నవ్వుచును
అరసి యందులో నిను భావించేటిఆత్మభావమిది యెన్నఁడొకో
॥ పల్లవి ॥

సకలోద్యోగంబులు మాని సకలోపాయంబులు విడిచి
సకలేంద్రియములజాలటు మాని సకలవిషయములరహితుఁడై
సకలముఁ దనవలె భావించి సర్వాంతరాత్మవు నినుఁ దెలిసి
అకలంకంబున నుండెడిభావం బది యిఁక నెన్నఁడొకో ॥ హరి ॥

౧. 'మఖ' కావచ్చునేమో.

ఘనమగుకోర్కులఁ జాలించి ఘనకోపంబు నివారించి
ఘనకాముకత్వముల నటు దనిసి ఘనమగునాసలఁ దొలఁగించి
ఘనముఁగొంచముల నిసుఁ దలఁచి ఘనాఘనుఁడవు నీవనుచు
అనుమానము[1]లటు సుఖియించే దది యిఁక నెన్నఁడొకో॥ హరి॥

పరచింతలలోఁ దడఁబడక పరమార్గంబుల కగపడక
పరహింసలకును యెన్నఁడుఁ జొరక పరదూషణలకు నెడగిలిసి
పరదేవుఁడ శ్రీవేంకటభూధరపతి నీకే శరణనుచు
అరమరపుల నేఁ [2]జొక్కి తనిసే దది యిఁక నెన్నఁడొకో ॥హరి॥
127

బౌళి

ఏది వలనె నీవది సేయు యిందులోన నోజీవాత్మ
పొదగుమనలో నంతరాత్మయై పరగినశ్రీహరిపనుపునను ॥ పల్లవి ॥

మనవంటిజీవులే మహిలోన నొకకొన్ని
శునఃములై [3] కుక్కుటములై సూకరములునైనవి
దినదినముఁ గర్మపాశములఁ దిరిగెడిదుర్దశ లటు చూడు
సనకాదులై కొందరుజీవులు శౌరిదాసులై రటు చూడు ॥ ఏది ॥

కన్నులుఁగాళ్లు మనవలెఁ దనువులు గై కొని కొందరునరులు
పన్నినతొత్తులు బంట్లునై మనపనులు సేయుచునున్నారు
యెన్నఁగ శ్రీహరి నెఱఁగక యిడుమలఁ బొరలెడి దది చూడు
మున్నె హరిదాసులై నారదముఖ్యులు గెలిచిన దది చూడు॥ ఏది ॥

[4] యింతగాలమును యీపుట్టుగులనె యిటువలెఁ బొరలితి [5] మిన్నాళ్ల
యింతట శ్రీవేంకటేశుఁడు దలంచి యీజన్మంబున మము నేలె
వింతలబొరలిననరకకూపముల వెనకటిదైన్యము లటు చూడు
సంతసమున ముందరి మోక్షము సర్వానందం బది చూడు ॥ఏది॥ 128

౧. 'లేక' కావచ్చు. ౨. 'జొక్కుచు' కావచ్చు.. ౩ 'కుక్కుటములై సూకరములైనవి' పూ.ము.పా. ౪. ౫. ఇట్టి పునరుక్తులక్కడక్కడ గలవు.

శంకరాభరణం

నీవు సర్వసముఁడవు నీవు దేవదేవుఁడవు
యీవల నాగుణదోషా లెంచ నీకనేలా ॥ పల్లవి ॥

పూవులపైఁ గాసీఁ బోరి ముండ్లపైఁ గాసీని
ఆవల వెన్నెలకేమి హానివచ్చీనా
పావనుల నటు గాచె పాపపుంజమైననన్నుఁ
గావఁగా నీకృపకునుఁ గడమయ్యీనా ॥ నీవు ॥

గోవుమీఁద విసరీఁ గుక్కమీఁద విసరీని
పావనపుగాలికిని పాపమంటీనా
దేవతలరక్షించి దీనుఁడనైననాకుఁ
దోవచూపి రక్షించితే దోసమయ్యీనా ॥ నీవు ॥

కులజునియింటనుండీ కులహీనునియింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేఁడు గావవే ॥ నీవు ॥ 129

సామంతం

నెప్పున ధర్మపుణ్యము నీచేతి దింతే
యెప్పుడు గాచినఁ గావు మింతా నీచిత్తము ॥ పల్లవి ॥

యేవల నరుఁడు లేక యెద్దే తా దున్ననా
నీవు సేయించక వేరే నేఁ బుణ్యము సేసేనా
దేవుఁడ సూర్యుఁడురాక తెల్లవారునా రేయి
వేవేగ నీకృపఁగాక విజ్ఞానినౌదునా ॥ నెప్పు ॥

కుమ్మరవాఁడు లేకే కుండ దాఁ బుట్టునా
నెమ్మి నీవు పుట్టించక నేనే పుట్టితినా
వమ్ముల రాట్నము నిలువక గుండ్రలు నిల్చునా
పమ్మి నీయప్పణ లేక భవములు మానునా ॥ నెప్పు ॥

మక్కువ మగఁడులేనిమనువు గలుగునా
లెక్కించి యంతర్యామివి లేనినే నున్నాఁడనా
చక్కఁగ శ్రీవేంకటేశ శరణనేబుద్ధి నాకు
తక్కక నీవియ్యకుంటే దాసుఁడ నే నౌదునా ॥ నెప్పు ॥ 130

లలిత

ఇహమేకాని యిఁకఁ బరమేకాని
బహుళమై హరి నీపై భక్తే చాలు ॥ పల్లవి ॥

యెందు జనించిన నేమి యెచ్చోట నున్న నేమి
కందువ నీదాస్యము గలిగితేఁ జాలు
అంది స్వర్గమేకాని అలనరకమేకాని
అందపునీనామము నాకబ్బితేచాలు ॥ ఇహ ॥

దొర యైనఁజాలుఁ గడుఁ దుచ్ఛపుబంటైనఁ జాలు
కరఁగి నిన్నుఁ దలఁచఁగలితేఁ జాలు
పరులుమెచ్చినమేలు పమ్మి దూషించినమేలు
హరి నీసేవాపరుఁడౌతే చాలు ॥ ఇహ ॥

యిలఁ జదువులు రానీ యిటు రాక పోనీ
తలఁపు నీపాదముల తగులేచాలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చలపట్టి నాకు నీశరణమే చాలు ॥ ఇహ ॥ 131

రేకు 133 మలహరి

సర్వోపాయముల జగతి నాకితఁడే
పూర్వీధరుఁడు పురుషోత్తముఁ డితఁడే ॥ పల్లవి ॥

సకలగంగాదితీర్థస్నానఫలము లివి స్వామిపుష్కరిణిజలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాసయాత్ర లివి సిరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చటఁ జాతుపడికైంకర్య మిదియే ॥ సర్వో ॥

ఉపవాసతపములివి యితనిప్రసాదంబులొగి భుజింపుటే నాకు దినదినంబు
ఉపరహస్యోపదేశంబు లితనిపాదవందనంబులు శరణవేటి సేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషుల దర్శనము నాకు నొగి నిచటిబహువృక్ష దర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటియెన్నఁగలబహుపక్షికలకలంబు ॥ సర్వో ॥

తలఁపుగలయోగంబులందు శ్రీవైష్ణవులందగులుసంవాససహయోగంబు
వెలయ నిందుమహోత్సవంబులిన్నియు నితనివిభవంబులెసఁగు తిరు౧నాళ్లు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనింతయు నాకు శ్రీవేంకటేశ్వరునిశరణాగతి
అలరునాసంపదలు యితని పట్టపురాణిఅలమేలుమంగకడకంటిచూపు ॥ సర్వో ॥ 132

శ్రీరాగం

ఇంతయు నీమాయామయ మేగతిఁ దెలియఁగ వచ్చును
దొంతిఁబెట్టినకుండలు తొడరినజన్మములు ॥ పల్లవి ॥

కలలోపలిసంభోగము ఘనవైభవసంపద లిన్నియు
వలలోపలిసిదిపరులు వన్నెలవిభవములు
తలఁపునఁ గలిగియు నిందునే తగులకపో దెవ్వరికిని
తెలిసినఁ దెలియదు యిదివో దేవరహస్యంబు ॥ ఇంత ॥

---

౧. 'నాకు' పూ.ము.పా. రేకు.

అద్దములోపలినీడలు అందరిదేహపురూపులు
చద్దికి వండినవంటలు ౨జంటఁగర్మములు
పొద్దొకవిధమయి తోఁచును భువి నజ్ఞానాంబుధిలో-
నద్దిన దిది దెలియఁగరా దంబుదముల మెఱుఁగు ॥ఇంత॥

మనసునఁ దాగినపా లివి మదిఁగలకోరిక లిన్నియు
యినుమున నిగిరిననీళ్ళు యిల నాహారములు
పనివడి శ్రీవేంకటగిరిపతి నీదాసు లివిన్నియు
కని మని విడిచినమనుజులకాయపుమర్మములు ॥ఇంత॥ 133

లలిత

షోడశకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥పల్లవి॥

అలరువిశ్వాత్మకున కావాహన మిదె సర్వ-
నిలయున కాసనము నెమ్మి నిదె
అలగంగాజనకున కర్ఘ్యపాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జన మిదె ॥షోడ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకార మిదె
సరిశ్రీమంతునకు భూషణము లివె
ధరణీధరునకు గంధపుష్పధూపములు
తిర మిదె కోటిసూర్యతేజునకు దినము ॥షోడ॥

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్రవిడెము
అమరినశ్రీవేంకటాద్రిమీఁదిదేవునికి
౨తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడ॥ 134

౧. 'ట' ప్రక్కన అరసున్న విచార్యము. ౨. కర్పూరనీరాజన మొగిరిపోయి 16 ఉపచారాలే మిగిలినవి.

మాళవిగౌళ

ఏమీ నెఱఁగనినాఁడు యిటు నిన్నుఁ గొలిచేనా
నీమాయ దెలుపఁగా నిను ననేఁగాకా ॥పల్లవి॥

పసురముగఁ జేసితే బడి నిన్నుఁ దలఁచేనా
వెస రాయిఁజేసితే వెదకి నిన్నెఱిఁగేనా
పొసఁగ మానుగ నన్నుఁ బుట్టించితేఁ బొగడేనా
మసిపి నరుఁజేయఁగా మొరయిడేఁగాక ॥ఏమీ॥

మొగి మృగముఁ జేసితే మొక్కనెఱిఁగేనా
తగఁ బక్షిఁ జేసితేఁ దరిఁ బూజసేసేనా
జిగి నితరజంతువుగఁ జేసితేఁ దగిలేనా
అగపడి వివేకిఁ జేయఁగ ననేఁగాక ॥ఏమీ॥

యింత కధికారిఁ జేసి యీప్రపంచజ్ఞాన-
మింత యొసఁగితివి మరఁ గిఁకనేలా
చింత లిన్నియుఁ దీర శ్రీవేంకటేశ నను
సంతతము నేలఁగా శరణనేఁగాక ॥ఏమీ॥ 195

శుద్ధవసంతం

పరమాత్ముఁ డొక్కఁడే పరమపావనుఁడుగన
పరిపూర్ణుఁడనెడియీభావమే చాలు ॥పల్లవి॥

హేయ మిందే దుపాదేయ మిం దేది
బాయిటనే హరి సర్వపరిపూర్ణుఁడు
సేయునెడ గుణభావజీవకల్పనము లివి
రోయఁజూచినఁ దనదుకాయమే రోఁత ॥పర॥

జాతి యిందే దంత్యజాతి యిం దేది
జాతులిన్నిటా నాత్మ సర్వేశుఁడు
ఆతలను అంటుముట్టనేదిభావనలెల్ల
జాఁతిపడి యెఱఁగనోపనివెలితే తనది ॥ పర ॥

తెలివిగలదాఁకాఁ ౧ దెగనిమఱఁపు లివి
తెలిసినంతటిమీఁదఁ దీరు సంశయము
యిలలోన శ్రీవేంకటేశ్వరునికరుణచే
వెలసి యీజ్ఞానంబు విడువకు మనసా ॥ పర ॥ 136

రేకు 134

### రామక్రియ

వెలుపల మఱవక లోపల లేదు వెలుపలఁ గలిగిన లోపల మఱచు
చలమున నిదియే ఘడియ ఘడియకును సాధించినసుఖ మటు దోఁచు ॥ పల్లవి ॥

వెలుపలి వెలుఁగే చూడఁగ లోపలి వెడచీఁకటి గానరియట్లు
అలరి ప్రపంచజ్ఞానికిఁ దనలో నాత్మజ్ఞానము గనరాదు
పలుమరు చీఁకటి చూడఁగఁ ౨ జూడఁగ బయలే వెలుఁగై తోఁచినయట్లు
అలయక తనలోఁ జూపు చూచినను అంతరంగమున హరిఁ గనును ॥ వెలు ॥

జాగరమే కడుఁ జేయఁగఁ జేయఁగ సతతము నిద్దుర రానట్లు
చేగలనింద్రియములలోఁ దిరిగినచిత్తవికారము లయపడదు
యీగతి నిద్దుర వోఁగాఁ బోఁగా నిలలో సుద్దులు యెఱఁగనియట్లు
యోగపుటేకాంతంబును దనమన సొగి మరవఁగ మరవఁగ హరిఁ గనును ॥ వెలు ॥

దేహపుటాకాశపునిట్టూర్పులు బాహిరపుబయట నడఁగినయట్లు
ఆహా జీవునిజననమరణములు అందే పొడముచు నందడఁగు
వూహల శ్రీవేంకటపతివాయువు కొగి నాకాశము వాక్యసూత్రము
ఆహా ప్రాణాపానవాయువుల ఆతుమ నిలుపుటే హరిఁ గనుట ॥ వెలు ॥ 137

---

౧. 'దెగనిమఱఁగు' పూ.ము.పా. రేకు. ౨. ఈ 'జూడఁగ' పూ.ము.పా.లో తప్పిపోయినది.

గుజ్జరి

ఇందరిలో నే మెందుఁబోలుదుము యిందరిఁ బోలినజీవుల మే
కందువ పేరలఁ దలఁచి చిత్తమిది కలఁగెడి దైవమ కావఁగదే ॥పల్లవి॥

యెందరొకో జరాదుఃఖము లేచి యనుభవించేటివారు
యెందరొకో [1] దరిద్రదుఃఖము లెసఁగి యలమటించేటివారు
యెందరొకో బంధనతాడనహీనదెసల [2] నుండెడివారు
యెందరొకో దాసదాస్యవిధి నెడయరాక చెలు [3] లయినవారు ॥ఇంద॥

యెందరొకో మరణదెసలచే నిల సంయోగవియోగదుఃఖితులు
యెందరొకో జన్మరోగముల నెక్కుడభయమందేటివారు
యెందరొకో రాజులచోరులహింసలకు లోన [4] యినవారు
యెందరొకో పొందమినజీవుల కెక్కడ నెక్కడ నేపాటో ॥ఇంద॥

యెందరొకో యీదుఃఖనివృత్తికి యెడసి మిమ్ముఁ గొలిచినవారు
యెందరొకో సంపదలకు లోనై [5] యేతాయాతనఁ బడువారు
యెందరొకో శ్రీవేంకటేశ యిపు డెక్కువ నీశరణము చొచ్చి
యిందును నందును సుఖులై లోకుల [6] నిందరిఁ జూచుచు
నవ్వేడివారు ॥ఇంద॥ 138

గుండక్రియ

నిన్నూ నన్నూ నెంచుకోనినేరమిగాక
పన్నినసూర్యునికాంతి ప్రతిసూర్యుఁడౌనా ॥పల్లవి॥

జలధిలోపలిమీను జలధి దా నౌనా
జలములాధారమైనజంతువుగాక
నెలవై నీలోనివాఁడ నీవే నే నౌదునా
పొలసి [7] నీయ్యాధరువుబొమ్మ నింతేకాక ॥నిన్నూ॥

---

1. 'ఇది భావప్రధాననిర్దేశము' కావచ్చు. 2. హీనదెసలు' వంటి చిల్లర సామాసికదోషములు ఈ వాఙ్మయమున లెక్కకు రావు. 3. 'లయ్యిన' రేకు.
4. 'వయ్యిన' రేకు. 5. 'యాతాయాతములఁ' కావచ్చు. 6. 'నిందరుఁ' పూ.ము.పా. రేకు. 7. 'నీ+అధరువు' ఇదియొక విలక్షణసంధి.

రాజువద్దనున్నబంటు రాజే తా నౌనా
రాజసపుచనవరిరచనే కాక
సాజమై నిన్నుఁ గొలిచి సరిగద్దె నుందునా
వోజతో నిన్ను సేవించి వుందు వింతే కాక ॥ విన్నా ॥

ముత్తెపుఁజిప్పలనీరు మున్నీటివలె నుందునా
ముత్తెములై బలిసి లో మొనపుఁగాక
నిత్తెపుశ్రీవేంకటేశ నీశరణాగతులము
మొత్తపులోకులమా ముక్తులముగాక ॥ విన్నా ॥ 139

మాళవి

ఇందుకుఁ జింతించనేల యీశ్వరునిమాయ లివి
యెందుకు మూలము హరి యీతనిఁ జింతించరే ॥ పల్లవి ॥

౧అల నారికడపుఁగాయకు నీరు వచ్చినయట్టు
తలఁచి రాఁగలమేలు తన్నుఁ దానే వచ్చురే
లలి నేనుగుదిన్న వెలఁగపంటిబేసము-
వలెనే పోఁగలవెల్ల వడిఁ దానే పోవురే ॥ ఇందు ॥

నిండినయుద్దములోన నీడ వాడచూపినట్టు
దండియైనపుట్టుగులు తన్నుఁ దానే వచ్చురే
పండినపండ్లు తొడమఁబాసి వూడినయట్టు
అండనే మరణములు అందరికి సరిరే ॥ ఇందు ॥

పెనురాతిపైఁ గడవ పెట్టఁగాఁ గుదురైనట్టు
తనుఁదానే చింతింపఁ దలఁపు నిలుచురే
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గని శరణన్నఁ జాలు
వెనక పాపాలు మంచు విచ్చినట్టు విచ్చురే ॥ ఇందు ॥ 140

౧. 'అల' పూ.ము.పా. యతిభంగము.

పాడి

చూచేచూపొకటి సూటిగుఱి యొకటి
తాచి రెండు నొకటైతే దైవమే సుండీ ॥ పల్లవి ॥

యేనుగఁ దలఁచితే యేనుగై పొడచూపు
మాను దలఁచిన నట్టే మానై పొడచూపు
పూని పెద్దకొండ దలపోయఁ గొండై పొడచూపు
తానే మనోగోచరుఁడు దైవమే సుండీ ॥ చూచే ॥

బట్టబయలు దలఁచ బయలై పొడచూపు
అట్టె యంబుధి దలఁచ నంబుధియై పొడచూపు
పట్టణము దలఁచిన పట్టణమై పొడచూపు
తట్టి మనోగోచరుఁడు దైవమే సుండీ ॥ చూచే ॥

శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతిఁ దలఁచితేను
శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతై పొడచూపు
భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ
తావు మనోగోచరుఁడు దైవమే సుండీ ॥ చూచే ॥ 141

రేకు 135 శ్రీరాగం

బిరుదులన్నియు నీవే బిరుదులోకములెల్ల
అరయ నీపాదమందె అణఁగుండెఁగాన ॥ పల్లవి ॥

బహుదేవతాసార్వభౌమబిరుదు నీకే
సహజము నీవు భూపతిపతివిగాన
వహి దేవతాచక్రవర్తిబిరుదు నీకే
విహితము చక్రముచే వెలసేవుగాన ॥ బిరు ॥

పెనుదేవశిఖామణిబిరుదు నీకే చెల్లు
ఘనకౌస్తుభమణిగలవాఁడవుగాన
మును దేవదేవోత్తముఁడనుబిరుదు నీకే
౧ననిచెఁ బురషోత్తమనాముఁడవుగాన ॥ బిరు ॥

వొట్టుకొని దేవరాహుత్తరాయబిరుదు నీదే
కిట్టి రాతిగుఱ్ఱము నెక్కితివిగాన
తిట్టమై శ్రీవేంకటేశ దేవ సింహాసనపునీవె
అట్టె నారసింహుఁడవై అమరితిగాన ॥ బిరు ॥ 142

లలిత

ఎందు నీకుఁ బ్రియమో యీతెప్పతిరుణాళ్ళు
దిందుపడె సిరులతో తెప్పతిరుణాళ్ళు ॥ పల్లవి ॥

పాలజలనిధిలోఁ బవ్వళించే పాముతెప్పఁ
దేలుచున్న దది తెప్పతిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకు మీఁద
తేలుచున్న దది తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

అమృతము దచ్చునాఁడు అంబుధిలో మంధరము
తెమలఁ దేలించుతెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగునంగపుపడిగెమీఁద
తిమిరి తొక్కినతెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

అప్పుడు పదారువేలు అంగనలచెమటల-
తెప్పలఁ దేలినతెప్పతిరుణాళ్ళు
వొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతిఁ గోనేటిలోన
తెప్పిరిల్లె ౨ నేఁటనేఁట తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥ 143

౧. 'పనిచేపురుషోత్తమ' కావచ్చు. ౨. ఏఁటన్+ఏఁటన్.

లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగిన దిది మాకాఁపురము ॥పల్లవి॥

నరహరికీర్తన నానినజిహ్వ
వొరుల నుతింపఁగనోపదు జిహ్వ
మురహరుపదముల మొక్కినశిరము
పరులవందనకుఁ బరగదు శిరము ॥తల॥

శ్రీపతినే పూజించినకరములు
చోఁపి యాచనకుఁ జొరవు కరములు
యేపున హరికథ కేఁగినకాళ్ళు
పాపులయిండ్లకుఁ బారవు కాళ్ళు ॥తల॥

శ్రీవేంకటపతిఁ జింతించుమనసు
దావతి వితరముఁ దలఁచదు మనసు
దేవుఁ డతనియాధీనపుతనువు
తేవల వితరాధీనముగాదు ॥తల॥ 144

రామక్రియ

ఏల మమ్ము గాపిసేసే రింకా మీరు
కాలముతో విలిచెను కైవల్యపదవి ॥పల్లవి॥

పాపములు హరినామపఠనచేఁ బాపుకొంటి
కైపుగఁ జిత్రగుప్తుఁ డాకవిలె గట్టు
కోపులఁ బుణ్యములెల్ల గోవిందుని కిచ్చితిమి
పూఁపలస్వర్గముత్రోవ భుజవేయరో ॥ఏల॥

ఆతుమలో నజ్ఞాన మాచార్యుఁడే పాపె
ఆతల జన్మాలవాకి లటు ముయ్యరో
చేత హరిదాస్యమున జీవన్ముక్తుఁడనైతి
జాతియధర్మములాల సంబంధము విడరో ॥ఏల॥

పరమాత్మచింతచేత బదుకు నిశ్చయమాయ
ధరఁ గైవసము గావో తగుచి త్తమా
యిరవైనశ్రీవేంకటేశుఁ డేలుకొనె మమ్ము
పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు ॥ఏల॥ 145

భైరవి

మఱి యెందూ గతిలేదు మనుప నీవే దిక్కు
జఱసి లక్ష్మీశ నీశరణమే దిక్కు ॥పల్లవి॥

భవసాగరంబులోఁబడి మునిఁగిననాకు
తివిరి నీనామమనుతేపయే దిక్కు
చివికి కర్మంబనెడిచిచ్చు చొచ్చిననాకు
జవళి నాచార్యు¹కృపజలధియే దిక్కు ॥మఱి॥

ఘనమోహపాశములగాలిఁ బొయ్యేదినాకు
కొనల నీ పాదచింతకొమ్మయే దిక్కు
కనలి మనసనెడియాకాసముననున్ననాకు
కనుఁగొనఁగ నీదాస్యగరుడఁడే దిక్కు ॥మఱి॥

మరిగి సంసారమనెడిమంటికిందటినాకు
ధర భక్తియనుబిలద్వారమే దిక్కు
యిరవైనశ్రీవేంకటేశ యిన్నిటా నాకు-
నరుదైన నీవంతరాత్మవే దిక్కు ॥మఱి॥ 146

---

౧. 'కృపా' కావచ్చు. లేక తత్పురుషసమాసమైన [illegible] కావచ్చు. 'పాదమనెడి చింతకొమ్మ' లేక 'పాదచింత అనెడి కొమ్మ' చిల్లరవమాన దోషము లెక్కలేదు. ఈ వాఙ్మయమున 'చింతకొమ్మ' యనుమాట వాడుకలోనున్నట్లు తోచదు. చింతకొమ్మ గాలంగట్టిదిగదా. మోక్షమునకు హరిపాదములంత గట్టివి.

రామక్రియ

శ్రీపతి నీయాజ్ఞ సేసెద మిదివో
పూఁపలమాయలఁ బొరలఁగనేలా ॥పల్లవి॥

కాయము సుఖదుఃఖములకు మూలము
పాయము యింద్రియపరవశము
ఆయము రెంటికి నన్నపానములు
మోయనిమోఁపిది మునుఁగఁగనేలా ॥శ్రీప॥

తలఁపు పుణ్యపాతకములమూలము
కలిగినపుట్టువు కర్మగతి
ఫల మిది రెంటికి బలుసంసారము
కలిగిన వెట్టికి కాదన నేలా ॥శ్రీప॥

జీవుఁ డింతటా [1] సృష్టికి మూలము
భావముఁ బ్రకృతికిఁ బ్రపంచము
చేవగ రెంటికి శ్రీవేంకటేశ్వర
నీ వంతరాత్మవు నెమకఁగ నేలా ॥శ్రీప॥ 147

రేకు 136 ధన్నాసి

జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము
నానార్థములు విన్నే నడపె మాగురుఁడు ॥పల్లవి॥

అలరి దేహమనేటియాగశాలలోన
బలుపై యజ్ఞానపుపశువు బంధించి
కలసి వైరాగ్యపుకత్తుఁ గోసి కోసి
వెలయు జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు ॥జ్ఞాన॥

---

1. 'శ్రష్టికి' రేకు.

మొక్కుచు ౧వైష్ణవులనేమువిసథ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థసోమపానము వించి
చక్కఁగా సంకీర్తనసామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెఁటో మాగురుఁడు ॥జ్ఞాన॥

౨తదియ్యగురుప్రసాదపుపురోడాశ మిచ్చి
కొద దీర ద్వయమనుకుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షము చేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుఁడు ॥జ్ఞాన॥ 148

శ్రీరాగం

లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ
యేవేళ నీవినోదాన కేదాయ నేమి ॥పల్లవి॥

పాలజలధివంటిది పవ్వళించు నామనసు
గాలిపూర్వులే కడళ్లు కలదు లోఁతు
చాలఁగఁ దొల్లి నీవు సముద్రశాయివట
యీలీల నీవినోదాన కేదాయ నేమి ॥లావ॥

వెక్కుపుభూమివంటిది నెలవుకో నామనసు
పెక్కులివ్నియుఁ గలవు పెరుగుచుఁడు
పుక్కటఁ దొల్లియు నీవు భూసతిమగఁడవట
యెక్కువ నీవినోదాన కేదాయ నేమి ॥లావ॥

నిండుఁగొండవంటి దిదె నిలుచుండు నాభక్తి
౩వుండుచోటనేవుండు నొక్కచోటను
కొండలరాయఁడవట కోరికె శ్రీవేంకటేశ
అండ నీవినోదానకేది యాయ నేమి ॥లావ॥ 149

౧. వైష్ణవుల నేము నీనథ పూ.ము.పా
౨. 'తదీయ' కావచ్చు. ౩. 'వుండ' పూ.ము.పా; రేకు.

రామక్రియ

మెచ్చు: మెచ్చకుంటే మాను; మించి నే నాడకమాన
అచ్చపుసీసూత్రధారి నవధారు దేవ ॥ పల్లవి ॥

వొక్కఁడ నే జీవుఁడను వోహో హరీ
పెక్కుబహురూపాలే పెంచి యాడితి
తక్కినయింద్రియములే తగుమేళము
అక్కజపువిద్యవాఁడ నవధారు దేవ ॥ మెచ్చు ॥

సూటి నించుకంతవాఁడఁ జూడవే హరీ
వీటిసంసారపుబారి విద్య లాడితి
పాటినాకర్మమే క్రియాభాషాంగము
ఆటవాఁడ నింతె నేను అవధారు దేవ ॥ మెచ్చు ॥

చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేఁడు
మేరతో [౧] శక్తైనేమోకుమీఁద నాడేను
యీరానిపదవులు యిచ్చితి నాకు
ఆరితేరి గెలిచితి నవధారు దేవ ॥ మెచ్చు ॥ 150

శ్రీరాగం

[౨] దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే ॥ పల్లవి ॥

అనంతగరుడముఖ్యులైనసూరిజనులతో
ఘననారదాదిభాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే ॥ దివ ॥

౧. 'శక్తనే' వ్రా.ము.పా. 'శక్తి+అనే; ఈ వ్యావహారిక సంధులు ఈ వాఙ్మయమున కొల్లలు.

౨. ఈపాట అన్నమయ్య శ్రాద్ధ దినమును గూర్చి వ్రాసినది గాన, అన్నమయ్య రచన కాదు. అన్నమయ్యకీర్తనలరేకులలో ఇది పొరపాటున చేరియుండవచ్చు.

వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి
లోకపవిత్రముక్తులలోన నుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుఁ గూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే ॥ దిన ॥

సంకీర్తనముతోడ సనకాదులెల్లఁ బాడ
పొంకపు శ్రీవేంకటాద్రిభూమి నుండి
లంకె శ్రీవేంకటగిరిలక్ష్మివిభుఁడు నీవు-
నంకెల మాయింటివిందు లారగించవే ॥ దిన ॥ 151

మాళవి

గుఱ్ఱాలఁ గట్టివితేరు కొంక కెందైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ [1]దీసీని వేడుకతో జీవుఁడు ॥ పల్లవి ॥

నరి పిఱుఁదే రెండుజంటబండికండ్లు
సరవితోఁ బాదాలు చాఁపునొగలు
గరిమఁ జూపులు రెండు గట్టినపగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలుచెక్కలు
మించైనశిరసే మీఁదనున్నశిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పాపపుణ్యములు రెండు పక్కనున్నచీలలు
తోపులయన్నపానాలు దొబ్బుఁడెద్దు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీధుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥ 152

౧. తీసీని— (ప్రకరణమునో) నరుగుల పెట్టించిని కావచ్చు.

సాళంగం

ఉన్నమంత్రా లిందుసరా వొగి విచారించుకొంటే
విన్నకన్నవారికెల్ల విష్ణునామమంత్రము ॥ పల్లవి ॥

పరగఁ బుచ్చకాయలఁ బరసిపోదు మంత్రము
గరిమ ముట్టంటులేనిఘనమంత్రము
వరుస నెవ్వరువిన్నా వాఁడిచెడనిమంత్రము
అరయ నిదొక్కటేపో హరినామమంత్రము ॥ ఉన్న ॥

యేజాతినోరికైన నెంగిలిలేనిమంత్రము
వోజదప్పితేఁ ౧ జెడకవుండేమంత్రము
తేజాన నొకరికి తిత్తేఁ దీరిపోనిమంత్రము
సాజమైన దిదేపో సత్యమైనమంత్రము ॥ఉన్న ॥

యిహముఁ బరముఁ దానే యియ్యఁజాలినమంత్రము
సహజమై వేదాలసారమంత్రము
బహునారదాదులెల్ల పాటవాడినమంత్రము
విహితమయినశ్రీ వేంకటేశుమంత్రము ॥ ఉన్న ॥ 153

రేకు137 సాళంగనాట

అనుచు దేవగంధర్వాదులు పలికేరు
కనకకశిపు నీవు ఖండించేవేళను ॥ పల్లవి ॥

నరసింహా నరసింహా వసుఁగావు వసుఁగావు
హరి హరి నాకు నాకు నభయమీవే
కరిరక్ష కరిరక్ష గతమైరి దనుజులు
సురనాథ సురనాథ చూడు మమ్ముఁ గృపను ॥ అను ॥

---

౧. 'జడక' రేకు.

దేవదేవ వాసుదేవ దిక్కు నీవే మాకు మాకు
శ్రీవత్స శ్రీవత్స సేవకులము
భూవనితనాథ నాథ పొడమె నీప్రతాపము
పావన పావన మమ్ముఁ బాలించవే ॥ అను ॥

జయజయ గోవింద శరణుచొచ్చేము నీకు
భయహర భయహర పాప మడఁగె
దయతో శ్రీవేంకటేశ తగిలి కాచితి మమ్ము
దయఁజూడు దయఁజూడు దాసులము నేము ॥ అను ॥ 154

లలిత

కటకటా కర్మమా కాలములో మర్మమా
మటమాయైపోతివంటా మది నమ్మివుంటిఁగా ॥ పల్లవి ॥

పాపబుద్ధి యేదనుండె పాయము రానినాఁడు
కోప మేద నుండె గర్భగోళమున నున్ననాఁడు
దీపన మేద నుండె దేహధారి గానినాఁడు
యేపున భూమిఁ బుట్టితే నేడనుండి వచ్చెనో ॥ కట ॥

నగుసంసార మెందుండె నరకాననుండునాఁడు
తగిలి మరణదెస ధనవాంఛ లెందుండె
వాగి లోభ మేద నుండె వొంటి నున్ననాఁడు
వెగ్గళై నేఁడెట్టు నన్ను వెదకి పైకొనెనో ॥ కట ॥

బహుబంధా లేద నుండె ప్రళయకాలమునాఁడు
మహిఁ గోరికె లెందుండె మతి మఱచిననాఁడు
యిహమున శ్రీవేంకటేశు శరణంటి నేఁడు
విహితమై మాకు నెట్టు వెఱచెనో తాము ॥ కట ॥ 155

## సామంతం

౧ హరి నీప్రతాపమున కద్దుమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా ॥ పల్లవి ॥

నీవు నీళ్ళు నములితే నిండెను వేదములు
యీవలఁ దలెత్తితేనే యింద్రపదవులు మించె
మోవ మూఁతి గిరిపితే మూఁడులోకాలు నిలిచె
మోవిఁబార నవ్వితేనే మునిఁగి రసురలు ॥ హరి ॥

గోర గీరితే నీరై కొండలెల్లఁ దెగఁబారె
మారుకొంటే బయిటనే మడుఁగులై నిలిచె
చేరి యడుగుపెట్టితే శిలకుఁ బ్రాణము వచ్చె
కూరిమిఁ గావలెనంటే కొండ గొడగాయను ॥ హరి ॥

కొంగుజారినంతలోనే కూలెను త్రిపురములు
కంగి గమనించితేనే కలిదోషములు మానె
రంగుగ నీశరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే ॥ హరి ॥ 156

## దేసాక్షి

మాపులే మరణములు రేపులే పుట్టువులు
చాపలాలు మాని విష్ణు శరణను మనసా ॥ పల్లవి ॥

చాలునంటే ఇంచుకంతే చాలును జన్మమునకు
చాలకున్న లోకమెల్లఁ జాలదు
పీలినయీయాసా ౨వెట్టివానిచేతిరాయి
చాలఁ నింక హరి నిట్టె శరణను జీవుఁడా ॥ మాపు ॥

౧. ఇందు దశావతార సమన్వయము కలదు. ౨. 'వెట్టి' పూ.ము.పా.

పాఱకున్న [1]పశుబాలై బడలదు మనసు
పాఱితే జవ్వనమునఁ బట్టరాదు
మీఱిన నీరుకొద్దిదా మేర యింతె యెంచి చూడ
జాఱవిడిచి దేవుని శరణము జీవుఁడా ॥ మాపు ॥

సేయకున్నఁ గర్మము శ్రీపతిసేవనే వుండు
సేయఁబోతేఁ గాలమెల్లా [2]సేనాసేన
వోయయ్య యిది యెల్లా [3]వుమినాఁకే చవులు
చాయల శ్రీవేంకటేశు శరణను జీవుఁడా ॥ మాపు ॥ 157

ధన్నాసి

దైవమా నీవే మమ్ము దయదలఁచుటగాక
చేవల నీసేఁతలెల్ల చెల్లును లోకానను ॥ పల్లవి ॥

తీపునంటేవేళ నట్టె తేటఁబులు సింపేను
పైపైఁ బుణ్యమయితేఁ బాప మింపేను
వోపి జంతువుల కివి వొకటొకటికి లంకె
చేపట్టి పాపము లెట్టు సేయకుండవచ్చును ॥ దైవ ॥

కదుఁజలువై తేను గక్కన వేఁడింపేను
చెడనివిరతివేళ సిరు లింపేను
వొడలుమోచినవారి కొకటొకటికి లంకె
తొడరుభోగాలు మాని తోయ నెట్టువచ్చును ॥ దైవ ॥

యివియు నీమాయే యిన్నియు నీయాజ్ఞలే
జవళిఁ బ్రాణులకెల్ల సమ్మతైనవి
యివల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
తవిలి నీవే గతి దాఁగ నెట్టువచ్చును ॥ దైవ ॥ 158

---

౧. 'పసుబాలై' పూ.ము.పా. 'పసిబాల' కావచ్చు.
౨. 'శేనాశాన' రేకు. ౩. 'ఉమ్మి నాకి చవి చూచుటలు' కావచ్చునా?

శంకరాభరణం

వట్టిలంపటాలఁ బడి వడఁ బొరలుటకంటే
వొట్టినవిరతి నూరకుండుటే సుఖము ॥పల్లవి॥

పాపముమానినయట్టిబదుకొక్కటె సుఖము
కోపమువిడిచినట్టిగుణమొక్కటే సుఖము
చేపట్టి గురుబుద్ధి సేసేటిదే సుఖము తీ-
దీపులఁబడనియట్టి ౧దినమే సుఖము ॥వట్టి॥

మహిఁ జంచలములేనిమనసొక్కటే సుఖము
సహజాచారముతోడి జన్మమొక్కటే సుఖము
యిహపరసాధనపుయెన్నికొక్కటే సుఖము
బహుళపుటాసకంటె పరిపాటి సుఖము ॥వట్టి॥

పరులఁ బీడించితేనిపసిఁ డొక్కటే సుఖము
గరిమ నిజముతోడఁగలమాటలే సుఖము
ధరలో శ్రీవేంకటేశుదాసానుదాసుఁడయి
సరవితో నశచేటిశాంతమే సుఖము ॥వట్టి॥ 159

రేకు 138 దేసాళం

వారిదేపో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి
భారతరామాయణాలై పరగె నీకథలు ॥పల్లవి॥

భువిమీఁద రావణుఁడు పుట్టఁగాఁగా రాముఁడవై
తవిలి యిందరికిఁ బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాఁడు వెలసితేఁగా నీవు
అవతార మందితే విన్నందరునుఁ జూతురు ॥వారి॥

---

౧. 'దీనమే' పూ.ము.పా.

రమణఁ గంసాదియసురలు లూటి సేయఁగాఁగా
తమిఁ గృష్ణావతార మిందరి కై తివి
గములై యంతటివారు గలిగితేఁగా నీవు నేఁడు
అమర జనించి మాటలాడుదు విందరితో ॥ వారి ॥

యెంత వుపకారియో హిరణ్యకశిపుఁడు
చెంత నరసింహుఁడ నీసేవ యిచ్చెను
యింతట శ్రీవేంకటేశ యిన్నిరూపులును నీవే
పంతాన నీశరణని బ్రదికితి మిదివో ॥ వారి ॥ 160

సామంతం

ఊరకై తే నిన్నుఁ గాన మొకకారణానఁ గాని
పూరిజీవులము, నీవు పురుషోత్తముఁడవు ॥ పల్లవి ॥

అసురలు భువిఁ బుట్టుటది వుపకారమే
అసురలు బాధింతు రమరులను
వొసఁగ వారికిఁగాను వూనుకవచ్చి నీవు
వసుధ జనించితేను వడి నిన్నుఁ గందుము ॥ ఊర ॥

అడరి ధర్మము చెడి యధర్మమైనా మేలు
వెడఁగుమునులు విన్నవింతురు నీకు
తడవి ధర్మము నిల్పఁ ధరణిఁ బుట్టుదు నీవు
బడి నిన్ను సేవించి బ్రదుకుదు మపుడే ॥ ఊర ॥

నీకంటే మాకుఁ జూడ నీదాసులే మేలు
పైకొని వారున్నచోటఁ బాయకుందువు
చేకొని శ్రీవేంకటేశ చెప్పఁగానే వారిచేత
నీకథలు విని విని నే మీడేరితిమి ॥ ఊర ॥ 161

సాళంగనాట

పేరు నారాయణుఁడవు బెంబాడిచేఁతలు నీవి
నోరు మూసుకున్నఁ బోదు మన్ననీసుద్దులు ॥పల్లవి॥

౧ వేసులు మాకుఁ జెప్పె విన భారతముగాఁగ
మోస నీపాలముచ్చిమి మొదలుగాను
రాసికెక్క శుకుఁడు రవ్వగాఁ బొగడఁజొచ్చె
ఆసలఁ బరకాంతల నంటిననీసుద్దులు ॥పేరు॥

రంతున వాల్మీకి చెప్పె రామాయణముగాను
సంతగాఁ దాటకాదులఁ జంపినదెల్లా
అంతకముందె నారదుఁ డవి దండెమీటి చెప్పె
యింతటా వేఁటాడి జీవహింసలు నేసినది ॥పేరు॥

వెడుక నజుఁడు చెప్పె వేదముగా నీవు దొల్లి
వోడక మీనై కొన్నాళ్ళుండితివంటా
తోడనే సప్తఋషులు తొల్లియునఁ జెప్పి రదె
యీడనే శ్రీవేంకటాద్రి విరవైతి వనుచు ॥పేరు॥ 162

గుండక్రియ

దేహ మిది యొకటే దేవుఁడ నీవొకఁడవే
యీహల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥పల్లవి॥

రాతి రొక్కలోకము రవ్వపడెఁ గలలోన
ఘాతలఁ బగలొక్కలోకము వేగితే
యీతల రెప్పలే మరఁ గిందుకు నందుకుఁ జూడ
యేతుల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥దేహ॥

---

౧. 'వ్యాసులకు' వ్యావహారికము గావచ్చు.

సతిగాఁగి లోకచే జవ్వనపుఁగాఁక రేఁచు
సుతగాఁగి లోకవేశసుఖమై తోఁచు
మతిలోపమఱఁగింతే మాయవాతో యిద్దరును
ఇతవై రెంట దెప్పర మిదివో మాబదుకు ॥ దేహ ॥

దైవమా నిన్నాత్మలోఁ దలఁచి యానందింతు
పూవుల నిన్నుఁ బూజింతు పొంచి[౧] వెలిని
శ్రీవేంకటేశ నీసేవలో నిమఱఁగింతే
యీవల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥ దేహ ॥ 163

## రామక్రియ

చాటెద నిదియే సత్యము సుండో
చేటు లేదీతని సేవించినను ॥ పల్లవి ॥

హరినొల్లనివా రసురలు సుండో
సుర లీతనిదాసులు సుండో
పరమాత్ముఁ డితఁడె ప్రాణము సుండో
మరుగక మఱచిన మఱి లేదీఁకను ॥ చాటె ॥

వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో
సోదించె శుకుఁ డచ్చుగ సుండో
ఆదిబ్రహ్మగన్నాతఁడు సుండో
యేదెస వెదకిన నితఁడే ఘనుఁడు ॥ చాటె ॥

యిహపర మొసఁగను యీతఁడె సుండో
వహి నుతించెఁ బార్వతి సుండో
రహస్య మిదివో రహి శ్రీవేంకట-
మహీధరంబున మనికై నిలిచె ॥ చాటె ॥ 164

---

౧. 'వెంచి' మూ.ము.పా.

కేదారగౌళ

మీరు సాక్షి మీరు సాక్షి మే మేమీ ననలేము
చేరి చూడరమ్మ వీని చెల్లుబడి యమ్మా ॥ పల్లవి ॥

పిన్నవాఁడు నిద్ర వోఁగ పెనది కూఁకటతోడ
పన్ని లేఁగతోఁకఁ గూడ బంధించి కట్టె
వున్నతిఁ దొలఁగ వాని వొళ్లెల్లా దోఁగిపోయ
కన్నెలార యీకృష్ణుఁ గంటిరటరమ్మా ॥ మీరు ॥

లేఁగల నన్నిటి నేపు లేవక తొల్లి పిడిచె
మూఁగి అవులఁ బేయలు మొగిఁ గలయ
ఆఁగి పట్టఁ బోతేను అప్పుడే తా గదె వెట్టి
రాఁగతనాన నున్నాఁడు రాచబలుపమ్మా ॥ మీరు ॥

వారము నేసేమనుచు వది నింటివారమెల్లా
కూరలు ౧పాళాలు దొంతిఁ గూడఁ బెట్టితే
ఆరగించ వేలుపుల అలికి పూసి కుడిపీ
కూరిమి శ్రీవేంకటాద్రి గోవిందుఁడమ్మా ॥ మీరు ॥ 166

రేకు 139 భూపాళం

ఇదివో మాయింట నేఁడు యింత సేసెఁ గృష్ణుఁడు
అదివో మాయింటామ యింత సేసెఁ గృష్ణుఁడు ॥ పల్లవి ॥

గంట వాఁగకుండా నిండఁ గసవు దురిగి మా-
యింటివారు నిద్దిరించ నిల్లుచొచ్చెను
అంటివచ్చి వొకదూడ అపూరి మేసితేను
గంట గణగణ వాఁగెఁ గక్కున మేల్కంటిమి ॥ ఇది ॥

౧. పాళాలు = పాయసములు కావచ్చు.

వొక్కరోలు దాపు వెట్టి వుట్టియెక్కి అందుమీఁది -
చక్కెరల్లా మెసఁగి మాచంటివానిని
వుక్కఁబట్టి వుట్టిమీఁద నునిచి రోలు దీసె
చొక్కి తా నెందున్నాఁడో చొప్పు ఇదే కంటిమి ॥ ఇది ॥

ఆవుల వెళ్లవిడిచె నని నేఁ ౧దోలి తేఁబోతే
నివల దూడలఁ దెచ్చి యింటిలోఁ గట్టె
దావతి నింతా వెదకి తలుపు దెరచితేను
శ్రీవేంకటేశునిమాయఁ ౨జిక్కి లోన నున్నవి ॥ ఇది ॥ 166

దేసాక్షి

అనరాదు వినరాదు ఆతనిమాయలు నేఁడు
౩దినదినక్రొత్తలాయ ద్రిష్ట మిదే మాకు ॥ పల్లవి ॥

అద్దెడిబాలుల హరి అంగిలిచూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁగాను యిందరముఁ గూడి పోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయనమ్మా ॥ అన ॥

తీఁటతీగెలు సొమ్మంటా దేహము నిండాఁ గట్టె
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేము
కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా ॥ అన ॥

కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
ఆకడ శ్రీవేంకటేశుఁ డాబాలుల కంటినీరు
జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము ॥ అన ॥ 167

---

౧. 'దోలితేఁ బోతే' పూ.ము.పా. ౨. 'జొక్కి' పూ.ము.పా. యతిభంగము. ౩. 'దినదినక్రొత్తలు' వంటి చిల్లర సామాసిక దోషములు మావ్యావహారికవాఙ్మయము-నకు అలంకారములు.

## దేసాక్షి

నిజముదెలియనిది మా నేరమే కాక
    భజన నీవు చేపట్టినందుకుఁ గడమా     ॥ పల్లవి ॥

అంచలఁ బరుసము లోహపుఁగాళికలనెల్ల
    మెంచీనా పసిఁడి గావించుఁగాక
    వించిననిన్నాతుమఁ జింతించువారిపాతకాలు
    మించనిచ్చేనా మేతే మెరయింతుగాక     ॥ నిజ ॥

నలుపంకరవికిరణాలు మేలుగీడని
    తలఁగీనా యిన్నిటిలోఁ దానేకాక
    యిల నీదాసుఁడు జాతి నెవ్వఁడైనా నీకృపఁ
    జెలఁగి పావనుఁ జేసి ౧చేకొనుఁగాక     ॥ నిజ ॥

పూని దిక్కులగాలి పొందుగ ౨నీడాడని
    మానీనా దోశ మెల్లా మలయుఁగాక
    మానక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే-
    దేసెలవైనా నీకిరవే కాదా     ॥ నిజ ॥ 168

## భైరవి

నీవు జగన్నాథుఁడవు నే నొకజీవుఁడ నింతే
    నీవలె ననుభవించ నే నెంతవాఁడను     ॥ పల్లవి ॥

వైకుంఠపదమేడ వడిఁ గోర నెంతవాఁడ
    యీకడ నీదాసుఁడనౌ టిది చాలదా
    చేకొని నీసాకారచింత యేడ నేనేడ
    పైకొని నీడాగు మోచి బ్రదికితిఁ జాలదా     ॥ నీవు ॥

౧. 'చేకొందుగాక' కావచ్చు.     ౨. ఈడన్+ఆడన్+అవి.

సొంపుల నీయానందసుఖ మేడ నే నేడ
పంపుశ్రీవైష్ణవపల్లాపన చాలదా
వింపుల విజ్ఞాన మేడ నేఁ దెలియ నెంతవాఁడ
యింపుగా నీకథ విను టిదియే చాలదా ॥ నీవు ॥

కైవల్యమందు నీతో కాణాచి యాడ నాకు
శ్రీవేంకటాద్రిమీఁదిసేవ చాలదా
యీవల శ్రీవేంకటేశ నీ విచ్చినవిజ్ఞానమున
భావించి నిన్నుఁ బొగడేభాగ్యమే చాలదా ॥ నీవు ॥ 169

మలహరి

అన్నిటాను హరిదాసు లధికులు
కన్నులవంటివారు కమలజాదులకు ॥ పల్లవి ॥

అందరును సమమైతే నరుహానరుహము లేదా
అందరిలో హరియైతే నౌఁగాక
పొందితో విప్రునిఁ దెచ్చి పూజించినట్టు వేరే
పొందుగా నితునకముఁ బూజించఁదగునా ॥ అన్ని ॥

అన్నిమతములు సరియైతేను వాసి లేదా
చెన్నగుఁ బురాణాలు చెప్పేఁగాక
యెన్నఁగ సొర్ణాటంక మింతటానుఁ జెల్లినట్లు
సన్నపుఁదోలు[౧] బిళ్లలు సరిగఁ జెల్లునా ॥ అన్ని ॥

గక్కనఁ బైరువిత్తఁగా గాదము మొలచినట్టు
చిక్కినకర్మములెల్లాఁ జెలఁగేఁ గాక
తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్టు
యెక్కడా మోక్షోపాయ మీకఁ జెప్ప నున్నదా ॥ అన్ని ॥ 170

౧. 'బిళ్లలు' రేకు.

### ముఖారి

ఇదియే బుద్ధి నాకు నింతకంటే మఱి లేదు
కదిసి నీబంటనంటే కాతువు నన్నును ॥ పల్లవి ॥

నేరిచి నడచేనంటే నేఁ గాను స్వతంత్రుఁడను
నేరమి చేసేనంటే నిందును దూరు
యీరెంటికిఁ గాక నేను యిట్టె నీకు శరణంటే
గారవించి వహించుక కాతువు నన్నును ॥ ఇది ॥

వాక్కుచే నర్థ మర్జించుకుండితే జన్మాలు పెక్కు
యెక్కేనంటే మోక్షము యేదో యెఱఁగ
యెక్కడిసుద్దులునేల యిచ్చట నీనామము
గక్కనఁ బేర్కొంటేఁ దయఁ గాతువుగా నన్నును ॥ ఇది ॥

తపసినయ్యేనంటేఁ జిత్తము కైవశము గాదు
చపలసంసారి నైతే శాంతి యుండదు
ఉపమలేల శ్రీవేంకటోత్తమ నీసేవ చేసి
కపటము మానితేను కాతువు నన్నును ॥ ఇది ॥ 171

రేకు 140

### శంకరాభరణం

ఆహా యేమిచెప్పేది హరి నీమాయ
మోహములే చిగిరించీ మొదల జవ్వనము ॥ పల్లవి ॥

యెంచఁగ భూమి యొక్కటే యేలినరాజు లెందరో
పొంచి వారివెంటవెంటఁ బోవదాయను
అంచలసూర్యచంద్రులనే [1] గడెకుడుకల
ముంచి కొలచి పోసీని మునుకొని కాలము ॥ ఆహా ॥

---

౧. 'గడెకుడుకల' కాలమును కొలిచెడి కొలపాత్ర కావచ్చునేమో. అర్థమింకను విచార్యము.

దేవలోక మొక్కటే దేవేంద్రు లెందరో
కైవశమై యేలఁగ నొక్కరిదీ గాదు
అవటించి పంచభూతాలనేటిశాఖలు వెళ్లి
సావధానానఁ బెరిగి సంసారవృక్షము ॥ అహో ॥

యిచ్చట నీ వొక్కఁడవే యిటు నీదాసు లెందరో
తచ్చి యెంత సేవించినాఁ దనివిలేదు
నిచ్చలు శ్రీవేంకటేశ నిధానము నీభక్తి
యెచ్చినాఁడ వింతటా నీదేరీ జన్మము ॥ అహో ॥ 172

ముఖారి

ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను
వారివారిపాలికి వరదుఁడవౌదువు ॥ పల్లవి ॥

చేరికొల్చినవారికిఁ జేపట్టుఁగుంచమవు
కోరినుతించినవారికొంగుపైఁడివి
మేరతోఁ దలఁచువారిమేటినిధానమవు
సారపువివేకులకు సచ్చిదానందుఁడవు ॥ ఏరీ ॥

కావలెననేవారికి కామధేనువవు మరి
సేవసేసేవారికి చింతామణివి
నీవే ౧గతెన్నవారికి నిఖిలరక్షకుఁడవు
వావిరి శరణువేఁడేవారిభాగ్యరాశివి ॥ ఏరీ ॥

నిన్నుఁ బూజించేవారినిజపరతత్వమవు
యిన్నిటా నీదాసులకు నేలికెవు
యెన్నఁగ శ్రీవేంకటేశ యిహపరములకును
పన్ని కాచుకున్నవారిఫలదాయకుఁడవు ॥ ఏరీ ॥ 173

౧. గతి+అన్న=గతెన్న.

వరాళి

ఇతరుల దూరనేల యెవ్వరూ నేమిసేతురు
మతి వారూఁ దమవంటిమనుజులేకాక ॥ పల్లవి ॥

చేరి మేలుసేయఁ గీడుసేయ నెవ్వరు గర్తలు
ధారుణిలో నరులకు దైవమేకాక
సారెఁ దనవెంటవెంటఁ జనుదెంచేవా రెవ్వరు
బోరునఁ జేసినపాపపుణ్యాలేకాక ॥ ఇత ॥

తొడఁగి పొగడించాను దూషించా ముఖ్యులెవ్వరు
గుడిగొన్న తనలోనిగుణాలేకాక
కడుఁగీర్తి నపకీర్తి గట్టెడివా రెవ్వరు
నడచేటితనవర్తనములేకాక ॥ ఇత ॥

ఘనబంధమోక్షాలకుఁ గారణ మిఁక నెవ్వరు
నవిచిన జ్ఞానాజ్ఞానములే కాక
తనకు శ్రీవేంకటేశుఁ దలపించేవా రెవ్వరు
కొనమొద లెఱిఁగినగురుఁడేకాక ॥ ఇత ॥ 174

దేసాళం

అక్కటా నే నిర్మలుఁడనయ్యే దిఁక నెన్నఁడో
చక్క నన్ను దిద్దుకోనే సర్వేశ్వరా ॥ పల్లవి ॥

నేనే మంచివాఁడనైతే నిందుకోదా జ్ఞానము
కానీలే యింకా నేమేమిగడమోకాక
ఆనుక సుకృతినైతే నలవడదా విరక్తి
కానరానితప్పు లెన్నిగలవోకాక ॥ అక్క ॥

నామనసే చక్కనైతే నాకుఁ బ్రత్యక్షము గావా
చేముంచి నేరమేమి సేసితినో కాక
ఆముక మోక్షాధికార నైతే నెదురుగా రాదా
కామితార్థాలు భోగించఁ గలుగఁబోలుఁగాక ॥ అక్క ॥

ఔలే నామేను పవిత్ర మైతే సేవ గొనవా
యేలాగున్నదో నీచిత్త మెఱఁగఁగాక
యీలీల శ్రీవేంకటేశ యెదుటనే వున్నాఁడవు
యేలుకొని చేపట్టి యీడేర్చవుగాక ॥ అక్క ॥ 175

## శ్రీరాగం

చొచ్చితి నీకు శరణు సుద్దు లిఁకనేఁటికి
కచ్చుపెట్టెవ్వరివల్లాఁ గలిగే దేమీ ॥ పల్లవి ॥

పుట్టక మునుపెఱఁగ పుట్టుగు మీఁదెఱఁగను
యిట్టె యెప్పటి యెఱుక యేడ కెక్కీవి
పట్టె మదనుభూతము పరసిపోయను బుద్ధి
వట్టిపెద్దతనాలను వచ్చేదేమీ ॥ చొచ్చి ॥

రానివి రప్పించఁగ నేరను వచ్చే వాఁపనేర
తానకపునాస్వతంత్ర మెందాఁకా వచ్చును
ఆనుకున్నది ముదిమి అట్టె జారె శాంతము
నే నెంత విఱ్ఱవీఁగినా నిందే దేమీ ॥ చొచ్చి ॥

యిప్పుడు నే నెవ్వఁడనో యెక్కడ నీ వున్నాఁడవో
కప్పిననావుపాయాలే కార్య మిచ్చీవి
నెప్పున శ్రీవేంకటేశ నీయెదుటఁ బడ్డపని
తప్పక యీడేర్తుగాక తలపోసేదేమీ ॥ చొచ్చి ॥ 176

కన్నడగౌళ

చేసిననావిన్నపము చిత్తానఁ బెట్టుకొమ్మీ
వేసరించి యిప్పుడే నే వేఁడుకొంటిఁజుమ్మీ ॥ పల్లవి ॥

ముందె నాపుణ్యఫలములు నీ కిచ్చితినంటి
కందువఁ గోరనవి సంకల్పించితిని
యిందు మఱచి తప్పినా యిన్ని నీకె ౧ చెలవు
సందవేసి నన్ను నీఁక నేరము లెంచకుమీ ॥ చేసి ॥

నిన్నే కాని యితరుల నేఁ గొలువనొల్ల నంటి
వున్నతిఁ బరద్రవ్యా లొల్లనంటి
అన్నిటా నేనే మఱి యప్పటిమాటే యంచు
నన్నల నన్నందుకు నొచ్చమని దూరకుమీ ॥ చేసి ॥

నానావుపాయాల నాఁడే శరణంటి
పూని నీసాకారము నేఁ బొడగంటిని
నేను మత్తుఁడనై వున్నా నీవే తలఁచి తెలుపుకో
కోనేటిశ్రీవేంకటేశ కొసరించుకోకుమీ ॥ చేసి ॥ 177

రేకు 141 శుద్ధవసంతం

దీనరక్షకుఁ డఖిలవినుతుఁడు దేవదేవుఁడు రాముఁడు
జానకీపతిఁ గొలువుఁడీ ఘనసమరవిజయుఁడు రాముఁడు ॥ పల్లవి ॥

హరునితారకబ్రహ్మమంత్రమై యమరినయర్థము రాముఁడు
సురలఁ గాచి యసురల నడఁచినసూర్యకులజుఁడు రాముఁడు
సరయువందును ముక్తిచూరలు జనుల కొసఁగెను రాముఁడు
హరియె యీతఁడు హరిఎంచుల కాదిపురుషుఁడు రాముఁడు ॥ దీన ॥

---

౧. 'శలవు' రేకు.

మునులరుషులకు నభయమొసఁగినమూలమూరితి రాముఁడు
మనసులోపలఁ బరమయోగులు మరుగుతేజము రాముఁడు
పనిచి మీఁదటిబ్రహ్మపట్టము బంటు కొసఁగెను రాముఁడు
మనుజవేషముతోడ నగజకు మంత్రమాయను రాముఁడు ॥ దీన ॥

బలిమి మించినదైవికముతో భక్తసులభుఁడు రాముఁడు
నిలిచి తనసరిలేనివేలుపు నిగమవంద్యుఁడు రాముఁడు
మెలుపు శ్రీవేంకటగిరీంద్రముమీఁది దేవుఁడు రాముఁడు
వెలసె వావిలిపాటిలోపలివీరవిజయుఁడు రాముఁడు ॥దీన॥ 178

బౌళి

తెలిసినమాటలు నీసముఖంబున దీకొని ని న్నడుగకపోదు
సులభుఁడ వన్నిట ప్రాణనాథుఁడవు చొప్పుగ నానతి యియ్యఁ
గదే ॥పల్లవి॥

నీవే బలవంతుఁడవో నీకంటేఁ గర్మము బలువో
దైవసముగ నే నెంచిచూచితే కర్మముకంటె బలువుఁడవు
భూవలయంబుల ప్రారబ్ధంబులు భోగించవలెనని యంటివా
వావిరి నిట్టై తే నీదేవత్వమునకు వెలితిగదే ॥ తెలి ॥

ఐనాఁగాని లోకములోపల నది నీ యాజ్ఞని తలఁచితిమా
నేను నీశరణు చొచ్చినమీఁదట నీవే పరిహరించఁగవలదా
కానిపించె నా కిఁక నొకబుద్ధి కర్మముపై నెప మటువేసి
పూనుచుఁ గాలక్షేపంబునకై భువిని వినోదము గాఁబోలు ॥ తెలి॥

యెందాఁకా జీవులతోడుత నీ వేలాటంబులు జరపెదవు
అందరికిని నీవే తలిదండ్రివి అయి రక్షింపుచునున్నాఁడవు
కందువ దెలిసెను శ్రీవేంకటేశ్వర కర్త వెట్టు చేసిన మేలు
చందమాయ నిది దగవౌ నీకును సంతోషించితి మిటు నేము
॥ తెలి ॥ 179

---

౧. అజ్ఞ+అని.

వరాళి

ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ
కామించి బ్రహ్మాదులనుఁ గప్పీ నీమాయ ॥ పల్లవి ॥

బచ్చెనరూపులు పెక్కు ౧పడెచ్చుల వేసినట్టు
నిచ్చలు ౨నివిఱుచున్నది నీమాయ
తచ్చి వారివారిరతి తమతమకే తెలియ
పచ్చిగా భోగింపించీ దంపతుల నీమాయ ॥ ఏమ ॥

మఱి తొలునాటిభోగాలు మరునాటికి నింతగా
నెఱవుగాఁ దమకించీ నీమాయ
విఱుగరానిదుఃఖము వెస నిద్రవోయితేనే
మఱపించి నవ్వించీ సుహాలో నీమాయ ॥ ఏమ ॥

పట్టరానిజవ్వనము పరసిపోతే ముదిమి
నెట్టుకొల్పి వుబ్బఁడచీ నీమాయ
గట్టిగా శ్రీవేంకటేశ ఘనుఁడవై ననీదాసుల
పట్టకుండాఁ జేయుము బలిసెనీమాయ ॥ ఏమ ॥ 180

నాట

ఎంత కఠినమో హృదయ మిది
చెంత ఱాతఁజేసిరి గాఁబోలు ॥ పల్లవి ॥

అమరఁ బురాణములందు నరకముల-
క్రమములు చదివియుఁ గలంగవు
యమకింకరఘోరాకృతు లటు విని
భ్రమసి యించుకా భయపడ నేను ॥ ఎంత ॥

౧. పడెచ్చు=పడియచ్చు. ౨. నివిఱి+ఉన్నది.

మనుజులదారుణమహితకర్మముల-
అనుభవములు గని యలయను
వానర ౧మహోగ్రయహోరాత్రంబులు
చనుచుండఁగా జడియను నేను ॥ ఎంత ॥

కలుషరౌద్రదుఃఖముల కించుకా
కలఁగను చేరికిఁ గైకొనను
యెలమిని శ్రీవేంకటేశుఁడ నాపాలఁ
గలిగి కాచితివి గాసిల నేను ॥ ఎంత ॥ 181

రామక్రియ

పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు
యీటువెట్టి పెద్దతనా లెంచఁ బనిలేదు ॥ పల్లవి ॥

సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు
గరిమ నీకృప నిన్నుఁ గను నొకఁడు
ధరఁ బ్రయాసముతోఁ దపముసేయు నొకఁడు
శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు ॥ పాటె ॥

వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు
వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు
వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షము గను
యెక్కడా నీకల్పన కేమిసేయవచ్చును ॥ పాటె ॥

భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము
యేవలనైనా నీవు యిచ్చితేఁ గద్దు
జీవులు నిన్నెఱఁగక చీఁకటి దవ్వఁగనేల
శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు ॥ పాటె ॥ 182

---

౧. మహోగ్ర+అహోరాత్రంబులు=మహోగ్రయహోరాత్రంబులు. ఇట్టివి కొన్ని వింతసంధులు గలవు. లేక 'మహోగ్ర'. అని సంబోధనమా?

రేకు 142

రామక్రియ

అందుకల్లా లోనగాక అట్టే యెచ్చరికెతోఁ
పొందుగా హరిఁ దలఁచేపురుషుఁడే ఘనుఁడు ॥ పల్లవి ॥

చలములు పుట్టించ సారె మత్సరము రేఁచ
కలుగు నానావిధకారణములు
తలఁపులు భ్రమయించ తగువేడ్క లొనరించ
పలుమా రెదుట నిల్చు బహురూపాలు ॥ అందు ॥

తగవులు దిద్దించ తగ నలమటఁ బెట్ట
తగులు ననేకబంధములెల్లాను
పగసాధింపించ నప్పటి నుపాయాలు నేర్ప
విగిడివచ్చు [౧] ననేకనెపములెల్లాను ॥ అందు ॥

[౨] తేరకే మేనలయించ దేహమెల్లా నావటించ
వూరకే తోఁచు ననేకవుద్యోగాలు
కోరి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి నిశ్చింతుఁడైతే
ఆరయ మతిలో నిండు నానందాలు ॥ అందు ॥ 183

మాళవిగౌళ

నేరఁగల దొక్కటె విశ్వబ్రహ్మవిద్య
వారివారియంతర్యామే వచ్చి పెరరేఁచీని ॥ పల్లవి ॥

వొక్కరు నేర్పఁగవద్దు వొగి సంసారధర్మము
దిక్కై పుట్టించినప్రకృతియే నేర్పీని
గుక్కక [౩] జంతులు చన్నుగుడుప నేరుపవద్దు
చక్కఁగా ననాదివాసనలే నేర్పీని ॥ నేరఁ ॥

---

౧. 'అనేకనెపములు' అనేకసాకులు వంటివి. ఈ చిల్లర దోషములు మా వాఙ్మయమునకు భూష. ౨. 'తేర తేమే నలయించ' పూ.ము.పా. ౩. 'జంతూలు' రేకు.

అంచ నెవ్వరు నిద్రవొమ్మని బుద్ధిచెప్పవద్దు
మించి వారితమోగుణమే కప్పీని
కొంచక భుజియించుమని కోరి యుచ్చరించవద్దు
పెంచినతనయాఁకలే పిలిచితెచ్చీని ॥ నేరఁ ॥

అట్టె పనివాటల అలవాటు చూపవద్దు
యెట్టైనా తనజాతే సేయిపించీని
వొట్టుక శ్రీవేంకటేశుఁ డున్నాఁడు కోనేటిదండ
పట్టికొలిచినవారే భాగ్యవంతు లిలను ॥ నేరఁ ॥ 184

శంకరాభరణం

అది నే నెఱఁగనా అంతలో భ్రమతుఁగాక
మదనజనక నాకు మంచిబుద్ధి యియ్యవే ॥ పల్లవి ॥

యెంత లోకానుభవము అంతయు వ్రిథా నష్టి
కొంతైనా బ్రహ్మచింత కోటిలాభము
వింతైనజనులతోడివినోదము నిష్ఫలము
చెంత సజ్జనసంగతి చేరినయాదాయము ॥ అది ॥

నానాదేశవార్తలు నడుమఁ జింతామూలము
పూనినపురాణగోష్ఠి పుణ్యమూలము
ఆనినకృషివాణిజ్యాలన్నియుఁ దీరనివెట్టి
మాననియాచార మాత్మకుఁ బద్ధపాటు ॥ అది ॥

పలుచుట్టరికములు బట్టబయలుతగుళ్లు
చెలఁగునాచార్యసేవ జీవన్ముక్తి
బలిమి శ్రీవేంకటేశ పరగ రెండువిధాలు
నిలుకడయినవాఁడవు నీవే యిన్నిటికి ॥ అది ॥ 185

### దేవగాంధారి

ఒక్కఁడే మోక్షకర్త వొక్కఁడే శరణాగతి
దిక్కని హరిఁ గొల్చి బదికిరి తొంటివారు ॥ పల్లవి ॥

నానాదేవత లున్నారు నానాలోకము లున్నవి
నానావ్రతా లున్నవి నడచేటివి
జ్ఞానికిఁ గామ్యకర్మాలు జరపి పొందేదేమి
అనుకొన్న వేదోక్తాలైనా నాయఁగాక ॥ ఒక్క ॥

వొక్కఁడు దప్పికిఁ ద్రావు వొక్కఁడు కడవ నించు
నొక్కఁ డీఁదులాడు మడుగొక్కటియందే
చక్క జ్ఞానియైనవాఁడు సారార్థము వేదమందు
తక్కక చేకొనుఁగాక తలకెత్తుకొనునా ॥ ఒక్క ॥

యిది భగవద్గీతార్థ మిది యర్జునునితోను
యెదుటనే వుపదేశమిచ్చెఁ గృష్ణుఁడు
వెదకి వినరో శ్రీవేంకటేశుదాసులాల
బదుకుఁద్రోవ మనకు పాటించి చేకొనరో ॥ ఒక్క ॥ 186

### భైరవి

ననుఁ జూచి హరి నీవు నవ్వకుందేవా
పనిమా లెంత బయలుపాఁకీ నామనసు ॥ పల్లవి ॥

మనసుకు గోచరమా మాటలకు గోచరమా
కనుఁగొన వసమా నీఘనరూపము
విను వెదకుచున్నాఁడ నీవెక్కడ నే నెక్కడ
జనుఁడ నింతె యెంత సాహసము నాది ॥ నను ॥

వున్నచో తెలుఁగుదునా వోయీ అంటేఁ బలికేవా
యెన్ని తెలియఁదరమా యిట్టి నీమాయ
అన్నిటా నీకొలువు సేయఁ గడఁగుచున్నవాఁడ
యెన్నటిపొందు నీవు నాకెంత దిట్టతనమో ॥ నను ॥

వాకిలి౧ గానవచ్చునా వంచించి ౨చొరవచ్చునా
రాకపోక కబ్బునా పరమపదము
శ్రీకాంతుఁడ ప్రత్యక్షమై శ్రీవేంకటాద్రి యిదె
కైకొంటి నీకృప నెంత గట్టువాయతనమో ॥ నను ॥ 187

లలిత

ఎన్నటికి జీవుఁ డిఁక నీడేరేది
పన్నుకొనేటిచింతలే బలిసీఁగాని ॥ పల్లవి ॥

కలవు వివేకులు కలదిటు ధర్మము
కలఁడు దైవము నేఁడు గావలె నంటే
వలవనిసందేహాన పట్టిజాలిఁబొరలేటి-
తలపోఁత లేమిటికో తడఁబడీఁ గాని ॥ ఎన్న ॥

వున్నవి వేదశాస్త్రాలు వున్నది విశ్వాసము
వున్నవాఁ డాచార్యుఁడు వుపదేశించ
తిన్నఁదానే మోసపోయి తత్వము నిశ్చయించక
మిన్నక చంచలమే లో మెరసీఁగాని ॥ ఎన్న ॥

యివిగో పుణ్యవిధులు యిదిగో సంకీర్తన
వివరింప వీఁ డిగో శ్రీవేంకటేశుఁడు
భవములచే భ్రమసి బహుసంగతులచేత
యివల నామన సిప్పు డెటీఁగీఁగాని ॥ ఎన్న ॥ 188

---

౧. 'వాకిటఁ' గానచ్చు. ౨. 'జొరవచ్చునా' వ్రా.ము.ప్ర.

రేకు 143 గుజ్జరి

అన్నియు నడుగవే నేనే మఱచితి నప హరి నీకే తెలిసినవి
మన్నించి నా కీజన్మ మొసఁగితివి మర్మగాఁడు మన్మథుఁ
డొకడు ॥ పల్లవి ॥

పలుజన్మంబుల నేఁ ద్రాగినచనుఁబాలు గొలచితే నెన్నానో
తలిదండ్రులు మరియెందరో తా మెక్కడ నున్నారో
తిలకింపఁగ నాహారంబునఁను తెగినకొలుచు లవి యెన్నెన్నో
యిలపై నే బ్రదికినకాలము యెంతని వ్రాసెనో చిత్రగుప్తుఁడు
॥ అన్ని ॥

చిమ్ముఁగఁగఁ జిమ్ముఁగఁగఁ గట్టుకోకలకుఁ జెల్లినపత్తి దా నదియంతో
కనక మెంతో నా కాభరణములై కాయంబులతో నొరసినది
పెనఁగి రమించినకామినీమణులపేరు లెన్నియో తొల్లిటివి
ఘనముగ నను నిటు భోగించఁజేసినకర్మమే యెఱుఁగు
వివియెల్లా ॥ అన్ని ॥

గరిమల నే గడియించినయిండ్లుఁ గాణాచిచోట్లు యేదేదో
పొరలినయిడుములు యెందుకెక్కెనో పొదలితి భువిపై నిన్నాళ్లు
అరయఁగ నందరి కంతర్యామివి అఖిలకారణంబును నీవే
నిరతపు శ్రీవేంకటేశ్వర దయగలనీచిత్త మెటువలెఁ దలచీనో
॥ అన్ని ॥ 189

మలహరి

దైవమా నీపెరరేఁపణ లివి తప్పక వున్నవి జీవులకు
భావించి కాదనిదొబ్బి దీకొనఁగ బ్రహ్మాదులకైనను వసమా
॥ పల్లవి ॥

యెక్కడ సిద్ధించు బ్రహ్మచర్యము యెగుటనే కాంతలఁ జూచినవేళను
చక్కఁగా మనోవ్యభిచారంబునఁ జలియించుంగాక
చిక్కునే విరతి ధనధాన్యంబులు చేతికి లోనయినఁ జూచి
వొక్కటియై తా నందే మగ్నమునొందించుం గాక ॥ దైవ ॥

---

౧. 'నయ్యిన' రేకు. ౧, ౨. 'చుఁగాక. చుఁగాక' కావచ్చు.

కలుగునే తవివి బహుపదార్థములు గక్కన నంగళ్లనుఁ జూచి
కొలఁదిమీఱఁ గడుతరితీపులతో కోరుచు నోరూరుం[1] గాక
వలమగ సమాధి యెటువలె దొరకొను వాజివారణంబులఁ జూచి
యెలమితోడ ముంగిళ్లనెల్లఁ జరియింపించుఁ గాక ॥ దైవ ॥

యేరీతి నెలకొను నీమీఁదితలఁపు యిహలోకపుసౌఖ్యము చూచి
భారపులంపటములు పైఁ దగిలించి పసులకుఁ బరికొలుపుఁ గాక
ధారుణి వే విపి గెలుచుట యెన్నఁడు తగ శ్రీవేంకటనాయక నీవే
గారవించి రక్షింపుము నీ కిది కడు నుపకారంబౌఁ గాక ॥ దైవ ॥ 190

ఆహిరి

ఎంత మహిమో నీది యెవ్వరి కలవిగాదు
చింతించితే దాసులకుఁ జేపట్టుఁగుంచమవు ॥ పల్లవి ॥

వూరకే ని న్నెవ్వరికి యుక్తుల సాధింపరాదు
సారెకుఁ దర్కవాదాల సాధింపరాదు
ఆరసి వెదకి ఉపాయముల సాధింపరాదు
భారములేనియట్టి[3] భక్తసాధ్యుఁడవు ॥ ఎంత ॥

మిక్కుటపుసామర్థ్యాన మెరసి తెలయరాదు
దిక్కరించి నేర్పులఁ దెలియరాదు
వెక్కసాన భూముల వెదకి తెలియరాదు
మొక్కి నీకు శరణంటే ముందర నిలుతువు ॥ ఎంత ॥

చెలరేఁగి తపములు చేసినా నెఱఁగరాదు
యిల నెన్ని చదివినా నెఱఁగరాదు
నెలవై శ్రీవేంకటేశ నీదాసానుదాసులఁ
గొలిచితేఁ జాలు గక్కనఁ గృపసేతువు ॥ ఎంత ॥ 191

౧. 'రుఁగాక' కావచ్చు ౨, 'తలకొను' పూ.ము.పా. ౩. 'శక్తి' కావచ్చు.

### కన్నడగౌళ

నీవు నన్ను రక్షించితే నింద నీపైఁ బడదు
భావించి నన్నెట్లయినా బ్రదికించుకొనవే ॥పల్లవి॥

సంతతము నన్నెంచితే సర్వాపరాధి నేను
యెంత నీ వేమిచేసినా నంత కర్హుఁడ
ఇంతటిలోకజననియైనలక్ష్మిఁ జూచి కావి
అంతరాత్మ నిన్నుఁ జూచియైనా మన్నించవే ॥నీవు॥

కల వెన్నైనాఁ దప్పులు కనఁగొన నావల్ల
చెలఁగి యిందుకుఁ బ్రాయశ్చిత్తము లేదు
లలి నాభుజము చక్రలాంఛనము చూచి కావి
అల నానోరిమంత్రమైనాఁ జూచి యేలుమీ ॥నీవు॥

మతి నిన్నెఱఁగేనంటే మదోన్మత్తుఁడ నేను
గతి యేది నాకు శ్రీవేంకటగిరినాయక
సతతము నీబిరుదు సారెకుఁ జూచి కావి
ప్రతిలేనినీదయయైనా భావించి చేకొనవే ॥నీవు॥ 192

### దేసాళం

ఇందరిబ్రదుకులును యీశ్వరునిచేతి౧దే
యెందూ సుజ్ఞానులు విన్నే యెఱిఁగి కొలిచిరి ॥పల్లవి॥

వినుఁ గనఁగొనలేక నీచేఁత దెలియక
మనుజులదృష్టమని మది నెంతురు
అవిశము నీసృష్టి యిట్లని నిశ్చయించరాక
తనఁ గొందరు తమతమకర్మ మందురు ॥ఇంద॥

౧. 'చేతివే' కావచ్చు.

మహి నీలీల లెంచక మహిమలు దెలియక
బహుగతి జగత్తుస్వభావ మందురు
విహితమై నీ వింతటా నిండుకుండుట చూడక
తహతహఁ గొందరు యింతా మిథ్య యందురు ॥ఇంద॥

భావములోన నిన్ను భావించవసముగాక
ఆవల నిరాకారమని యందురు
శ్రీవేంకటేశ నీవు చేరి యెదుట నుండఁగా
దేవుఁడు మనవాఁడుగా తెలిసితి మందురు ॥ఇంద॥ 193

రేకు 144 సాళంగనాట

ఏమని తలఁచవచ్చు నిటువంటినీచిత్తము
దీమసాన నీభావము తెలియ దెవ్వరికి ॥పల్లవి॥

రవిచంద్రగ్రహతారకములకుఁ దెరువు
వివరించ నున్నదా నీవే యధారముగాక
పవనునికి భువికి పదునాల్గులోకముల-
కవల వేరొకచోట నాధార మున్నదా ॥ఏమ॥

తిలకింపఁ గులాచలదిగ్గజశేషాదులకు
నిలుపఁ జోటున్నదా నీవే యాధారముగాక
నలుదిక్కులకు గగనమునకు మేఘాలకు
కలది నీయధారమేకాక వేర వున్నదా ॥ఏమ॥

అనంతబ్రహ్మాండముల కట్టే నీరూపములకు
వెనకముందున్నదా నీవే యాధారముగాక
వినుతి కెక్కినశ్రీవేంకటేశ నీకు నీవే
మనికైనయాధారము మఱి యెంచ నున్నదా ॥ఏమ॥ 194

పాడి

విష్ణుఁడే యింతానని భావించుటే బుద్ధి
వైష్ణవుఁడై యాచార్యసేవసేయుటే బుద్ధి ॥ పల్లవి ॥

కొండవంటితనలోనికోపము రేఁగ వచ్చితే
దండనే యెచ్చరి వూరకుండుటే బుద్ధి
మెండుగా బరకాంతల౧ మీఁదితమి వుట్టితేను
౨అందుకాచందుకు భ్రమయకుండుటే బుద్ధి ॥ విష్ణుఁ ॥

ఆట్టె యెవ్వరయినా గృహారామాదులపై నాస
వుట్టించితేఁ వానివెంటఁ బోనిదే బుద్ధి
చుట్టపుసమ్మంధాన సోఁకితే పరబాధలు
చుట్టుకోక లోనుగాక జునుఁగుటే బుద్ధి ॥ విష్ణుఁ ॥

తప్పదింతా దైవికమే తనవద్దనున్నవారిఁ
దప్పులువట్టనిదే తగినబుద్ధి
యెప్పుడూ శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
చొప్పెత్తి యాతనిమూర్తి చూచుటే బుద్ధి ॥ విష్ణుఁ ॥ 195

కన్నడగౌళ

సకలమైనవారికి సహజ మిది
అకటా యెట్టు గల్పించి ఆడించేవు దేవుఁడా ॥ పల్లవి ॥

తనియ కొరులచక్కఁదనమే చూచుఁగాని
తనభావము తనకుఁ దలఁపు గాదు
చొనిపి యొవ్వనపుసుద్దులే చెప్పుఁగాని
పెనఁగి తనవయసు పోవుట దెలియదు ॥ సక ॥

౧. 'మీఁద తమిపుట్టితేను' అనుట సహజము. ౨. అందుకాచి+అందుకు

దారుపాషాణబుద్ధులు ద్వైపముపైఁ బెట్టుఁగాని
యీరీతినే తనదేహ మెంచుకొనఁడు
వూరిలోనిమాటలెల్లా వుగ్గడించఁబోవుఁగాని
కారణపుతనజన్మకథలు దడవఁడు ॥ నక ॥

వేడుకతో విశేషాలు వెదకఁగోరుఁగాని
ఆడనే ఆత్మవిశేష మది వొల్లఁడు
పీడక శ్రీవేంకటేశ వెలయ నీదాసులకు
తోడఁదోడ దెలుపుచు తోడయి రక్షింతువు ॥ నక ॥ 196

భైరవి

ఇంతకంటే నే మున్నది యెంత దలపోసినాను
చింతదీర నీసేవ సేయుటే కలది ॥ పల్లవి ॥

ఉపకారముగ దేహ మొసఁగితి విటు నాకు
ఉపమించి నేఁ జేసే ప్రత్యుపకార మిఁక నేది
యెపుడూ నీధర్మమున నిటు నీరుణస్థుఁడనై
ప్రపన్నుఁడనై నేను బ్రదుకుటే కలది ॥ ఇంత ॥

వేవేగ వెట్టిఁ జేయగ నిన్నేఁ జేసితివి
యీవికి నే మారుకుమా రిచ్చే దెక్కడ నున్నది
యీవల నీకుఁ గీర్తిగా విట్టే నీయాధీనుఁడనై
భావించి భయము లేక బ్రదుకుటే కలది ॥ ఇంత ॥

బడులలోఁ గూర్చక యాచార్యునిలోఁ(తోఁ?) గూర్చితివి
నడపేటినీసరవికి నావరవి యేమున్నది
యెడయక శ్రీవేంకటేశ నీకు బంటనై
బడివాయ కిట్లా నే బ్రదుకుటే కలది ॥ ఇంత ॥ 197

ముఖారి

వెలుపల వెదకితే వెస నాత్మఁ గనునా
పలుమారు నిదే యభ్యాసము గావలెను ॥ పల్లవి ॥

యిన్ని చింతలు మఱచి యింద్రియాలఁ గుదియించి
పన్ని వుండినహృదయపద్మమందును
యెన్న నంగుష్ఠమాత్రపుటీశ్వరుపాదాలకింద
తిన్న నణుమాత్రముగఁ దలఁచఁగవలెను ॥ వెలు ॥

పలుదేహపుఁగాళ్లఁ బరువులు వారక
బలుదేహపుటింటిలోపల చొచ్చి
చలివేఁడిఁ బొరలక సర్వేశుపాదాలకింద
తలకొన్నతన్నుఁ దానె తలఁచఁగవలెను ॥ వెలు ॥

కైకొన్నభక్తితో నిక్కపుశరణాగతితో
చేకొని విన్నపాలు చేసుకొంటాను
యేకాంతాన శ్రీవేంకటేశ్వరుపాదాలకింద
దాకొని తన్నుఁ దానే తలఁచఁగవలెను ॥ వెలు ॥ 198

శ్రీరాగం

ఇంతేకాని తెలిసితే నెవ్వరూఁ గర్తలు గారు
బంతినే వీని కెప్పుడుఁ బ్రకృతి గారణము ॥ పల్లవి ॥

యివిగో గుణాలు మూఁడే యింద్రియాలఁ గూడుకొని
భువిఁ బ్రాణులనెల్లాను పూఁచి పనులుగొనేవి
కవిసి కర్మములై ఘనలోకాలఁ దిప్పేవి
అవలఁ బుట్టుగులకు నప్పటిఁ దెచ్చేవి ॥ ఇంతే ॥

పంచభూతా లివియే పరగ జీవులకెల్లా
దించరాక యెప్పుడును దేహాలయ్యేవి
అంచెలఁ గంచములోఁ బదార్థములై వుండినవి
తెంచరానిపాశములై తీపులఁబెట్టేవి ॥ ఇంతే ॥

మనసొక్కటే ౧ జంతులమర్మములు రేఁచేది
తనుభోగములలోనఁ దనివిచ్చేది
అనయము శ్రీవేంకటాధిప నీమహిమ మిది
నినుఁ గొల్చినదాసుల నెరవేర్చేది. ॥ ఇంతే ॥ 199

రేకు 145 దేసాళం

భావించలే రెవ్వరును బయులువాఁకేరుగాని
నీవే గుఱుతు మాకు నీరజనాభా ॥ పల్లవి ॥

కైవల్య మెట్టుండునో నిక్కపుజ్ఞాన మెట్టుండునో
దైవిక మెట్టుండునో తలఁచరాదు
జీవన మెట్లనుండునో చిత్త మేరీతినుండునో
ఆవిధ మెవ్వరి కిట్టట్టనఁగరాదు ॥ భావి ॥

వేదము లెట్టుండునో విరతి యెట్టుండునో
ఆది నంత మెట్టుండునో అరయరాదు
భేద మనే దెట్టుండునో అభేద మది యెట్టుండునో
సోదించి యెవ్వరికిని చూడఁగరాదు ॥ భావి ॥

ఫల మెట్లానుండునో భక్తి యెట్లానుండునో
తెలివి యెట్టుండునో సాధించఁగరాదు
యిలపై శ్రీవేంకటేశ యిటు నీశరణుచొచ్చి
నిలుకడై వున్నారము నీకృప యిఁకను ॥ భావి ॥ 200

౧. 'జంతూల' రేకు.

గౌళ

ఒడఁబరచుకొంటివి వుపేంద్ర నిన్ను నిపుడె
చిడిముడి నీసేవకే నెలవుచేసుకొమ్మి ॥పల్లవి॥

కన్నుల నేఁ జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే
విన్నవినుకులెల్లా విష్ణుఁడ నీకథలే
తిన్నవినామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే
అన్నిటా నాభావము సమర్పణము నీకును ॥ఒడఁ॥

అట్టె నే నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే
గుట్టున నాసేఁతలెల్లా గోవింద నీకైంకర్యాలే
ముట్టి నేభుజించినవి ముకుంద నీప్రసాదాలే
నెట్టన నాభోగమెల్లా నీవసము చేసితి ॥ఒడఁ॥

యిల నేఁ [౧] వండఁబడేవి యీశ్వర నీకు మొక్కులే
తలఁచే నాతలఁపెల్లా దామోదర నీధ్యానమె
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను
నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి ॥ఒడఁ॥ 201

కన్నడగౌళ

నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని
వున్నవాఁడ నిఁక వేరే ఉపాయ మేమిటికి ॥పల్లవి॥

గతియై రక్షింతువో కాక రక్షించవోయని
మతిలోనిసంశయము మాటి విడిచి
యితరులచే ముందర నిఁక నెట్టాదునోయని
వెతతోడఁ దలఁచేటివెఱపెల్లా విడిచి ॥నిన్ను॥

౧. వండఁబడేవి=వండుకొనునవి. స్వార్థమున 'వడు' ధాత్వనుప్రయోగము.

తిరమైననీమహిమ తెలిసేవాఁడనే –
గరువము ౧ తోడివుద్యోగము విడిచి
వెరవున నీరూపు వెదకి కానలేవనే –
గరిమ నలపు నాస్తికత్వమును విడిచి ॥ విన్ను ॥

ధ్రువమైననాచేతను తోడు దెచ్చుకొనేననే
అవల నన్యులమీఁదియాస విడిచి
వివరించ లమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తవిలితి నాపుణ్యమంతయు నీకు విడిచి ॥ విన్ను ॥ 202

లలిత

భ్రమయుకవుండేదే పరమార్థము
నెమకితే నన్నిటాను నీవే వుండుదువు ॥ పల్లవి ॥

వసుధలోఁ బురుషులవనితలరూపులు
వెస మాయయంత్రపువెరబొమ్మలు
ముసరి యొండొంటికి మోహించేమోహములు
అసురుసురయ్యేఇంద్రియావేశములు ॥ భ్రమ ॥

తగినతనులో చక్కఁదనాలు వయసులు
పగటురక్తమాంసాలపరిపూర్ణులు
జిగి నిండుకుఁగాఁ బుట్టేచిత్తవికారములు
నిగుడుచు బయలువన్నినయట్టిపురులు ॥ భ్రమ ॥

లలి మీరి యన్యోన్యవిలాసములు భోగములు
వలవవిమొయిలులేనివానజల్లు
యెలమి శ్రీవేంకటేశ యివెల్లా నీదాసులకుఁ
దెలిపి బ్రహ్మానందము తిరముగా విత్తువు ॥ భ్రమ ॥ 203

---

౧. 'తోడ' కావచ్చు. వ్యస్తస్థలములలో కూడ చేత–తోడ–మీఁద–వలన అను వానిపై 'ను' వర్ణము ఈ వాఙ్మయమున తరచుగ కనుపట్టుచుండును.

పాడి

దైవముతోడిదే తనతగులు
జీవుఁ డిది యెఱిఁగితే చిక్కనీదు తగులు ॥ పల్లవి ॥

కన్నులఁ జూచినంతనే కలుగుమఁ దగులు
మిన్నక మాటలాడితే మిగులాఁ దగులు
పన్నుగా నవ్వితేను పాదుకొనుఁ దగులు
యెన్నైనా నూరకుండితే నేమీ లేదు తగులు ॥ దైవ ॥

వీనులొగ్గి వినఁబోతే విశ్వమెల్లాఁ దగులు
ఆని సువాసన నంటుకొనుఁ దగులు
పూని లోకులపొందుల పొదిగొను తగులు
మోనాన నూరకుండితే మొగియదు తగులు ॥ దైవ ॥

కరుణించి యేమిచ్చినా గట్టిగావునుఁ దగులు
దొరతనాన మించితే తొడరును తగులు
ధరణి శ్రీవేంకటేశుఁ దలఁచి యేకాంతాన—
నిరవై వూరకుండితే నెనయదు తగులు ॥ దైవ ॥ 204

సామంతం

ఇందరూ జీవులే యెంచి చూచితే—
నందులో భావము లవియే వేరు ॥ పల్లవి ॥

అంతటఁ జూచిన యాహారనిద్రలు
జంతురాసులకు సహజములు
సంతోషంబును సాత్వికగుణమును
శాంతచిత్తులకు సహజములు ॥ ఇంద ॥

మనసునఁగలకామక్రోధంబులు
జననశీలులకు సహజములు
వినయంబును ఘనవిజ్ఞానము స-
జ్జనుల కెప్పుడును సహజములు ॥ ఇంద ॥

విడువనియాసలు వేవేలుచింతలు
జడులకు నం(నెం?)దును సహజములు
బడి శ్రీవేంకటపతికొలువుఁదపము
జడియనిదాసులసహజములు ॥ ఇంద ॥ 205

రేకు 146 శంకరాభరణం

కలది యీమూర్తివల్ల గతి గనవలెను
యిల నిందు నమ్మకుంటే యెందు మరి లేదు ॥ పల్లవి ॥

కంటిమా బ్రహ్మమును వేంకటపతిఁ గనినట్టు
కంటిమా అవతారాలు కతలెకాక
కంటిమా హృదయములోఁ గలిగినదైవమును
కంటిమా ౧ వైకుంఠము కడవారైనాను ॥ కల ॥

తెలిసీనా జ్ఞానము యీదేవునిమహిమవలె
తెలిసీనా వేదాలు సందేహమేకాక
తెలిసీనా మాయ యిది యెంత చదివినా
తెలిసీనా ముందరితెరువు వెదకితే ॥ కల ॥

చిక్కీనా మనసు యీశ్రీవేంకటేశ్వరువలె
చిక్కీనా ధ్యానము వట్టిచింతలేకాక
చిక్కీనా అనాదినుండి చిగిరించీకాలము
చిక్కీనా పెద్దలు చెప్పేజితమైనశాంతి ॥ కల ॥ 206

౧. వైకుంఠముకడవారైనాను = "వైకుంఠము దగ్గర నున్నవారైనా" అను నర్థమున ప్రయోగించిరేమో? లేక కడవారైనా = తుదిమెట్టు నందుకొన్నవారైనా "వైకుంఠము కంటిమా" అను రీతిగా ప్రయోగించిరేమో?

నాట

అందరికంటే నెక్కుడు హనుమంతుడు
కందువ మతంగగిరికాడిహనుమంతుడు ॥ పల్లవి ॥

కనకకుండలాలతో కౌపీనముతోడ
జనియించినాఁడు యీహనుమంతుఁడు
ఘనప్రతాపముతోడ కఠినహస్తాలతోడ
పెనుతోఁక యెత్తినాఁడు పెద్దహనుమంతుఁడు ॥ అంద ॥

తివిరి జలధిదాఁటి దీపించి లంకయెల్లా
అవలయివల సేసె హనుమంతుఁడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డహనుమంతుఁడు ॥ అంద ॥

తిరమైనమహిమతో దివ్యతేజముతోడ
అరసి దాసులఁ గాచీ హనుమంతుఁడు
పరగ శ్రీవేంకటేశుబంటై సేవింపుచు
వరములిచ్చీఁ బొడవాటిహనుమంతుఁడు ॥ అంద ॥ 207

సాళంగనాట

ఈతఁడు తారకబ్రహ్మ మితఁడు మాదేవుఁడు
కౌతుకానఁ జెప్పే వినఁగదరే వోజనులు ॥ పల్లవి ॥

రాముఁడు యిందీవరశ్యాముఁడు నానాసార్వ-
భౌముఁడు షోడశకళాసోముఁడు
దోమటిరాక్షసులను తుత్తుమురుసేసినాఁడు
కామితఫలములిచ్చి కాచినాఁడు సురల ॥ ఈతఁ ॥

పూ[౧]ర్ణుఁడు నీలమేఘవర్ణుఁడు దానమున వి-
  స్తీర్ణుఁడు [౨]వాహనసుపర్ణుఁడు
  అర్ణవము దాఁటి రావణాదుల గెలిచినాఁడు
  నిర్ణయించి చెప్పరాదు నేఁ డీతనిమహిమ ॥ఈతఁ॥

వరుఁడు సీతకు పరాత్పరుఁడు [3]కోదండదీక్షా-
  గురుఁడు దివ్యామోఘశరుఁ డితఁడు
  నిరతి శ్రీవేంకటాద్రి నెలవై యుండేటివాఁడు
  సరి భరతలక్ష్మణశత్రుఘ్నసహితుఁడు ॥ఈతఁ॥ 208

## శ్రీరాగం

ఇదియే కావలెనని తాఁ గైకొని యిచ్ఛగించువాఁడే ఘనుఁడు
వదలకురో హరిదాసులమత మిది వర్ణించెద నోవివేకులాలా ॥పల్లవి॥

దేవుఁడుగలఁడని మదిలోఁ దెలియుటే జన్మఫలంబు
  తావుగ నాతని నెప్పుడుఁ దలఁచుటే తనభాగ్యము
  శ్రీవైష్ణవధర్మము తప్పక చెలఁగుటయే వైభవము
  దేవతాంతరంబులన్నియు మానినదియే సుకృతంబు ॥ఇది॥

కామక్రోధము లుజ్జగించుటయే కల్యాణానుభవము
  చేముంచి పాపము సేయకమానుటే చెప్పఁగ లాభము
  నేమముతోడుత విరక్తుఁడగుటే నిర్మలానందము
  వేమరు నాచార్యసేవ సేయుటే విచారింపఁగ దాఁచినధనము ॥ఇది॥

ప్రకృతివికారములకుఁ జొరకుండుటే పరమమైనసాత్వికము
  సకలబంధములఁ బెడఁబాసినదే సామ్రాజ్యపదము
  ప్రకటింపఁగ నలమేలుమంగకును పతియగుశ్రీవేంకటవిభుని
అకలంకుఁడై కొలిచియుండుటే యనంతమహిమాతిశయంబు ॥ఇది॥209

---

౧. రేకులో 'ర్ణ' వర్ణములన్నీ 'న్న' గానే యున్నవి.

౨. 'సుపర్ణవాహనుఁ' డనుట సహజము. "స్తీర్ణ, వర్ణ" శబ్దములప్రాస యతి-ప్రభావము కాఁబోలు. లేక అహితాదిగణమువియా?

౩. చూ: ప్రథమ సంపుటము, పాట: 314.

కేదారగౌళ

ఇదియే ఉపాయ మింక నాకు నిందుకంటె మఱి లేదు
మది పెరవిదాసులదాసుఁడనై మహిమలతోఁ గడుమెఱసేఁగాక
॥పల్లవి॥

కడచితినా నాజన్మములు గక్కన మానిసినైనంతనే
విడిచితినా పాపము సేయక వేవేలుచదివినయంతనే
అడఁచితినా సంసారవారధి అఖిలదేవతలఁ గొలిచినయంతనే
బడిబడి హరినామము నుతించి నేఁ [౧]పావనమయ్యేఁగాక
॥ ఇది ॥

గెలిచితినా యీమాయను నేఁ గెరలి తపంబులు సేసినంతనే
తలఁగితినా నరకములు చొరక ధరయెల్లా [౨]నేలినంతనే
తెలిసితినా తత్త్వరహస్యము తిరముగ కులజుఁడనయినంతనే
యిలలో శ్రీపతి శరణుచొచ్చి నేనిప్పుడు బుణ్యుఁడ నయ్యేఁగాక
॥ఇది॥

వదలితినా నాదుర్గుణములు వరుసతోఁ జుట్టాలు గలిగినంతనే
వెదకితినా ముక్తిమార్గము విద్య లెఱిఁగినేర్చినంతనే
యిదివో శ్రీవేంకటేశుఁడు నాకును యేలికయై మన్నించఁగను
పదిలముగా నాతనిసేవచేసి పరమానందుఁడ నయ్యేఁగాక
॥ఇది॥ 210

రేకు 147 సామంతం

ఎట్టు దోయవచ్చు నింక నెంతటివారికైనాను
పట్టి నీకృపచేతఁ బ్రదికింతువుగాక ॥ పల్లవి ॥

మాలతనమువంటిది మతిఁదగులుఁగామము
అలరి ముట్టువంటిది అంటుఁగ్రోధము
కేలి నొదిగించునెంగిలివంటిది లోభము
వాలాయించి నెందుండైనా వచ్చును లోకులకు ॥ ఎట్టు ॥

౧. 'పావనుఁడయ్యేఁ గాక' కావచ్చు. ౨. 'నేలితినంతనే' వ్రా.ము.పా.

చుట్టి మద్యమువంటిది చొక్కించు మోహము
వట్టిమాంసమువంటిది వయోమదము
పుట్టినభ్రమవంటిది పొదిగినమచ్చరము
వుట్టిపడి నోరూరించు నూరకే ప్రాణులను ॥ ఎట్టు ॥

గోడమఱుగువంటిది గుట్టుతోడిసంసారము
పీడనికట్టువంటిది వేడుకయాస
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నీదాసుల
జాడదప్పనియ్యవు యీచందము జీవులది ॥ ఎట్టు ॥ 211

## వరాళి

మహి నుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు
౧సహజివలె నుండేమీ సాధింపలేడు ॥ పల్లవి ॥

వెదకి తలఁచుకొంటే విష్ణుఁడు గానవచ్చు
చెదరి మఱచితే ౨సృష్టి చీఁకటౌ
పొదలి నడచితేను భూమెల్లా మెట్టిరావచ్చు
నిదిరించితేఁ గాలము నిమిషమై తోఁచు ॥ మహి ॥

వేడుకతోఁ జదివితే వేదశాస్త్రసంపన్నుఁడౌ
జాడతో నూరకుండితే జడుఁడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుఁడౌ
కూడక సోమరియైతే గుణహీనుఁ డౌను ॥ మహి ॥

మురహరుఁ గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెఱఁగకుండితే పీరిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుఁడు రక్షించును
పరగ సంశయించితే ౩పాషండుఁడౌను ॥ మహి ॥ 212

---

౧. సహజి = సహజమైనవాడు 'పుట్టినవాడు పుట్టినట్టే ఏవనీ లేనివాడు' అని భావము. ౨. 'శ్రిష్టి' రేకు. ౩. 'పాషణ్డు' రేకు.

కేదారగౌళ

తనలో నుండినహరిఁ దాఁ గొలువఁ డీదేహి
యెనలేక శరణంటే నితఁడే రక్షించును ॥పల్లవి॥

కోరి ముదిమిమానుపుకొనేయాస మందులంటా
పూరకే చేఁదులుదిన నొడఁబడును
ఆరూఢి మంత్రసిద్ధుఁడనయ్యేననేయాసలను
ఘోరపుఁబాట్లకు గక్కన నొడఁబడును ॥తన॥

యిట్టె యక్షిణిఁ బంపు సేయించుకొనేయాసలను
వొట్టి జీవహింసలకు నొడఁబడును
దిట్టతనమునఁ దా నదృశ్యము సాధించేయాస
జట్టిగ భూతాలఁ బూజించఁగ నొడఁబడును ॥తన॥

చాపలపుసిరులకై శక్తిఁ గొలిచేయాసను
వోపి నిందలకునెల్లా నొడఁబడును
యేపున శ్రీవేంకటేశుఁ దేలి చేపట్టినదాఁకా
ఆఁపరానియాస నెందుకైనా నొడఁబడును ॥తన॥ 213

ధన్నాసి

దేవ నే నీయాధీనము దిక్కు దెస నాకు నీవే
సేవసేయకుండినా రక్షించ నీకు భారము ॥పల్లవి॥

ఆడివచ్చినబిడ్డని నపరాధిఁ జేసి తల్లి
వోడక యన్నము వెట్టకుండవచ్చునా
వేడుకకాఁడు చిల్కకు వింతమాటలెల్లా నేర్పి
ఆడినట్టే యాడితేను అదలించవచ్చునా ॥దేవ॥

౧ చిక్కినావు తొడుకుమేసి వచ్చేనంటా గొల్లఁడు
దిక్కక కావక పోఁదోలవచ్చునా
యెక్కగుట్టము గోళగె నెనసి పైకొంటే రౌతు
తక్కక దావిఁ జీకటితప్పు గొనవచ్చునా ॥ దేవ ॥

పతిఁ బెండ్లాడినయాలు పక్కనుండి విద్రించితే
కొతికి కాలానుభాగి గొనవచ్చునా ?
తతి నేఁపనికి రాక తాపసుఁడై వుండినా
గతియై శ్రీవేంకటేశ కావకుండవచ్చునా ॥ దేవ ॥ 214

రామక్రియ

ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవు సేసితి
తటుకన నీవనేనిధానము చేకొంటిని ॥ పల్లవి ॥

కామించితి నాత్మ నిన్నుఁ గలసి భోగించుటకు
వేమరుఁ గ్రోధించితి నీవిరోధులపై
నేమమున ౨ లోభించితి నీమంత్రమన్యుల కియ్య
ఆముకొని మోహించితి హరి నీరూపునకు ॥ ఇటు ॥

యెఱుకతో మదించితి యిట్టే నీదాస్యమున
మఱి నిన్నొల్లనిచదువు మచ్చరించితి
తఱిఁ జలపట్టితి నీతప్పనిభక్తియందు
వెఱవక ని న్నొల్లనివిధుల నిందించితి ॥ ఇటు ॥

కలకర్మములెల్లా నీకైంకర్యములందు వెట్టితి
బలుమమకారము నీపైఁ జేర్చితిఁ
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
విలిచినకాలమెల్లా నీసేవే చేసితి ॥ ఇటు ॥ 215

౧. చిక్కిన+అవు. ౨. 'లోభించితివి మంత్ర' వ్రా.ము.పా.

మాళవి

కలశాపురముకాడఁ గాచుకున్నాఁడు
వలసినవరాలిచ్చీ వాయునందనుఁడు ॥పల్లవి॥

మాయాబిలముచొచ్చి సుగుతి యంబుధిలోని -
ఛాయాగ్రహముఁ జంపి చయ్యన దాఁటి
ఆయెడ లంకిణిఁ గొట్టి యింతిలో జానకిఁగని
వాయువేగానవచ్చినవాయునందనుఁడు ॥కల॥

కడగి దరిసుండినకపులతోఁ గూడుకొని
పడిదీరఁగా మధువనము చొచ్చి
బడి రామునికి సీతాపరిణామమెల్లాఁ జెప్పె
వడిగలవాఁ డితఁడు వాయునందనుఁడు ॥కల॥

రావణాదిరాక్షసుల రామునిచే సాధింపించి
ఆవిభుని సీతఁ గూర్చి అయోధ్య నుంచె
శ్రీవేంకటేశుఁ గొల్చి శిష్టరక్షణమునకై
వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు ॥కల॥ 216

రేకు 148 బౌళిరామక్రియ

వసుధఁ జూడఁ జిన్నవానివలె నున్నవాఁడు
వెస నన్నివిద్యలాను వెలసె విట్ఠలుఁడు ॥పల్లవి॥

పరగ నేడునూటడెబ్బదియేడుగురిచేత -
విరవై పాడించుకొన్నాఁ డీవిట్ఠలుఁడు
సరస నైదులక్షలిండ్ల జవ్వనపుగొల్లెతల
మరిగించుకొన్నవాఁడు మఱి యీవిట్ఠలుఁడు ॥వసు॥

బత్తితోడ తనమీఁదపాటలు వాడితేను
యిత్తలమోమై తిరిగె నీవిఠ్ఠలుఁడు
హత్తి తన్నొల్లకపోఁగా నందరి మేడ[1] దేవళ్ల
యెత్తి పాదాలందుఁ జూపె నితఁడే విఠ్ఠలుఁడు ॥వసు॥

గట్టిగాఁ బుండరీకుఁడు కడువేడుకఁ బెట్టిన-
యిట్టికపీఁటపై నున్నాఁ డీవిఠ్ఠలుఁడు
అట్టి తానే శ్రీవేంకటాద్రిఁ బాండురంగమున
యెట్టు గాచ్చినా వరము లిచ్చీ విఠ్ఠలుఁడు ॥వసు॥ 217

## మాళవి

ఇతఁడు రాముని బంటు యితని కెవ్వ రెదురు
చతురత మెరసె నిచ్చట హనుమంతుఁడు ॥పల్లవి॥

ఆకాస(శ?)మంతయు నిండి యవ్వలికిఁ దోఁక చాఁచి
పైకొని పాతాళానఁ బాదాలు మోపి
కైకొని దశదిక్కులు కరములఁ గబళించి
సాకారము చూపినాఁ డిచ్చట హనుమంతుఁడు ॥ఇతఁ॥

కొంచక సురలు రోమకూపముల విహరించ
ముంచి ధ్రువమండలము మొగమై యుండ
యెంచఁగ లోకములెల్లా యెడనెడ సందులుగా
చంచుల మెరసినాఁ డిచ్చట హనుమంతుఁడు ॥ఇతఁ॥

గరిమ రవిచంద్రులు కర్ణకుండలములుగా
ధరణి మేరువు కటితటము గాఁగా
ఇరవుగా శ్రీవేంకటేశుని సేవకుఁడై
బెరసె నిచ్చట నిదె పెద్దహనుమంతుఁడు ॥ఇతఁ॥ 218

౧. 'మెడదేవళ్ల' వ్రా.ము.ప్ర, మేడదేవళ్లు=పెద్ద పెద్ద గోపురాలు, శిఖరాలు గలిగిన దేవతలు కావచ్చు.

పాడి

రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్య-
ధాముఁడు రణరంగభీముఁడు వాఁడె ॥ పల్లవి॥

వరుఁడు సీతకు ౧ఫలాధరుఁడు మహోగ్రపు-
శరుఁడు రాక్షససంహారుఁడు వాఁడే
స్థిరుఁడు సర్వగుణాకరుఁడు కోదండదీక్షా
గురుఁడు సేవకభయకరుఁడు వాఁడే ॥ రాముఁ ॥

ధీరుఁడు లోకైకవీరుఁడు సకలా-
ధారుఁడు భవబంధదూరుఁడు వాఁడే
శూరుఁడు ధర్మవిచారుఁడు రఘువంశ-
సారుఁడు బ్రహ్మసాకారుఁడు వాఁడే ॥ రాముఁ ॥

బలుఁడు యిన్నిటా రవికులుఁడు భావించ వి-
ర్మలుఁడు నిశ్చలుఁ డవికలుఁడు వాఁడే
వెలసి శ్రీవేంకటాద్రి విజనగరములోన
తలకొనెఁ బుణ్యపాదతలుఁడు వాఁడే ॥ రాముఁ ॥ 219

సాళంగనాట

శరణు శరణు విభీషణవరదా
శరధిబంధన రామ సర్వగుణస్తోమ ॥ పల్లవి ॥

మారీచసుబాహుమదమర్దన తాటకాహర
క్రూరేంద్రజిత్తులగుండుగండా
దారుణకుంభకర్ణదనుజ-౨శిరచ్ఛేదక
వీరప్రతాపరామ విజయాభిరామ ॥ శర ॥

---

౧. ఫలాధరుడు = బింబఫలాధరుఁడు కావోలు. ౨. 'శిరచ్ఛేదక' రేఫ. శిరస్శబ్దము అకారాంత పుంలింగము కలదు గదా. "విచకర్త శిరాన్ ద్రోణః అథః పాదరణోత్తమాన్" అని ప్రయోగము. దీనితో 'రణస్' శబ్దముకూడ అకారాంతమైనది.

వాలినిగ్రహ సుగ్రీవరాజ్యస్థాపక
 లాలితవానరబల లంకాపహార
 పాలితపవనాహల్యాపాపవిమోచక
 పౌలస్త్యహరణ రామ బహుదివ్యనామ ॥ శర ॥

శంకరచాపభంజక జానకీమనోహర
 పంకజాక్ష సాకేతపట్టణాధీశ
 అంకితబిరుద శ్రీవేంకటాద్రినివాస
 ఓంకారరూప రామ పురుసత్యకామ ॥ శర ॥ 220

రామక్రియ

శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే
 యేవిధానఁ దలఁచినా యిన్నిటికిఁ దగును ॥ పల్లవి ॥

కరిరాజుఁగాచినచక్రముపట్టినహస్తము
 కరితుండమని చెప్పఁగా నమరును
 వరములిచ్చేయట్టివరదహస్తము కల్ప-
 తరుశాఖ యని పోల్పఁదగు నీకును ॥ శ్రీవేం ॥

జలధిఁబుట్టినపాంచజన్యహస్తము నీకు
 జలధితరఁగయని చాటవచ్చును
 బలుశార్ఙ్గిగునితోఁకపట్టుకటిహస్తము
 వొలుపై ఫణీంద్రుఁడని పొగడఁగఁదగును ॥ శ్రీవేం ॥

నిలిచినహస్తంబులెడమనున్న నీయుర-
 స్థలముమేలుమంగ కిరవుగాఁదగును
 అలర శ్రీవేంకటగిరిపై నెలకొన్న విన్ను-
 నలరి శ్రీవేంకటేశుఁ డనఁదగును ॥ శ్రీవేం ॥ 221

దేసాళం

పంట వండుకొనేవారిభాగ్యము లిటమీఁద-
వంటిముట్టి వెదకితే నాతుమ లోనున్నది ॥ పల్లవి ॥

వేదములలో మొలచె వేదాంతాలఁ గొనసాగె
గాదిలి శ్రీహరిభక్తికల్పలత
పోదియెక్కె వైరాగ్యబోధలచేఁ బలుమారు
పాదుకొని వేరువారె పంచసంస్కారాలను ॥ పంట ॥

అల్లుకొనె మునులలో నంటెనుఁ బురాణాల
చెల్లుబడి శాస్త్రాలఁ జిగిరించెను
చల్లఁగాఁ బూవులు వూచె సత్కర్మవిదులను
మెల్లనే నీడలు నిండె మించి సుజ్ఞానమున ॥ పంట ॥

పరమయోగములఁ బూఁపలుఁ బిందెలు వుట్టె
పరగె సురలనేపందిటియందు
యిరవై శ్రీవేంకటేశుఁ డిందుకు ఫలమైనాఁడు
గురుసేవలను దొరకును వివేకులకు ॥ పంట ॥ 222

రేకు 149 శంకరాభరణం

మతంగపర్వతమాడ మాల్యవంతమునీడ
అతిశయిల్లినపెద్దహనుమంతుఁ డితఁడా ॥ పల్లవి ॥

యీతఁడా రామునిబంటు యీతఁడా వాయుసుతుఁడు
ఆతతబలాఢ్యుఁ డందు రాతఁ డితఁడా
సీతను వెదకివచ్చిచెప్పినయాతఁ డితఁడా
ఘాతలలంకలోని రాక్షసవైరి యితఁడా ॥ మతం ॥

అంజనాసుతుఁ డితఁడా అక్షమర్దనుఁ డితఁడా
సంజీవనికొండ దెచ్చె సారె నితఁడా
భంజించెఁ గాలనేమిని పంతమున నితఁడా
రంజితప్రతాపకపిరాజసఖుఁ డితఁడా ॥ మతం ॥

చిరజీవి యీతఁడా జితేంద్రియు డితఁడా
సురల కుపకారపుచుట్ట మీతఁడా
నిరతి శ్రీవేంకటాద్రిని విజనగరములో -
నరిది వరములిచ్చీ నందరికి నితఁడా ॥ మతం ॥ 223

కాంబోది

ఏమని విన్నవింతు నిదివో నాభాగ్యము
కామించి మీశరణంటిఁ గమలారమణా ॥ పల్లవి ॥

కలది యందరికై తేఁ గర్మఫలము
కెలన నాకై తే నీకృపాఫలము
అల సురలకు మథితామృతము
నెలకొన్న నా కై తే నీనామామృతము ॥ ఏమ ॥

సకలాత్మలబ్రదుకు సంసారమూలము
ప్రకటించ నాకై తే నీపాదమూలము
వెకలిలోకులరతి వీధివీధిని నా-
త్రికరణరతి నీదివ్యభావవీధిని ॥ ఏమ ॥

రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు
సంగతి నాకు నీభక్తజనులయందు
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
చెంగట నాధ్యానము నీశ్రీమూర్తియందు ॥ ఏమ ॥ 224

### పాడి

ఇహపరసాధన మీతలఁపు
సహజజ్ఞానికి సత మీతలఁపు ॥ పల్లవి ॥

సిరులు ముంగిటను జిగిఁ దడఁబడఁగా
హరిని మఱవనిది యది దలఁపు
సరిఁ గాంత లెదుట సంచడిగొనఁగా
తిరమయి భ్రమయనిదే తలఁపు ॥ ఇహ ॥

వొడలి వయోమద ముప్పతిల్లినను
అడఁచి మెలంగుట యది దలఁపు
కడఁగుచు సుఖదుఃఖములు ముంచినను
జడియని నామస్మరణమే తలఁపు ॥ ఇహ ॥

మతి సంసారపుమాయ గప్పినను
అతికాంక్షఁ జొరని దది తలఁపు
గతియై శ్రీవేంకటపతి గాచిన
సతతము నితనిస్మరణమే తలఁపు ॥ ఇహ ॥ 225

### శంకరాభరణం

శరణన్న విభీషణుఁ గరుణఁ గాచినవాఁడు
పరికింపఁ దారకబ్రహ్మమా యీరాముఁడు ॥ పల్లవి ॥

ఆలికై విల్లువిఱిచి వాలికై యమ్ము వేసిన-
వాలుమగఁటిమిగలవాఁడా వీఁడు
ఱాలను జలధిగట్టి కేలను మోక్షమిచ్చి
యేలెను జటాయువును యీతఁడా రాముఁడు ॥ శర ॥

మింటికట్లు దెగనేసి యంటి పగసాధించి
దంటరాకుమారుఁడు తా నీకూరుఁడా
బంటుగా వాయుజు నేలి నంటు సుగ్రీవుతోఁ జేసి
కంటకరావణవైరి ఘనుఁడా యీరాముఁడు ॥ శర ॥

రాకాసుల మర్దించి కాకాసురు నటు గాచి
మైకొన్న జానకీరమణుఁ డితఁడా
యీకడ శ్రీవేంకటాద్రి నిరవై తాను నున్నాఁడు
దీకొన్న ప్రతాపపుదేవుఁడా యీరాముఁడు ॥ శర ॥ 226

సాళంగనాట

౧ మిన్నునేలా నొక్కటైనమేటితేరు
కన్నులపండువయినశ్రీకాంతునితేరు ॥ పల్లవి ॥

జలధులమీఁదను చక్కఁగా నేఁగెను తేరు
బలిమిఁ గులాద్రులపైఁ బారెను తేరు
వెలుచులంకముంగిట పేరెలువారెను తేరు
చెలఁగె దిగ్విజయపుశ్రీహరితేరు ॥ మిన్ను ॥

రమణఁ గుండిననగరము చుట్టుకొన్నతేరు
తిముచు రుకుమిణిఁ దెచ్చినతేరు
సమరములో జరాసంధునిఁ దోలినతేరు
అమరులవెనుబలమగుశౌరితేరు ॥ మిన్ను ॥

వొట్టి సృగాలవాసుదేవుని భంగించినతేరు
బెట్టుపౌండ్రకునిపై దాడివెట్టినతేరు
అట్టె శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
పట్టమేలుచు నెక్కిన పరమాత్మతేరు ॥ మిన్ను ॥ 227

---

౧. చూ. ఇదే రాగములో కొంతపదబంధభేదము భావభేదము గలిగిన తేరుపా॰ సం॰ 110.

సాళంగనాట

సింగారాల మించీ నరసింహదేవుఁడు
చెంగట నున్నాఁడు నరసింహదేవుఁడు ॥ పల్లవి ॥

సురలు [౧] జయ వెట్ట నసురలెల్ల మొఱవెట్ట
సిరితో మెలఁగీ నరసింహదేవుఁడు
ధరణి [౨] దంపెట్టఁ బ్రతిధ్వనులు మిన్నులు ముట్ట
శిరసెత్తె నలి నరసింహదేవుఁడు ॥ సింగా ॥

కాంచనదైత్యుఁడు [౩] దొరకాలువనెత్తురు వార
చించెను గోళ్ల నరసింహదేవుఁడు
పంచలఁ బంతాలు మీరి భవనాశియేరు వార
చెంచెతలఁ గోరీ నరసింహదేవుఁడు ॥ సింగా ॥

బలిమి పైపై నెక్క బ్రహ్లాదుఁ డగ్గై మొక్క
చెలికిఁ గరుణ నరసింహదేవుఁడు
అలరి శ్రీవేంకటాద్రి నహోబలముమీఁద
చెలువమే చూపీ నరసింహదేవుఁడు ॥ సింగా ॥ 228

రేకు 150

నాట

[౪] దానవారితోడిపగ ధరించరాదు మీకు
కానుకిచ్చి శరణవి కప్పము లియ్యరో ॥ పల్లవి ॥

భ్రమసి వార్ధిఁబడ్డాను పాతాళము దూరినాను
సమయింపక మానఁడు శత్రులార
రమణ భూమిచొచ్చిన బ్రహ్మచే వరముగొన్న
తమిఁ జంపక మానఁడు దైతేయులాల ॥ దాన ॥

---

౧. 'జయజయ' పూ.ము.పా. ౨. దంపెట్ట. ='ఓపెట్ట' = అరచుట కావోలు. 'జయపెట్టు' వలె 'ఓపెట్టు' అనునది నేటికిని వ్యవహారమున గలదు.
౩. 'దోర' కావచ్చు. దోర='ఎఱ్ఱనైన' కావచ్చు. ౪. ఇందు దశావతార సమన్వయము గలదు.

రాసిమిన్నులో దాఁగిన రాచమూకలలోనున్న
కోసివేసీఁ దల లరికుమతులాల
ఆసఁ ద్రికూటమెక్కినా ఆచక్రవాళమంటినా
తోసి సాధించకపోఁడు దుర్మతులాల ॥దాన॥

సతుల మాఁటుననున్నా సరి నెందెందు వోయినా
రతి మెట్టక మానఁడు రాకాసులాల
యితఁడు శ్రీవేంకటేశుఁ డెదురులేదితనికి
గతియని మొక్కరో వోకపటులాల ॥దాన॥ 229

సాళంగం

భోగించఁ బుట్టినసొమ్ము పొంచి [౧]పరానకేలోపు
శ్రీగురుఁడ నీవే దయసేతువుగాని ॥పల్లవి॥

యీరెండుచేతులే యిన్ని పాపాలకు నోపు
వూఁరకే పుణ్యము సేయనోపవుగాని
[౨]మారుకొ నీరెండుఁగాళ్లే మాపుదాఁకాఁ జుట్టనోపు
యేరీతి దేవ నీగుడి కేఁగ నలసుఁ గాని ॥భోగిం॥

కన్ను లివి రెండే మిన్నగలంతాఁ జూడనోపు
ఉన్నతి నాసాగ్ర[౩]దృష్టి కోపవుగాని
అన్నిటా రెండుపెదవు లధరామృతాన కోపు
సన్నల మోక్షమ్ముతోవ జపించవు గాని ॥భోగిం॥

యీవీనులురెండే విశ్వమంతా నాలించనోపు
వోవల శాస్త్రాలకైతే నోపవుగాని
శ్రీవేంకటేశ నీవే చిత్తాన జ్ఞానమిచ్చితే
భావించి జీవుఁడిన్నిటా బ్రదుకనోపుఁగాని ॥భోగిం॥ 230

---

౧. పరాపకు+ఏల+ఓపు. ౨. 'మారుకొని తెండు గాళ్లె' పూ.ము.పా. 'మారుకొని+ఈ రెండు కాళ్లే'. రెండవ చరణము రెండవ పాదమున తప్ప అంతటా ఈ రెండు' 'ఇవి రెండు' అనియే వున్నది. ౩. 'ద్రిష్టి' రేకు.

ముఖారి

పరము నిహము ౧ పంటవండినయట్టు
యిరవుగాఁ దానే యెట్టయెదుట నున్నాఁడు ॥ పల్లవి ॥

మించినమహిమలెల్లా మూర్తివంతమైనట్టు
కొంచినపిరములు సాకారమైనట్టు
అంచె శృంగారరసాన కంగములు వచ్చినట్టు
యెంచఁగ శ్రీవేంకటేశు డెదుర నున్నాఁడు ॥ పర ॥

చెలఁగి ఆకాశానకు చైతన్యము వచ్చినట్టు
అల దయాసింధువు ప్రత్యక్షమైనట్టు
మొలచి సుజ్ఞానము మోసులెత్తివుండినటు
యెలమి శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు ॥ పర ॥

పరగ నానందము ప్రతిబింబించినయట్టు
సురలభాగ్యము పొడచూపినట్టు
పురులై యలమేల్మంగ నురమున నించుకొని
యిరవై శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు ॥ పర ॥ 231

భైరవి

పరమాత్ముఁడు సర్వపరిపూర్ణుఁడు
సురలకు నరులకు చోటయియున్నాఁడు ॥ పల్లవి ॥

కన్నులఁ గంటానే కడు మాటలాడుతానే
తన్నుఁగానివానివలె దాఁగియున్నాఁడు
అన్నియు వింటానే అట్టే వాసనగొంటానే
వన్నెలనూనెకుంచమువలె నున్నాఁడు ॥ పర ॥

---

౧. పంట + పండిన.

తనువులు మోచియు తలఁపులు దెలిసియు
యెనసియునెనయక యిట్లున్నాఁడు
చెనకి మాయకు మాయై జీవునికి జీవమై
మొనసి పూసలదారమువలె నున్నాఁడు ॥ పర ॥

వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై
పూవులువాసనవలెఁ బొంచియున్నాఁడు
భావించనిరాకారమై పట్టితే సాకారమై
శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతై యున్నాఁడు ॥ పర ॥ 232

హిందోళవసంతం

మూఁడే మాటలు మూఁడుమూండ్లు తొమ్మిది
వేఁడుకొని చదువరో వేదాంతరహస్యము ॥ పల్లవి ॥

జీవస్వరూపము చింతించి యంతటాను
దేవుని వైభవము తెలిసి
భావించి ప్రకృతిసంపద యిది యెఱఁగుటే
వేవేలువిధముల వేదాంతరహస్యము ॥ మూఁడే ॥

తనలోనివిజ్ఞానము తప్పకుండాఁ దలపోసి
పనితోడ నందువల్ల భక్తి నిలిపి
మనికిగా వైరాగ్యము మఱవకుండుటే
వినవలసినయట్టివేదాంతరహస్యము ॥ మూఁడే ॥

వేడుకతో నాచార్యవిశ్వాసము గలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి దాసుఁడౌటే
వీడివడ్డబ్రహ్మానంద వేదాంతరహస్యము ॥ మూఁడే ॥ 233

సామంతం

ఇట్లానే యోగలక్ష్య మెఱుఁగుకొంటే ఫలించు
యెట్లయినా గురువాక్య మేమరకుఁడీ ॥ పల్లవి ॥

కాంతఁ దలచుకొంటేనే కామోద్రేకము వుట్టు
యింతలోఁ గూడెనా యేడకేడ సూత్రము
చింతకాయతొక్కు చూచితేనే నోరూరు
యెంతకెంతదవ్వు యేడకేడ సూత్రము ॥ ఇట్లా ॥

వీనుల మంచిమాటలు వింటేనే సంతోష ముబ్బు
యేవిజము గనె నేడకేడ సూత్రము
ఆనించితే నాలుకనే అరురుచులుఁ దెలిసీ
యీనెపమున నేడకేడ సూత్రము ॥ ఇట్లా ॥

ముక్కుకొనఁ బ్రాణ ముండి ముందువెనుకకు వచ్చి
యెక్కడ ౧మోచున్న దేడ కేడ సూత్రము
చిక్కి శ్రీవేంకటేశుఁడు జీవుల కంతర్యామి
యిక్కు వెదఁగితే నీడ కిదే సూత్రము ॥ ఇట్లా ॥ 234

రేకు 151 దేసాక్షి

ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంచితముగ నితనిశరణంటే సర్వఫలప్రద మిందరికి ॥ పల్లవి ॥

హరిఁ గొలువనికొలువులు మఱి యడవిఁగాసినవెన్నెలలు
గరిమల నచ్యుతు వినవికథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁగానితపంబులు పాతాళమునసిధానములు
మరుగురునికిఁగానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు ॥ఎంచి॥

౧. మోచి+ఉన్నది.

వైకుంఠుని నుతియించనివినుతులు వననిధిఁ గురిసినవానలు
ఆకమలోదరుఁ గోరనికోరికె లందనిమావిఫలంబులు
శ్రీకాంతునిపైఁ జేయనిభక్తులు చెంబుమీఁదికనకపుఁబూఁత
దాకొని విష్ణుని తెలియనితెలువులు తగ నేటినడిమి పైరులు ॥ఎంచి॥

హావిరిఁ గేశవునొల్లనిబదుకులు వరతఁ గలపుచింతపండు
గోవిందుని కటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు
భావించి మాధవుపైలేనితలఁపులు పలు౧ మేఘములవికారములు
శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు ॥ఎంచి॥ 235

## గుజ్జరి

త్రికరణశుద్ధిగఁ జేసినపనులకు దేవుఁడు మెచ్చును లోకము మెచ్చును
వొకటి కోటిగుణితంబగుమార్గము లుండఁగఁ బ్రయాసపడనేలా ॥పల్లవి॥

తనమననే పరిపూర్ణమైన౨ గోదావరి గంగా కావేరి
కనకబిందుయమునాగయాది౩ ముఖ్యక్షేత్రంబుల సంతతమును
దినకరసోమగ్రహణకాలముల తీర్థాచరణలు సేసినఫలములు
తనుఁదానే సిద్ధించును వూరకే దవ్వులు దిరుగఁగ మరి యేలా ॥త్రిక॥

హరి యనురెండక్షరములు నుడివిన నఖిలవేదములు మంత్రములు
గరిమ ధర్మశాస్త్రపురాణాదులు క్రమమునఁ జదివినపుణ్యములు
పరమతపోయోగంబులు మొదలగుబహుసాధనములసారంబు
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలు వెదకఁగనేలా ॥త్రిక॥

మొదల శ్రీవేంకటపతికిఁ జేయెత్తి మొక్కినమాత్రములోపలనే
పదిలపుషోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును
వదలక సాంగంబులుగాఁ జేసినవాఁడే కాఁడా పలుమారు
మదిమదినుండే కాయక్లేశము మాఁటికి మాఁటికిఁ దనకేలా ॥త్రిక॥ 236

౧. ఈ 'పలు' పూ.ము. పా.లో తప్పిపోయినది. ఇదిలేకున్న యతిభంగము. ౨. రేకులో 'ర్ణ' కుబదులు ణ్ణ అనియున్నది. ౩. పూ.ము. పా.లో 'ముఖ్య' తప్పిపోయినది. ఇది లేకున్నచో యతిభంగము.

### ముఖారి

ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు
ఆతనిబంట్లము మాకు నన్నిటా ౧ విశ్చింతము || పల్లవి ||

యేలికెగలబంటుకు యెక్కడిది విచారము
పాలించేమగఁడుగలపడఁతి కేడ చింత
కోలుముందై తండ్రిగలకొడుకు కేది తొడుసు
యీలీల హరిదాసుని కెక్కడికోరికెలు || ఆతఁ ||

బలుదుర్గమువానికి భయ మేమిటా లేదు
కలిమిగలవానికి కడమ లేదు
యిల క్షేత్రవంతునికి నెందూ ౨ దరిద్రము లేదు
అల శ్రీపతిబంట్లకు నలమట లేదు || ఆతఁ ||

పట్టినముద్రుంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టిచాతనివారికిఁ గొంతు లేదు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయు సేవకులము
గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే || ఆతఁ || 237

### గుండక్రియ

మనసులో మర్మమై మరలఁ బారుచునుండు
పొనుఁగువడ్డమదము పోవఁగనీదు || పల్లవి ||

అంటేనే విషమెక్కు దిష్టముగ విషలత
కంటేనే వలపెక్కుఁ గాంతలను
అంటిముట్టి కాఁగిట నలముకొంచేఁగనక
మంటఁగలసిన భ్రమ మానలేదు || మన ||

---

౧. 'విశ్చింతయె' కావచ్చు. లేక 'మనసు' అధ్యాహారము కావచ్చు.
౨. 'దరిద్రము' ఇది భావప్రధాన నిర్దేశము కావచ్చు. లేక వ్యావహారిక ప్రయోగమైన కావచ్చు.

మెట్టితేనే కఱచును మెలపుతోఁడుతఁ బాము
పట్టితే విడ్వనీదు పచ్చనిపైఁడి
దట్టమై మేన సొమ్ములు తగులుకొంటేఁగనక
తొట్టి వెళ్లిఁబోయినాస తొలఁగనీదు ॥మన॥

ఆహారము వెట్టితేను అట్టె విడుచు భూతము
ఆహారానకుఁ బోదెక్కు నట్టే ప్రాయము
యీహల శ్రీవేంకటేశుఁ డిట్టే కరుణించితేను
సాహాయమై వచ్చుఁ దానే సత్వగుణజ్ఞానము ॥మన॥ 238

సాళంగనాట

దిక్కులు సాధించఁబూని దేవదుందుభులు మ్రోయ
యెక్కువతో శ్రీవేంకటేశుఁ డెక్కెఁ దేరు ॥పల్లవి॥

పన్నిద్దరుసూరియులబండికండ్ల తేరు
సన్నుతి శేషాదిదేవాననపుఁదేరు
కన్నులపండుగై నగరుడధ్వజపుఁదేరు
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥దిక్కు॥

మించునానామేఘములమేలుకట్లతేరు
చుంచులనక్షత్రాలకుచ్చులతేరు
అంచెదేవతలే బొమ్మలై వుండినట్టితేరు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥దిక్కు॥

అట్టె కిం దేడులోకములంతరువులైనతేరు
నట్టనడుమను బ్రహ్మాండపుతేరు
దిట్టయలమేల్మంగతోఁ దిరమైవుండేటితేరు
యిట్టె శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥దిక్కు॥ 239

రేకు 152 శుద్ధవసంతం

మాయ కిదె సహజము మాయను గెలువరాదు
మాయానాథుఁ గొలిచితే మన్నించు నాతఁడే ॥ పల్లవి ॥

చేతికి లోనై నట్టుండు ౧ సృష్టిలోనివేడుకలు
పోతరించి పట్టఁబోతేఁబోవు నట్టటే
ఆతుమలో వేసరి అలసి పూరకుండితే
పైతాళపునీడవలె వచ్చు వెంటవెంటను ॥ మాయ ॥

తీపువలెనే వుండు దిష్టపుఁబదార్థాలు
మేపుగొంటే మీసాలమీఁదితేనౌను
యేపున నాస విడిచి యేరుపడి వుంటేను
మూపునఁగట్టినచద్దై మోఁపించును ॥ మాయ ॥

తలఁపులోనే వుండు తనలోని యంతరాత్మ
తెలుపుకోఁబోతే పెక్కుదేవతలౌను
చలపట్టి యీతనినే శరణని కొలిచితే
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడై రక్షించును ॥ మాయ ॥ 240

మంగళకౌశిక

దేవుఁ డొక్కఁడే గురితెలిసినవారికి
యీవలావల చూచినా నిఁక లేదు తెఱఁగు ॥ పల్లవి ॥

కోపము మానితేనే కోటిజపాలు సేయుట
పాపము సేయకుంటేనే బలుతపము
లోపల తా నూరకుంటే లోకమెల్లాఁ జరించుట
మాపుదాఁకా వెదకినా మఱి లేదు తెఱఁగు ॥ దేవు ॥

౧. 'శ్రిష్టి' రేకు.

పరకాంత నంటకుంటే బలుపుణ్యాలు సేయుట
    సొరిది నాస మానుటే సోమపానము
    సరి మోనాన నుండుటే సన్యాసము చేకొనుట
    యిరవైతే నంతకంటే నిఁక లేదు తెఱఁగు ॥ దేవు ॥

పలుసుఖదుఃఖములఁ బాసివుండుటే మోక్షము
    అల చంచలము మానుటది యోగము
    యిలపై శ్రీవేంకటేశుఁ డిచ్చినసుజ్ఞాన మిది
    యెలమి బుద్ధిఁ బోల నిఁక లేదు తెఱఁగు ॥ దేవు ॥ 241

సౌరాష్ట్రం

తలఁచుకో వోమనస తగినద్రిష్టము లివి
    వెలలేకతెచ్చేటివివేకము లోధనము ॥ పల్లవి ॥

గాలిఁబోయేమాఁటలు లోకములోవిసుద్దులెల్లా
    గాలిఁబో వెన్నఁడును శ్రీకాంతునుతులు
    జాలిఁబడేచేఁతలు సంసారభోగములెల్లా
    జాలిలేనివి విష్ణునిసంతతపుపూజలు ॥ తలఁ ॥

మాయమౌఁ గొన్నాళ్లకు మానుషకృత్యములెల్లా
    మాయముగానివి దైవికమహిమలెల్లా
    కాయకములే తమకల్పితము లన్నియును
    కాయకము గాక విల్పుఁ గమలాక్షుమన్నన ॥ తలఁ ॥

వుడివోవు రాఁగారాఁగా నున్నతకర్మఫలాలు
    వుడివోదు దేవునిపై నొనరుభక్తి
    జడియు నితరులిచ్చేసకలవరములును
    జడియదు శ్రీవేంకటేశ్వరుఁడిచ్చేవరము ॥ తలఁ ॥ 242

సాళంగనాట

అహోబలేశ్వరునకు నాదిమూర్తికి
విహారమే పంతము వీరసింహమునకు ॥ పల్లవి ॥

చుక్కలు మొలపూసలు సూర్యచంద్రులు కన్నులు
దిక్కులు చేతు లెండలు దివ్యాయుధాలు
మిక్కుటపువేదములు మించుఁగొనవెంట్రుకలు
రక్కసులఁ జెండేవిదారణసింహమునకు ॥ అహో ॥

శైలములే పాదములు జానువులే లోకములు
కాలచక్రమే నోరు గ్రహాలు పండ్లు
చాలుకొన్న మేఘములు సకలదివ్యాంబరాలు
పాలించేప్రతాపపుసింహమునకు ॥ అహో ॥

అంతరిక్షమే నడుము అట్టె భూమియే పిరుఁదు
వంతఁ గృపారసము వార్ధులెల్లాను
యింతటా శ్రీవేంకటాద్రి యిరవు మహాగుహా
రంతు లురములు ఘోరరౌద్రసింహమునకు ॥ అహో ॥ 243

పాడి

ఈరూపమై వున్నాఁడు యీతఁడే పరబ్రహ్మము
శ్రీరమాదేవితోడ శ్రీ వేంకటేశుఁడు ॥ పల్లవి ॥

పొదలి మాయాదేవిపట్టినసముద్రము
అదె పంచభూతాలుండే ౧ అశ్వత్థము
గుదిగొన్నబ్రహ్మాండాలగుడ్లఁ బెట్టేహంస
పదరపుబ్రహ్మలకు జలజమూలకందము ॥ ఈరూ ॥

౧. 'అశ్వత్థము' రేకు.

అనంతవేదాలుండేటిఅక్షయవటపత్రము
ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము
కనలుదానవమత్తగజసంహారసింహము
మొనసి సంసారభారము దాల్చేవృషభము ॥ ఈరూ ॥

సతతము జీవులకు చైతన్యసూత్రము
అతిశయభక్తులజ్ఞానామృతము
ప్రతమై శ్రీవేంకటాద్రి వరములచింతామణి
తతిగొన్న మోక్షపుతత్త్వరహస్యము ॥ ఈరూ ॥ 244

నాట

విఱిగి పారెడియట్టివీరిడియోరిపులాల
తఱి శరణుచొరరో దరడాలువెట్టరో ॥ పల్లవి ॥

వీఁడె వచ్చెఁ గృష్ణుఁ డిదె వేయరో కైదువులు
కాఁగినపోట్లు రాఁగి కదియకురో
ఘోఁడిమితో భీతివాయ పూరి నోళ్లఁ గరవరో
ఆఁడువార మనుకోరో అతఁడు దగవఁడు ॥ విఱి ॥

గోవిందుఁడు దాడివచ్చె గుసుకుచుఁ బారరో
కావు మని మెడలఁ బాగలువేయరో
౧వేవేగ బిడ్డలఁ బేర్లు విభునికిఁ బెట్టరో
వో వో యెంగిలికిఁ జేతు లొగ్గరో రక్షించీని ॥ విఱి ॥

మొత్తీ శ్రీవేంకటేశుఁడు మూలలకు దాఁగరో
వొత్తిలి పంతములిచ్చి మీ రోడఁగదరో
హత్తి మీతలలు విరియఁగఁ బోసుకొనరో
బొత్తుగా మిమ్ము గెలిచెఁ బొగడరో మెచ్చీని ॥ విఱి ॥ 245

౧. ఈపాదము వున్నదున్నట్లుగా మంచి అన్వయ మగుటలేదు, 'బిడ్డలకుఁ బేర్లు విభునివి పెట్టరో' అనిన బాగుండునేమో. తమ్ముగెలిచినవాని పేర్లు తమబిడ్డలకు పెట్టుట పరాజితలక్షణములలో నొక్కటి. లేక "బిడ్డలపేర్లువిభునికి=ప్రభువునకు సంబంధించినవిగా పెట్టరో" అని కావచ్చు. అప్పుడు "బిడ్డలఁ" లో అరసున్న చింత్యము కావచ్చు.

రేకు 153 నాట

పారి నీకుమ విఱిగిపోయినదానవులు
విరుదులుడిగి వోడబేహారులైరి ॥ పల్లవి ॥

మకుటాలు దీసి జటామకుటాలు గట్టుకొని
వెకలిరిపులు మునివేషులైరి
మొకములను బోమపుమొకములు వెట్టుకొని
అకటా కొందరురిపు లాటవారైరి. ॥ పారి ॥

పేరులు విడిచి శంకుఁబేరులు మెడ వేసుక
సారెకుఁ గొందరు శివసత్తులైరి
బీరపుపాములు మాని పెద్దగడపాము నేర్చి
తోరపుఁబగతులెల్ల దొమ్మరులైరి. ॥ పారి ॥

నాదింత వెఱచి సింగినాదా లూదుకొంటాను
సోదించేరటాఁ గొందరు జోగులైరి
యీదెస శ్రీవేంకటేశ యిన్నియు మాని కొందరు
౧ దాదాత నీశరణని దాసరులైరి. ॥ పారి ॥ 246

కాంబోది

ఐనట్టయ్యీఁగాక హరికల్పితము లివి
మానేటి వేఁటివో మానని వేవో ॥ పల్లవి ॥

వొక్కరు తలఁచినట్టు వొకరితలఁపు రాదు
పక్కన నందరికి బహుభావాలు
అక్కట మొద లొకటి ౨ అనలుఁగొనలు వేరు
యెక్కడని తగిలేది యేమిసేసేది. ॥ ఐన ॥

---

౧. 'దాదాతని శరణని దాసరులైరి' పూ.ము.పా.

౨. 'నవలుఁగొనలు' అనుట వహజము. ఇక్కడ 'అనలు' యతి స్థానము గాత.

పొరుగువానిచేత అపొరుగువాఁడు మెచ్చఁడు
నరులకర్మములు నానావిధాలు
గరిమ నన్ను మొక్కితే కడుపుతనివి వేరు
కరుణించొనన నేవి కావన నేవి. ॥ఐన॥

కడఁగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు
కెడఁగుజీవులపొందు పెక్కురీతులు
కడుశ్రీవేంకటేశుఁ దొక్కఁడు జగత్తులు వేరు
వాడిఁగట్టుకొనే దేది వొల్లననే దేది ॥ఐన॥ 247

నాట

వింటె విన్నిచోటులను నీమహిమలే
అంటనే మొక్కేము నీకు నాదినారసింహా ॥పల్లవి॥

కూరిమి యిందిరమీఁద, కోపము అసురమీఁద
తారుకాణనవ్వు దేవతలమీఁదను
ఆరీతి నీకొలు విట్టే అహోబలముమీఁద
నారుకొనె నీనేరుపు నారసింహా ॥వింటె॥

కరుణ ప్రహ్లాదుమీఁద, గన్నులు దిక్కుల మీఁద
సరిచేతులు పేగులజంధ్యాలమీఁద
గరిమ నీనటనలు ఘనప్రతాపముమీఁద
తిరమాయ నీకోరిక దివ్యనారసింహా ॥వింటె॥

శాంతము లోకముమీఁద శౌర్యము శత్రులమీఁద
కాంతులెల్లా తనదివ్యకాయముమీఁద
చింతదీర వినోదము శ్రీవేంకటాద్రిమీఁద
సంతతమై నీకుఁ జెల్లె జయనారసింహా ॥వింటె॥ 248

సాళంగనాట

అన్నిటా నీపెంపు వింత హనుమంత నీ-
వున్నచోటు నిశ్చింత మోహనుమంతా. ॥ పల్లవి ॥

రామునిసేనలఁ గాచి రావణుగర్వ మడఁచి
ఆముకొన్న బలవంత హనుమంతా
గోమున జలధి దాఁటి కొండతో సంజీవి దెచ్చి
ధీమంతుఁడవైతి వింత దివ్యహనుమంత ॥ అన్ని ॥

చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోఁచె
అక్కజపునీరూ పంత హనుమంత
చొక్కమై మీ రుండఁగాను సుగ్రీవాదులకెల్లా
అక్కర లే దించుకంతా హనుమంతా ॥ అన్ని ॥

జంగచాఁచి చేయెత్తి సరిఁ బిడికిలించుక
అంగము విక్కించి తెంత హనుమంత
ఉంగగుశ్రీవేంకటాద్రిరామునిదేవి కిచ్చితి-
వంగులియ్యక మొక్కంత హనుమంతా ॥ అన్ని ॥ 249

రామక్రియ

మగటిమిగలహనుమంతరాయ
౧ దిగువపట్టణములోనిదేవ హనుమంత ॥ పల్లవి ॥

చక్కఁగాఁ దోఁక చాఁచి జంగవెట్టి చేచాఁచి
అక్కజపుప్రతాపపుహనుమంతుఁడా
రక్కసులఁ దునుమాడి రామునిదేవులకు
దిక్కై యుంగరమిచ్చినదేవ హనుమంత ॥ మగ ॥

౧. దిగువపట్టణము దిగువతిరుపతియా?

కీలు౧ గంటు వేసుకొని కెరలి పిడికిలించి
అలకించేవు దిక్కులు హనుమంతుఁడా
నేలకు మింటికి మేను నిండఁ బెరిగి యశని
తీలుపడఁగొట్టినట్టిదేవ హనుమంతుఁడా ॥ మగ ॥

తమితోడ దాసులను తప్పక కాచేనని
అమర నభయమిచ్చినహనుమంతుఁడా
జమళి శ్రీవేంకటేశుసరసపూడిగావకు
తిమురుచు నుండేయట్టిదేవ౨ హనుమంతా ॥ మగ ॥ 250

శ్రీరాగం

ఏమి చెప్పే దిది యీశ్వరమాయలు
దీముప్రతిమకును త్రిజగము గలిగె ॥ పల్లవి ॥

మలమూత్రంబుల మాంసపుముద్దకు
కులగోత్రంబులగుణి గలిగె
తొలుతొమ్మిదగుతోలుఁదిత్తికివి
పిలువఁగఁ బేరును బెంపును గలిగె ॥ ఏమి ॥

నెత్తురునెమ్ములనీరుబుగ్గకును
హత్తినకర్మము లటు గలిగె
కొత్తవెంట్రుకలగుబురులగంతికి
పొత్తులసంసారభోగము గలిగె ॥ ఏమి ॥

నానాముఖములనరములపిడుచకు
పూనినసిగ్గులు భువిఁ గలిగె
ఆనుక శ్రీవేంకటాధిపుఁ దేలఁగ
దీనికిఁ బ్రాణము తిరముగఁ గలిగె ॥ ఏమి ॥ 251

---

౧. పూ.ము.పా. లో 'కీలుగంటుగంటు' అని ఒక 'గంటు' శబ్దము ఎక్కువగా మన్నది. ౨. 'హనుమంతుఁడా' పూ.ము.పా.

రేకు 154 బౌళి

పురుషుండవి శ్రుతి వొగడీనట ఆపురుషుఁడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి విని వించే నసంబద్ధములు ॥ పల్లవి ॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట అమూరితి అవయవరహితుఁడట
తగుబాహువులను రాజులట ఆతత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యులట ఆబ్రహ్మముదేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతవిరూపము లేదట ॥ పురు ॥

తనవందనమునుఁ గలదట దైవము తనుఁ జూడఁ గన్నులు లేవట
తనవిన్నపమునుఁ జేయునట ఆతవికివి వీనులు లేవట
తనయిచ్చినదే నైవేద్యంబట దైవమునోరే లేదట
తనయిచ్చేటిధూపంబును గలదట దైవముముక్కును లేదట ॥ పురు ॥

అంతాఁ దానే దైవమటా యజ్ఞము లొరులకుఁ జేయుటట
సంతతమునుఁ దా స్వతంత్రుఁడటా జపములవరముల చేకొంటట
చింతింపఁ దానే యోగియటా చేరువ మోక్షము లేదట
పంతపుశ్రీవేంకటపతిమాయలు పచారించిన విధియట ॥ పురు ॥ 252

శంకరాభరణం

ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యాలాల ॥ పల్లవి ॥

పాప మొక్కఁడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున నొకరిపుణ్య మిందరికి రావలదా
కోపించి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁడొక్కఁడైతే సురలిందరుఁ గావలదా ॥ ఏకా ॥

వొకఁ డపవిత్రుఁ డైతే నొగి నిందరుఁ గావలదా
వొకఁడు శుచై వుండితే వొద్ద కిందరుఁ గావలదా
వొకవిరతిసుఖ మంటి యిందరును వొనరఁ బొందవలదా
వొకనిదుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా ॥ఏకా॥

అకట నొకఁడు ముక్తుఁడయితే నందరునుఁ గావలదా
దీకొని యొకఁడు [1]బంధుఁ డయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి-
లోకపుమనులనుఁ దెలుసుకోవలదా ॥ఏకా॥ 253

శంకరాభరణం

దేవుఁడుగలవారికి దిగులుఁ జింతయు లేదు
శ్రీవిభుఁడే అన్నిటా రక్షించుఁగనక ॥పల్లవి॥

యేలికగలబంటుకు యేవిచారములేదు
వోలి మగఁడుగలాలికి వొప్పమి లేదు
పోశిమిఁ దండ్రిగలపుత్రుని కంగద లేదు
మేలుగాఁ బండినభూమికిఁ గరవు లేదు ॥దేవు॥

బలముగలరాజుకు భయమేమియు లేదు
కలిమిగలవాని కక్కుర లేదు
యిల నాచారవంతుని కేపాపమును లేదు
తలఁపుఁబుణ్యముగలఅతనికిఁ జేటు లేదు ॥దేవు॥

గురువుగలవానికిఁ గొఱఁత యేమియు లేదు
పరముగలవానికి భ్రాంతులు లేవు
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటా మాకుఁ గలఁడు
అరయ దాసులము మా కడ్డఁకే లేదు ॥దేవు॥ 254

౧. 'బద్ధుఁడయితే' అనుట సబబేమో? లేక బద్ధార్థములోనే 'బంధు' శబ్దమా?

కేదారగౌళ

౧కమలారమణ నీకల్పితపుమానిసిని
తమితోడ నాదిక్కు దయఁ జూడవే ॥ పల్లవి ॥

ఆరీతి బ్రాహ్మణుఁడ ననుటే కాని దేహము
కోరి యాచారమునకుఁ గొలుపదు
పేరు వైష్ణవుఁడననే పెద్దరికమే కాని
సారమైనమనసులో జ్ఞానమే లేదు ॥ కమ ॥

చదివితినవియెడిం చలపాద మింతే కాని
అదన నందులోవిఅర్థ మెఱఁగ
పదరి సంసారమనే బహురూపమే కాని
చతురుఁడనాన నందు సమర్థుఁడఁ గాను. ॥ కమ ॥

దేవ మీభక్తుఁడననేతేజ మొకటె కాని
చేవమీర నినుఁ బూజించ నేరను
శ్రీవేంకటేశ నీచేతిలోనివాఁడ నేను
భావించి మఱి యేపాపము నెఱఁగను. ॥ కమ ॥ 255

కాంబోది

ఇన్నాళ్లు నందువందు నేమి గంటివి
అన్నిటా శరణు చొచ్చి హరి నినుఁ గంటివి ॥ పల్లవి ॥

అంగనలపసఁ జిక్కి అలయికలే కంటి
బంగారువెంటఁ దగిలి భ్రమ గంటివి
ముంగిటిక్షేత్రాలంటి ముంచి వెట్టిసేయఁ గంటి
అంగపునన్నే చూచి అంతరాత్మఁ గంటి ॥ ఇన్నా ॥

౧. 'కమలారమణుని' వ్రా.ము.పా.

చుట్టాలఁ జేరి చూచి సుద్దులవావులు గంటి
మట్టులేనివిషయసుతో మదము గంటి
వట్టికామములు సేసి వరుస మాయలు గంటి
పట్టి నారాయణాయని భక్తి నిన్నుఁ గంటిని ॥ఇన్నా॥

వింతచదువులవల్ల వేవేలుమతాలు గంటి
సంతకర్మములవల్ల సాము గంటిని
యింతట శ్రీవేంకటేశ యిటు నాజీవభావము
చింతించి అందులోన నీశ్రీపాదాలు గంటి. ॥ఇన్నా॥ 256

రేకు 155 సామంతం

సొరిది నమ్మిట్టే దయఁజూతువుగాకా
వెరపి మరి యెక్కడా నేమి విన్నవించే మిఁకను ॥పల్లవి॥

తలఁచితి నీరూపము తగిలితి నీపాదాలు
కలసితి నీదాసులగమిలోనను
చలివాసె భవములు నడిదీరెఁ గర్మములు
యెలమి నీమహిమలు యేమిచెప్పే మిఁకను ॥సొరి॥

నీముద్రలు ధరించితి నీగుణాలు వొగడితి
చేముట్టి పూజించితి శ్రీయంగాలు
తామసములెల్లా నూడె తతివచ్చె సాత్వికము
గోమున మరేమి నిన్ను గ్గొసరే మిఁకను. ॥సొరి॥

తిరుమణి ధరించితి తీర్థప్రసాదాలు గొంటి
విరివైనవీకథలు వీనుల వింటి
పరగ శ్రీవేంకటేశ పరము నిహముఁ గంటి
అరసి యితర మేమి ఆశపడే మిఁకను. ॥సొరి॥ 257

వరాళి

శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు
పైపై నీశరణమే పరమపదంబు. ॥ పల్లవి ॥

పరమాత్మునిపై నాత్మప్రవేశింపఁజేయుటే
పరికింపఁ బరకాయప్రవేశము
గరిమ నాహృదయాకాశమునఁ దలఁచుటే
గిరపై యబ్బినయట్టి ఖేచరత్వము ॥ శ్రీప ॥

మంచిపరమహంసనామము ప్రాణులచే వింట
చంచులవినేటిదూరశ్రవణము
కాంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట
యెంచఁగ దూరగమన మింటిలో నాట ॥ శ్రీప ॥

సావధానమె లోచూపు సర్వథా నిన్నుఁ జూచుట
తావులనే అనిమిషత్వము చేరుట
శ్రీవేంకటేశ్వర నీసేవకుఁడై నిలుచుటే
వేవేలుతత్త్వజ్ఞానవిధుల నిలుచుట ॥ శ్రీప ॥ 258

దేసాళం

అంతరంగములో నున్నహరియే గతిగాక
చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును ॥ పల్లవి ॥

పుట్టించినకర్మమే పోషించకుండునట
బెట్టుగా మనసే మఱపించునట
పట్టైనమేనే ఆసల బతిమాలింపించునట
చుట్టములెవ్వరు ఎంచిచూచినఁ బ్రాణికిని ॥ అంత ॥

పక్కన విత్తినభూమి పంట పండకుండునట
యెక్కడా మాయే భ్రమయింపించునట
అక్కరతోఁ జేసినపుణ్యమే కట్టివేసునట
దిక్కు దెస యెవ్వరు యీదేహిఁ గరుణించను ॥ అంత ॥

ఆసలఁబెట్టేపాయమే అటమటమౌనట
నేసేసంసారమే జ్ఞానిఁ జేయునట
వేసరక యింతకూ శ్రీవేంకటేశుఁ దేలికట
మోసపుచ్చేవారెవ్వరు ముదమే జీవునికి ॥ అంత ॥ 259

దేసాళం

ధరణి నెంద రెన్నితపములు చేసినాను
హరికృపగలవాఁడే అన్నిటాఁ బూజ్యుఁడు ॥ పల్లవి ॥

మితిలేనివిత్తు లెన్ని మేదినిపైఁ జల్లినాను
తతితో విత్తినవే తగఁ బండును
యితరకాంతలు మఱి యెందరు గలిగినాను
పతి మన్నించినదే పట్టపుదేవులు ॥ ధర ॥

పాలుపడి నరు లెన్నిపాట్లఁ బడి కొలిచినా-
నేలికె చేపట్టినవాఁడే యెక్కుడుబంటు
మూల నెంతధనమున్నా మంచి దానధర్మములు
తాలిమితో నిచ్చినదే దాఁపురమై నిల్చును ॥ ధర ॥

యెన్నికెకుఁ గొడుకులు యెందరు గలిగినాను
యిన్నిటా ధర్మపరుఁడే యీడేరును
పున్నతిఁ జదువు లెన్ని వుండినా శ్రీవేంకటేశు
సన్నుతించినమంత్రమే సతమై ఫలించును ॥ ధర ॥ 260

దేవగాంధారి

అన్నిటికి మూలమని హరి నెంచరు
పన్నినమాయలో వారు బయలు వాఁకేరు ॥పల్లవి॥

ప్రకృతిబోనులలోపలఁ జిక్కి జీవులు
ఆకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాలసంధిజన్మములవారు
వెకలిసంసారాలకే వేడుకపడేరు ॥అన్ని॥

కామువియేట్ల దిగఁగారేటిదేహులు
దోమటితమబదుకే దొడ్డదనేరు
పామిడికోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తల మనేరు ॥అన్ని॥

యితరలోకాలనెడియేఁతపుమెట్లప్రాణులు
కతల మోక్షమార్గము గంటిమనేరు
తతి నలమేల్మంగపతిశ్రీవేంకటేశ్వర
మతకాననున్నవారు మారుమలసేరు ॥అన్ని॥ 261

దేసాక్షి

ఎంత సోదించి చూచినా యెన్నెన్ని చదివినా
వింతలైననీమూర్తి వెసఁ దెలిసేమా ॥పల్లవి॥

లోకములో సముద్రములోఁతు చెప్పఁగరాదట
ఆకాశ మింతంతని యనరాదట
మేకొని భూరేణువులు మితి వెట్టఁగరాదట
శ్రీకాంతుఁడ నీమహిమ చెప్పిచూపవశమా ॥ఎంత॥

అల గాలి దెచ్చి ముడియగాఁ గట్టఁగరాదట
వెలయఁ గాలము గంటువేయరాదట
కలయ నలుదిక్కులకడ గానఁగరాదట
జలజాక్ష నీరూపు తలపోయఁగలనా ॥ ఎంత ॥

కేవలమైననీమాయ గెలువనేరాదట
భావించి మనసుఁ జిక్కఁబట్టరాదట
దేవ యలమేల్మంగపతివి నీశరణే గతి
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కొల్వవశమా ॥ ఎంత ॥ 262

రేకు 156 శంకరాభరణం

నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాఁడను
యేచి నీవు రక్షించేదే యెక్కుడుపుణ్య మింతే ॥ పల్లవి ॥

పాటించి నీభావము పట్టవశమా తలఁచి
మేటినామనసు నీకు మీఁదెత్తు టింతే
నూటికైన నీనామము నుడుగఁగవశమా
మాటలు నీసెలవుగా నుట్టుపెట్టు టింతే ॥ నీచి ॥

వేవేలైననీకథలు వినఁగ నాతరమా
సోవగా వీనులు తావు చూపుట యింతే
దేవ నీసాకారము ద్రిష్టించనావశమా
పావనముగా వందులోఁ బవిగొను టింతే ॥ నీచి ॥

గట్టిగా నిన్నుఁ బూజించఁ గమ్మటి నావసమా
నెట్టన నామేను నీకు నేమించు టింతే
పట్టపలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
జట్టిగొనుకొరకు నీశరణను టింతే ॥ నీచి ॥ 263

గౌళ

నమ్మవలెఁగాని యెన్నఁడు సందేహము లేక
యిమ్ముల దేవుఁడు వరమిచ్చు టేమరుదు ||పల్లవి||

మగనిపై బత్తిసేసి మంచిలోకా లెక్కేరట
[౧]తగుదండకోల వట్టి తత్వగతి గనేరట
పగటున నొకవేరు వట్టి పాముఁ బట్టేరట
తగిలి హరిదాసులు ధన్యు లౌ టేమరుదు ||నమ్మ||

యేలికెకు ధనమిచ్చి హితభోగా లందేరట
కేలఁ గత్తిపూని పగ గెల్చేరట
గాలి లోలోఁ బూరించి ఘనసిద్ధు లయ్యేరట
యేలీల హరిదాసులు యీడేరు టేమరుదు ||నమ్మ||

దిక్కుల యజ్ఞాలు చేసి దివిజు లయ్యేరట
మొక్కి విప్రుల నర్చించి మంచి సిరు లందేరట
పక్కన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరుఁ
జక్కనఁ గొల్చినదాసులు జ్ఞాను లౌ టేమరుదు ||నమ్మ|| 264

ముఖారి

నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి
యీకడ లాలించితే మే మిటు నిన్నుఁ గొలుతుము ||పల్లవి||

మాటలకు లోఁగాని బ్రహ్మమనంటా దాఁచి దాఁచి
మాటాడకుండేవుసుమ్మీ మాతో నీవు
నీటున మనసులో నిలుపరానివాఁడనంటా
పాటించి మాకుఁ బొడచూపకుంటే గతి యేది ||నీకే||

---

౧. 'తగుదండ కోలవట్టి' పూ.ము.పా.

శ్రుతులకుఁ బట్టరానిచోద్యపుబ్రహ్మమనంటా
మతకానఁ జిక్కక మానేవుసుమ్మీ
పతివి నీ౧ గంభీరము బయటఁబడీ నంటా
౨ అతిగోప్యాన వి న్నది యెట్టైఁగేము ॥ నీకే ॥

మాయవన్నుకొవినవుమ్మడిబ్రహ్మమనంటా
యేయెడనైనా భ్రమయించేవుసుమ్మీ
పాయపులలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ ॥ నీకే ॥ 265

౩ దేసాళి

కోటానఁగోట్లాయ కోరికెలు జన్మములు
కూటువ గూడి రాట్నపుగుండ్ర లై నారయ్యా ॥ పల్లవి ॥

మిన్నుపైనున్నజీవులు మన్నుపైఁ బ్రవేశించి
అన్నద్వారమున దేహము మోఁచి
మున్నిటిదానఫలా లిమ్మల భుజించి యప్పటి
తిన్నవికర్మములు గాదెలఁ బోసేరయ్యా ॥ కోటా ॥

యిరవు మఱచి మఱి యెరవులకాఁపిరేల
సురలు నరులమంటాఁ జొక్కిచొక్కి
సొరిది లోకములెల్లాఁ జొచ్చి కాలగతులను
పొరి నాయుష్యము గొల్చిపోయుచున్నారయ్యా ॥ కోటా ॥

దండగాఁగఁ బరుమలకొండ యెక్కి సుజ్ఞానులు
పండినమనసుతోడ బత్తిసేసి
అండనే శ్రీవేంకటేశు నలమేల్మంగనుఁ గొల్చి
విందువిధానములై విల్చినారయ్యా ॥ కోటా ॥ 266

౧. 'గంభీరము' భావ ప్రధాన నిర్దేశము కావచ్చు. ౨. 'అతిగోప్యాన మన్న విన్న' అని 'వున్న' పదమును అధ్యాహారము చేసికొనవలె కాబోలు.
౩. 'దేసాళం' మూ.ము.పా.

భూపాళం

మొదలనే యెచ్చరికెతో మోసపోక యేపొద్దూ
వెదకి హరికథలే వినుచుండవలయు ॥ పల్లవి ॥

వెలఁదులసుద్దులు వీనులను వింటేను
పెలుచుఁజూపులఁ జూడఁ బ్రేమ వుట్టించు
మలసి యాచూపులు మనసునఁ దగిలించు
తలఁపు మాటలాడఁ దమిరేఁచును ॥ మొద ॥

మగువలతోడుత మాటలాడదొరకొంటే
నగినగి సంసారాలనంటు గల్పించు
తగిలిననవ్వులు తనువులు సోఁకింపించు
మిగులాఁ దనుసోఁకులే మించి వలపించును ॥ మొద ॥

సతులతో మోహము సంపదలు పోరించు
అతిసంపదలు దేహి నజ్ఞానిఁ జేయు
తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడే
గతియని కొలిచితే ఘనునిఁగాఁ జేయును ॥ మొద ॥ 267

ముఖారి

ఇందువల్ల నేమిగద్దు యినుపగుగ్గిళ్లింతే
యిందిరారమణుసేవే యిరవైనపదవి ॥ పల్లవి ॥

సతులతో నవ్వులు చందమామగుటుకలు
మతితలపోఁత లెండమావులనీళ్లు
రతులలో మాటలు రావిమానిపువ్వులు
తతి విరహపుకాఁక తాటిమానినీడ ॥ ఇందు ॥

లలనలజవ్వనాలు లక్కపూసకపురులు
నెలకొని నేసేబత్తి నీటిపై వ్రాఁత
చెలువపువినయాలు చేమకూరశైత్యాలు
కొలఁదిలేనినసుపు గోడమీఁదిసున్నము ॥ ఇందు ॥

పడఁతులవేడుకలు పచ్చివడఁగండ్లగుళ్లు
కడుమోవితీపు చింతకాయకజ్జము
ఒడి వలుమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరుఁ-
డడరించినమాయలు అద్దములోనీడలు ॥ ఇందు ॥ 268

రేకు 157 బౌళి

సత్యముసేయఁగవచ్చును సర్వేశ్వర యీమాటకు
నిత్యము నీవే యెఱుఁగుదు నేనేమీ నెఱఁగఁజుమీ ॥ పల్లవి ॥

సులభుఁడవౌదువు వొకమరి చూడఁగ దుర్లభుఁడవౌదువు
తలఁపింతువు మఱపింతువు తగఁ బ్రాణములోనుండి
పలికింతువు అక్షరముల పరగ నవే వ్రాయింతువు
వెలయఁగ నీవే వెలిగా వేరొకటి నేఁ జేయఁజుమీ ॥ సత్య ॥

వొనరఁగఁ బూజలు గొందువు వొక్కొకపరి మానుదు వటు
కను మూయింతువు నిదురలఁ గడు మేల్కొలుపుదువు
ఘనముగ నజ్ఞానిఁ జేతువు కరుణతో జ్ఞానిఁ జేతువు
ననుఁ బుట్టించితి నీవే నా కాపని గాదుసుమీ ॥ సత్య ॥

నాలో నుందువు వొకపరి నగి శ్రీవేంకటగిరి నుందువు
పాలింతువు లాలింతువు భవమీదేరింతువు
పోలింప సంసారిఁ జేతువు భువి నీదాసునిఁ జేతువు
కాలముఁ గర్మము నీవే కపటము నే నేరఁజుమీ ॥ సత్య ॥ 269

## రామక్రియ

వారి వారి భాగ్యములు వ్రాసి వున్నవి నొసళ్ల
ధీరతతో నేది మేలో తెలుసుకోరో ॥పల్లవి॥

అట్టె కొందరు మతము లన్నియు నేకమని
పట్టవర్ధనము నెత్తిఁబెట్టి చూపిరి
ఇట్టె గొందరు జీవులు జంగమే లింగముగాని-
పుట్టుగెల్లా భస్మమని పూసుక చూపిరి ॥వారి॥

కొంద రేమియును లేదు కొట్టఁగొన లయమని
అంది పట్టిలలాటశూన్యము చూపిరి
కందువఁ గొందరు లక్ష్మీకాంతుఁ డంతరాత్మయని
ముందే నామము శ్రీచూర్ణమునుఁ బెట్టి చూపిరి ॥వారి॥

చెలఁగి దిష్ట మిపుడు శ్రీవేంకటేశుఁడు
౧అలమేలుమంగపతి యై యున్నవాఁడు
౨యిలవీర వీదాసుల కిట్టిభాగ్యరేఖలు
వలసినవారికెల్లా వ్రాసినాఁ డితఁడు ॥వారి॥ 270

## లలిత

విచార మెన్నఁడు లేదు వీరిడిజీవులకును
పచారించేరు బ్రదుకు బ్రహ్మనాటనుండియు ॥పల్లవి॥

పొద్దువొడచుటయును పొరిఁ గూఁగుటయె కాని
అద్దుకొని మిగులఁగ నందేమి లేదు
వొద్దికఁ బుట్టుటయును వుడుగఁజూచుటె కాని
కొద్దితోడఁ గాలమేమి గురియై నిలువదు ॥విచా॥

---

౧. 'అలమేలుమంగపతి...రేఖలు' వరకు గల భావము అంత సుగ్రహముగ లేదు.

౨. 'అలమేలు....వాఁడు' వరకుగల భాగమును 'కలవారు యిలలోవీరు' అని వూ.ము.పా. పరిష్కర్తల భావముగా తోచుచున్నది. 'కలవారు' అనునది అధ్యాహార్యము. 'యిలవీరని' విభజించి చూపినారు. 'అలమేలు....వాఁడు' వరకు గల భాగము 'కలవారు యిలవీర=, 'వీరే వీదానులు' అని అన్వయముగా తోచుచున్నది. 'వీ దానులకు' విభక్తి అతుకుట లేదు. కాని 'యిల వీర అని' 'అని' పదము గూడ అధ్యాహరించుకొన్నచో అర్థము సుగ్రహము సంగతము అగునని తోచుచున్నది.

అన్నము భుజించేదియు నాఁకలి గొనేదెకాని
యెన్నికకుఁ జెప్పచూప నేదియు లేదు
ఇన్నిటఁ దిరిగాడేది ఇంటికి వచ్చేదే కాని
పన్ని తననిలుకడ భావించ లేదు ॥ విచా ॥

జవ్వనము మోఁచేదియు సరి ముదుసేదే కాని
తవ్వి కట్టుకొనే దేది దాఁచే దేది
నవ్వుతా నలమేల్మంగనాయక శ్రీవేంకటేశ
రవ్వల నీ వేలికవు రక్షించు మిఁకను ॥ విచా ॥ 271

శంకరాభరణం

౧ ఇంతకంటే నేమిసేసే మిదే మా మానసపూజ
సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుఁడవు ॥ పల్లవి ॥

అంతర్యామివైనమీకు నావాహన మదివో
అంతటా విష్ణుఁడ మీకు నాసనము వేసినది
పంతపుఁగోనేరే మీకుఁ బలుమారు నర్ఘ్యము
చెంతనే గంగాజలముచల్లేమీకుఁ బాద్యము ॥ ఇంత ॥

జలధు లన్నియును నాచమనీయ్యము మీకు
అల యా వరుణజల మిదియే స్నానము
పలనుగా మీమహిమలే వస్త్రాభరణములు
అల వేదములే మీకు యజ్ఞోపవీతములు ॥ ఇంత ॥

ఇరవుగఁ గుబ్జ తొల్లిచ్చినదే మీకు గంధము
ధర మాలాకారునిపూదండలే మీకు పువ్వులు
ఉరుగతి మౌనులహోమమే మీకు ధూపము
తిరమైనమీకు రవితేజమే దీపము ॥ ఇంత ॥

---

౧. పాటలో పంచదశోపచారములే కలవు. 'నీరాజనము' తప్పిపోయినది.

నానామృతములే మీకు నైవేద్యతాంబూలములు
పూవినభక్తి షోడశోపచారములు
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
తానకపుజపములే తగ మీకు నుతులు ॥ఇంత॥ 272

శ్రీరాగం

రాజీవనేత్రాయ రాఘవాయ నమో
సౌజన్యనిలయాయ జానకీశాయ ॥పల్లవి॥

దశరథతనూజాయ [౧] తాటకదమనాయ
కుశికసంభవయజ్ఞగోపనాయ
పశుపతిమహాధనుర్భంజనాయ నమో
విశదభార్గవరామవిజయకరణాయ ॥రాజీ॥

భరితధర్మాయ శూర్పణఖాంగహరణాయ
ఖరదూషణాదిరిపుఖండనాయ
[౨] తరణిసంభవసైన్యదక్షకాయ నమో *
నిరుపమమహావారినిధిబంధనాయ ॥రాజీ॥

హతరావణాయ [౩] సంయమినాథవరదాయ
అతులితాయోధ్యాపురాధిపాయ
హితకర శ్రీవేంకటేశ్వరాయ నమో
వితతవావిలిపాటివీరరామాయ ॥రాజీ॥ 273

లలిత

భోగము నేను నీకు, భోగివి నీవు
శ్రీగురుండ విన్నిటాను చిత్తగించు నన్నును ॥పల్లవి॥

౧. సంస్కృతకీర్తనలో 'తాటక' అను తత్సమపదము వింత. 'తాటకా' కావచ్చు.
౨. 'తర....కాయ=సుగ్రీవసైన్యాధిపత్యము? ౩. 'సంయ్యమి' రేకు.

చక్కనిజన్మపుసంసారవృక్షమునకు
పక్కన(వ?)ఫలము నీవు భావించఁగా
మక్కువఁ గర్మమనేటిమత్తగజమునకును
యెక్కినమావటీఁడవు యెంచఁగ నీవు ॥భోగ॥

నెట్టన దేహమనేటి నిర్మలరాజ్యమునకు
పట్టమేలుచుండినభూపతివి నీవే
దిట్టయైనచిత్తమనేం తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింప నీవు ॥భోగ॥

సంతతమైనభక్తిచంద్రోదయమునకు
రంతులఁ జెలఁగుసముద్రమవు నీవు
చెంతల శ్రీవేంకటేశ జీవుఁడనేమేడలోన
అంతర్యామివి నీవు అంకెలఁ జూచినను ॥భోగ॥ 274

రేకు 158 సాళంగనాట

కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
భాసురవరద జయపరిపూర్ణరామ ॥పల్లవి॥

మునుప దశరథరాముఁడవై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
వెనుకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటివి ॥కౌస॥

సుప్పనాతి శిక్షించి సొరిది రుషులఁ గాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి
చొప్పుతో మాయామృగము సోదించి హరియించి
కప్పి హనుమంతు బంటుఁగా నేలుకొంటివి ॥కౌస॥

---

౧. తేజిగుఱ్ఱము = 'ఉత్తమాశ్వము' కావచ్చు. లేకున్న పునరుక్తి.

సొలసి వాలి నడచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంక సాధించి
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించి
వెలఁగితి వయోధ్యలో శ్రీవేంకటేశుఁడా ॥ కౌస ॥ 275

గౌళ

గట్టిగాఁ దెలుసుకొంటే కన్నదే కంటి ౧గురుమ (తు?)
దట్టమై సుజ్ఞానము తనలోనే వున్నది ॥ పల్లవి ॥

బయలే పంటలు వండె బయలే పొఁడి విరికె
బయలు ప్రపంచమై భ్రమయించెను
బయటనే ప్రకృతియు బయటనే జీవులు
బయటనే బ్రహ్మము పరిపూర్ణమాయె ॥ గట్టి ॥

ఆకసము చూలాయ నాకసము రూపులాయ
నాకసము సంసారమై యలవడెను
ఆకసాన దివియును నాకసాన లోకములు
ఆకసాన శ్రీహరి యవతారమందెను ॥ గట్టి ॥

అంతరంగమే భోగము అంతరంగమే యోగము
అంతరంగమే అన్నిటి కావాసమయ్యె
అంతరంగాన శ్రీవేంకటాధిపుఁ డున్నవాఁడు
అంతరంగాన మోక్షము అతఁడే యొసఁగెను ॥ గట్టి ॥ 276

గౌళ

ఆతురబంధుగుఁడవు హరినారాయణ కృష్ణ
మాతలఁ బెఱిఁగి నీవే మన్నించితి విపుడు ॥ పల్లవి ॥

---

౧. 'గురుమ' ఈ వాఙ్మయమున చాలచోట్ల కలదు. 'పెద్దరికము' 'తేజము' ఇత్యాదిగ అర్థములు కావచ్చు. చూ. సంపు. 25. పీఠిక పేజీ 12.

గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్లు
ధరలో గజరాజు నుద్ధరించినట్లు
గరిమఁ జెరలువాప్పి కాంతలఁ బెండ్లాడినట్లు
సిరులతో మముఁ దెచ్చి సేవలు గైకొంటివి ॥ అతు ॥

నేరుపుననే రుకుమిణిదేవిఁ దెచ్చినయట్లు
ధీరత మునిపుత్రులఁ దెచ్చినయట్లు
భారమైనయహల్యశాపము మానిపినయట్లు
గారవించి మము నేఁడు కరుణఁ జూచితివి ॥ అతు ॥

లంక సాధించి సీతను అలిఁ జేకొనినయట్లు
తెంకికి ననిరుద్ధునిఁ దెచ్చినయట్లు
అంకెల శ్రీవేంకటేశ అట్టె నీదాసులమని
పొంకముగ మాపాలిటఁ బొసఁగి యేలితివి ॥ అతు ॥ 277

శంకరాభరణం

వేదములు నుతించఁగ వేడుకలు దైవారఁగ
ఆదరించీ దాసుల మోహననారసింహుఁడు ॥ పల్లవి ॥

నెఱిలజడలతోడ నిక్కుఁగర్ణములతోడ
కుఱుచకొమ్ములతోడ కోఱలతోడ
వుఱక సిరిఁ దొడపై నుంచుక సింహాసనాన
మెఱసీఁ బ్రతాపముల మేటినారసింహుఁడు ॥ వేద ॥

విడుపమీసాలతోడ విట్టూరుపులతోడ
మిడిగుడ్లతోఁ దెల్లనిమేనితోడ
వొడలసొమ్ములు వెట్టి వొడ్డోలగమై వుండి
కడు మంచివరాలిచ్చీ ఘననారసింహుఁడు ॥ వేద ॥

చిలుకుగోళ్లతోడ నెలవినవ్వులతోడ
బలు[౧] జిహ్వతోడ యోగపట్టెముతోడ
అలరి శ్రీవేంకటాద్రి నహోబలగిరిని
అల [౨]ప్రహ్లాదునిఁ గాచె నాదినారసింహుఁడు ॥ వేద ॥ 278

## శ్రీరాగం

సకలలోకనాథుఁడు జనార్దనుఁ డితఁడు
శుకయోగివంద్యునిసుజ్ఞాన మెంత ॥ పల్లవి ॥

మరునితండ్రికిని మఱి చక్కఁదన మెంత
సిరిమగనిభాగ్యము చెప్ప నెంత
పురుషోత్తముఘనత పొగడఁగ నిఁక నెంత
గరిమ జలధిశాయి [౩]గంభీర మెంత ॥ సక ॥

వేవేలుముఖాలవానివిగ్రహము చెప్ప నెంత
భూవల్లభునివోరుపు పోలించ నెంత
వావిరి బ్రహ్మతండ్రికి వర్ణింప రాజస మెంత
యేవల్లెఁ జక్రాయుధుని కెదురెంచ నెంత ॥ సక ॥

అమితవరదునికి ఔదార్యగుణ మెంత
విమతాసురవైరివిక్రమ మెంత
మమతల నలమేలుమంగపతిసొబ గెంత
అమర శ్రీవేంకటేశుఆధిక్య మెంత ॥ సక ॥ 279

## సామంతం

కోటిమన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీమహిమలే పరబ్రహ్మము ॥ పల్లవి ॥

---

౧. 'జింహ్వ' లేఖ. ౨. 'ప్రంహ్లాదు' అని లేఖ.
౩. 'గాంభీర్య' కావచ్చు. లేదా ధర్మప్రధాన నిర్దేశము కావచ్చు.

ఆకాశమువంటిమేన నమరెమూ ర్తివిగాన
ఆకాశనదియే నీకు నభిషేకము
మేకొని నీవే నిండుమేఘవర్ణుఁడవుగాన
నీకు ౧ మేఘపుష్పాలే పన్నీరుకాపు ॥ కోటి ॥

చంద్రుఁడు నీమనసులో జనించె నటుగాన
చంద్రికలు శ్రప్రకాశా పై సరి నిండెను
ఇంద్రనీలపుగనుల యిలధరుఁడవుగాన
తంద్రలేవియీపెచూపే తట్టుపునుఁగాయను ॥ కోటి ॥

లక్ష్మిపతివిగాన లాగుల నీవురముపై
లక్ష్మి యలమేలుమంగే లలి నీకాశి
సూక్ష్మమై శ్రీవేంకటేశ చుక్కలవొడవు గాఁగ
పక్ష్మనక్షత్రములే యాభరణహారములు ॥ కోటి ॥ 280

రేకు 159 పాడి

చంచలపడఁగవద్దు సారె సారెఁ గోరవద్దు
పొంచుకున్నదైవమే బుద్ధులు నేర్పిని ॥ పల్లవి ॥

లోకరక్షకుఁడు నాలోననే వున్నాఁ డిదే
నాకు నభయములిచ్చి నన్నుఁ గాచును
శ్రీకాంతుఁ డితఁడే నాచిత్తములో మలసీని
దాకొని శుభములెల్లాఁ దానే వొసఁగును ॥ చంచ ॥

పరమపురుషుఁడు నాప్రాణనాథుఁడై నాఁడు
పరగ నాపాలివాఁడై బ్రదికించును
ధరణీశుఁ డితఁడే నాదాపుదండై కడఁగిని
విరతి నేపొద్దును మన్నించును మమ్మెపుడు ॥ చంచ ॥

౧. 'మేఘపుష్పాలే' పూ.ము.పా.

శ్రీవేంకటేశుఁడు నాజిహ్వఁ దగిలి వున్నాఁడు
పావనునిఁ జేసి నాకు ఫల మిచ్చును
గోవిందుఁ డీస్వామి నన్నుఁ గొలిపించుకొన్నవాఁడు
యీవలనావల నాకు నిహపరా లిచ్చును ॥చంచ॥ 281

రామక్రియ

నెట్టన శ్రీపతిమగనికి శరణు
దిట్టయై సర్వేశుఁడైనదేవునికి శరణు ॥పల్లవి॥

చెలఁగి జగత్తులకు జీవులకుఁ బ్రాణమై
నెలవై వుండేయాతనికి శరణు
తెలివై మఱపై దేహాలలో సూత్రమై
వలనై రక్షించేయట్టివానికి శరణు ॥నెట్ట॥

చక్కఁగా వేదములకు సకలశాస్త్రములకు
నెక్కొని గుఱుతైనవానికి శరణు
దిక్కుదెసయి స్వతంత్రుఁడయి తేరినఆదిమూలమై
అక్కజపుమహిమలయాతనికి శరణు ॥నెట్ట॥

యిరవుగఁ గరుణించి యిహపరాలొసగేటి-
విరతిశ్రీవేంకటేశునికి శరణు
గురువై తల్లిదండ్రియై గుణము సుజ్ఞానము-
లెరవులేక యిచ్చేటియాతనికి శరణు ॥నెట్ట॥ 282

మాళవి

౧ పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా
పురుఁడు లే దిఁక నీకుఁ బురుషోత్తమా ॥పల్లవి॥

౧. ఇందు దశావతార సమన్వయము గలదు.

పొలసులాడకు నీవు పురుషోత్తమా
బలిపి లోఁగఁగనేల పురుషోత్తమా
పొలమురాజవు నీవు పురుషోత్తమా నీ౧
పొలఁతు వదే కంబమునఁ బురుషోత్తమా ॥ పురు ॥

పొడవులకుఁ బొడవైన పురుషోత్తమా బిరుదు
పుడిసిళ్లఁ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిఁగైకొంటి పురుషోత్తమా
పొడమెఁ జీఁకటితప్పు పురుషోత్తమా ॥ పురు ॥

బూటకపుబుద్ధిగలపురుషోత్తమా
కోటి౨గుఱ్ఱపుఁబసల పురుషోత్తమా
మేటి శ్రీవేంకటముమీఁద నొసఁగే విదివో
పూటపూఁటవరాలు పురుషోత్తమా ॥ పురు ॥ 283

## సామంతం

అన్నిటికి మూలమవి హరి నెంచరు
పన్నినమాయలో వారు బయలువాఁకేరు ॥ పల్లవి ॥

ప్రకృతిబోనులలోపలఁ జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాలసందిజన్మములవారు
వెకలిసంసారాలకే వేడుకపడేరు ॥ అన్ని ॥

కామునియేట్ల దిగఁగారేటిదేహాలు
దోమటితమబదుకే దొడ్డదనేరు
పామిడికోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తలమనేరు ॥ అన్ని ॥

౧. ఈ పాదములో ఈ 'నీ' పూ.ము.పా. తొలఁగినది.
౨. 'గుఱపుఁ' రేకు, పూ.ము.పా.

ఇతరలోకాలనెడియేఁతపుమెట్లప్రాణులు
కతల మోక్షమార్గము గంటిమనేరు
తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశ్వర
మతకాన నున్నవారు మారు మలసేరు ॥ అన్ని ॥ 284

వరాళి

[1] ఏఁటిజాణతనమే యేమే నీవు
కోటియైనా యాఁటది కక్కూఁరితికిఁ జొచ్చునా ॥ పల్లవి ॥

వరుసకువచ్చి యావనిత గాచుకుండఁగా
యెరవులనన్నుఁ బతినేల పిల్చేవే
తెరమఱుంగున నొక్కెతకు మీఁదెత్తినమోవి
యిరవుగ నీకది యెంగిలిగాదా ॥ ఏటి ॥

పొందైనయాపె యింటిలో బోనము వెట్టుకుండఁగా
విందు నీవేల చెప్పేవే విభునికిని
అందాకె మనసుపెట్టినటువంటికాఁగిలి—
కిందటనే [2] వాఁడి మిగిలినదిగాకా ॥ ఏటి ॥

సేసపెట్టినమగువ చెఱఁగువట్టుకుండఁగా
ఆసతో నీవెట్టు గూడి యలరితివే
యీసరినే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వోసరించితే బువ్వము వూరఁబొత్తుగాదా ॥ ఏటి ॥ 285

ముఖారి

[3] ఇంతిజవ్వనవనాన నిన్నియు నెలకొనెను
వంతులవాసులతోడ వలరాచపౌఁజులు ॥ పల్లవి ॥

---

౧. ౨. ఇందరసున్నచింత్యము. ౩. ఇవి శృంగారసంకీర్తనలలో నుండదగినది.

కుతిలాలు మాని సరిఁ గూచున్నవి చూడవే
సతియురముమీఁదట చక్రవాకాలు
గతిగూడ గుంపుగట్టి కాఁపురముసేసీ నవే
మితిమీరి శిరసుపై మేఁటితుమ్మెదలు ॥ ఇంతి ॥

కలికితనాలతోడఁ గడుమించీఁగదవే
జలజాక్షిమోముననే చకోరములు
పలుకులలోననే పాదుకొనె నిపు డిట్టె
చెలరేఁగి మోవిమీఁద చిలుకమొత్తములు ॥ ఇంతి ॥

తగుశ్రీవేంకటేశ్వరుదండ నిల్చిఁ జూడవే
మగువనడపులనేమంచిహంసలు
మిగుల రతివేళను మెరసీఁ దా మిన్నిటాను
పగటుఁగుత్తికలోన పావురములు ॥ ఇంతి ॥ 288

రేకు 160 భైరవి

ఎవ్వరినేర్పులు జెప్ప నిందు నేది
రవ్వసేయక జీవుల రక్షించవయ్యా ॥ పల్లవి ॥

తలపోసి తలపోసి ధ్యానముసేతురు నిన్ను
యెలమి నింతని నిశ్చయింపలేరు
పలుమారు నీగుణాలు పైకొని నుతింతురు
కొలఁదివెట్టుచు నీగుణుతు లెంచలేరు ॥ ఎవ్వ ॥

పొదిగి పొదిగి నిన్నుఁ బూజలెల్లాఁ జేతురు
యెదుట నీశ్రీమూర్తి యెఱుఁగలేరు
వెదకి వెదకి సారె విందురు నీకతలెల్లా
పదిలపునీభక్తి పట్టఁగలేరు ॥ ఎవ్వ ॥

నిక్కి నిక్కి చేతులెత్తి నీకు మొక్కుదురుగాని
మక్కువ నీమహిమ నమ్మఁగలేరు
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నీకరుణచేత
తక్కక నిన్ను సేవించి తనియలేరు ॥ఎవ్వ॥ 287

మాళవిగౌళ

ఇన్నిటికిఁ బ్రేరకుఁడు యీశ్వరుఁ డింతే
పన్ని యీతనిఁ దెలిసి బ్రదుకుటే జ్ఞానము ॥పల్లవి॥

మనసునఁబుట్టినమంకుఁగామక్రోధాలు
పనిలేవు తనకంటేఁ బాప మాటదు
పనివి తొడమ నూది పండు తీఁగె నంటదు
జనులకెల్లాఁ బ్రకృతిసహజ మింతే ॥ఇన్ని॥

చేతులారఁ జేసేటిచేకొన్నకర్మానకు
ఘాతలఁ గర్తఁ గానంటే కట్టువడఁడు
ఆతల నబక ముంచినట్టివేఁడి చెయ్యంటదు
జాతి ౧ దేహము నోఁచిన్నసహజ మింతే ॥ఇన్ని॥

వాకునవాడినయట్టివట్టిపల్లదాలనెల్లా
దాకొని బోరయనంటే తప్పులే లేవు
పైకొని శ్రీవేంకటేశుబంటుకు వళకు లేదు
సైకమైనహరిభక్తిసహజ మింతే ॥ఇన్ని॥ 288

సాళంగనాట

జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాదవరద ॥పల్లవి॥

---

౧. 'దేహము' రేకు.

మిహిరశశినయన మృగనరవేష
బహిరంతస్స్థలపరిపూర్ణ
అహినాయకసింహాసనరాజిత
బహుళగుణగణ ప్రహ్లాదవరద ॥ జయ ॥

చటులపరాక్రమ సమఘనవిరహిత
నిటలనేత్ర మౌనిప్రణుత
కుటిలదైత్యతతికుక్షివిదారణ
పటువజ్రనఖ ప్రహ్లాదవరద ॥ జయ ॥

శ్రీవనితాసంశ్రితవామాంక
భావజకోటిప్రతిమాన
శ్రీవేంకటగిరిశిఖరనివాస
పావన౧చరిత ప్రహ్లాదవరద ॥ జయ ॥ 289

సామంతం

౨ఎంత నలచితివయ్యా యింతికి
చెంతనుంటే లేఁతనవ్వే సేసపాలుగావా ॥ పల్లవి ॥

చెలి నీపైఁ జిగురాకు చిదిమివేసితేను
వలరాజడిదమని వంచించితివి
వెలయఁగ విరహపువేళ వాఁడెక్కుఁగాక
మెలుపునఁ గదిసితే మెత్తనేకాదా ॥ ఎంత ॥

వనరుహాక్షి పుప్పొడి ప్రేమ నీపైఁ జల్లితేను
వసంతునిచొక్కమచు వసివాడేవు
వెసఁ దెరమరఁగైతే వేగమే నామెక్కుఁగాక
రసికత నొద్దనుంటే రజమేకాదా ॥ ఎంత ॥

౧. 'చెరిత' రేకు. ౨. ఇది శృంగార కీర్తనలలో నుండదగినది.

అలమేలుమంగ సురటట్టే నీపై విసరితే
మలయూవిలు వేఁడంటా మాటువెట్టేవు
తలఁచి శ్రీవేంకటేశ దప్పైవ్వతే వేఁడెక్కుఁగాక
చలపట్టి కూడితివి చల్లనేకాదా ॥ ఎంత ॥ 290

శ్రీరాగం

[1] ఎంత లేదు నీబత్తి యెరఁగరా యిందరును
దొంతిఁబెట్టేవు [2] ప్రియూలు దొరకుదాఁకాను ॥ పల్లవి ॥

పొరుగాపెపైవలపు పూసేవు నామీఁద
వరుసల వద్ది కాపె వచ్చుదాఁకాను
సరుస నావంక నీవు చక్కఁ జూచే వప్పటివి
అరసి యవ్వలిపొందు అదనౌదాఁకాను ॥ ఎంత ॥

కడవారిపొందు నాతోఁ గసి వుచ్చుకొనే విట్టే
అడరి వారితో మాఁట లందుదాఁకాను
నడుమ నవ్వులెల్లాను నవ్వేవు యీవేళను
వుడివోనియట్టికాఁగి లొనరుదాఁకాను ॥ ఎంత ॥

పోరచిపవితమారు పొదిగేవు నన్ను విట్టె
చేరి యాపె విన్నుఁగూడి చెలఁగుదాఁకా
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కోరికె లన్నియును జేకూరుదాఁకాను ॥ ఎంత ॥ 291

శుద్ధవసంతం

[3] ఇవిగో మీమహిమలు యేమని పొగడవచ్చు
జవళి నెంచిచూచితే సరిలేనివంటివి ॥ పల్లవి ॥

---

౧. ఇదీ శృంగారకీర్తనే. ౨. 'ప్రియూలు' మూ.ము.పా. రేకు. ౩. ఇదీ శృంగారకీర్తనే

అంగనలచూపులు ఆరతులవంటివి
కుంగక నీవు కొలువై కూచున్నవేళ
చెంగట లేఁతనవ్వులు సేసపాలవంటివి
కొంగులువట్టుచు నీవు కొసరేటివేళ ॥ ఇవి ॥

కాంతలపలుకులెల్లా కప్పురాలవంటివి
అంతలో నీవు సరసాలాడేటివేళ
బంతిమోవులయీవులు పాలకూళ్లవంటివి
మంతనాన నుండి నీవు మన్నించేవేళను ॥ ఇవి ॥

వెలఁదులకాఁగిళ్లు విడిదిండ్లవంటివి
చలముల నీరతులు సలిపేవేళ
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తలఁపులవంటి వన్నీ తమకపువేళను ॥ ఇవి ॥ 292

రేకు 161 లలిత

౧ ఎట్టిదో మీమాయావిలాసము యెఱిఁగిన నెఱఁగనీదు
అట్టె మాగురునమతినే ప్రత్యక్షమవై తివిగావి ॥ పల్లవి ॥

కరుణాకరా మిమ్మనుఁ గని తెలియఁగలేము
ధర మీమహిమలు వివివివి తగ నరుదందుదుము
నరహరి నీవు నాలో నుండఁగ నమ్మక పురాణకథలందు
అరయఁగ మీచరితలు చెప్పఁగ నాసతోడ మిముఁ దలంతును ॥ ఎట్టి ॥

జగదీశా మీనామంబులు జపించనలయుదుము
వెగటుగ నీచిత్రసృష్టి చూచి మిము వెదకుదు వింతటను
నగధర మీపై భక్తి సేయఁగ మనంబున వొడఁబడము
పగటున మీరిచ్చువరములకొరకే పలుమారు మీకు
మొక్కుకొందుము ॥ ఎట్టి ॥

---

౧. భక్తివిరక్తిలో ప్రథమసోపానము.

శ్రీవేంకటేశా నీమూరితి చింతించి చేపట్టఁగలేను
దేవుఁడ వనియెదువిశ్వాసమునకే తిరముగఁ గొలిచెదను
శ్రీవనితాధిప వేదాలు మిమ్మునుఁ జెప్పఁగా నే తర్కింపుదును
వేవేలుపరుషలు సేవింపఁగ నీవే కర్తవని నిశ్చయింతును ॥ఎట్టి॥ 293

లలిత

అతవి నడుగవో చిత్రగుప్త నాయందలియోఁగాము లన్నియును
అతఁడే మీ కుత్తరము చెప్పెడివి యన్నిటికివి మముఁ దడవకుమీ
॥ పల్లవి ॥

కరచరణాదులు నాకుఁ గల్పించినయతఁడే
గరిమల నాపుణ్యకర్మసంఘములకుఁ దాఁ గర్తా
నరుగఁ బ్రాణము [1]లొసఁగి చైతన్య మతఁడే
పరగఁగ నాయపరాధంబులు పరిహరించఁ గర్తా ॥ అత ॥

ఉమణతో ననుఁ బుట్టించి రక్షించేయతఁడే
అమరఁగ నన్ను వహించుక నావంతకంతయుఁ దీర్పఁగఁ దాఁ గర్తా
ప్రమదమున నాయంతరాత్మయైపాదుకొన్నయతఁడే
మమతల మీలోకము చొరకుండా మాఁటలాడుకొనఁ దానే కర్తా ॥అత॥

యెప్పుడుఁ బాయక దాసునిఁగా నేలుకొన్నయతఁడే
తప్పక యిహముఁబరమువిచ్చి వారులు దడవకుండఁ జేయఁగఁ
గర్తా
చెప్పఁగ నాపాలిదేవరా శ్రీవేంకటేశుఁ డతఁడే
అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నటు మముఁ గావఁగఁ
దానే కర్త ॥ అత ॥ 294

లలిత

అవధారు వరాకుసేయకు మపరాధముగా నెంచకు
వివరింపఁగ నీవే గతి విష్ణుఁడ మన్నించఁగదే ॥ పల్లవి ॥

---

౧. 'లొసంగిన' కావచ్చు.

నాకునాకే నీసన్నిధానము గల్పించుకొని
చేకొని విన్నపములెల్లాఁ జేయుచున్నాఁడను
కాకుసేసి నన్ను నీఁ డెంత గట్టువాయయనక
శ్రీకాంతా నీ౧వింతట నుండువు చిత్తగించి వినవే ॥అవ॥

చూచిచూచి నీమూరితి నాసొమ్ముగఁ జేసుకొని
చేచేత నాలో ధ్యానము సేయుచునున్నాఁడను
కాచుకొని వీనికి నాకూఁ౨గారణమేమనక
యేచోటా నీరూపమే హరి యెదలో నుండఁగదే ॥అవ॥

కోరికోరి నేనూరక నీకొలువుగడించుకొని
చేరి నీపూదిగములు సేయుచునున్నాఁడను
యీరీతుల శ్రీవేంకటేశ్వర యివి యేఁటిపలిగెలనక
నారాయణ సర్వేశ్వరుఁడవు నన్ను నేలఁగదవే ॥అవ॥ 295

లలిత

ఎట్టు సేయఁగలవాఁడవో యిఁక నీచేతిది నాపనికి
నెట్టన నీదాసుఁడనైతిని నీచిత్తం బిఁకను ॥పల్లవి॥

సారెకుఁ గొలువుసేతు చనవుల నీ విత్తువోయనుచు
నేరకున్నాఁ బాడుదును నీవు మెత్తువనుచు
వోరిచి వుపవాసములుండుదు నొగి దయదలంతువోయనుచు
చేరి వాకిలిగాచుకుండుదు చిత్తమురావలెననుచు ॥ఎట్టు॥

కమ్మటి విచ్చకములు నెరపుదు కైవసముగావలెననుచు
వుమ్మడి నీగుణాలు వొగడుదు వూరక మొగమోడుదువనుచు
నెమ్మది మొక్కులు నే మొక్కుదు నేరములెంచక కాతువని
నమ్మి నిన్ను నేఁ బూజింతు నను నీ వీడేరింతువని ॥ఎట్టు॥

౧. 'అంతట' కావచ్చు. ౨. కారణము=సంబంధము కావచ్చు. వ్యావహారికము.

ఆసతో విను భావింతు అన్నిట నన్నేలుదువనుచు
వేసరక నీమంత్రము నుడుగుదు వేగమే వరమొసఁగుదువనుచు
రాసికి నెక్కఁగ శ్రీవేంకటేశా రక్షించితి విప్పుడు నన్ను
వాసితోడ నే విన్నుఁ దగులుదును వదలక నాపాలఁ గలవనుచు
॥ ఎట్టు ॥ 296

రేకు 162 గౌళ

ఇటులైతేఁ బుణ్యము నీకు యిది వుపకారంబౌను
తటుకన నీకీరితి వొగడుదురు తలకొని యిందరును ॥ పల్లవి ॥

సురాసురగంధర్వయక్షులు మిమ్ముఁ దెలియఁగలేరు
పరాశరాదులు మీరూపు భావించఁగలేరు
నరు లెరుఁగుదురా మిమ్ము నారాయణ నీవే సులభుఁడవై
కరీంద్రుఁ గాచినయటువలెఁ గాతువుగాక ॥ ఇటు ॥

సనాతనబహువేదశాస్త్రంబులు మిము నుతింపలేవు
అనంతయజ్ఞంబులు మిమ్ము నటు సాధించఁగలేవు
తనూధరు లెంతటివారు దామోదర నీవే అహల్యను
వినోదముగఁ గాచినయటువలె వెసఁ గాతువుగాక ॥ ఇటు ॥

రమాసతి ౧ నీళామహిరామలు మీతలఁ పెఱుఁగరు
సమేతులైనశేషాదులు మీజాడ మీరలేరు
తమోమయు లిందరును ధరణీధర శ్రీవేంకటేశ
నమోనమో యని మొక్కంగాఁ నను గాతువుగాక ॥ ఇటు ॥ 297

సామంతం

సరిగాఁడు వీఁడన వలదు జగమున రాజు ౨ వలసినది దేవులు
యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాట ॥ పల్లవి

---

౧ 'నిళా', పూ. ము. పా. ౨. 'వలచినది' కావచ్చు.

జగదేకబంధుఁడవట సకలజీవులకును, గుఱుతుగ
మొగముచూపవయ్యా మీకు మొక్కెద విదె నేను
తగులై నచుట్టరికము దాఁచఁగ నీకనేలా
తెగరానిమమకారము తెలుపఁగవలెఁగాని ॥ సరి ॥

యితవైనప్రాణమవట యీచరాచరములకు, అభయము
సతత మియ్యవయ్యా మాకును సన్నుతింతు నిన్ను
మతిఁ బాయనికూటంబులు మానుప మరి యాలా
జతవంబునఁ జాలాఁ(క్రియ)ములు జరపఁగవలెఁగాని ॥ సరి ॥

నెలవైనయేలికెవట నీదాసులకెల్లా, వేళలు
దెలియఁజెప్పవయ్యా మిమ్మును తిరముగఁ గొలిచెదను
బలువయిన౧ శ్రీవేంకటేశ పరాకు లీఁకనేలా
చెలరేఁగి నీసులభత్వమే చెలిం[చ]వలెఁగాని ॥ సరి ॥ 298

ఎదురుమాటలాడితి నీకు [...] లోఁగొను నీవు
పదరఁగఁదగదు నీకు పంతములిచ్చితిఁ గావఁగదే ॥ పల్లవి ॥

మునుపే నే విన్నవించితిని విన నవధరించితివి నీవు
వెనకవేసుకో శరణు చొచ్చితిని విడువకు వన్ననుచు
ననుఁజూచి 'దేహి' యంటే 'నాస్తి' యనరాదు నీకు
ఘనయాచకుఁడను నేను కడుదాతవు నీవు ॥ ఎదు ॥

వెదకి నిను వేఁడుకొంటివి విచ్చేసితివి మాయింటికి
వదలఁదగదు నీభక్తి యొసఁగు నీవాఁడను పాయకుమనుచు
పదిలంబుగ మొక్కినచేతులు బలిమిఁ గోయరాదు
యిదివో బంటను నేను యేలినవాఁడవు నీవు ॥ ఎదు ॥

---

౧. 'బలువయ్యన' రేకు.

మరిగి నీముద్రలు మోచితిని మన్నించితి విటు నను నీవు
కరుణతోడ నాయపరాధంబులు కడపు కావుమనుచు
యిరవై నీపేరు వెట్టితే విఱ్ఱకొనక పోరాదు
నరమాత్రుఁడ నే శ్రీ వేంకటేశ నాయకుఁడవు నీవు ॥ ఎదు॥299

సామంతం

ఏదిగతి నే నొక్కఁడనే యెందరి కోపుదును
నీదయతో మన్నించఁగదవే నీరజనాభా ॥ పల్లవి ॥

మోహాంధకారము యెక్కడచూచిన ముంచుకవున్నది
దేహాభిమానము అందుకుఁ దోడు దీకొనివచ్చీని
సాహసభూతము ఘనహింసలకే బాఁపించీఁ జేయి
దాహపుటాసలు వెనకముందరల తరవులువెట్టీని ॥ ఏది ॥

కోపాగ్నికణములు సారెకుఁ జుట్టుక గుబ్బతిలఁదొడఁగె
పైపై వయోవికారంబులు చలపట్టుక తిరిగీని
చాపలగర్వము యెవ్వరినైనా సాధింపించీని
తీపులధనములు ౧ మీఁదిమీఁదనే తీదీపులు రేఁచీని ॥ ఏది ॥

భావజవిలాస మప్పటప్పటికి బలుములు చూపీని
వేవేలుసంపద లెందుచూచినా వేడుకనేసీని
శ్రీవేంకటేశ యలమేల్మంగను చేకొనుదేవుఁడా
యీవేళను నన్నేలితివి నాకు నిన్నియు తగ వసమయ్యీని
॥ ఏది ॥ 300

రేకు 163 సామంతం

ఆనతియ్యఁగదవే అందుకే కాచుకున్నాఁడను
పూనుక నీ వెంతనేర్పరివైనా భువి మనసుపేదను నేను॥ పల్లవి ॥

---

౧. 'మీఁద' కావచ్చు

కొలిచేమనేబంట్లు నీకుఁ గోటానఁగోట్లు గలరు నిన్నుఁ
దెలిసేమనేజ్ఞానులు తెందేప లున్నారు
తలఁచి వరములడిగేవారలు తలవెంట్రుకలందరు వారె
యిల సందడిలో నాకొలువు యెటువలె నెక్కీనో ॥ అన ॥

పనులకుఁ బాల్పడినవారు బ్రహ్మాదిదేవతలట
వినుతులు సేయఁగ¹ దొడఁగినవె వేదరాసులట
మునుకొని ధ్యానించువారు మునులెందరైనాఁ గలరట
వినయపునామనవిసనవులకు వేళ లెపుడు గలిగీనో ॥ అన ॥

వున్నతితోడుత నిన్ను మోఁచుటకు వున్నారు గరుడఁడు శేషుఁడు నీకు
అన్నిటాను నీకాఁగిటిలోపల నలరీ నలమేల్మంగ
యెన్నఁగ శ్రీవేంకటేశా నన్నును యేలితి వింతటిలోనె
పన్నిననామొక్కులు నీ కెబాగులఁ జేరీనో ॥ అన ॥ 301

సామంతం

ఇప్పుడే నే నొడఁబడ మరవఁగఁదగదుజెప్పితి యెల్లనాఁడు
నెప్పున నే² నెంతకల్లరినైనా నీదాసుఁడనని యందురుగా ॥ పల్లవి॥

మఱతునో తలఁతునో నిన్ను మాఁటల నేతప్పు గలుగునో
యెఱఁగక నీదాసులఁజూచి యేమని పలుకుదునో
నేఱసిననాకర్మఫలంబులు నీకు సమర్పణ సేసితిని
మఱి నామీఁదట నేరము తెంచక మాధవ నన్నిటు రక్షించవే ॥ ఇప్ప ॥

ఒలతునో సొలతునో నే నీయందు భక్తి సేతునో³ సేయనో
యెలమిని నీకు నివేదించక యేమేమి భుజియింతునో
తలఁచేటినామనసే నీకును ధనముగాఁ గప్పము పెట్టితిని
పలుమరు నన్నును తగవుకుఁదియ్యక పరమాత్మా నన్నుఁ గావఁగదే ॥ ఇప్ప ॥

---

౧. 'దొడఁగీనవె' పూ.ము.పా. ౨. 'నెంతటి' పూ.ము.పా. ౩. 'శాయనో' రేకు.

నేరనో నేర్తునో నీకైంకర్యము నేమము నే సేసి మానితినో
నీరూపము నే సేవించి యెక్కడ నే ననుమానించితినో
మేరతోడ మావారు చెప్పఁగా మిమ్ము నింతట నే నమ్మితిని
వారిఁ జూచైన శ్రీవేంకటేశా వరదుఁడవై మము మన్నించఁ
గదవే ॥ ఇప్పు ॥ 302

ముఖారి

సర్వేశ్వరా నీతో సరి ౧యెవ్వరు
పూర్వపువారు చెప్పఁగాఁ బూఁచి కొలిచేఁగాని ॥ పల్లవి ॥

చేరి వేదములు నిన్నుఁ జెప్పఁగా వినుటేకాని
నీరూపము దర్శించేవార లెవ్వరు
౨ధారుణిలో నీ యవతారాలే చూచుట
ధీరత నీమహిమలు తెలిసేవా రెవ్వరు ॥ సర్వే ॥

భూమివారిఁ జూచి నిన్నుఁ బూజలు సేయుటగాని
కామించి నీతో మాటాడేఘను లెవ్వరు
దీమసాన నీదాసుల దృష్టి మెరుఁగుటగాని
యీమేర నీదైవిక మెరిఁగేవా రెవ్వరు ॥ సర్వే ॥

వరములు నీ వియ్యఁగా వచ్చి సేవించుటగాని
కెరలి నీమూర్తి వెదకేవా రెవ్వరు
హరి శ్రీవేంకటేశా నీకరుణవారౌటగాని
అరసి నిన్ను సుద్దులడిగేవా రెవ్వరు ॥ సర్వే ॥ 303

ముఖారి

ఇట్టినా వెట్టితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁజూడవే ॥ పల్లవి ॥

---

౧. 'యెవ్వరు, రేకు. ౨. 'ధారుణిలోనియవతారాలే', పూ.ము.పా.

పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడనేరుతునంటా మరి నే నహంకరింతును
నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను
గాఁటాన దొరనంటా గర్వింతు నేను ॥ ఇట్టి ॥

నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించఁగాను
కమ్మి నేనే బిడ్డలఁ గంటినంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను
యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు ॥ ఇట్టి ॥

మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును
వున్నతి శ్రీవేంకటేశ నన్ను నేమి చూచేవు
అన్నిటా నాయాచార్యువిన్నపమే వినవే ॥ ఇట్టి ॥ 304

ముఖారి

ఇటు వినుఁ దెలియఁగ నెంతటివారము
తటుకన నాసలఁ దగులుటగాక ॥ పల్లవి ॥

నానామూర్తులు నగధర నీరూపు
యేనెలవుల నిన్నెటువలెఁ దలఁచుట
పూని నీభావము పొందుగాఁ జెప్పఁగా
పీనులు చల్లఁగా వినుటేకాక ॥ ఇటు ॥

పెక్కునామములు బిరుదు లనంతము
లెక్కడ గొలదిగ [1]నెన్నెని పొగడుట
యిక్కువ సేసుక యిందులో నొకటి
పక్కన నొకమరి పలుకుటగాక ॥ ఇటు ॥

---

౧. ఎన్ని+అని

వేవేలు గలవు నీవిహారభూములు
యేవిధమున నెం దెందని తిరుగుట
శ్రీవేంకటేశా నీశృంగారమెల్లను
సేవించి ముదమునఁ జెలఁగుటగాక ॥ ఇటు ॥ 305

రేకు 164 ముఖారి

ఎవ్వరికి యెవ్వ రయ్యేరు యిందరికి నీవే దిక్కు
అవ్వలనివ్వల నీ వనాథనాథుఁడవు ॥ పల్లవి ॥

కాయకము లందరుఁ గార్యవశపరులే
పాయనినీ వకారణబంధుఁడవు
దాయగాం డ్లెవ్వరినై నాఁదప్పించుకొనేవారే
బాయటనున్నా నీ వాపన్నశరణ్యుఁడవు ॥ ఎవ్వ ॥

అట్టె లోకమువారు అర్థకామపరులే
జట్టిగొవి నీవై తే సర్వదాతవు
పొట్టఁబొరుగుచుట్టాలు భోజనసహాయులే
నెట్టన నీవై తే మాకు నిర్వాహకుఁడవు ॥ ఎవ్వ ॥

అంతటా వారికివారు ఆత్మపోషకులే
రంతుల నీవై తే నానారక్షకుఁడవు
సంతతము శ్రీవేంకటేశా మమ్ము నేలితివి
సంతమున నీవు భక్తపరిపాలకుఁడవు ॥ ఎవ్వ ॥ 306

ముఖారి

దేవ నీవు గల్పించినతెరువు లివి
నీవారైనవారినేరుపు లివి ॥ పల్లవి ॥

పరమశాంతునకుఁ బాపము రాదు
విరతిగలవానికి వెరపు లేదు
గురుసేవారతునకుఁ గోపము రాదు
ధర సత్యవిదునకుఁ దప్పు లేదు ॥ దేవ ॥

పుట్టుబ్రహ్మచారికి బుద్ధి చెడదు
అట్టె ఆసలేనివారికి అలపు లేదు
తొట్టినసుజ్ఞానికి దుఃఖము లేదు
గట్టియైనమౌనికి కలహమే లేదు ॥ దేవ ॥

సమచిత్తునకును చంచలము గాదు
విమలాచారునకు వెలితి లేదు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులై కొల్చి
భ్రమయనివారికి భారము లేదు ॥ దేవ ॥ 307

శ్రీరాగం

వారివారికర్మములే వారిఁ జుట్టుకొనఁగాను
యీరీతి నీవే వారియెఱుక ౧ మాల్పితివి ॥ పల్లవి ॥

హిరణ్యకశిపుపాటు యెఱఁగఁడా రావణుఁడు
ధరలో హరికిఁ బగై తానూఁ బొలిసె
విరసపుకంసుగతి వినఁడా దుర్యోధనుఁడు
పరుగఁ దానూఁ బగై సమసినాఁడు ॥ వారి ॥

తెగి మురాసురుజాడ తెలియఁడా నరకుఁడు
మొగిసి పోటుకుఁ బోయి మొక్కపోయను
నొగిసి ౨ సోమకుదెస చూదరా దానవులెల్లా
మగిడి మగిడి పోరి మడిసిరిగాక ॥ వారి ॥

౧. 'మాన్పితివి' పూ.ము.పా, ౨. 'సోమకు' కావచ్చు.

బలివోయినతెరువు బాణుఁడు విచారించఁడా
    బలిమిఁ దొడరి భంగపడెఁగాక
యెలమి శ్రీవేంకటేశా యెవ్వరి నేమనవచ్చు
    యెలమి విప్పటివారూ నెఱఁగరేకాక ॥ హరి ॥ 308

శ్రీరాగం

హరి నీదాసులభాగ్య మిది యెంతని చెప్పేము
    విరివైననీసుద్దులు వింటిమయ్యా ॥ పల్లవి ॥

నెమ్మదిని నీవనేటినిధానము గన్నవారు
    కిమ్ముల సంపన్నులై సుఖింతురయ్యా
కమ్మటి నీభక్తియనేకామధేను వున్నవారు
    వుమ్మడి నచ్చికము లే కుందురయ్యా ॥ హరి ॥

చేరి నీపై చింతయనేచింతామణిగలవారు
    కోరినట్లల్లా బదుకుదురయ్యా
సారపునీకృపాపారిజాతమబ్బినవారు
    బోరన సంతోసాలఁ బొదలుదురయ్యా ॥ హరి ॥

హత్తి నీనామమనేఅమృతముగలవారు
    విత్తమైనపదవుల నిలుతురయ్యా
యిత్తల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
    ౧ సత్తుగా నీవారు నాకుఁ జనవిత్తురయ్యా ॥ హరి ॥ 309

శ్రీరాగం

దైవమా నీ చొక్కుడవే దక్కినదనముగాక
    యీవలానావలా మఱి యెంచ నే మున్నది ॥ పల్లవి ॥

---

౧. 'సత్తు' 'సత్య' శబ్దభవము కావచ్చు.

పుట్టినవారికెల్లా ౧పొత్తుల దీజగము
మెట్టితూచుండేయరఁగు మేదినియల్లా
బట్టబయటిభోగాలు బంతికూటిబోజనాలు
పట్టి తమవని యేరుపరచ నే మున్నది ॥దైవ॥

పంచుకొన్న భాగాలు పంచమహాభూతాలు
పంచేంద్రియములే పరివారాలు
యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుప నే మున్నది ॥దైవ॥

మనోవికారాలు మానుషపుటెలుకలు
వినోదమాత్రాలు వేడుకలెల్లా
యెనలేని శ్రీవేంకటేశ నీమహిమ లివి
వెనకా ముందరా విన్నవించ నే మున్నది ॥దైవ॥ 310

శ్రీరాగం

ఇట్టివాఁడవు సులభమెట్లా నైతివో కాక
అట్టినీదయ దలఁచి అరుదయ్యీ నాకు ॥పల్లవి॥

యేమేమి చదువవలె నెందరి నడుగవలె
ఆముక విన్నుఁ దెలిసేయందుకొరకు
భూమిలోన నెంతేసిపుణ్యములు సేయవలె
కామించి నీపై భక్తిగలిగేటికొరకు ॥ఇట్టి॥

యెన్నిజన్మా లెత్తవలె నెందెందు వెదకవలె
కన్నుల నీసాకారము గనేకొరకు
వున్నతి నెంతగాలము వొగ్గి కాచుకుండవలె
విన్నవించి నీసేవ వేఁడుకొనేకొరకు ॥ఇట్టి॥

౧. 'పొత్తులది జగము' పూ.ము.పా.

యేదేది యెఱఁగవలె యెట్లభ్యసించవలె
సీదానుఁడవిపించుకొనేటికొరకు
సాదరాన శ్రీవేంకటేశ్వర నన్ను మన్నించితి-
వేదెనఁ బొగడవలె యింతసేసేకొరకు ॥ఇట్టి॥ 311

రేకు 165 శ్రీరాగం

చెప్పితేఁ బాసునందురు చేసినదోసములెల్లా
వొప్పుగొవి మన్నించ నుచితమా నీకు ॥పల్లవి॥

క్షమియించుకొనవే సర్వాపరాధములు
క్రమ మెఱఁగ కేమేమి గావించితినో
రమణతో సర్వలోకరక్షకుఁడవట నీవు
తమితోడ నన్నుఁగావఁ దగవౌను నీకు ॥చెప్పి॥

పరిహరించఁగదవే బహునరకబాధలు
గరిమల నెటువలెఁ గాచుకున్నవో
అరుదుగా సురలమొ రాలించితివట తొల్లి
ధర నన్ను వహించుకోఁ దగవౌను నీకు ॥చెప్పి॥

వెనుకొవి యుద్ధము రావే శ్రీవేంకటేశ్వర
అనుభవించేకర్మము ల వేమున్నవో
పవివడి భక్తపరిపాలకుఁడవట నీకు
తనుభోగాలు భోగించఁ దగవౌను నీవు ॥చెప్పి॥ 312

నాదరామక్రియ

అతఁడు లోకోన్నతుఁ డాదిపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు
చతురుఁ డితఁడే రక్షించఁగలవాఁడు శరణవిబ్రదుకవో వోమనసా
॥పల్లవి॥

మరుతండ్రిఁ జూచినమంచికన్నులను మరొకరిఁ జూచిన నింపౌనా
సిరివరునామము నొడిగిననోరను చిక్కినపేరులు యిఁకవౌనా
పరమాత్ముఁ దలఁచినమనసులోపలను పరులఁ దలఁచితే నొడఁబడునా
కరుణానిధిపుణ్యకథలువినినచెవుల కడలసుద్దులు వినసమ్మతించునా
॥ అతఁ ॥

నరహరిఁ బూజించినయట్టికరములు నరులసేవసేయ నరుహములా
మురహరు శరణని మొక్కినశిరసున మూఢులకు మొక్క నుచితములా
హరిమందిరమునకరిగెడుపదములు అధములింట్లకేఁగఁగ నలవడునా
పురుషోత్తము౧ లాంఛనము మోచినమేను భువిహీన౨ వృత్తికిఁ
బొసఁగీనా ॥ అతఁ ॥

గోవిందుఁడే దిక్కై వుండుఘనులకు కొలిపీనా దేవతాంతరంబులు
భూవల్లభుదెసఁ బుట్టినజ్ఞానము పొంది వేరొకట నిలిచీనా
శ్రీవేంకటపతిపై నిడినభక్తి చెలులపై నునుపఁగఁ దగవవునా
దేవకినందనుఁ డితవిదాసులఁ దెలియఁగ జడులకుఁ దరమయ్యీనా
॥ అతఁ ॥ 313

నాదరామక్రియ

ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినాఁ దానే
యెదిటిబ్రహ్మాండము యిమ్ముచాల దిందుకు ॥ పల్లవి ॥

పవిగొంచే భువిలో నేఁబదియే అక్షరములు
కొనాడితే నీగుణాలు కోటానఁగోటి
యెనసి పదునాలుగే యెడమైన లోకములు
అనిశము నీకైతే ననంతమహిమలు ॥ ఇది ॥

---

౧. 'లాంచనము' రేకు. ౨. 'ప్రిత్తికి' రేకు.

మించి ౧ విందుకొంటే నెవిమిదియే దిక్కులు
అంచల నీకతలై తే ననేకములు
యెంచి చూచితేఁ గలవి పంచమహాభూతాలే
మించిననీమాయ తుదమొదలే లేదు ॥ ఇది ॥

వుపమించి తెలిసితే నొక్కటే జగము
అపురూపపునీసృష్టి అతిఘనము
అపరిమితపుజీవు లణుమాత్రులైనాను
యెపుడు శ్రీవేంకటేశ యెక్కుడు నీదాసులు ॥ ఇది ॥ 314

నాదరామక్రియ

ఎంతకత నడపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా ॥ పల్లవి ॥

కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల
నేరిచి సారథ్యము నెఱపనేలా
కోరి భూభార మణఁచేకొరకై తే నీచే చక్ర-
మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా ॥ ఎంత ॥

చేకొని వావరులఁగాఁ జేయనేల దేవతల
శోకతో లంకాపురి చుట్టుకోనేల
కాకాసురు వేసినకనవే రావణుమీఁద-
నాకదఁ బంపువెట్టితే నప్పుడే సమయఁడా ॥ ఎంత ॥

గక్కన శ్రీవేంకటేశ కంబములో వెళ్లనేల
చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగనేల
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక
తక్కించి నీవెడపితే తానే పొలియఁడా ॥ ఎంత ॥ 315

౧. 'విందుకొంటేనే నెవిమిదియే' పూ.ము.పా.

నాదరామక్రియ

పరులకైతే విదే పాపముగాదా
పురిగొని నీవంటకఁ బుణ్యమాయఁగాక ॥ పల్లవి ॥

పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధించఁగ
దొరపి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు ॥ పరు ॥

నారాయణుఁడ నీవు నడిపినదే తగవు
ఆరూఢి నీ వౌనన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో ఖండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు ॥ పరు ॥

శ్రీవేంకటేశ నీవు చేసినదే నీతి
చేవతో నీ వాదఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
ఆవేళ వడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు ॥ పరు ॥ 316

రేకు 166 నాదరామక్రియ

ప్రపన్నులకు విది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు ॥ పల్లవి ॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరుశరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము ॥ ప్రప ॥

దురహంకారము దుఃఖము సుఖమును
బొరయక ప్రాకృతులపొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥ 317

రామక్రియ

జతనము జతనము సర్వేశున్నగరిది
బతుకుఁదోవ యిదె బడకరము ॥ పల్లవి ॥

హృదయములోపల నీశ్వరుఁ డున్నాఁడు
దిలము మనసా బడకరము
తుద నల కామాదులఁ జొర నియ్యక
పదరక కావుము బడకరము ॥ జత ॥

యెంచుకొని విదే యేలిక మిము నిఁక
పంచభూతములాల బడకరము
మించినపురి తొమ్మిదివాకిళ్లను
పంచుక వున్నారు బడకరము ॥ జత ॥

నడుమ నడుమఁ బ్రాణములాలా మీరు
బడివాయకుండరో బడకరము
యెడయక శ్రీవేంకటేశ్వరునకు మీరు
బడలక కొలువరో బడకరము ॥ జత ॥ 318

భైరవి

అతఁడే విష్ణుం డఖిలము నడపెడి
యీతల నెవ్వరి కేఁటికిఁ జింతా ॥ పల్లవి ॥

పుట్టించఁ బెంచఁగ పొడ వెక్కించ దేహుల
గట్టిగా మాఁటలాడించఁ గదలించ
పట్టి వాన గురియించ పైరులు మో[౧]
తిట్ట పెట్ట నొకానొకదేవుఁడు గలఁడు ॥ అతఁ ॥

అన్నపానము లొసఁగ నాపదలు గడపఁగ
పన్ని మాయలు భువిఁ బచరించ
విన్నపాలు సురలవి విని యందరి రక్షింప
వున్నతోన్నతుఁడై వొకానొకకర్త గలఁడు ॥ అతఁ ॥

కాల మక్షయము[౨]సేయ కర్మము ఫలించఁజేయ
తాలకొని మరపించఁ దలఁపించ
పాలుపడి శ్రీవేంకటపతియై వేదాలుచెప్పే-
యేలిక యొకానొకయీశ్వరుఁడు గలఁడు ॥ అతఁ ॥ 319

భైరవి

హరి హరి జగ[౨]మెఱుంగ నీ వాతుమలోనే వున్నాఁడవు
సురలఁ గాచుటయు నసురల నడఁచుట చొప్పడియున్నది
నీగురుతు ॥ పల్లవి ॥

వేదార్థము [౩]దప్పం దెలిసినవిద్వాంసునివంటిది
పాదుగఁ జదువక తర్కించఁబోవుపాండిత్యమువంటిది
మేదిని నడవులఁ దెరువుదప్పి మరి మెలఁగేటితెరువరివంటిది
ఆదిమూర్తి నీశరణుచొచ్చి నిను నారాధించనివానిబదుకు ॥ హరి ॥

---

౧. 'కాయ' రేకు ౨. 'మెఱుంగ' పూ.ము.పా. రేకు. ౩. 'దప్పఁదెలిసిన' పూ.ము.పా.

వట్టిజోలితో నూరక దేవరలేనిపూజవంటిది
వొట్టుక ఫలములులేనిపంటలకు వొడిగట్టేయటువంటిది
నెట్టనఁ గర్ణధారుండులేనిజలనిధినడిమియోడవంటిది
బట్టబయటనే పరమేశ్వర నీపైభక్తిలేనివానిబదుకు ॥ హరి ॥

పొందుగ ధర్మముబోధించెడిసత్పురుషులులేనిసభవంటిది
చెంది శ్రీవేంకటేశ్వర నీమహిమలు చెప్పనికథవంటిది
సందడి నన్నియుఁ జేసి దక్షిణలుచాలనియజ్ఞమువంటిది
యిందిరారమణ నీ వెక్కుడనుచు నిన్నిటఁ దెలియని[illegible]కు
॥ హరి ॥ 320

## భైరవి

అరుదు నీచెరిత్రము హరి నే నిదియే తలఁచుకొని
శరణంటేఁ గావు మిదియ విన్నపము సరిలేరు నీకు ॥ పల్లవి ॥

వరగ నీయకారణబంధుత్వ మహల్యయందుఁ గంటిమి
రియందు నార్తరక్షకత్వము మెరయఁగఁ గంటిమి
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము గంటిమి
శరణంటేఁ గాచుట ధర విభీషణునందుఁ గంటిమి ॥ అరు ॥

మును భక్తవత్సలత్వము నీకు శబరియందుఁ గంటమి
అనాథనాథుడవు నీ వగుట సుగ్రీవునందుఁ గంటిమి
పెనఁగి నిరుహేతుకప్రేమ పరీక్షితునందుఁ గంటిమి
వినుఁ గింకరాధీనుఁడని ప్రహ్లాదునియందుఁ గంటిమి ॥ అరు ॥

గోవర్ధనమందు సర్వజీవదయాపరత్వము గంటిమి
భావించి సాందీపునందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి
దేవ శ్రీవేంకటేశ్వర నీవు దృష్టవరదుఁడవగుట
తావైననీకొనేటిదండ నౌనఁగేయందే కంటిమి[1] ॥ అరు ॥ 321

---

౧. ఈపాటలో ప్రతిచరణమునందుమా 'కంటిమి' దీర్ఘాంతముగనే కలదు.

రేకు 167 భైరవి

ఎంతపుణ్యమో యిటు మాకుఁ గలిగె
చెంతనే నీకృప సిద్ధించఁబోలు ॥ పల్లవి ॥

శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపము లణఁగెను భయ ముడిగె
తీపుగఁ దులసితీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలంబాయ ॥ ఎంత ॥

గోవింద మిముఁ గనుఁగొంటి మిప్పుడే
పావనమైతిమి బ్రతికితిమి
తావుల మీపాదములకు మొక్కితి
వేవేలఁ గలిగెను వేడుకలాయ ॥ ఎంత ॥

శ్రీవేంకటేశ్వర సేవించితి మిము
ధావతి దీరెను తనిసితిమి
వావిరి మువ్మారు వలగొని వచ్చితి
నీవారమైతిమి నిలిచితి మిపుడు ॥ ఎంత ॥ 322

మలహరి

అనంతాపరాధి నేను అటుగాన శరణంటిని
యెనలేనినీగుణాలు యేమిచూచేనయ్యా ॥ పల్లవి ॥

దగ్గరి కొలుతు నాతరతమ్య మెంచుకోను
సిగ్గువడ నిట్టె నిన్నుఁ జేరి పాడుదు
వొగ్గి విన్నపాలు సేతు వుబ్బునఁ జిత్త మెరఁగ
మొగ్గ లెంచితే నావల్ల నెన్ని లేవయ్యా ॥ అనం ॥

పాదాలంటి మొక్కుదును పరిశుద్ధి దలఁచను
సాదించి కొలువవత్తు సత్వి చూడను
యేదెసనైనా నుతింతు యెంగిలినోరని మాన
పాదుగా విచారించితే బలుమూఢుఁడనయ్యా ॥ అనం ॥

మంచముపైఁ దలపోతు మందెమేళమనియన
కంచముకూడర్పింతుఁ గాదననేర
యెంచఁగ శ్రీవేంకటేశ యిన్నిటా నీబంట నైతి
పంచలఁ జూచితే నీపాలివాఁడనయ్యా ॥ అనం ॥ 323

మలహరి

అన్నిటా నీవే వుందునందువుగాన
యిన్ని నీవు వుట్టించిన వివి నీసొమ్మలే ॥ పల్లవి ॥

నిలిచినరూపులెల్లా నీగుళ్లుగాఁ దలఁతు
మెలఁగేటిచైతన్యము మిమ్ముగాఁ దలఁతు
యిలలోనిధ్వనులు నీపలుకులుగాఁ దలఁతు
కలపంచభూతా లుపకరణాలుగాఁ దలఁతు ॥ అన్ని ॥

నారుకొన్నపంటలు నీనైవేద్యాలుగాఁ దలఁతు
నీరెల్లా నీతీర్థమని నెమ్మిఁ దలఁతు
ధారుణి భోగాలు పూజాద్రవ్యాలుగాఁ దలఁతు
నేరిచినపనులెల్లా నీలీలలుగాఁ దలఁతును ॥ అన్ని ॥

కాలత్రయము నీగతులుగానే తలఁతు
చాలి సురల నీయనుచరులఁగానే తలఁతు
నాలోని శ్రీవేంకటేశ నాతండ్రివని తలఁతు
తాలిమి నీదేవులను తల్లియని తలఁతును ॥ అన్ని ॥ 324

### మలహరి

అందుకేపో నీపై నాసవుట్టి కొలిచేది
మందలించితి నీక మరి నీచిత్తము ॥పల్లవి॥

యిందరుఁ జెప్పఁగా వింటి యెవ్వరికైనా విష్ణుఁడే
కందువ మోక్ష మియ్యఁ గర్త యనఁగా
ముందే వింటి నారదుఁడు మంచి నిన్నుఁ బాడఁగా
పొందుగ లోకములోనఁ బూజ్యుఁడాయననుఁచు ॥అందు॥

అప్పటి వింటి లోకము లన్నిటికి హరియే
కప్పి రక్షకత్వానకుఁ గర్త యనఁగా
యిప్పుడే వింటి ధ్రువుఁడు యిటు నిన్ను నుతించే
వుప్పతిల్లి పట్ట మేలుచున్నాఁడనుచును ॥అందు॥

యిదె వింటి శ్రీవేంకటేశ బ్రహ్మకుఁ దండ్రివై
కదిసి పుట్టించఁ బెంచఁ గర్త వనుచు
వదలక వింటి నీకు వాల్మీకి కావ్యము చెప్పి
చెదర కాద్యులలోఁ బ్రసిద్ధుఁడాయననుచు ॥అందు॥ ౩౨[illegible]

### భూపాళం

అపరాధిని నే నైనాను
కృపగలవారికిఁ గపటము లేదు ॥పల్లవి॥

సనాతనా అచ్యుతా సర్వేశ్వరా
అనాదికారణ అనంతా
జనార్దనా అచల సకలలోకేశ్వరా
విను మరచియున్నాఁడ నన్నుఁ దెలుపవయా ॥అప॥

పురాణపురుషా పురుషోత్తమా
చరాచరాత్మక జగదీశా
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా
యిరవు నీవేయట యెఱఁగించఁగదే ॥ అప॥

దేవోత్తమా శశిదినకరనయనా
పావనచరితా పరమాత్మా
శ్రీవేంకటేశా జీవాంతరంగా
సేవకుఁడను బుద్ధిచెప్పఁగవలయు ॥ అప ॥ 326

భూపాళం

చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు
యెప్పుడును జింతించే విదేవనై నేను ॥ పల్లవి ॥

పొలసి నీరూప మెట్టు పొడచూపేవో
యెలమి నా భాగ్య మిఁక నెట్టున్నదో
అలరి నా కేబుద్ధి అనతిచ్చేవో
కలిగిననీమాయ యేగతిఁ గడచేనో ॥ చెప్ప ॥

వరుస నా కెట్లాఁ గైవసమయ్యేనో
యిరవై నాజన్మఫల మెట్టున్నదో
పరగ నామతి నెట్టు పాయకుండేవో
కరుణానిధివి నిన్నేకరణి మెప్పించేనో ॥ చెప్ప ॥

పనివడి యెట్లా నీశక్తి యిచ్చేవో నా-
మనసుచంచల మెట్టు మట్టుపడీనో
యెనలేని నాతలఁపు యెఱిఁగి శ్రీవేంకటేశ
నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో ॥ చెప్ప ॥ 327

రేకు 168 భూపాళం

ఇవి సేయఁగ నే నలసుఁడ యెటువలె మోక్షం బడిగెదను
  వివరముతోడుత నీవు సులభుఁడవు విష్ణుఁడ నిన్నే కొలిచెదఁగాక
  ॥ పల్లవి ॥

జపయజ్ఞదానకర్మంబులు యెంచఁగ జిరకాలఫలంబులు
  యెపుడుఁ బుణ్యతీర్థస్నానములు యిల పాపవిమోచనములు
  అపరిమితదేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
  వుపవాసాదినియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు ॥ ఇవి ॥

రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
  తవిలినపంచేంద్రియవిగ్రహంబులు తనుధరులకు దుర్లభములు
  అవిరళధర్మార్థకామంబులు మఱి యైశ్వర్యములకు మూలములు
  అవలగ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు ఆశామయము ॥ ఇవి ॥

పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
  అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికివి సంసారభోగము
  హరి నరహరి శ్రీవేంకటేశ్వరా అఖిలము నొసఁగెడిదాతవు
  పరుగన నీవే దయతో రక్షించఁజాలుదు వేకాలమును మమ్మును
  ॥ ఇవి ॥ 328

ధన్నాసి

నీవే మాకు దిక్కు నిన్నే తలఁతుము
  కావు మానేర మెంచక కరుణానిధీ ॥ పల్లవి

నెట్టన సూర్యు[1] లోనినెలకొన్న తేజమా
  గట్టిగాఁ జంద్రునిలోనికాంతిపుంజమా
  పుట్టిరక్షించేయజ్ఞపురుషునిప్రకాశమా
  వొట్టుక దేవతలలోనుండినశక్తి ॥ నీవే ॥

---

[1] 'లోన' కావచ్చు.

పిడుఱు మించినయట్టిజీవులలో ప్రాణమా
గరిమ వేదములలోఁగలయర్థమా
పరమపదమునందుఁ బాదుకొన్నబ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా ॥నీవే॥

జగములో వెలసేటిసంసారసుఖమా
నిగిడినమంత్రములనిజమహిమా
మిగుల శ్రీవేంకటాద్రిమీఁదమన్నదైవమా
ముగురువేల్పులలోనిమూలకందమా ॥నీవే॥ 329

ధన్నాసి

నీ వెంత నే నెంత నేఁడు నాయగ్గలి కెంత
దేవ నీదాసులఁ జూచితేనే విస్మఁ గనుట ॥పల్లవి॥

వొక్కొక్కరోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
ఉక్కుమీరి ధరించుకఉన్నాఁడవట
చిక్కనినీరూప మెంతో విస్మఁ గనుఁగొను టెట్టు
అక్కజపువేదముల కగోచరుఁడవు ॥నీవెం॥

యెన్నో శిరసులట యెన్నో పాదములట
యెన్నరానిచేతులట యిట్టినీమూర్తి
కన్నులఁ జూచుట యెట్టు కడగురు తందు కేది
అన్నిటా మునీంద్రులకు నచింత్యుఁడవు ॥నీవెం॥

కోటిసూర్య లొక్కమాటే కూడ నుదయించినట్టు
గాటపునీతిరుమేనికాంతులట
మేటివి శ్రీవేంకటేశ మిమ్ము ద్రిష్టించుట యెట్లు
కోటిదేవతలకెల్లాఁ గొడవైనవాఁడవు ॥నీవెం॥ 330

ధన్నాసి

నారాయణ నీవంశో నాభాగ్యమో ఇది
పేరుకాని పిలువని పేరటమై వున్నది ॥ పల్లవి ॥

వుడిగినాఁ గామాదు లొక్కొక్కవ్యాళావ వచ్చి
సుడిసి నడుముచొచ్చుచుట్టాలవలె
తడవకున్నాఁ గర్మాలు తమ్ముఁ దామె పేయించి
బడిబడిఁ దిరుగును బంట్లవలె ॥ నారా ॥

చూడకున్నా దుర్గుణాలు పొంట్లు సోదించవచ్చి
వాదవాదలఁ [1]దల[illegible]రులవలె
యేద నున్నా లంపటాలు యెదుటనే వొలసీని
జోడువాయనీక తోడునీడలవలె ॥ నారా ॥

కలఁచకున్నా భోగాలు తనువుతోఁ బెనఁగిని
చెలరేఁగి గరడిలో [2]జెట్లవలె
బలిమి శ్రీవేంకటేశ భావములో నీమూరితి
నిలుపవే యెందుకైనా నిగిడీ నామనసు ॥ నారా ॥ 331

దేవగాంధారి

పసులఁ గాచుట యెట్టు బండిబోయఁడవౌటెట్టు
వెస నిన్నుఁ దలఁచితే వెరగయ్యీ నాకు ॥ పల్లవి ॥

వరుస నంతరియామిత్వము నవతారములు
పరగ మూఁడుమూర్తులప్రభావము
పరమపదము పరాత్పరము బ్రహ్మమునై
తిరమైనయాదిదేవదేవుఁడవు నీవు ॥ పసు ॥

---

౧. 'దలవరులవలె' రేకు. ౨. 'జెట్లువలె' రేకు.

అఖిలము జీవులకు నణువుకు మహత్తుకు
వెనుకొన్నమాయకు విరాట్టుకు
ఘనుఁగనిమహిమలపొడవుకుఁ బొడవైన
దినకరకోటికోటితేజమవు నీవు ॥ పను ॥

సర్వశాస్త్రములలో సనకాదులలో
సర్వేశగరుడానంతప్రముఖులలో
సర్వదా మెలఁగుచు జనవరదుఁడవై
వుర్వి శ్రీవేంకటాద్రినున్నదేవుఁడవు ॥ పను ॥ 332

రేకు 169 దేవగాంధారి

ఏపొద్దూ నీచేఁతలెల్లా యెదుటనే కానవచ్చీ
వీఁపు గానరాఁగా దాఁగేవిద్య నీదిగాక ॥ పల్లవి ॥

పుట్టినమేకానకుఁ బూరి మేయ నేరిపితా
అట్టె పిల్లలఁ బెట్టనటు నేర్పిరా
చుట్టి నీళ్లున్నచోటు సోదించ నేరిపిరా
మట్టులేవి దింతా నీమాయ యింతేకాక ॥ ఏపొ ॥

తీవెలకుఁ జుట్టి చుట్టి దిక్కులఁ బాఁక నేరిపిరా
తావులఁ దతికాలానఁ బూవ నేరిపిరా
[1] వేవేలుపక్కొమ్మలు వెనఁ బెట్ట నేరిపిరా
యేవలఁ జూచినా నీమహిమ లింతేగాక ॥ ఏపొ ॥

కోరి పక్షులు కొరులు గూండ్లువెట్ట నేరిపిరా
సారె జాతియ్యాహారాలచవి నేర్పిరా
యీరీతి శ్రీవేంకటేశ యిన్నియు లోకములోన
చేరి నీవు సేసిన[2]సృష్టి యింతేకాక ॥ ఏపొ ॥ 333

1. 'వేవేలువకొమ్మలు' వ్రా.ము.పా. పక్క+కొమ్మలు=పక్కొమ్మలు కావచ్చు.
2. 'స్రిష్టి' రేకు.

దేవగాంధారి

ఇంతకంటే మరి లేదు యెవ్వరికి నుపాయము
యెంతైనా విదియు నీ విచ్చితేనే కలుగు ॥ పల్లవి ॥

హరి నీచిత్తమువచ్చేయందుకు నుపాయము
ధర నిన్ను బోధించేనీదాసులమాటే
దురితములన్నిటిని తొలగించేవుపాయము
నిరంతరమును నీనామజపమే ॥ ఇంత ॥

దండితోడ నీమాయ ౧దాఁటేయందు కుపాయము
నిండుపెధానమైననీపై భక్తే
అండనున్నకామాదుల నణచుట కుపాయము
కొండవంటినీమూర్తిఁ గోరి శరణనుటే ॥ ఇంత ॥

పుట్టుగులు గెలిచి నిన్ను బొందుట కుపాయము
అట్టె నీరూపమైనఆచార్యుడే
యిట్టె శ్రీవేంకటేశ యిన్నిటికి నుపాయము
మట్టులేనిరామానుజమతము చేకొనుటే ॥ ఇంత ॥ 334

దేవగాంధారి

తెలియరాదు నీమాయ తెరమఱఁగుపెక్కు-
వలలఁ జిక్కక నిన్నే కొలువఁగవలయు ॥ పల్లవి ॥

చూడఁగ నీజగత్తుకు సూత్రధారివి నీవు
జోడై నీసూత్రాన నాడుచును సర్వంబున్నది
యేడఁ జూచినా నీ వుందు వెవ్వరికిఁ గానరావు
వోడక స్వతంత్ర మొకరిపై వేతువు ॥ తెలి ॥

౧. 'దాఁటి' రేకు.

మఱపించాఁ దలఁపించా మర్మజ్ఞుఁడవు నీవు
గుఱియై నీసంకల్పముకొలఁదే యీజీవులెల్లా
మఱి నీ వీశ్వరుఁడవు మాఁటలకుఁ జిక్కవు
కఱకరి వితరులఁ గర్తలఁగాఁ జేతువు ॥తెలి॥

అందరిమొర లాలించి అట్టె రక్షింతువు నీవు
కందువ శ్రీవేంకటేశ కానవచ్చె నీమహిమ
చెంది వరము లిత్తువు చేతికి సులభుఁడవు
సందడి నెవ్వరినైనా సరిగా మన్నింతువు ॥తెలి॥ 335

ధన్నాసి

నీవే దయదలఁచుక నెమ్మి రక్షించుటగాక
యీవలఁ గొలిచేనంటే యీడైనవాఁడనా ॥పల్లవి॥

పరగ నేమైనా విన్నపము చేసుకొనేనంటే
హరి నీకు నెదురుమాఁటాడేవాఁడనా
గరిమ సువస్తువులు కానుక ఇచ్చేనంటే
సరుస నీకన్నా నేను సంపన్నుఁడనా. ॥నీవే॥

మెలఁగి నీగుణాలకు మెచ్చి సంతోషించేనంటే
జలజాక్ష నే నీతో సరివాఁడనా
బలువైన నీపరమపదము గోరేనంటే
వలనైననీతోడివంతువాఁడనా. ॥నీవే॥

తాలిమితో నాలో నిన్ను ధ్యానము సేసేనంటే
పాఁమఁడ నేను నీపాటివాఁడనా
యేలితివి శ్రీవేంకటేశ నన్నుఁ గృపతోడ
యీలీల నీమహిమలు యెఱిఁగేటివాఁడనా. ॥నీవే॥ 336

దేవగాంధారి

చిత్తానఁ బెట్టు మీమాఁట శ్రీరమణ మరవకు
    హత్తి విన్నెమెఱఁగుదు నజ్ఞాని నేను. ॥పల్లవి॥

నెలకొని నాలోన నీ వున్నాఁడవుగనక
    తలఁచకున్నా నిన్నుఁ దలఁచినవాఁడనే
    యెలమి నందరి నీవే యేలినవాఁడవుగనక
    కొలువకున్నా నిన్నుఁ గొలిచినవాఁడనే. ॥చిత్తా॥

నిక్కని ఆకసమెల్లా నీపాదమే కనక
    మొక్కకున్నా నేను నీకు మొక్కినవాఁడనే
    నిక్కి నానాక్షరములు నీపేరులే కనక
    పెక్కులుగాఁ బిలువకున్నాఁ బిలిచినవాఁడనే ॥చిత్తా॥

వోజ నారుగములా నున్నాఁడవుగనక
    పూజించకున్నా నిన్నుఁ బూజించినవాఁడనే
    తేజపుశ్రీవేంకటేశ దేవ నీవే గతిగాన
    సాజాన నే మఱచినా శరణన్నవాఁడనే. ॥చిత్తా॥ 337

గుండక్రియ

౧దాఁచుకో నీపాదాలకుఁ దగ నేఁ జేసినపూజ లివి
    పూఁచి నీకీరితిరూపపుష్పము లివి యయ్యా ॥పల్లవి॥

వొక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
    తక్కినవి భండారాన దాఁచి వుండనీ
    వెక్కసమగు నీ నామము వెలసులభము ఫల మధికము
    దిక్కై నన్నేలితి వింక నవి తీరనినాధనమయ్యా ॥దాఁచు॥

౧. 'దాఁచుకొని పాదాలకుఁ' పూ.ము.పా.

నావాలికపైనుండి నానాసంకీర్తనలు
పూని నాచే నిన్నుఁ బొగడించితివి
వేనామాల వెన్నుఁడా వినుతించ నెంతవాఁడ
కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా ॥దాఁచు॥

యీమాఁట గర్వము గాదు నీమహిమే కొనియాడితిఁగాని
చేముంచి [1]నాస్వాతంత్ర్యము చెప్పినవాఁడఁ గాను
నేమాన నాడేవాఁడను నేరము లెంచకు మీ
శ్రీమాధవ నే నీదాసుఁడ శ్రీవేంకటేశుఁడవయ్యా॥దాఁచు॥338

రేకు 170 గుండక్రియ

హరి గోవిందా హరి గోవిందా
ఆనంద మానంద మాతుమకును
గురూపదేశాన వెదకఁగా వెదకఁగా
గరిమ నీయర్థము కంటి మోయయ్యా ॥పల్లవి॥

సరి నన్యధర్మములు మానుమంటివి
శరణు నీకుఁ జొరుమంటివి
దురితము లణఁచేనంటివి
పరగ మోక్షం బిచ్చేనంటివి
హరి నీవచనము అమోఘము
నరులము నే మిది నమ్మితిమి
పరమపద మిప్పుడే కలిగెను
ధర నొక్క మనసుతో సువ్వారమయ్యా ॥హరి॥

---

౧. 'స్వాతంత్రము' రేకు.

యెందు నీవే గతి [1] యనుమంటివి
యేచి యెక్కుమాఁటే చాలునంటివి
యిందరి కభయ మిత్తునంటివి
యిది నీ కెపుడు వ్రతమంటివి
కందువ నీబిరుదు సత్యము
కావిమ్మని నేము చేపట్టితిమి
అంది నీవే మాకు దిక్కైతివి
అన్నిటా సంతోసాన నున్నారమయ్యా ॥ హరి ॥

ఆసమానినవాఁ డెక్కు డంటివి
అతనివెంటఁ దిరిగేనంటివి
భాసురపాదరేణువు [2] నే నంటివి
పావన మయ్యేనని యంటివి
మోసలేనిది నీసంకల్పము
మొక్కే మిందులకు శ్రీవేంకటేశా
ఆసపడ నితరుల నాకు నీవే యాస
యని నీదాసులమై యున్నారమయ్యా ॥ హరి ॥ 339

గుండక్రియ

ఇదివో నాసంపదా ఆస్తియుఁ బాస్తి నీవు ఇతరంబులు నాకుఁ బనిలేదు
పదిలంబుగ నాబ్రతుకెల్లా నీవే పాలించఁగదే నారాయణా ॥ పల్లవి ॥

ఉపమల నే నార్జించినఉన్నతధనంబు నీవు
తపము [3] సేయఁగాఁ గలిగెడుతత్ఫలంబు నీవు
జపములవలనఁ గలిగెడునాతేజఃప్రభావమును నీవు
కపురులదానధర్మపరోపకారంబులఁ బొందెడుమేలు నీవు ॥ ఇది ॥

---

౧. 'యెను' రేకు. ౨. 'చేనంటివి' రేకు. ౩. 'కాయఁగా' రేకు.

పరము నాకు నీవు పరాత్పరమును నీవు
గరిమల నిలలోపలియనంతభోగంబులు నీవు
గరుడోరగామరసిద్ధసాధ్యగంధర్వపదములు నీవు
సురమునిపితృపూజావేదపాఠసుకృతంబులు నీవు ॥ఇది॥

నాలుగాశ్రమంబులు నానావిద్యలు నీవు
తాలిమి నాపంచవింశతితత్త్వంబులు నీవు
ఈలీల శ్రీవేంకటేశ్వర యిన్నియు నీవు నా కవి యెఱిఁగితి
యేలితివి నాప్రాణంబులు నీవు యిల సర్వోపాయంబులు నీవు
॥ ఇది ॥ 340

శుద్ధవసంతం

అందుకేనుమ్మీ నేఁ జేసేఆదారాలు దైవమా
నిందవాయ నామనసు నీపై నిలుపవే ॥ పల్లవి ॥

బట్టబయటఁ దోలితేను బందె మేయుఁ బసురము
పట్టి మేపితేను తనపనులు సేయు
ఇట్టె వదలితేను యెందైనాఁ బారు మనసు
కట్టిక నేమస్తుఁడైతే కైవసమై యుండును ॥ అందు ॥

బడి దప్పితే బంట్లు పరదేసు లౌదురు
౧యెదయక కూడుకొంటే హితు లౌదురు
విడిచితే నిటులానే కడకుఁ బారు మనసు
వొడలిలో నణఁచితే వొద్దికై వుండును ॥ అందు ॥

చే వదలితే పెంచినచిలుకైనా మేడ లెక్కు
రావించి గూఁటఁ బెట్టితే రామా యనును
భావించకుండితే యిట్టె పారు నెందైనా మనసు
శ్రీవేంకటేశుఁ గొల్చితే చేతఁ జిక్కి వుండును ॥ అందు ॥ 341

౧. 'యడయక' పూ.ము.పా. రేకు. యతిభంగము.

### బౌళి

జపములఁ దపములు సంధ్యాదివిధులకు
నెపము నామీఁద నింతే నీకే[1]నెలవు || పల్లవి ||

ఫలము విను గోరనిపంతమువాఁడఁ గాను
[2]వలెననడుగ నెంతవాఁడను నేను
చెలఁగి నీవు కర్మము సేయించఁగాఁ జేసేటి-
వెలలేక తెచ్చుకొన్న [3]వెట్టివాఁడ నేను || జప ||

ఆస మానితిననేటియహంకారి నేఁ గాను
వాసికి నీతోఁ బెనఁగేవాఁడఁగా నేను
వేసరకుండాఁ గట్టు విడిపించి యేలుకోఁగా
దాసుఁడనై బదికేటిధర్మపువాఁడ నేను || జప ||

జ్ఞానినై తిననేగర్వాచారపువాఁడఁ గాను
కానక నీపై మోపుగట్టనోపను
ఆనుక శ్రీవేంకటేశ ఆతుమ నీ వుండఁగాను
మోనాన నీకు మొక్కేటిమూఁకవాఁడ నేను || జప || 342

### హిందోళవసంతం

అందరి రక్షించేదేవుఁ డాదరించీ జీవులను
పొందుగా [4]యీమేలెరిఁగి పొగడరో లోకులు || పల్లవి ||

వనము వెట్టినవాఁడు వాఁడకుండా నీరు వోసి
వెసఁ గలుపు దీసి పెంచినయట్లు
పసివడి గొల్లవాఁడు పచ్చికపటునఁ బసుల
తనియఁగ నిల్పి నిల్పి తానే మేపినట్లు || అంద ||

---

౧. 'కలవు' రేకు. ౨. 'వలెననెడుగ' రేకు. అని+అడుగ 'అనెడుగ' ఇట్టి-వంటివి వాఙ్మయమున కోకొల్లలు. ౩. 'వెట్టివాఁడను' పూ. ము. పా. ౪. 'మీమేలెరిఁగి' పూ. ము. పా.

కన్నతల్లి బిడ్డలకు గాచుక వెన్నయుఁ బాలు-
  నన్నము గడి రక్షించినటువలెను
యెన్నఁగ బిడ్డలేలేయేలిక జీతాలు వెట్టి
  మన్నించి యేటుకోలు మన్నించినట్లు ॥ అంద ॥

వసుధ వైద్యుఁడై నాలుక మందు మాకు లిచ్చి
  హెసఁగ వేమారు లోఁ బోషించినట్లు
యెసఁగ శ్రీవేంకటేశుఁ డిచ్చెఁదే కర్మఁ గొట్టించి
  నన్ను వరము లిచ్చి రక్షించినట్లు ॥ అంద ॥ 343

రేకు 171 ధన్నాసి

ఎఱఁగరో వేసారు నల జీవుఁడు
  మెఱసి నిండుకున్నాఁడు మేఁటి యీదేవుఁడు ॥ పల్లవి ॥

వూరకే పరాకైనట్టుండును దేవుఁడు
  నారుకొన మతిలోఁ దనపైనే చింత
గారవాన మరి యెలుతనయట్టే వుండును
  యీరీతి మాటాడించేవాఁ డన్నిటా నితఁడే ॥ ఎఱఁ ॥

యొందు లేనియట్టేవుండు నెంచి చూచితే దేవుఁడు
  చెంది లోకశరీరియై చెలరేఁగిని
అందరిలో యెక్కుడాను అడగినట్లనే వుండు
  యిందరిఁ బోషించేవాఁడు యెప్పుడూ నితఁడే ॥ ఎఱఁ ॥

చేరి ౨లోనుగానెట్టుండు శ్రీవేంకటేశుఁ దేవుఁడు
  కోరినవరము లిచ్చు గురుఁడుగాను
వారక యలమేల్మంగపతియుఁ డిట్టిదేవుఁడు
  యీరూపుతో నుండు నిందరిలో నితఁడే ॥ ఎఱఁ ॥ 344

---

౧. 'లిచ్చి భావించినట్లు' పూ.ము.పా.

౨. 'లోనుగావట్టుండు' పూ. ము. పా. లోనుగాని+అట్టుండు=లోనుగానెట్టుండు. ఇది వ్యావహారికసంధి. ఈ వాఙ్మయమున పలుతావుల గలదు.

నాట

విష్ణుఁ డొక్కఁడే విశ్వాత్మకుఁడు
వైష్ణవమే సర్వంబును ॥ పల్లవి ॥

పరమేష్ఠి సేయుబ్రహ్మాండసృష్టియు
హరువిలోనిసంహారశక్తి
పరగఁగ నింద్రునిపరిపాలనమును
అరసిచూడ శ్రీహరిమహిమ ॥ విష్ణుఁ ॥

యిలఁబంచభూతములలో గుణములు
అల నవగ్రహవిహారములు
తలకొను కాలత్రయధర్మంబులు
అలరఁగ నారాయణునిమహిమలే ॥ విష్ణుఁ ॥

అంతటఁ గలమాయావిలాసములు
పొంతఁ బరమపదభోగములు
మంతుకునెక్క నమరినసమస్తమును
యింతయు శ్రీవేంకటేశుమహిమలే ॥ విష్ణుఁ ॥ 345

గుజ్జరి

ఒకటి కొకటి లంకై పూరకై నాఁ బెనగొను
అకటా యెవ్వరు దాఁటేరయ్య నీమాయలు ॥ పల్లవి ॥

తనయెదుటివెల్లాను తలఁపులోఁ బారును
మనసులోపలివెల్లా మర్మము లంటు
ఘనమర్మములు రేఁగి కాయమెల్లాఁ గరఁగించు
తనువుసౌఖ్య మవ్వలితమవున నంటును ॥ ఒక ॥

అవ్వలి దేహభోగము లట్టే కర్మములౌను
మువ్వంకఁ గర్మాలు లోకములై చెందును
చివ్వన నాలోకములు చేరి కాలము గడపు
తెవ్వవి కాలము నిద్రఁ దెలిపినై ముంచును ॥ ఒక ॥

వెస నాతెలివి యొకవేళ నన్నెఱిఁగించు
వసమై ఆయుఋకతు వచ్చి మెత్తువు
యెసగి నీవు మెచ్చితే నిహపరము లిత్తువు
మిసిమి శ్రీవేంకటేశ మెరయు నీయావి ॥ ఒక ॥ 346

సాళంగనాట

శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్యధురంధరా ॥ పల్లవి ॥

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమలంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపురనివాస ॥ శర ॥

రవితనయసచివ రావణవనాపహార
పవనవేగబలాఢ్య భక్తసులభ
భువనపూర్ణదేహా బుద్ధివిశారద
జవసత్వవేగ కలశాపురనివాస ॥ శర ॥

సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
అతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవేంకటేశుకరుణాసమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస ॥ శర ॥ 347

బౌళిరామక్రియ

నమో నమో లక్ష్మీనరసింహా
నమో నమో సుగ్రీవనరసింహా ॥ పల్లవి ॥

వరద సులభ భక్తవత్సల నరసింహా
నరమృగవేష శ్రీనరసింహా
పరమపురుష సర్వపరిపూర్ణ నరసింహా
గిరిగుహానిలయ సుగ్రీవనరసింహా ॥ నమో ॥

భయహర ప్రహ్లాదపాలన నరసింహా
నయనత్రయారవింద నరసింహా
జయ జయ సుర మునిసంస్తుత నరసింహా
క్రియాకలాపసుగ్రీవనరసింహా ॥ నమో ॥

అతికృపానిలయ సోమాహిరూప నరసింహా
నతపితామహముఖ్య నరసింహా
సతతశ్రీవేంకటేశ్వర దివ్యనరసింహా
కితవారిభంజన సుగ్రీవనరసింహా ॥ నమో ॥ 348

భైరవి

చిత్తగించి రక్షించు శ్రీహరి నీవు
యిత్తల మానేరములు యెన్ని లేవయ్యా ॥ పల్లవి ॥

అంగము యేచి జానలు అప కొంతఁబొడవు
యెంగిలిమేను ఆచార మెంతైనాఁ గద్దు
ముంగిలింతే సంసారము సాధించేది లోకమెల్లా
అంగడిఁబడి జీవుని కలపు లేవయ్యా ॥ చిత్త ॥

మఱి సల్లెడునాలికె మాటలు గంపెడేసి
యెఱుక గొంచె మజ్ఞాన మెంచఁగరాదు
గుఱిలేనిది బదుకు కొలఁదిలేదు భోగము
నెఱవైజీవునికి నేఁట లేదయ్యా ॥ చిత ॥

పట్టరానిది మనసు బయలువందలి చేఁత
చుట్టుకొన్నది కర్మము పట్టిగుట్టు
యిట్టె [1] యలమేల్మంగ నేలె శ్రీవేంకటేశుఁడు
నట్టన నీబంటుజీవునికి మితిలేదయ్యా ॥ చిత ॥ 349

రేకు 172 ప్రతాపనాట

ఏమని నుతించవచ్చు నితనిరూపము
భీమవిక్రముఁ డితఁడు పెద్దహనుమంతుఁడు ॥ పల్లవి ॥

వొక్కటంగ చాఁచినాఁడు వొగిఁ దూర్పుఁ బడమర
తక్కక భుజా లిడ్పంచె దక్షిణోత్తరాలు నిండ
మిక్కిలి బ్రహ్మలోకము మీరను శిరసెత్తెను
పిక్కటిల్లుమహిమతోఁ బెద్దహనుమంతుఁడు ॥ ఏమ ॥

వేడుక వాల మాకాశవీధితోఁ బెనచినాఁడు
యేడుజలధులు చేసె నదే మోకాళ్లబంటి
వోడక పిడికిలించె నుగ్రదైత్యులతలలు
బేడుగాఁ జేసినాఁడు పెద్దహనుమంతుఁడు ॥ ఏమ ॥

జళిపించి వలకేలు సకలము మెచ్చ నెత్తె
కులగిరులు తనతొడలసందినే యడఁచె
బలువుఁడు శ్రీవేంకటపతిబంటు మతంగాద్రి-
నిలమువాఁడు నున్నాఁడు పెద్దహనుమంతుఁడు ॥ ఏమ ॥ 350

---

౧. 'యలమేలుమంగ నేలే శ్రీవేంకటేశుఁడ' కావచ్చు.

### దేసాళం

పనిగాననేరిచితే పాపమే పుణ్యమౌను
నినుఁగొలిచేయట్టినీసేవకులకు ॥పల్లవి॥

మనసు చంచలమైనా మరి నిన్నుఁ దలఁచితే
జనులకు నిహపరసాధనమౌను
తనువు హేయమైనా తగ నిన్నుఁ గొలిచితే
పనివడి యంతలోనే పవిత్రమౌను ॥పని॥

కర్మము బంధకమైనా కమ్మి నీసొమ్ముచేసితే—
నర్మిలి మోక్షమియ్య నాధారమౌను
మర్మము కోరికయైనా మహి నీభక్తికెక్కితే
ధర్మములకుఁ బరమధర్మము దా నౌను ॥పని॥

జగమెల్లా మాయయైనా సరి నీకే శరణంటే
పగటున నదే తపఃఫలమౌను
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
మిగులా నిహమైనా మించి పరమౌను ॥పని॥ 351

### లలిత

మనసు నమ్మనేర్చితే మనుజుఁడే దేవుఁడౌను
తనలోనే వున్నవాఁడు తావుకాని దైవము ॥పల్లవి॥

మగనిపై భక్తిచేసి మగువ యొక్కరితె
తెగి పరలోకము సాధించీనట
వొగి వీఁడు వైష్ణవుఁడై వున్నవాఁడు హరిఁ గొల్చి
అగపడి ఘనమోక్ష మందనోపఁడా ॥మన॥

యేలికకై పగవారి నెదిరించి బంటొకఁడు
మేలైనపదవులంది మెరసీనట
వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణుకైంకర్యాలు చేసి
కాలమందే యందరిలో ఘనుఁడు గానోపఁడా ॥మన॥

పరమపురుషార్థపుపని చేసి యొకరుఁడు
అరిది నధికపుణ్యుఁ డయ్యీనట
విరతి శ్రీవేంకటేశ విష్ణుఁ బూజించి దాసుఁడు
పరము నిహముఁ జెంది బ్రదుకఁగ నోపఁడా ॥మన॥ 352

దేసాక్షి

సోదించి చూడఁబోతే చూచి మఱపు
వో దేవదేవ మించె నోహో నీమాయ ॥పల్లవి॥

వొక్కటే పదార్థము వూరివారెల్లాఁ జూచితే
గుక్కిళ్ల మింగించి యాసకొలుపుచుండు
౧మక్కళిం చందరిలోనిమనసులు వేరు వేరో
వొక్కటో యేమనవచ్చు నోహో నీమాయ ॥సోదిం॥

ధరలో బిడ్డ వొక్కటి తల్లిదండ్రులిద్దరు
తొరలింపువేడుకలై తోఁచుచుండు
పెరిగేటిపుట్టుగులు భేదమో అభేదమో
వారుల కేమనవచ్చు నోహో నీమాయ ॥సోదిం॥

కోరేమోక్ష మొక్కటే కొలచే దిద్దరినట
చేరె వి న్నలమేల్మంగ శ్రీవేంకటేశ
మీ రిద్దరు నేకమో మీభావాలు వింతలో
వూరకే యేమనవచ్చు నోహో నీమాయ ॥సోదిం॥ 353

౧. 'మక్కళిం చెందరిలో' కేతు 'మక్కళించి+అందరిలో' ఇది వ్యావహారికసంధి. శువాఙ్మయమున దండిగ గలదు.

## దేసాళం

ఎన్నిపాట్లఁ బడ్డాను యెవ్వరికిఁ జెప్పినాను
పన్ని నీముద్రలఁగాఁ పాపము వోయీనా ॥పల్లవి॥

కందువ నీపాదాలపైఁ గట్టిపెట్టినఁగాక
సందులఁదూరేమనసు చక్కనుండీనా
సందలేక యేపొద్దు నిన్నే కొలచినఁగాక
తుందుడుకునిమాయ తొలఁగిపోయీనా ॥ఎన్ని॥

వుడివోనిరుచులు నీ కొప్పగించినఁగాక
బడిఁ బంచేంద్రియములు వాయనిచ్చీనా
జడియక నే నీకు శరణువొచ్చినఁగాక
వాడటలో కామక్రోధా లుడిగిపోయీనా ॥ఎన్ని॥

వెక్కపునాకర్మములు నీకొంటునైనఁగాక
యిక్కడ నేఁ జేసేటిహింస మానీనా
పక్కన నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
అక్కర నీకు మొక్కక అజ్ఞానము వోయీనా ॥ఎన్ని॥ 354

## నాట

౧వాఁడెవో ప్రహ్లాదవరదుఁడు
౨వాఁడె వో భక్తవత్సలుఁడు ॥పల్లవి॥

కోరదవడలతోడ కోటిసూర్యతేజముతో
హారకేయూరాదిభూషణాంబరాలతో
చేరి బ్రహ్మాదులెల్లాను సేవలు సేయఁగాను
మేరమీరినశిరులమేడలో నున్నాఁడు ॥వాఁడె॥

౧, ౨. 'వాఁడివో' రేకు. దగ్గరగా చేతితో చూపినట్లు రేకు పాఠము కావచ్చు.

తెల్లని మేనితోడ తీగెనవ్వులతోడ
చల్లని గంధముల వాసనలతోడ
పెల్లుగా నారదాదుల పేరుకొని నుతించఁగా
వెల్లవిరిఁ గొలువై వేడుక నున్నాఁడు ॥ వాఁడె ॥

సంకుఁజక్రములతోడ జంటవూదండలతోడ
పొంకపునానావిధభోగములతో
అంకపు శ్రీవేంకటాద్రి నహోబలమునందు
అంకెల నేపొద్దూ నెలవై తా నున్నాఁడు ॥ వాఁడె ॥ 355

రేకు 173 మలహరి

ఎఱిఁగినవారికి హింస లిన్నియు మాని
మఱి సత్యమాడితేను మాధవుఁడే దిక్కు ॥ పల్లవి ॥

కలుగుఁ గారణములు కామక్రోధములు రేఁగ
వెలసినమాయావికార మది
కలఁగఁగనలనదు కర్త లెవ్వరుఁ గారు
తెలిసి వోరుచుకొంటే దేవుఁడే దిక్కు ॥ ఎఱిఁ ॥

పదార్థా లెదుట నిలుచుఁ బంచేంద్రియాలు రేఁగ
వెదచల్లేటిమాయావిహార మది
పదరి పైకొనవద్దు పట్టితేఁ బసలేదు
చెదరక వోరిచితే శ్రీపతే దిక్కు ॥ ఎఱిఁ ॥

సిరులు తానే వచ్చు చిత్తాన నాసలు రేఁగ
విరసపుమాయావికార మది
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు
శరణంటే నీతనిచరణాలే దిక్కు ॥ ఎఱిఁ ॥ 356

ధన్నాసి

ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము
ప్రకటించి వొకటి చేపట్టరో వివేకులు ॥ పల్లవి ॥

తనుఁ దలఁచుకొంటేను తక్కినదేహభోగాలు
పనికిరావు అవి ప్రకృతిగాన
ఘనమైనలోకభోగములతో లోలుఁడైతే
తనుఁ గానరాదు జీవతత్వముగాన ॥ ఒక ॥

దైవము నెఱఁగితేను తనకామ్యకర్మములు
భావించి మఱవవలె బంధాలుగాన
కావించేటితనకామ్యకర్మాలఁ గట్టువడితే
దైవము లోను గాఁడు స్వతంత్రుఁడుగాన ॥ ఒక ॥

సరి మోక్షముగోరితే స్వర్గము తెరువు గాదు
అరయ స్వర్గము తెరువల మోక్షానకు
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుని
శరణాగతియే సర్వసాధనముగాన ॥ ఒక ॥ 357

లలిత

హరి హరి నీమహిమ లనంతములు
విరతి జీవులకెల్ల నేరుపులై వున్నవి ॥ పల్లవి ॥

యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి
అందరికిఁ దమతమదై వుండును
కందువ నెవ్వ రెవ్వరి కాణాచి యైనదో భూమి
సందడించీఁ బంటలను సకలసస్యములు ॥ హరి ॥

చుట్టూఁ యం(యెం?)దరికిని సొమ్మయినదో కాలము
అట్టె అందరిఆయుష్యమై యున్నది
గట్టిగా నెవ్వరెవ్వరికిఁ బంచముకూడదో యీమాయ
దట్టపుసంసారములధర్మములై యున్నవి ॥ హరి ॥

ముంచి యఁ(యెం?)దరికైనాను మోపులై వుండీ కర్మము
పంచు కొందరికిఁ దమ౧ పనిపాటలై
వంచక శ్రీవేంకటేశ వారివారిబ్రదుకులు
నించి నీవే యైతివి నిధినిధానమవై ॥ హరి ॥ 358

## భూపాళం

౨పావనము గావో ౩జిహ్వ బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని నింక వేమారునుఁ బాడి ॥ పల్లవి ॥

హరినామములే పాడి అతనిపట్టపురాణి
ఇరవై మించినయట్టియిందిరఁ బాడి
సరి నిరువంకలాను శంఖచక్రములఁ బాడి
వరదకటిహస్తాలు వరుసతోఁ బాడి ॥ పావ ॥

ఆదిపురుషునిఁ బాడి అట్టె భూమిసతిఁ బాడి
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి
మోదపుబ్రహ్మాండాలుమోచేవుదరముఁ బాడి
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి ॥ పావ ॥

---

౧. 'పనివాటలై' రేకు. పని+పాటలు=పనివాటలు. ఈసంధి లీవాఙ్మయమున కొల్లలు. ౨. ఈపాటలో 'వరదహస్తము' పేర్కొనబడినది. క్రిందికి తనకుడి చేతితో పాదములను చూపుచున్న వైకుంఠహస్తమే వరదహస్తముగ భావించిరేమో. ఉరమున శ్రీదేవి, వీపున భూదేవి, శిరముపై తులసి ఉన్నట్లు ఈ వాఙ్మయమున పలుతావుల గలదు. 'సర్వాంగములు' అని చెప్పుటచే అన్ని అవయవములను స్వామిస్వరూపము గానే భావించుట వీరి తరిపాటి. ౩. 'జింహ్వ' రేకు.

శ్రీవేంకటేశుఁ బాడి శిరసుతులసిఁ బాడి
శ్రీవత్సముతోడురముఁ జెలఁగి పాడి
లావుల మకరకుండలాలకర్ణములు పాడి
ఆవటించి యితనిసర్వాంగములుఁ బాడి ॥పావ॥ 359

దేసాక్షి

నీవు వెట్టినట్టిదిక్కు నీవే తెలుపవలె
నావశమా తెలియ నారాయణా ॥పల్లవి॥

నీటిలోన నొకబుగ్గ నిమిషములోనఁ బుట్టి
కోటిసేసినట్లుండుఁ గొంతవడి
పాటించి యందే యడఁగెఁ బ్రకృతియో బ్రహ్మమో
యేఁటిదో నీనియర్థ మెరిఁగించవయ్యా ॥నీవు॥

ఆకసాన నొకగాలి అట్టె మ్రోయుచుఁ బొడమి
లోకము సేయ నిసరు లోలోనె
మైకొని యందే యడఁగె మాయయో సత్యమో
యీకడ నీయర్థము మా కెఱిఁగించవయ్యా ॥నీవు॥

భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవేంకటేశ
వాములై వెలయు సేసేవారికి
అముక యందే యడఁగె అసత్తో ఇది సత్తో
యేమో యీయర్థము మా కెరిఁగించవయ్యా ॥నీవు॥ 360

నాట

ఎత్తుకొన్న బహురూప మీఁక మరి మానరాదు
చిత్తగించి మన్నించు శ్రీనరసింహా ॥పల్లవి॥

పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి
గట్టిగా కనకదైత్యు ఖండించితివి
యిట్టినీచేఁతలు విని యిందరుఁ గొల్చేరు విన్న
కట్టుకొంటి వింతపని ఘననారసింహా ॥ ఎత్తు ॥

దేవతలమొరాలించి దీకొంటి వింతపనికి
చేవ నభయము లిచ్చి చేయెత్తితివి
దేవుఁడ వని యెఱిఁగి త్రిజగాలు మొక్కె నీకు
నీవల్లనే వచ్చె విది నిత్యనారసింహా ॥ ఎత్తు ॥

భూకాంతవిన్నపము బొంచి విని గురైతివి
శ్రీకాంత తొడమీఁదఁ జేకొంటివి
మీకును శ్రీవేంకటాద్రిమీఁదనే శరణంటిమి
దాకొనె మీమహిమలు దండినారసింహా ॥ ఎత్తు ॥ 361

రేకు 174 లలిత

ఆతనిమూలమే జగమంతా విది
ఆతుమలో హరి కీలుఅయివుండుఁగాని ॥ పల్లవి ॥

మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము
వచ్చినట్టె వచ్చితేను వలపే చవి
యెచ్చు కుందు లేకున్న నెక్కడైనా సుఖమే
యిచ్చకుఁడై హరి తన కియ్యవలెఁగాని ॥ ఆత ॥

నెట్టుకొని నడచితే నిజమే మూలధనము
పట్టినదే వ్రతమైతే భవమే మేలు
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము
యిట్టె హరి దనకు నియ్యవలెఁగాని ॥ ఆత ॥

చెప్పినట్లు సేసితేను చేరి దేహమే చుట్టము
తప్పులు లేవిదియైతే ధర్మమే సొమ్ము
చొప్పునహరిదాసులు సోదించి చూచిన దిది
యెప్పుడు శ్రీవేంకటేశుఁ డియ్యవలెఁగాని ॥ అత ॥ 362

సాళంగనాట

దిక్కు నీవే జీవులకు దేవసింహమా
తెక్కులగద్దియమీఁదిదేవసింహమా ॥ పల్లవి ॥

సురలెల్లాఁ గొలువఁగ సూర్యచంద్రులకన్నుల
తిరమైనమహిమలదేవసింహమా
నిరతిఁ బ్రహ్లాదుఁడు నీయెదుట నిలిచితే
తెరదీసితి మాయకు దేవసింహమా ॥ దిక్కు ॥

భుజము లుప్పొంగఁగాను పూఁచినశంఖుఁజక్రాల
త్రిజగములు నేలేటిదేవసింహమా
౧ గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి-
ద్విజమునిసంఘములదేవసింహమా ॥ దిక్కు ॥

ముప్పిరిదాసులకెల్లా ముందు ముందే యొసగేటి—
తిప్పరానివరములదేవసింహమా
చిప్పల నహోబలాన శ్రీ వేంకటాద్రిమీఁద
తెప్పలదేలేటియట్టిదేవసింహమా ॥ దిక్కు ॥ 363

౧. గజ=దండి అని అర్థము కావచ్చు. 'దండిసిరులు' అనుటకు 'గజసిరులు' అనియు వీరిప్రయోగము. 'గజదొంగ' వలె దీనిని సాధించుకొనవలెనేమో. 'గజభజింపుచు' కూడ అట్లనే.

బౌళి

కన్నులపండుగలాయ కమ్మి సేవించేవారికి
నన్నల నీ దాసులము సంతసించేము ॥ పల్లవి ॥

పడఁతు లిద్దరు నీపాదములు వొత్తఁగాను
కొడుకు బ్రహ్మదేవుఁడు కొలువఁగాను
కడుపులో లోకములు కడు జయవెట్టఁగాను
గుడిగొనె నీబ్రదుకు గోవిందరాజా ॥ కన్ను ॥

మెత్తఁగా శేషుఁడు నీకు మించుఁబరపై వుండగా
జొత్తుమధుకైటభులు సుక్కి వోడఁగా
హత్తి దేవతలు నిన్ను నందరుఁ బూజించఁగాను
కొత్తలాయ నీబ్రదుకు గోవిందరాజా ॥ కన్ను ॥

పరగి నీముందరను పంచబేరము లుండఁగా
గరిమఁ జక్రము నీకుఁ గాపై వుండఁగా
తిరమై శ్రీవేంకటాద్రితిరుపతిలోపలను
గొరబాయ నీబ్రదుకు గోవిందరాజా ॥ కన్ను ॥ 364

శ్రీరాగం

కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూశినము త్తెమువలె మొక్కేము నీకు ॥ పల్లవి ॥

నెమ్మిఁ జక్రాయుధుఁడవు నీవు గల వటుగాన
నమ్మి మాకు నెన్నఁడును భయమే లేదు
యిమ్ముల లక్ష్మీపతివి యేలిక పైతివిగన
సమ్మతి మాకు సర్వసంపదలు గలవు ॥ కేశ ॥

పుట్టించినవాఁడవు భూధవుఁడ పటుగన
దట్టముగ నెంచగఁ బదస్థుఁడ నేను
తొట్టి కరిరాజవరదుఁడ నీవే దిక్కుగన
గట్టిగా నాకోరిక లిక్కడ ఫలియించెను ॥ కేశ ॥

గురువవు గొల్లలకు గోవిందరాజువుగన
నిరంతరమునుఁ బాఁడి నిండెను మాకు
చిరంతనదేవుఁడవు శ్రీవేంకటేశ్వర నీవు
పరము నిహము మాకు బలువుగాఁ గలిగె ॥ కేశ ॥ 365

గౌళ

హరియు సిరియు నేఁగే రదివో తేరు
పరం[1]జ్యోతిస్వరూపపుపైఁడికుండతేరు ॥ పల్లవి ॥

గరుడధ్వజపుఁదేరు కనకమయపుఁదేరు
సురలు బొమ్మలైనారు చుట్లఁదేరు
మెరుఁగుల మేఘములమించుఁగొణిఁగెలతేరు
సిరుల ధ్రువలోకపుశిఖరపుఁదేరు ॥ హరి ॥

బలుకులపర్వతాలె బండికండ్లైనతేరు
నలుదిక్కులంచులవున్నతపుఁదేరు
కొలఁదిలేనిచుక్కలకుచ్చులముత్తెలతేరు
మెలుపునాకాశగంగమేలుకట్లతేరు ॥ హరి ॥

మునులనే వుత్తమాశ్వములఁగాఁ గట్టినతేరు
ఘనమహిమలనేసింగారపుఁదేరు
యెనసి శ్రీ వేంకటేశుఁ డెప్పుఁడూ నలమేల్మంగ
దినదినభోగములఁ దిరమైనతేరు ॥ హరి ॥ 366

౧. 'జ్యోతిస్స్వరూప' కావచ్చు.

బౌళి

పరమపురుష[1] నిరుపమాన శరణు శరణు రే[2] యే యే యే యే ఇందిరా-
నిజమందిరా ॥ పల్లవి ॥

కమలనాథ కమలనయన కమలచరణు[3] రె
అమితసురమునినాథయూథపనాయకా వరదాయకా ॥ పర ॥

చతురమూరితి చతురబాహుశంఖచక్రధరా
అతిశయశ్రీవేంకటాధిప అంజనాకృతిరంజనా ॥ పర ॥ 367

మాళవి

[4] హాసమీచీనమపహాసం తే
దాస్యై ప్రకాశితం దరిదంతు లోకే ॥ పల్లవి ॥

ద్వారకాపట్టణే త్వం పురా చ స్వయదీక్షితస్త్వా ప్రియః
కేశముష్టిః కథం సారస కురుపంతి సరసవేళాయాం ॥హాస ॥

వరశిశోరక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారి అథోచేస్తదేతి
గోపతరుణయః కిమితి వా తద్వసతి త్వం ॥ హాస ॥

తత్తబృందావనే త్వం పురా చ శ్రియా వేంకటాద్రౌ ఇదం .
విర్విభాసి ఇదం చిత్తమిత్యమరాళ్చ ది సేవంతి సర్వే ॥*హాస॥368

---

౧. 'నిరుపమాణ' రేకు. ౨. ఈ నాలుగు యెకారములు పూర్వముద్రణమున జారిపోయినవి, ఈ 'యె' కారములు 'శరణురే' లోని 'ఎ' కారమునకు అనుబంధి-స్వరప్రతీకములుగా నుంచినారేమో. పల్లవి ఒకపాదముగా, చరణములన్నియు రెండేసి పాదములుగా నడచిన దీపాట. ౩. 'చరణ' కావచ్చు. ౪. ఈ కీర్తనవిషయములో పూర్వపరిష్కర్తలభావమే నాదికూడ. * ఈసంకీర్తన సంస్కరింప వీలుకాకున్నది.

రేకు 175 దేవగాంధారి

సదానందము సర్వేశ్వర నీ-
పదారవిందముపై భక్తి ॥ పల్లవి ॥

నయనానందము నరులకు సురలకు
జయమగు హరి నీసాకారము
నయమగుశ్రవణానందము వివినను
క్రియగలిగిననీకీర్తనము ॥ సదా ॥

చెలఁగి యందరికి జిహ్వానందము
పలుమరుఁ గొనునీప్రసాదము
నలుగడ దేహానందము బుధులకు
బలునీపాదప్రణామములు ॥ సదా ॥

ధరఁ బరమానందము నీదాస్యము
గరిమల శ్రీవేంకటవిభుఁడా
నరహరి నిత్యానందము నినుఁ దగ-
వరవిరిఁ జేయునమారాధనము ॥ సదా ॥ 369

సామంతం

అరసి వేరొకచో ముక్తడుగఁగవలదు
సారపులౌకికవిమోచనమే ముక్తి ॥ పల్లవి ॥

మొగిఁ బుణ్యపాపవిముక్తియే ముక్తి
వెగటుఁబ్రపంచపువిముక్తే ముక్తి
తగులుసంసారబంధవిముక్తే ముక్తి
జగములోఁ గలుగుయాశాముక్తే ముక్తి ॥ అర ॥

కామక్రోధాదిసంగవిముక్తే ముక్తి
వేమారు రుచులపై విముక్తే ముక్తి
నాముల దేహాభిమానపుముక్తే ముక్తి
పామెడికోరికలసంపదముక్తే ముక్తి ॥ అర ॥

ముందువెనకల కర్మమోచనమే ముక్తి
అంది సుఖదుఃఖభయముక్తే ముక్తి
కందువ శ్రీవేంకటేశుఁగని యందే శరణని
విందుల నితరసేవావిముక్తే ముక్తి ॥ అర ॥ 370

## సాళంగనాట

ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచిచూచిన
చేతనే వరాలిచ్చీ శేషాచలేశుఁడు ॥ పల్లవి ॥

విశ్వరూపపుబ్రహ్మము విరాట్టయినబ్రహ్మము
ఐశ్వర్యస్వరాట్టౌసామ్రాట్టయినబ్రహ్మము
శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైనబ్రహ్మము
యీశ్వరుఁడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము ॥ ఈతఁ ॥

సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపుటనలునిభాస్వత్తేజము
కార్యపుటవతారాలఁ గనుఁగొనేతేజము
(1) వీర్యపుయెజ్ఞభాగాలవిష్ణునామతేజము ॥ ఈతఁ ॥

---

1. 'వీర్యము+యజ్ఞభాగాలు' సామాసికములైన "పు.టు" ఆగమములు వచ్చి జరిగిన వ్యావహారిక సంధి. "యజ్ఞము" లోని యకారము అచ్చుగా గ్రహింపబడుట వింత.

పరమపురుషమూర్తి ప్రకృతియైనమూర్తి
గరిమతో మహదహంకారమూరితి
ధరఁ బంచతన్మాత్రలు తత్వము లైనమూరితి
గరుడానంత[౧] సేనేశకర్తయైనమూరితి ॥ ఈత ॥

భాగవతపుదైవము భారతములో దైవము
సాగినపురాణవేదశాస్త్రదైవము
భోగులైనబ్రహ్మలను బొడ్డునఁ గన్నదైవము
శ్రీగలిగి భూపతైనశ్రీవేంకటదైవము ॥ ఈత ॥ 371

దేసాళం

గతులన్ని ఖిలమైనకలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ॥ పల్లవి ॥

యీతనికరుణనేకా యిల వైష్ణవులమైతి-
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతఁడేకా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర-
మీతఁడే రామానుజులు యిహపరదైవము ॥ గతు ॥

వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము ॥ గతు ॥

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశునగ[౨]మెక్కెవాకిటను
దయఁజూచి మమ్ము నిట్టే తల్లితండ్రిదైవము ॥ గతు ॥ 372

---

౧. 'శనేశక' పూ.మా.పా. ౨. 'మెక్కి' రేకు.

### నాదరామక్రియ

నే నేమెఱిఁగి సేసేనో నీకుఁ దిరువారాధన
అని మున్నిట్బ్రహ్మరుద్రాదులు సేయఁగలేరు ॥పల్లవి॥

అనుగునీరూప[౧]మింతంతనెఱిఁగి సేసేనో
వునికై నీ వొక్కచోనే వుండే దెఱిఁగి సేసేనో
తవిలి నీకు నొక్కమంత్రమనెఱిఁగి సేసేనో
కనరానినీమహిమే కడయెఱిఁగి సేసేనో

మరిగి నీకు నొక్కనామమునెఱిఁగి సేసేనో
అరసి యించుకేకాలమనెఱిఁగి సేసేనో
విరతి నీ కేమి లేవని యెఱిఁగి సేసేనో
బెరసి [౨]నన్నుఁ గొంత మెప్పించ నెఱిఁగి సేసేనో ॥నేనే॥

తెలిసి నీకు నొక్కమూర్తియనెఱిఁగి సేసేనో
అలమిననీమాయఁ గొంతనెఱిఁగి సేసేనో
అలమేల్మంగకుఁ బతియగుశ్రీవేంకటేశుఁడ
వొలిసి నీ కృపమింప నొక్కటెఱిఁగి సేసేనో ॥నేనే॥ 373

### వరాళి

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥పల్లవి॥

మీనకూర్మ [౩]వరాహా మృగపతిఅవతారా
దానవారే గుణశౌరే ధరణీధర మరుజనక ॥డోలా॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ ॥డోలా॥

---

౧. 'ఇంతంత+అని+ఎఱిఁగి'. ఇట్టి స్థలములందంతటా ఇట్లే.
౨. 'నిన్నుఁ' కావచ్చు ౩. 'వరాహ' కావచ్చు.

దారుణ బుద్ధ కలికి దశవిధఅవతారా
శిరపాణే గోసమాణే శ్రీవేంకటగిరికూటనిలయ [౧]॥ దోలా ॥374

రేకు 176 బౌళి

జగన్మోహనాకార చతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటునాసోదంబు ఇది నీవెలితో నావెలితో ॥ పల్లవి॥

యెన్నిమారులు సేవించినఁ గన్నులూ దవియవు
విన్ననీకథామృతమున వీనులుఁ దవియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వాయుఁ దనియదు
విన్న కన్నది గాదు ఇది నావెలితో నీవెలితో ॥ జగ ॥

కడఁగి నీప్రసాదమే కొని కాయమూఁ దనియదు
బడిఁ బ్రదక్షిణములుసేసి పాదములు [2]నివిఁ దవియవు
మడివి సాష్టాంగఁబు చేసి నుదురునూఁ దవియదు
వెడఁగుఁదన మిది గలిగె నిది నావెలితో నీవెలితో ॥ జగ ॥

[3]చెలఁగి నిను నేఁ బూజించి చేతులూఁ దవియవు
చెలువు సింగారంబు దలఁచి చిత్తమూఁ దవియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర ఆత్మ నను మోహించఁజేసితి
వెలయ ఏన్నియుఁ దేరె మును నీవెలితో నావెలితో ॥జగ॥375

---

౧. ఈ పాటలో ప్రతిచరణమునందును మొదటి పాదమునకు తరువాత పల్లవి వలె "డోలాయాం చల డోలాయాం" ఇత్యాదిగా కలదు. సంగీతకోవిదులగు పూజ్యపాదులు రాళ్లపల్లివారిపరిష్కరణము గావున పూర్వముద్రణమును మార్చలేదు. ౨. 'ఇయున్' లో 'యు' లోపించిన రూపము కావచ్చు. ౩. ఈపాదములో క్త్వాంతమైన 'పూజించు' ధాతువులో కర్త నేను, 'తనియు' ధాతువులో కర్తలు చేతులు.

దేవగాంధారి

అందుకే నేఁ జింతించెదను అచ్యుత నీశరణాగతుఁడ
సందడి నాభవ మిందువల్లనే సఫలంబాయనయ్యా ॥ పల్లవి ॥

వొకనీనామము వొగిఁ దలంచిన
అకలంకం బగునాపాపంబులు అన్నియుఁ బారణేసెనె
అకటా తక్కిన అనంతనామములు
వొకట నుపవాసములున్న వోయయ్యా ॥ అందు ॥

హరి నీపాదము లవి రెండే
పరమును విహమును నా కొసఁగెను పయిపైఁ గృపతోడ
ధర నీయనంతకరములు తా మేమి-
సిరు లిత్త మనుచు చెలఁగినయ్యా ॥ అందు ॥

ఇల నీదాస్యం బిది యొకటే
సిలుగులభవములజిలుగు మాన్పె నదె చిత్తమునహ దీర
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ విదె
తలఁపునఁ బాయక దక్కితివయ్యా ॥ అందు ॥ 376

మాళవి

దేవ నమో దేవా
పావనగుణగణభావా ॥ పల్లవి ॥

జగదాకారచతుర్భుజ
గగననీలమేఘశ్యామ
నిగమపాదయుగ నీరజనాభ
అగణితలావణ్యానన ॥ దేవ ॥

౧ ఘనవేదాంతైగణన ప్రచార
కనకశంఖచక్రకరాంకా
దినమణిశశాంకదివ్యవిలోచన
అనుపమరవిబింబాధరా. ॥ దేవ ॥

భావజకంజభవజనక
శ్రీవనితాహృదయేశ
శ్రీవేంకటగిరిశిఖరవిహార
పావనగుణగణభావా. ॥ దేవ ॥ 377

బౌళి

దేహంబొకటే దేహియు నొకఁడే
దాహంబెంతటఁ దనియునో తలఁపు ॥ పల్లవి ॥

వినుకలి వెంట వెడలీఁ దలఁపు
కనుకలి వెంటఁ గదలీఁ దలఁపు
కొననాలుక మదిఁ గూడీఁ దలఁపు
తునిగినయెన్నెన్నితునకలో తలఁపు ॥ దేహఁ ॥

నయమగుచోటను నవ్వీఁ దలఁపు
భయమగుచోటను బడలీఁ దలఁపు
లయమై నిద్రల లవమౌఁ దలఁపు
క్రియ నెందరిపంగెనయో తలఁపు ॥ దేహ ॥

భావించినగతిఁ బారీఁ దలఁపు
వేవేలుగతుల వెలసీఁ దలఁపు
శ్రీవేంకటపతిచిత్తములోపల
నీవే తెలుపఁగ నిలుఁగనె తలఁపు ॥ దేహం ॥ 378

---

౧. 'ఘనవేదాంతి+ఐ' అని విభజిస్తే బాగున్నట్లు తోఁచదు. 'వేదాంతైకగణన' లేక 'వేదాంతగణన' కావచ్చునేమో.

సాళంగనాట

మొక్కరె మొక్కరే మీరు ముందు ముందే జయ లిడి
దక్కి శ్రీవేంకటేశుఁడే తానైనదేవునికి ॥ పల్లవి ॥

కరములు వే యవే కరములను భయం-
కరనఖాయుధములు కడలే వవే
సిరి దొడపై నదె సింహపునెమ్మొ మదే
నరరూపు సగమదె నరసింహునికి ॥ మొక్క ॥

వంకరకోర లవె వజ్రపుదంతము లవె
సంకుమఁ జక్రము నిరువంకలా నవె
జంకెల నేత్రము లవె జడలు మూఁపున నవె
అంకె నభయహస్తము అదె నరహరికి ॥ మొక్క ॥

నిక్కినకర్ణము లవె నీలిమచ్చపుర మదె
చుక్కలమొలపూసల నొక్కరూ పదె
తొక్కినపాపము లవె తోడనే శ్రీవేంకటాద్రి
పక్కరనరసింహపుప్రళయసింహునికి ॥ మొక్క ॥ 379

భవుళి

తొల్లి యెట్టుండునో తాను తుద నెట్టుండునో తాను
యిల్లిదె నట్టనడుమ నింతేసి మెరసీ ॥ పల్లవి ॥

పుట్టినప్పుడే దేహి బుద్ధు లేమీ నెఱఁగఁడు
యిట్టె లోకులఁ జూచి యింత నేరిచె
౧ ముట్టుకొన్నయింద్రియాల ముదిసి ముదిసి రాఁగా
తట్టువడి తనమేను తానే మరచె ॥ తొల్లి ॥

౧ 'ముట్టుకొన్న యింద్రియాలు' కావచ్చు.

మనుజుఁ డైనప్పుడే తా మాటలేమి నెరఁగఁడు
జనులాడుకొనఁగానె సంగడి నేర్చె
దినదినభోగాలదృష్టాంతములెల్ల
అనుభవనై తన కడియాలమాయ ॥ తొల్లి ॥

తచ్చి తాఁ గలప్పుడే దైవము నెఱఁగఁడు
విచ్చ నాచార్యునివల్ల నేఁ దెలిఁగె
అచ్చపుశ్రీవేంకటేశుఁ డంతర్యామై యుండి
యిచ్చఁ గరుణించఁగాను యెక్కుడాయఁ దాను ॥ తొల్లి ॥ 380

రేకు 177 గుజ్జరి

జగమంతా నీమయము సర్వం విష్ణుమయంబుగాన ॥ పల్లవి ॥

యెనయుచు నేఁ గర్మమార్గముల నితరదేవతల భజియించెదను
అని యపరాధం బెంచకుమీ అన్యము నీకంటె మరి లేదు
సనివడి "మత్తః పరతరం" బని పలికితి విన్నియు నీ
యాజ్ఞలు ॥ జగ ॥

దేవ నావుదరపోషణకు తిప్పరి హింస చేసెదను
ఏ విది నావల నెంచకుమీ నీవే అఖండ[1]చైతన్యుఁడవు
దేవ మిము [2]"నైతేన వినా తృణాగ్రమపి" యని శ్రుతి
వాగదెడివి ॥ జగ ॥

భువిలో నాకట పూర్వకర్మముట పొసఁగదునే నీసరణినీయడను
అవి నా కేమియుఁ బనిలేవు అంతరియామివి నీవు
అవలను "త్వమేవశరణం గతి" యనుటది నమ్మితి
శ్రీవేంకటనిలయా ॥ గజ ॥ 381

---

౧. 'చైతన్య' కావచ్చు. ౨. మిమునైతే "న వినా తృణాగ్రమపి" యని కావచ్చు-నేమో. "నహి శేవ వినా" అని గదా శ్రుతి. పూర్వపరిష్కర్తలు 'నైతేన' శ్రుతివాక్యముగ గ్రహించిరి.

గుజ్జరి

అర్తుఁడ నేను నీకడ్డ మెందును లేదు
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే ॥ పల్లవి ॥

సర్వసాక్షివి నీవు సర్వాంతరంగుఁడవు
సర్వసర్వంసహాచక్రవర్తి
నిర్వాణమూర్తి నిగమాంతకీర్తి
సర్వాపరాధములు క్షమియింపవే ॥ అర్తుఁ ॥

పరమాత్ముఁడవు నీవు [1] పరంజ్యోతివి నీవు
పరమ పరానంద పరమపురుషా
కరిరాజవరదా కారుణ్యనిలయా
శరణాగతుఁడ నన్ను నరిఁ గావవే ॥ అర్తుఁ ॥

అణువులోపలినీవు ఆదిమహత్తును నీవు
ప్రణుతశ్రీవేంకటప్రచురనిలయా
అణిమాదివిభవా ఆద్యంతరహితా
గణుతించి నాపాలఁ గలుగవే నీవు ॥ అర్తుఁ ॥ 382

లలిత

విజాతు లన్నియు [2] వృథా వృథా
అజామిళాదుల కది యేజాతి ॥ పల్లవి ॥

జాతిభేదములు శరీరగుణములు
జాతి శరీరము నరిఁ [3] దోఁడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అవి నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపుదాస్యం బిది యొక్కటె పో సుజాతి ॥ విజా ॥

౧. 'పరంజోతి' రేకు  ౨. 'వ్రిథా వ్రిథా' రేకు.

౩. 'వరిఁ' ఈ పదము పూర్వముద్రణమున జారిపోయినది. యతిభంగము.

హరి యిందరిలో నంతరాత్ముఁ డిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమయోగు లీభావ మష్టమదము భవవికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి ॥విజా॥

లౌకికవైదికలంపటులకు నివి
కైకొను నవశ్యకర్తవ్యంబులు
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతి సేసినసంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీనామమే సుజాతి॥విజా॥ 383

గుజ్జరి

ఉపకారి దేవుఁడు అపకారి గాఁడు ॥పల్లవి॥

దేహం బొసఁగెను దేవుఁడు తనుఁ దెలియఁగ శాస్త్రము గడియించె
దేహాంతరాత్ముఁడు మరి దేహచైతన్యుఁడా దాను
దేహి యేలోకంబున కేఁగిన దేవుఁడు దా వెంటనే యేఁగును
దేహి కోరినట్టే కమ్మర దేవుఁ డనుమతి ఇచ్చీఁగాన ॥ఉప॥

చేయుటకును చేయకమానుటకును జీవుఁడు స్వతంత్రుఁడా యంచేను
కాయపుసుఖములు గోరఁగఁ గర్తట కడగనుటకుఁ గర్త గాఁడా
యీయెడ నాయెడ నంతర్యామే యన్నిటికివిఁ బ్రేరకుఁ డింతే
దాయక పాయక తనతలఁపుకొలఁది దైవమే సృజియించీఁ గాన ॥ఉప॥

ఇవి యెఱిఁగి చిత్తమా నీ వితనందే అభిరతి నేయుము
సదయుఁడు మన శ్రీవేంకటగిరిసర్వేశ్వరుఁడు సత్యుఁడు
మొదలనే యీయర్థము కిరీటితో మొగి నానతి ఇచ్చినాఁడు
అదే "సమోఽహం ౧సర్వభూతేషు" అని గీతలలో నున్నది
గాన ॥ఉప॥ 384

---

౧. 'సర్వం' రేకు.

బౌళి

౧ తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన ॥ పల్లవి ॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ॥ తంద ॥

కందువగుహీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరె అంతరాత్మ ॥ తంద ॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టుభూమి యొకటే
చండాలుఁ డుండేటి సరిభూమి యొకటె ॥ తంద ॥

---

౧ పూర్వముద్రితపాఠమును యథారూపముగ పైన చూపియున్నాము. ఈ పరిష్కరణము సంగీతకోవిదులగు పూజ్యపాదులు కీ॥ శే॥ రాళ్లపల్లివారిచేతిమీదుగా ముందు జరిగినది. సంగీతాను గుణముగ వారు పై చూపినటు మార్చియుండురని, నేటికీ గాయని గాయకసంప్రదాయములో నున్నపాఠమని దానిని పైనచూపి రేకు పాఠము ఇందు చూపుచున్నాము.

తందనాన యీహి తందనాన ఆహో తందనాన। పురే తందనాన।
భళా తందనాన పరబ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే
పరబ్రహ్మమొకటే
కందువగు హీనాధికము లిందు నేది
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతానొకటే. ॥ పల్లవి ॥
అని రేకుపాఠము

అనుగుదేవతలకును అలకామసుఖ మొకటే
ఘనకీటపశువులకు కామసుఖ మొకటే
౧దినమహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర ౨నిరుఁబేదకును వొక్కటే అవియు ॥తంద॥

కొరలి శిష్టాన్నములుగొనునాఁక లొకటే
తిరుగుదుష్టాన్నములు దినునాఁక లొకటే
పరగ దుర్గంధములపై వాయువు నొకటే
వరుసఁ బరిమళముపై వాయువు నొకటే ॥తంద॥

కడఁగి యేనుఁగుమీఁదఁ గాయుయెండొకటే
పుడమి శునకముమీఁదఁ బొలయునెండొకటే
కడుఁబుణ్యులను పాపకర్ములను సరిఁ గావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే ॥తంద॥ 385

రేకు 178 బౌళి

మచ్చికఁ బ్రపంచపుమరపే బ్రహ్మానంద—
మిచ్చల తానే గురి ఇన్నిటికి నాత్మ ॥పల్లవి॥

యీచూపే వెలిఁబడి లోకమయి తోఁచీని
ఆచూపే మరలితే నది మోక్షము
యేచి రెంటికి నెడమధ్య మీమేను
తాచి వొకఁడే గురి తానాయ నాత్మ ॥మచ్చి॥

౧. 'దినయహోరాత్రములు' రేకు. ౨. 'నిఱుపేద' వ్రా.ము.పా.

మన సౌఖ్యచోట నుండి మాయలై తోఁచీని
మనసు తనందుంటే మహి యోగ్యము
వెనకముందులకు పీడుఁబట్టు జననము
కొనమొదలునుఁ దానే గురియాయ నాత్మ ॥ మచ్చి ॥

బయలు దునిసి బహుభానులై తోఁచీని
దయ లొక్కట యఖండపరిపూర్ణము
నయమై శ్రీవేంకటనాథుకరుణచేత
జయమై తానున్నచోనే సతమాయ నాత్మ ॥ మచ్చి ॥ 386

బౌళి

నందగోపనందనుండే నాఁటిబాలుఁడు
ఇందు నేఁడే రేపల్లె నేచి పెరిగెను. ॥ పల్లవి ॥

పువ్వువంటిమఱ్ఱియాకుపొత్తిఁ బవళించనేర్చె
యెవ్వఁడో కావి తొల్లె యీబాలుఁడు
మువ్వంకవేదములను ముద్దుమాఁట లాడనేర్చె
యెవ్వరూఁ గొంత నేర్పనేఁటికే వీవికి ॥ నంద ॥

తప్పటడుగు లిడఁగనేర్చె ధరణియందు నాకసమున-
నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే
రెప్పలెత్తి చూడనేర్చె రేసీఁ జంద్రునందు పగలు
గొప్పసూర్యునందు వింకఁ గొత్త నేర్పనేఁటికే ॥ నంద ॥

మంచివెన్నబువ్వ లిపుడు మలసి యారగించనేర్చె-
నంచితముగ శ్రీవేంకటాద్రిమీఁదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కాఁగిలించనేర్చె
దించరావివురముమీఁద దివ్యకాంతను ॥ నంద ॥ 387

లలిత

అంతరాత్మ హరిగలఁ డంతే చాలు
యెంత కెంత చింతించ నేలా వెరవ ॥ పల్లవి ॥

వెనక జన్మపుగతి వివరించి నే నెరఁగ
అనుగుమీఁదటిజన్మ మది యెఱఁగ
నవిచి యీజన్మము నానాఁటఁ దెలిసేము
యెనసి యీభవములకేలా వెఱవ ॥ అంత ॥

విన్నటిదినముకత నిమిషమై తోఁచీని
కన్నుల రేపటిచేఁత కానఁగరాదు
పన్ని నేఁటిదినము మున్ను నోఁచినట్లే
యెన్నఁగ నెందుకునైనా నేలా వెఱవ ॥ అంత ॥

పరము విహము నేఁ బైకొన నాయిచ్చ గాదు
హరి శ్రీవేంకటపతి యఖిలకర్త
శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది
యిరవైతి నింకా నాకేలా వెఱవ ॥ అంత ॥ 384

గుండక్రియ

అదియేల తా మాను మాయందు విస్తారమే కాక
చెదరి విత్తొకటియుఁ జెట్టొకటి యౌనా ॥ పల్లవి ॥

కడుఁ బుణ్యపాపాలు గలిగినజన్మము
చెడుఁబుణ్యపాపాలు నేయకుండీనా
పుడమిలో ముష్టిమానఁ బొడమినశాఖలు
బడి ముష్టిపండ్లె పండకుండీనా ॥ అది ॥

పంచేంద్రియాలఁ బుట్టి పరగినయీ మేను
 పంచేంద్రియాలమీఁదిభ్రమ మానీనా
పొంచి హేయములోనఁ బుట్టినకీటములెల్ల
 కొంచి హేయమే చవిగొనకుండీనా ॥ అది ॥

శ్రీవేంకటేశ నీవుచేసినయీ మాయలు
 నీవల్ల మానుఁగాక నేఁ గర్తనా
దైవమవై నాలోనఁ దగిలి నాదుర్గుణాలు
 వేవేగ మానుపఁగ వెతదీరెఁగాక ॥ అది ॥ 389

## శ్రీరాగం

అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు
 పోల్ప నెంతపనికిఁ బూనితినయ్యా ॥ పల్లవి ॥

నీపదధ్యానములోనే వింటెను నామనసెల్ల
 యేపున నీసాకార మేమిట భావింతునయ్యా
చూపు నీసింగారమందే చొక్కి తగులాయ విదె
 ఆఁపి నే నీయంగకాంతు లవేమిట జూతునయ్యా ॥ అల్ప ॥

నాలుక నీకడలేనినామములే నుడిగివి
 మేలిమి నీగుణము లేమిటఁ బొగడుదునయ్యా
గాలివంటివీనులు నీకథలఁ దవిలెనయ్యా
 యీలీల నీయనంతమహిమ యెందు విందునయ్యా ॥ అల్ప ॥

నీకు శరణని యట్టె నే ధన్యుఁడనైతి
 యీకడ నీసేవ సేసి యేమి గట్టుకొందునయ్యా
శ్రీకాంతుఁడవైన శ్రీవేంకటేశ నీకు
 వూఁకొన నాజన్మఫల మొకమొక్కె చాలునయ్యా ॥ అల్ప ॥ 390

బౌళి

గరుడగమన గరుడధ్వజ
నరహరి నమోనమోనమో ॥ పల్లవి ॥

కమలాపతి కమలనాభా
కమలజజన్మ[౧] కారణిక
కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో ॥ గరు ॥

జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్యా[౨] జంతుకల
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో ॥ గరు ॥

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనాఘనకాయవర్ణ
అనఘ శ్రీవేంకటాధిప[౩] తేహం
అనుపమ నమో హరి నమో ॥ గరు ॥ 391

రేకు 179 సాళంగనాట

జీవుని కేకాలము శ్రీహరి చేరువబంధువుఁ డీతఁడు
భావములోపలి పెరరేఁపకుఁడై భక్తి చేకొనును యీతఁడు ॥ పల్లవి ॥

పరమున నిహమున వెంటవెంటనే పాయనిబంధువుఁ డీతఁడు
ధరఁ దనుఁదలఁచిన మారుకుమారై తా రక్షించును యీతఁడు
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతఁడు
వురుగతిఁ జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతఁడు ॥ జీవు ॥

---

౧. 'కారణక' కావచ్చు. స్వార్థ'క'ప్రత్యయము. ౨. 'జంతూకల' రేకు. 'జంతూకుల' కావచ్చు. ౩. "వేంకటాధిపతేహం" పూ. ము. పా. వేంకటాధిప, తే=తుభ్యం, అహం నమః=నమస్కరోమి, అని కావచ్చు.

వడిఁ గలకాలము ఋరువడియొక్కటవావులబంధువుఁ డీతఁడు
బడిబడిఁ జైతన్యంబై యున్నటఁ బనులకు నొదగును యీతఁడు
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్తుఁ డీతఁడు
పొదలుచు వైదికలౌకికముల నొకపొత్తునఁ గుడుచును యీతఁడు
॥ జీవు ॥

ఘననిధినిక్షేపములిచ్చేటివుపకారపుబంధువుఁ డీతఁడు
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతఁడు
ననిచి శ్రీవేంకటేశ్వరుఁడై యిటు నాపాలఁ గలుగు నీతఁడు
పనివడి అరులను సూడుపట్టి కడుఁ బగసాధించును యీతఁడు
॥ జీవు ॥ 392

బౌళి

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁ డనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు ॥ఎంత॥

సరి నన్నెదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు
౧ దరిశనములు మిము నానావిధులను తలఁపులకొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచినవారికి నల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమనితలఁచినఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥

నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథిదరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్నదైవమని
యీవల నే నీశరణనియెదను యిదియే పరతత్వము నాకు ॥ఎంత॥ 393

౧. 'దరిశనముల' కావచ్చు.

సాళంగం

నీవే మూలమువో నేరిచినపెద్దలకు
దేవుఁడు నీయందులోనే తిరమాయ విదివో ॥ పల్లవి ॥

బాపురే వో దేహమా బాపురే వో నీవు
వోపి నేఁ బెట్టినకొద్ది నందువుగా
రూపు నీవు గలిగితే రుచులెల్లఁ గానఁగద్దు
బాపలావ ధర్మములు సాధింపఁగలదు ॥ నీవే ॥

మెచ్చితి నోమనసా మెచ్చితివో నీవూ నా-
యిచ్చకొలఁది నెందైనా నేఁగుదువుగా
అచ్చపునీకతమున నవుఁగాము లెంచఁగద్దు
పచ్చిగా యేమూర్తినైనా భావించఁగలదు ॥ నీవే ॥

మేలు మేలు నాలికె మేలు మేలు నీవు
వోలి యేమాటకునైనా నొనరుదుగా
చాలి నీవు మెలఁగంగ చదువు చదువఁగద్దు
పోలించి శ్రీవేంకటేశుఁ బొగడఁగఁగలదు ॥ నీవే ॥ 394

లలిత

హరి నీవే బుద్ధిచెప్పి యాదరించు నామనసు
హరి నీవే నాయంతర్యామివిగాన ॥ పల్లవి ॥

వసముగావికరివంటిది నామనసు
యెసఁగి సారెకు మదియించీఁగాన
పొసఁగఁ బాదరసముఁబోలిననామనసు
అసము దించక సదా అల్లాడీఁగాన ॥ హరి ॥

వడి నడవుల చింకవంటిది నామనసు
బడిబడిఁ బట్టఁబట్టఁ బారీఁగాన
కడఁగి విసరుపెనుగాలివంటిది మనసు
విడువక కన్నచోట విహరించీఁగాన ॥హరి॥

వరుస విందుజలధివంటిది నామనసు
వొరసి సర్వము లోనై వుండీఁగాన
గరిమ శ్రీవేంకటేశ కావవే నామనసు
సరి నీయానతి నీకే శరణనీఁగాక ॥హరి॥ 395

ధవళ

జలజనాభ హరి జయ జయ,
యిల మానేరము లెంచకువయ్యా ॥పల్లవి॥

బహుముఖముల నీప్రపంచము
సహజగుణంబుల చంచలము
మహిమల నీ విది మరి దిగవిడువవు
విహరణ జీవులు విడువఁగఁగలరా ॥జల॥

పలువబవలయీప్రకృతి యిది
తెలియఁగఁ గడువింద్రియవశము
కలిపి నీ వందే కాఁపురము
మలినపుజీవులు మానఁగఁగలరా ॥జల॥

యిరవుగ శ్రీవేంకటేశుఁడ నీమాయ
మరలుచ నీవే సమర్థుఁడవు
శరణనుటకే నే శక్తుఁడను
పరు లెవ్వరైనా నాఁ బాపఁగఁగలరా ॥జల॥ 396

రేకు 180 సామంతం

ఇందుకా కోరి పుట్టె యిట్టిబదుకు
పొందుల శ్రీహరితోడిపొత్తుల మాబదుకు ॥ పల్లవి ॥

బడబాగ్ని ఆఁకటిబారిఁబడ్డబ్రదుకు
పడఁతులకూటములఁ బడ్డబదుకు
వొడలి౧ తోలినెమ్ముల వొడిగట్టేబదుకు
బడిఁ బుణ్యపాపాలపైతరవు బదుకు ॥ ఇందు ॥

నాలుక గడచితేను నరకపుబదుకు
మూలమలమూత్రాల మూటగట్టేబదుకు
కాలము నడిపి పూర్పుగాలిఁబుచ్చేబదుకు
పాలుమాలేయింద్రియాల పంగెమాయ బదుకు ॥ ఇందు ॥

ఇంపుసుఖదుఃఖాల యెండనీడబదుకు
మంపుఁగామక్రోధాలమాటు బదుకు
జంపుల శ్రీవేంకటేశుశరణు చొరఁగ నేఁడు
సొంపు లిన్నిటాఁ బోకు సుఖమాయ బదుకు ॥ ఇందు ॥ 397

రేవగుప్తి

నీ వెరఁగవిది లేదు నీయాజ్ఞ మోచితి నింతే
నీవాఁడ నింతె హరి నే నవఁ జోచేది ॥ పల్లవి ॥

కన్నుల కెంపైనఁ జూపుకలది స్వభావము
యెన్నఁగ నాయందుఁ బాప మెంచఁ జోచేది
విన్ననై చెవుల కింపు వినుట స్వభావము
పన్నినకర్మాలు నన్నుఁ బైకొనఁ జోచేది ॥ నీవె ॥

౧. 'తోలునెమ్ముల' కావచ్చు.

నాలికకుఁ జవి యైతే నమలుచే సహజము
నాలి అభోజ్యపువింద నాకుఁ బనేమి
మూల వాసనగొనేది ముక్కునకు సహజము
జోలిబంధములు నన్నుఁ జుట్టఁగఁ జోచేది ॥సీవె॥

కాయము కాయముపొంతఁ గరఁగుచే అగుణము
నేయనిచేఁతలు నాపైఁ జెప్పఁ జోచేది
యీయెడ శ్రీవేంకటేశ యిన్నిటిలో నన్నుఁ బెట్టి
పాయక నాలో మందువు పట్టఁగఁ జోచేది ॥సీవె॥ 398

లలిత

ఇదివో వున్నార మింతట నంతట
వెదకి కదియకుమీ విష్ణునిమాయ ॥పల్లవి॥

హరిదాసులము హరికింకరులము
కరివరదునిడింగరులము
యిరవెఱిఁగితివనక యెఱఁగననక
సరి మాగురుతిది సర్వేశుమాయ ॥ఇది॥

హితులము శరణాగతులము కేశవ —
వ్రతులము వైష్ణవమతులము
గతి నినుఁ బాసితి కడు నిఁక మామీఁద
తతి దయమరవకు దైవముమాయ ॥ఇది॥

శ్రీవైష్ణవులము శ్రీవేంకటపతి
భావింప నితవిపరికరము
యీవలనావల విహపరములకును
తోవదొలఁగుమీ తొలిఁదొలి మాయ ॥ఇది॥ 399

### రామక్రియ

ఇంతకంటేఁ దగుబంధు లింక నున్నారా
యెంత సేసినా నీకు నెదురాడేనా ॥ పల్లవి ॥

కోపగించి చంకబిడ్డఁ గోరి తల్లి డించితేను
పైపై నే పడుఁగాక పాసిపొయ్యీనా
వోపక నానేరముల కొగి నీవు వేసరితే
నీపాదాలే గతిగాక నే మానేనా ॥ ఇంత ॥

చదివించే౧ అయ్యఁగారు జంకించి చూచితేను
వొదిగి చదువుఁగాక వోపవనీనా
యెదుటిగుణములకు నెంత నీవు దొబ్బినాను
యిదె నీకే మొక్కుదుఁగా కింక మానేనా ॥ ఇంత ॥

చెక్కు మీటి పాలు పెంచినదాది వోయఁగాను
గక్కన మింగుటగాక కాదనీనా
యిక్కడ శ్రీవేంకటేశ యిటుల రక్షించఁగ
విక్కి నే మెరతుఁగాక నే మానేనా ॥ ఇంత ॥ 400

### మంగళకౌశిక

తే శరణ మహం తే శరణ మహం
శైశవకృష్ణ తే శరణం గతోఽస్మి ॥ పల్లవి ॥

దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసురదళన
దశదిశాపరిపూర్ణ తప౨నీయస్వరూప
దశావరణ లోకతత్త్వాతీత ॥ తేశ ॥

---

౧. ఇంతకమున్న వింత. ౨. 'నియ్య' లేదు

సహస్రలోచన సంతతవినుత
సహస్రముఖ శేషశయనా
సహస్రకరకోటిసంపూర్ణతేజా
సహస్రారదివ్యచక్రాయుధా ॥ తేజ ॥

అనంతచరణ సర్వాధారాధేయ
అనంతకరదివ్యాయుధా
అనంతనిజకల్యాణగుణార్ణవ
అనంత శ్రీవేంకటాద్రినివాసా ॥ తేజ ॥ 401

శంకరాభరణం

అదియే విష్ణుపదము అతుమకు నెలవు
అదే జననకారణ మాకాశపదము ॥ పల్లవి ॥

మంచిమాఁటలైనాఁ గావిమాటలైన నొకచోట
ముంచిముంచి యాకాశముననే యణఁగును
యెంచరానివిట్టూర్పు లెన్ని వొడమినాను
అంచల నణఁగిపోవు నాకాశమునను ॥ అది ॥

చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రులఁ దాఁకి
అపొంతనే యణఁగు నాకాశమునను
రూపుల మైపీడలును రుచులఁ గాలత్రయము
పైపైనే యణఁగును బహిరాకాశమున ॥ అది ॥

యిలఁ జీఁకటి వెలుఁగు యెంచ నహోరాత్రాలఁ
గలసి మెలఁగు నాకాశతత్వమున
చలువై శ్రీవేంకటేశు సాకారనిరాకారా—
లలరి వెలుఁగుచుండు నంతరాకాశమున ॥ అది ॥ 402

రేకు 181 తెలుఁగు కాంబోది

చూచి మోహించకుందురా సురలైన నరులైన
    తాచి నీవు ముందరఁ బ్రత్యక్షమైనను ॥ పల్లవి ॥

భాగీరథి పుట్టినపాదపద్మములు
    భోగపుమరువిజన్మభూమి నీతొడలు
    యోగపునవబ్రహ్మలుండినవీనాభి
    సాగరకన్యకలక్ష్మి సతమైనవురము ॥ చూచి ॥

అందరి రక్షించేటిఅభయహస్తము
    కంద నసురలఁజంపేగదాహస్తము
    సందడిలోకములయాజ్ఞాచక్రహస్తము
    చెంది ధ్రువు నుతియించఁజేయుశంఖహస్తము ॥ చూచి ॥

సకలవేదములుండేచక్కనినీమోము
    వొకరై తులసిదేవివుండేటిశిరసు
    ప్రకటపుమహిమలఁ బాయవినీరూపము
    వెకలిశ్రీవేంకటాద్రివిభుఁడ నీభావము ॥ చూచి ॥ 403

లలిత

వాదులేల చదువులు వారు చెప్పినవేకావా
    వాదులేల మీమాట వారికంటే నెక్కుడా ॥ పల్లవి ॥

నాలుగువేదాలబ్రహ్మ నలి నెవ్వనిసుతుఁడు
    వాలినపురాణాలవ్యాసుఁ డెవ్వనిదాసుఁడు
    లీల రామాయణపువాల్మీకివసిష్ఠులు
    ఆలకిం చెవ్వనిఁ గొల్చి రాతఁడే పో దేవుఁడు ॥ వాదు ॥

భారత మెవ్వనికథ భాగవతముచెప్పిన—
ధీరుఁడై శుకుఁడు యేదేవునికింకరుఁడు
సారపుశాస్త్రాలు చూచి¹ సన్యసించి మడిగేటి —
నారాయణనామపునాథుఁడే పో దేవుఁడు ॥వాదు॥

విష్ణువాజ్ఞయని చెప్పీవిధిసంకల్ప మేదది
విష్ణుమాయయని చెప్పీవిశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ" మనేవేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవేంకటాద్రివిభుఁడే ఆదేవుఁడు ॥వాదు॥ 404

నాట

ఇతని కితఁడేకాక యితరులు సరియా
మితి లోకా లితనిమేనిలోనేకావా ॥పల్లవి॥

కమలనాభునిభయంకరకోపముతోడ
రమణ వేరొకరివరములు సరియా
తమితోడఁ దల దుంచి తగినవరము లిచ్చె
అమరఁగ నరకాసురాదులకు నితఁడు ॥ఇత॥

కరివరదునిపేరుగలసినతిట్లతో
పరదేవతలమంత్రపఠనలు సరియా
నిరతి శిశుపాలునినిందకు శిక్షించి
పరలోక మిచ్చినట్టిభావము వినరా ॥ఇత॥

చలిమి శ్రీవేంకటేశుకరుణాగతితోడ
బలిమి మించినబ్రహ్మపట్టము సరియా
వాలిపినధ్రువునకు వున్నతలోక మిచ్చె
అలబ్రహ్మలోకమున కదె మీఁదెలుఁగరా ॥ఇత॥ 405

---

౧. 'సన్యాసించి' లేదు

పాడి

గొరబై మొద లుండఁగఁ గొనలకు నీ రేల
దొరదైవ మితఁడే తుదఁగలఫలము ॥ పల్లవి ॥

క్రతువులు హరియే కర్మము హరియే
పితరులకు హరియే పెనుఁదృప్తి
సతతమంత్రములసారము హరియే
యితనిసేవే పో యిన్నిటిఫలము ॥ గొర ॥

అనలము హరియే ఆహుతి హరియే
జననీజనకులపరవి హరే
పనివడి వేదముఁ బ్రణవము హరియే
యెనసితనిపూజ యిన్నిటిఫలము ॥ గొర ॥

యేలికె హరియే యిరవును హరియే
వాలాయము సర్వము హరియే
కాలము శ్రీవేంకటగిరిహరియె
నేల నీతనిశరణే సఫలంబు ॥ గొర ॥ 406

లలిత

దొంతివిషయములాల దొరలాల
చెంత మీఁదటిబుద్ధి చెప్పరో మాకు ॥ పల్లవి ॥

దురితంబు లొకకొన్ని దుర్గుణము లొకకొన్ని
మరుగుటలు గొన్ని మర్మములు గొన్ని
ధర నెరుక లొకకొన్ని తగ నెరఁగములు గొన్ని
యిరవు మనసపంట లివి యెందు వోయుదమో ॥ దొంతి ॥

ఆన లోకకొన్ని మిథ్యాచారములు గొన్ని
వాసు లోకకొన్ని గర్వములు గొన్ని
రేసు లోకకొన్ని మీరనరుచులు నొకకొన్ని
యీసునఁ గడిచితిమి యిముడఁ జోటేదో ॥ దొంతి ॥

వైరాగ్యములు గొన్ని వరభక్తి లోకకొన్ని
నేరుపులు గొన్ని యిన్నియునుఁ గలిగి
యీరీతి శ్రీవేంకటేశుగతి చేరితిమి
మేర మిము మీరితిమి ౧ మీకు గతి యేదో ॥ దొంతి ॥ 407

## శుద్ధవసంతం

ఏవుపాయములు మా కికఁ బనికిరావు
నీవే హరి కావవే నిరుహేతుకమున ॥ పల్లవి ॥

యివల నింద్రియజయం బేడ నే నేడ
భువి నింద్రియములతోఁ బుట్టె నీతనువు
అవల విశ్చలబుద్ధి అది యేడ నే నేడ
భవము చంచలమనసు పంగెమే యెపుడు ॥ ఏవు ॥

యెలమిఁ గర్మవిముక్తి యేడ నే నేడ
తెలియంగఁ గర్మాధీన మీబ్రదుకు
కుళకమగుసాత్వికపుగుణ మేడ నే నేడ
కలియుగం బిది యిందుఁ గలవాఁడ నేను ॥ ఏవు ॥

తనివోవిఘోరతప మేడ నే నేడ
అనిశంబు నీకు శరణాగతుఁడను
యెనలేని శ్రీవేంకటేశ్వరుఁడ నీబిరుదు
కనుఁగొనఁగ శరణాగతపారిజాతం ॥ ఏవు ॥ 408

౧. 'మాకు' పూ.ము.పా. యతిభంగము.

రేకు 182 సామంతం

సమబుద్ధే యిందరికి సర్వవేదసారము
సముఁ డిందరికి హరి సాధనమోయయ్యా ॥ పల్లవి ॥

చీమకుఁ దనజన్మము చేరి సుఖమై తోఁచు
దోమకుఁ దనజన్మము దొడ్డసుఖము
ఆమనియీఁగకు సుఖ మాజన్మమై తోఁచు
యేమిటా నెక్కువసుఖ మెవ్వరి కేదయ్యా ॥ సమ ॥

జంతురాసులకునెల్లా జననము లొక్కటే
అంతటాను మరణము లవియొక్కటే
చెంత నాహారనిద్రలు స్త్రీసుఖా లొక్కటే
ఇంతటా నిందుకంటె నెవ్వ రేమి గట్టిరయ్యా ॥ సమ ॥

ఇందులోన నెవ్వరైనానేమి శ్రీవేంకటపతి-
నందముగాఁ దలఁచిన దది సుఖము
యెందుఁ జూచినా నీతఁ డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి స్వతంత్ర మేదయ్యా ॥ సమ ॥ 409

బౌళి

కరుణానిధివిగాన కాచితివేమోకాని
సరికి బేసికి నిన్ను జరయఁ జోటున్నదా ॥ పల్లవి ॥

కాయములోపలినిన్నుఁ గని మని కొలువక
ఆయపుఁగర్మమె బ్రహ్మ మని వుంటిని
చీయనినాచేఁతకు నే సిగ్గువడుండుటగాక
ఆయమేమైనా నిన్ను వడుగఁ జోటున్నదా ॥ కరు ॥

సకలచైతన్యుఁడవై సరి నాలో నుండఁగాను
వికటపువిషయాలవెంటఁ బారితి
వొకరు రక్షించఁగా వేరొకరిపాలైననాకు
తుకతుకలేకాక దూరఁగఁ జోటున్నదా ॥కరు॥

పట్టి శ్రీవేంకటగిరిఁ బ్రత్యక్షమై యుండఁగాను
ఇట్టు నట్టు వైకుంఠ మేల కోరేను
దిట్టనై నానేరమి నే తెలిపి నవ్వుట యింతే
ఇట్టె నీచిత్తము గాక యెంచఁగఁ జోటున్నదా ॥కరు॥ 410

శంకరాభరణం

ఇన్నిటా నొరయక యెఱుకేది
వెన్నువికృపఁగా వెలసేది ॥పల్లవి॥

కోపము మతిలోఁ గుందినపుడు వో
పాపము లన్నియుఁ బాసేది
తీపులయాసలు దీరినపుడు వో
తాపత్రయములు దలఁగేది ॥ఇన్ని॥

ఘనకర్మంబులు గడచినపుడు వో
వెనుకొనుభవములు విడిచేది
మునుకొని యింద్రియములు పీడినఁబో
పనివడి విరక్తి బలిసేది ॥ఇన్ని॥

ఆఁకటిరుచు లివి యణఁగినపుడు వో
చేకొని సుఖమును జెందేది
యీకడ శ్రీవేంకటేశ్వరుశరణము
పైకొనినను బో బదికేది ॥ఇన్ని॥ 411

సాళంగనాట

సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకలమునీంద్రులు పూజించే యీసాకారమె ప్రమాణము ॥ పల్లవి ॥

సగుణంబని నినుఁ గొందరు సరి నిర్గుణమని కొందరు
వగలఁ బెక్కుగతిఁ జదివినకొలఁదుల వారికివారే వాదింతురు
అగణితస్వతంత్రుఁడవుగాన అల వాల్మీకి ఇట్టిటనకే
అగు "నిర్గుణాయ గుణాత్మనే" యని ఆనతి ఇచ్చుటే
ప్రమాణము ॥ సక ॥

"సోహం" బని కొందరు "దాసోహం" బని కొందరు
సాహసవృత్తుల రెండుదెరంగుల సకలవివేకులు భజింతురు
దేహధారియై "దాసోహం" బని తేరి శుకుఁడు మీలోఁ గలసె
సోహపుభావన సర్వజగత్తులఁ జూపిన దే ప్రమాణము ॥ సక ॥

ఆరుశాస్త్రముల నారుమతంబుల నారుగర్మములనైనాను
యీరీతుల మిము శరణని కొలువక యెవ్వరి కుపాయము లేదు
నారదాదులగుభక్తు లిందరును నానాగతు లరసి చూచి
సారపుశ్రీవేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము ॥ సక ॥ 412

లలిత

ఇల జాణతనము లిన్నిటికిఁ గలదు
తలఁపే కూటై తగిలీఁగాని ॥ పల్లవి ॥

మఱపదు దేహము మహిఁ దనగుణములు
గుఱి నాహారము గొను నెపుడు
మఱవ వింద్రియములు మర్మస్థలములు
మఱచితి నను నేమరులోకాని. ॥ ఇల ॥

చెదరదు కర్మము సేసినంతయును
పొదిగి జీవమును భోగించును
చెదరదు సంసారశీతలబంధము
మదిఁ [౧] జెదరెడి నామరులేకాని ॥ఇల॥

తొలఁగవు మాయలు తొడరి ప్రపంచము
కలవలెఁ బెనగొని కదిసీని
బలు శ్రీవేంకటపతికృపచే నాకు
తొలఁగె భవము లెటు దూరీనో మరులు ॥ఇల॥ 413

మాళవి

హరి నెఱఁగనిజన్మ మది యేలా ఆ-
సగుస నాతఁడులేనిచదువేలా ॥పల్లవి॥

దయదొలఁగినయట్టితపమేలా
భయములేనియట్టిభక్తేలా
ప్రియముమానినయట్టిపెనఁగేలా మంచి-
క్రియావిరుద్ధపుకీర్తనలేలా ॥హరి॥

ఫలములేనియట్టిపనులేలా కడుఁ-
గలిమిలేనియట్టిగర్వమేలా
బలిమిలేనియట్టిపంతమేలా శౌరిఁ-
దలఁచలేనియట్టితనువది యేలా ॥హరి॥

తన కమరనిదొరతనమేలా
చనవులేనియట్టిసలిగె యేలా
యెనలేనిశ్రీవేంకటేశ్వరుని శరణని
మనఁగలిగినమీఁద మరిచింతలేలా ॥హరి॥ 414

---

౧. 'జెదరేది' పూ.ము.పా.

రేకు 183 లలిత

దోమటి నింతెరఁగరా తొల్లిటివారు
 వామదేవవసిష్ఠవ్యాసాదులు ॥ పల్లవి ॥

తానే దైవమైతే తపమేల జపమేల
 పూని సారెఁ బూజించేపూజలేల
 కాను వంగి యింటింటఁ గోరనేల వేఁడనేల
 యీనెపాన లోకమెల్లా నేలరాదా తాను ॥ దోమ ॥

తగఁ దా స్వతంత్రుఁడై తే దరిద్రదుఃఖములేల
 నొగిలి వ్యాధులచేత నొవ్వనేల
 వగఁబాటులై వజననమరణములేల
 మఁగురువేల్పులదండ మొనచూపరాదా ॥ దోమ ॥

శ్రీవేంకటేశుఁడే శేఖరపుదైవమని
 సావధానఁ డితనికి శరణుచొచ్చి
 భావములోపలఁ దవపాపబంధములఁ బాసి
 తావుల నాతనికృప దండ చేరరాదా ॥ దోమ ॥ 415

గుండక్రియ

అవియు నాతఁ బ్రథమాచార్యులు
 తవిలి యీనెపము మిమ్ముఁ దలఁపించుఁగాన ॥ పల్లవి ॥

ధనవాంఛ మతిలోనఁ దగిలినప్పటివేళ
 దనుజారి మీమీఁదఁ దలఁపు గలుగు
 పొవిగి భయదుఃఖములఁ బొరలినప్పటివేళ
 పనిపూని మీమీఁదిభక్తి గలుగు ॥ అవి ॥

చెలఁగి పాపములు మించినవేళ హరి మీ-
నలువునామోచ్చారణంబు గలుగు
బలిమి భవరోగముల బడలినప్పటివేళ
వలుమారు మీసంప్రార్థనలు గలుగు ॥ అవి ॥

ఇన్నిటాఁ దొలఁగి మిము నెరిఁగి కొలిచినవేళ
మన్ననలపరిణామంబు గలుగు
వున్నతపుశ్రీవేంకటోత్తముఁడ మిము నెదుటఁ
గన్నయీవేళ సౌఖ్యంబులే కలుగు ॥ అవి ॥ 416

## అలిత

ఈతని మరచివుంటి మిన్నాళ్లును
యీతల నేఁ దెచ్చరిఁచె నీతఁడే పో విష్ణుఁడు ॥ పల్లవి ॥

తల్లియై పోషించు తండ్రియై రక్షించు
పుల్లపుబంధువుఁడై వొడ లరయు
మెల్లనె దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్లవిధబంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు ॥ ఈత ॥

యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధిచెప్పు
చాలుమావిసియై యంచలఁ దిరుగు
బాలుఁడై ముద్దుచూపు ప్రాణమై లోన నుండు
యీలాగులబంధుఁ డీతఁడే పో విష్ణుఁడు ॥ ఈత ॥

దేవుఁడై పూజగొను ద్రిష్టిగోచరమై
శ్రీవేంకటాద్రిమీఁద సిరు లొసగు
తావై యెదమిచ్చు తలఁపై ఫలమిచ్చు
యీవలనావల బంధుఁ డీతఁడేపో విష్ణుఁడు ॥ ఈత ॥ 417

లలిత

వీదిలోన నదేకదే విష్ణుపదము
ఆదెసనే పాయకుండు నాదిమూలము ॥ పల్లవి ॥

చూచేటిచూపులకును సూటియైనమొదలేదో
యేచి వినుకలిమర్మ మెందు దాఁకీనో
వాచవిచవులు చూచేవంటశాలచోటేదో
ఆచాయనే వుఁడు నాదిమూలము ॥ వీది ॥

పూఁపతలపోఁతలకు పుట్టినయి ల్లది యేదో
పైపై నూర్పులు నిజపఁగఁ జోటేదో
మాపులు నిద్రించువేళ మరచేటిచోటేదో
అపొరుగుననే వుండు నాదిమూలము ॥ వీది ॥

నేరిచినవిద్యలెల్లా నించి దాఁచేచోటేదో
కోరనియానందముకొన యేదో
ఆరయ శ్రీవేంకటేశుఁ డాతనే పాయక వుండు
ఆరితేరి నాతఁ డీతఁ డాదిమూలము ॥ వీది ॥ 418

బౌళి

దేహి నిత్యుఁడు దేహము లనిత్యాలు
యీహల నామనసా యిది మరవకుమీ ॥ పల్లవి ॥

గుడిఁ బాఁతచీర మాని కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహి మొగిఁ గొత్తమేను మోచు
అదనఁ జంపఁగలేవు ఆయుధము లీతనిఁ
గదిసి ౧యగ్నియు నీరు గాలియుఁ జంపఁగ లేవు ॥ దేహి ॥

౧. 'యజ్ఞియు' రేకు.

యీతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునుఁగఁ డీతఁడు గాలిఁ బోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ [౧]చెలియించఁ దేమిటను
యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు ॥ దేహి ॥

చేరి కానరానివాఁడు చింతించరానివాఁడు
[౨]భారపువికారాలఁ బాసినవాఁ డీయాత్మ
అరయ శ్రీవేంకటేశునాధీన మీతఁడని
సారము దెలియుటే [౩]సత్యం జ్ఞానము[౪] ॥ దేహి ॥ 419

ధవళి

హరిసే వొకటే యనంతము
గురుబోధలకును కొలఁదే లేదు ॥ పల్లవి ॥

తలఁచినకొలఁదే తనలో భావము
నిలిపినకొలఁదే నేమము
పలికినకొలఁదే పరమగుసత్యము
యిల నెవ్వరికిని యెక్కుడు లేదు ॥ హరి ॥

జరిపినకొలఁదే సకలాచారము
నెరపినకొలఁదే నిజకీర్తి
తిరము సేయుకొలఁదే ధర్మంబును
యిరవుగ నందుకు నెక్కుడు లేదు ॥ హరి ॥

సేసినకొలఁదే చేకొనుకర్మము
రోసినకొలఁదే రుచివిరతి
ఆసల శ్రీవేంకటాధిపుశరణను –
దాసుఁడే యెక్కుడు తప్పే లేదు ॥ హరి ॥ 420

---

౧. 'చలియించ' ఐతే యతిభంగము. ౨. 'భావపు' రేఫ, ప్రాసభంగము.
౩. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" శ్రుతి. ౪. చూ:- భగవద్గీత 2 అధ్యా 22 నుంచి 24 శ్లోకాలు.

రేకు 184 లలిత

ఇది యరుదను నొకఁ డిది యరుదని చెప్పు
యిది యరుదని విను నెవ్వఁడూ నెఱఁగఁడు ॥ పల్లవి ॥

పుట్టినవానికినెల్లా భువి మరణము నిత్య-
మట్టే చచ్చినవారి కవ్వలజననము
పుట్టనినాఁడైతేను పొడగానరాదు మేను
కొట్టఁగొనఁ గానరాదు కొన్నాళ్లేకాని ॥ ఇది ॥

జీవుఁడు నిత్యుఁ డేమిటాఁ జెరుపఁగరానివాఁడు
యీవివేకము దెలిసి యేజాతివారైనా
దైవికమే నమ్మి తమధర్మములఁ బాయరాదు
సావధాన మిదియే సంసారయోగము ॥ ఇది ॥

చిత్తమా నీలోపలను శ్రీవేంకటేశ్వరుఁడు
పొత్తునఁ గూడున్నవాఁడు పొదిగి పాయకు నీవు
యెత్తి నాదేహగుణము ఇది జీవగుణ మిది
౧ఇత్తలాదైనగుణము యిది మఱవకుమీ ॥ ఇది ॥ 421

ముఖారి

నాకు నీవు గలవు హరి నాలోపలనుండి
పైకొని యిన్నియు బదుకనీవయ్యా ॥ పల్లవి ॥

పసిగొని రుణానుబంధముకొలఁదే
పసులునుఁ బడతులు బహుసుతులు
వసముగావు తమవంతులు దీరిన
పసగా నవియే బదుకనీవయ్యా ॥ నాకు ॥

---

౧. ఇత్తలన్+అది+ఐనగుణము

పెనగొని భటులకుఁ బెట్టినకొలఁదియు
పనులునుఁ గీర్తులు పంతములు
అనువులు దప్పను అవి గడమైతే
పనివడి యివియే బదుకనీవయ్యా ॥ నాకు ॥

డుసంపదలును కాలముకొలఁదే
బడిబడిఁ జవులై ఫలియించు
యెడపక శ్రీవేంకటేశుఁ డిచ్చె నివే
పడసితి మివియును బదుకనీవయ్యా ॥ నాకు ॥ 422

సామంతం

నారాయణాచ్యుతానంత గోవింద హరి
సారముగ నీకు నే శరణంటివే ॥ పల్లవి ॥

చలువయును వేఁడియును సకలసంసారంబు
తొలఁకు సుఖ మొకవేళ దుఃఖ మొకవేళ
ఫలము లివె యీరెండుఁ బాపములు పుణ్యములు
పులుసుఁ దీపునుఁ గలపి భుజియించినట్లు ॥ నారా ॥

పగలురాత్రులరీతి బహుజన్మమరణాలు
తగుమేను వొడచూపు తనుఁ దానె తొలఁగు
వగియించు నొకవేళ వలఁగించు నొకవేళ
వొగరుఁగారపువిడె ముల్బించినట్లు ॥ నారా ॥

ఇహముఁ బరమునువలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని
సహజశ్రీవేంకటేశ్వర నన్నుఁ గరుణించి
బహువిధంబుల నన్నుఁ బాలించవే ॥ నారా ॥ 423

గుండక్రియ

కలుగుట గలిగిననాఁడే నే ఘనపాపములకు ౧దొలంగినా
యెలమి నే నిపుడే యెఱిఁగితిని యిన్నాళ్లీమతి లేదు ॥పల్లవి॥

౨జనియించిననే నిటకమునుపు సకలయోనిగతజన్మములు
౩కనుఁగొని యవె నే సారెకుఁ బలుమరు ఘనవర్ణాశ్రమధర్మములు
అనుభవించినవే సకలార్థంబులు అయిహికవిషయము లన్నియును
మనసున వాకున శ్రీహరి నొకని నే మఱచియుఁ దలఁచుట లేదు॥కలు॥

తిరిగినవే ౪నే నాసలకొరకును దిక్కు లన్నియును ౫నేను
యిరవుగ తొల్లియు నెఱిఁగినవే యీసంసారపుసుఖము లివి
పొరలినవే నేఁ గామినీజనులపొందులసుఖములభోగములు
యెరవులదొకటే శ్రీహరిదాస్యం బిది గతియని యెఱుఁగుటలేదు॥కలు॥

గడియించినవే నేఁ బూర్వకాలమున ఘనమగుసంపద లిన్నియును
నొడిగినవే నే శబ్దజాలములు నోరఁ గొలఁదు లివి యిన్నియును
తడఁబడి నే నిటు సకలలోపాయపుధర్మము లిన్నియుఁ జూచితిని
యెడపక శ్రీవేంకటేశ్వరు శరణం బిటువలెఁ జేయుటలేదు ॥కలు॥ 424

లలిత

నీ వొక్కఁడవే నాకుఁ జాలు నీరజాక్ష నారాయణ
నీవే నాకు గతియని తెలిసితి నెక్కొని యితరము వృథా వృథా
॥పల్లవి॥

మీనామోచ్చారణమే మెరసిన దుఃఖనివారణము
మీనామోచ్చారణమే మెలఁగుశుభకరము
నానావేదశాస్త్రములు నవపురాణేతిహాసములు
మీనామములోనే వున్నవి మిగిలిన విన్నియు వృథా వృథా ॥నీవొ॥

---

౧. 'దొలంగేనా' కావచ్చు. ౨. 'జనియించినవే' కావచ్చు. ౩. 'కనుఁగొనినవె' కావచ్చు.
౪. ౫. పునరుక్తి. ఇట్టి వక్కడక్కడ గలవు.

నీపాదమూలము నింగియు భువియు రసాతలము
నీపాదమూలము నిఖిలజీవపరిణామములు
దీపించినచరణంబులు దివ్యులు మునులును సర్వమును
నీపాదమూలమే మరి నెరి నితరంబులు వృథా వృథా ॥నీపా॥

దేవ మీతిరుమేను దిక్కు-ను బ్రహ్మాండాధారము
దేవ మీతిరుమే నుత్పత్తిస్థితిలయములకును ఆకరము
శ్రీవేంకటపతి నాభావము చిత్తము నీకే సమర్పణ
దేవ మీశరణము చొచ్చితి దిక్కు-లన్నియును వృథా వృథా॥నీపా॥425

రేకు 185 గుండక్రియ

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కు-లు లోకపావని నీకమ్మా ॥పల్లవి॥

ధర్మార్థకామమోక్షతతులు నీం సోపానాలు
అర్మిలి నాలుగువేద లదె నీదరులు
నిర్మలపునీజలము నిండుసప్తసాగరాలు
కూర్మము నీలోతు వోకోనేరమ్మా ॥దేవు॥

తగినగంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఃబుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మునులోయమ్మా ॥దేవు॥

వైకుంఠనగరమువాకిలే నీయాకారము
చేకొనుపుణ్యములే నీజీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీవునికి
దీకొని నీతీర్థ మాడితిమి కావవమ్మా ॥దేవు॥ 426

౧. 'సోపానాలు' కావచ్చు.

కాంబోది

నన్నెఱఁగలేనయ్యో నాయంతర్యామై
వున్నతపుహరి నాలో నున్నాఁడట ॥పల్లవి॥

యిల నేడుజానలమే నిందులోనివాఁడ నింతే
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపొయ్యీని
కలువరేకులంతేసికన్నులవాఁడ నింతే
సొలసి చూ పాకాశమే చూఁగొనీని ॥నన్నె॥

వెడ వెంట్రుకదూరేటివీనులవాఁడ నింతే
కడలేనిశబ్దము లొక్కట వినేను
నడుమ నే సల్లెఁడంతనాలికెవాఁడ నింతె
వుడివోనిసుద్దు లెల్లా నుగ్గడించేను ॥నన్నె॥

లచ్చనఁ బదారంగుళాలప్రాణ మింతే
కుచ్చి కాలపుదినాలు గొలచీని
కొచ్చినశ్రీవేంకటేశుకొలువుడుబంట నింతే
పచ్చియింద్రియాల కెల్లాఁ బంపు సేసేను ॥నన్నె॥ 427

సామంతం

నిక్కమైనవాలోనినెలవు గాన లేను
దిక్కు నీవే హరి నాతెలి వేఁటితెలివి ॥పల్లవి॥

నీటిలో మునిఁగి వచ్చి నిర్మలుఁడ ననుకొందు
గాఁటమై యావేగి లేచి కా వందును
తేటలఅదేహమే దిష్టము అనేనే
పాటిలేనిభావపునాబదు కేఁటిబదుకు ॥నిక్క॥

యెన్న నొక బంటు నేలి యేలికె నే ననుకొందు
పన్ని నే నొకరిఁ గొల్చి బంట నందును
మున్నిటినామనసె మొదలినాపుట్టుగే
యిన్నివికారాలనాయెరు కేఁటియెరుక ॥విక్క॥

కాంచనము చేతనుంటే కలవాఁడ ననుకొందు
పెంచి యొకవేళ నేఁ బేద నందును
కంచుమాయఁ బొరలఁగాఁ గాచితి శ్రీవేంకటేశ
కొంచినయిన్నాళ్ల నాగుణ మేఁటిగుణము ॥విక్క॥ 428

మాళవి

అరు దరుదు నీమహి మతిమానుషము చూడ
పురుషోత్తమను దివ్యపురజగన్నాథా ॥పల్లవి॥

పసులఁగాచే దేవ బ్రహ్మ నుతియించు దేవ
సిసువౌ దేవ నాలుగుచేతు లేవ
కొసరి వేలనే యేవ కొండగొడగెత్తు దేవ
వనమా విన్నుఁ బొగడ వరజగన్నాథా ॥అరు॥

జనవేష మేవ పారిజాతము దెచ్చిన దేవ
తనివెన్నముచ్చ మేవ దైవిక మేవ
పని బంధిబోయిఁ దేవ బాణుని వరకు దేవ
వినఁ గత నీమహిమ విష్ణు జగన్నాథా ॥అరు॥

కమ్మి రోలఁ గట్టు దేవ గరుడవాహన మేవ
దొమ్మి భద్రసుభద్రులతోఁబుట్టు వేవ
చిమ్మెల విలగిరివి (?) శ్రీవేంకటాద్రిమీఁద-
నుమ్మడి విరవుకొంటి వోజగన్నాథా ॥అరు॥ 429

### మాళవిగౌళ

కలియుగ మెటులైనాఁ గలదుగా నీకరుణ
జలజాక్ష హరిహరి సర్వేశ్వరా ॥ పల్లవి ॥

పాప మెంత గలిగినఁ బరిహరించేయందుకు
నాపాలఁ గలదుగా నీనామము
కోప మెంత గలిగిన కొచ్చి శాంతమిచ్చుటకు
చేపట్టి కలవుగా నాచిత్తములో నీవు ॥ కలి ॥

ధర నింద్రియా లెంత తరముకాదిన నన్ను
సరిఁ గావఁగద్దుగా నీశరణాగతి
గరిమఁ గర్మబంధాలు గట్టినతాళ్లు వూడించ
విరతిఁ గలదుగా నీభక్తి నాకు ॥ కలి ॥

హితమైనయిహపరా లిష్టమైనవెల్లా నియ్య
సతమై కలదుగా నీసంకీర్తన
శతి శ్రీవేంకటేశ నాతపము ఫలియింపించ
గతి గలదుగా నీకమలాదేవి ॥ కలి ॥ 430

### గుండక్రియ

జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి ॥ పల్లవి ॥

శరణాగతపారిజాతమా
వైరి నసురలపాలిభూతమా
అరుదయిన సృష్టికి నాదిమూలమా వో-
హరి నమో పరమపుటాలవాలమా ॥ జయ ॥

సకలదేవతాచక్రవర్తి
వెకలిపై విండినవిశ్వమూర్తి
అకలంకమైనదయానిధి
వికచముఖ నమో విధికి విధి ॥ జయ ॥

కొలిచినవారలకొంగుపైఁడి
మలిగిఁవాంకి మొనవాఁడి
కలిగినశ్రీవేంకటరాయా
మలసి దాసులమైనమాకు విధేయా ॥ జయ ॥ 431

రేకు 186 దేవగాంధారి

అణురేణుపరిపూర్ణమైనరూపము
అణిమాదిసిరి యంజనాద్రిమీఁదిరూపము ॥ పల్లవి ॥

వేదాంతవేత్తలెల్లా వెదకేటిరూపము
ఆదినంత్యములేవియారూపము
పాదుగయోగీంద్రులు భావించురూపము
యీదెస నిదివో కోనేటిదరిరూపము ॥ అణు ॥

పాలజలనిధిలోనఁబవళించేరూపము
కాలపుసూర్య(౧)చంద్రాగ్నిగలరూపము
మేలిమి వైకుంఠాన మెరసినరూపము
కీలైన దిదే శేషగిరిమీఁదిరూపము ॥ అణు ॥

ముంచినబ్రహ్మాదులకు మూలమైనరూపము
కొంచనిమత్త్వాకుమీఁదికొనరూపము
మంచిపరబ్రహ్మమై మమ్ము నేలినరూపము
యెంచఁగ శ్రీవేంకటాద్రి విదేరూపము ॥ అణు ॥ 432

౧. 'చంద్రాగ్నిఁగల' రేకు. ఇందలిఅరసున్న చింత్యము.

గుండక్రియ

నేనేమిఁ జేయఁగలేను నీవు పరిపూర్ణుఁడవు
హీనుఁడ నే నధికుఁడ౧ విన్నిటా నీవు ॥ పల్లవి ॥

దండమువెట్టుట నాది, తప్పు లోఁగొనుట నీది
వెండి నీవెప్పుడు దయానిధివి గాన
అండఁ జేరుకొంట నాది అందుకు నూఁకొంట నీది
దండియైనదేవదేవోత్తముఁడవు గాన ॥ నేనే ॥

శరణుచొచ్చుట నాది సరుగఁ గాచుట నీది
పరమపురుష శ్రీపతివి నీవు
విరులు చల్లుట నాది వేవేలిచ్చుట నీది
సిరి నీవు భక్తసులభుఁడ వటుగాన ॥ నేనే ॥

దాసుఁడననుట నాది తప్పక యేలుట నీది
ఆసదీర్చేవరదుఁడ వటుగాన
నీసేవ యొక్కటి నాది విచ్చలఁ గైకొంట నీది
యాసులేవిశ్రీవేంకటేశుఁడవుగాన ॥ నేనే ॥ 433

బౌళి

ఎట్టైనాఁ గావకపోదు యీ వెంత నేసినాను
యిట్టె నీకు శరణంటి విదియే తెరఁగు ॥ పల్లవి ॥

చేకొని నే మొక్కఁగాను చేతులు గోయఁగరాదు
ఆకడఁ దప్పుకుఁదగినాజ్ఞ మానరాదు
కైకొని యపరాధాలే కావించితి నెన్నైనా
యీకడ నీశరణంటి వికనో తెరఁగు ॥ ఎట్టై ॥

౧. 'విన్నిటా' పూ.ము.పా. అతికంగము.

దిక్కు దైన్యపడఁగాను చెలఁగి ఖండించరాదు
చక్కఁగా నాద్రోహాలు సైరించరాదు
అక్కడఁ జూచిన శరణాగతబిరుదు నీకు
యిక్కడ నీశరణంటి నిఁకనో తెరఁగు ॥ఎట్టై॥

సేవసేయుచుండఁగాను జీతము మానపరాదు
యీవిధి నాన దోసితే నిందుకోరాదు
దేవుఁడ నిన్నుఁ గొలిచి తెగి కర్మా లుడిగితి
యీవల శ్రీవేంకటేశ ఇఁకనో తెరఁగు ॥ఎట్టై॥ 434

గుండక్రియ

ధరలో "౧నెద్భావం తద్భవ"తనెఁగాన
హరిమయమే జగమంతాను, ॥పల్లవి॥

మహి నెదిటివారందు మలినము దలఁచిన
తహతహ మనసే తా ౨మలినము
వహి నెదిటందు ౩భావనము భావించిన
బహువిధములఁ దానూ భావనమే ॥ధర॥

యెక్కువ నెదిటిపాపా లెంచి నిందించేటి-
నిక్కపునాలుక తానే నిందితము
వొక్కటై యెదిటిపుణ్యా లుగ్గడించి ఘన మంచే
దక్కినపుణ్యపుజిహ్వ తానూ ఘనమే ॥ధర॥

సారె శ్రీవేంకటపతి సగుణము దలఁచిన
సారపుజీవుఁడు దాను సగుణమే
నేరుపుల నాతనినిర్గుణము దలఁచిన
తారతమ్యములులేనితానూ నిర్గుణమే ॥ధర॥ 435

---

౧. "యద్భావం తద్భవతి" అనుటకు వ్యావహారికమేమో 'యద్భావం కర్మ తత్ = తత్ఫలం భవతి' అని అర్థము కావచ్చు. ౨. 'మలినం' రేకు. ౩. భావనము = (ప్రకరణముతో) మేలు; మంచి కావచ్చు.

భూపాళం

ఎందాఁక నిద్ర నీ కిదె తెల్లవారెఁగదె
యిందిరారమణ నీ విటు మేలుకొనవే ॥పల్లవి॥

కమలనాభుఁడ నీకు రంగాదినదులెల్ల-
నమర మొకమజ్జనం బాయితము సేసె
తమితోడఁ గనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పె నదే విచ్చేయవే ॥ఎందాఁ॥

హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతమగువాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాఇత్తపడి సందడించేరు ॥ఎందాఁ॥

కామధేనువు వచ్చె కనుఁగొనుటకై నీకు.
శ్రీమహాదేవి నీచేలాగు కదివో
యీమహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె
కామించి యన్నియునుఁ గైకొంటి విపుడు ॥ఎందాఁ॥ 436

సాళంగనాట

రామా రామభద్ర రవివంశ రాఘవ
యేమి యరుదిది నీ కింతటివానికిని ॥పల్లవి॥

నాఁడు రావణుతలలు నఱకినలావరివి
నేఁడు నాపాపములు ఖండించరాదా
వాఁడిప్రతాపముతోఁడ వారిధిగట్టినవాటి-
వాఁడ విటై నామనోవార్ధిఁ గట్టరాదా ॥రామా॥

తనిసి కుంభకర్ణాదిదైత్యుల గెలిచితివి
కినిసి నాయింద్రియాల గెలువరాదా
యెనసి హరునివిల్లు యెక్కువెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచరాదా ॥ రామా ॥

వినస విభీషణుఁడు శరణంటేఁ గాచితివి
ఘనము నే శరణంటేఁ గావరాదా
తొరలి శ్రీవేంకటేశ దొడ్డు గొంచ మెంచనేల
ఉరవై లోకహితాన కేదైనా నేమీ ॥ రామా ॥ 437

రేకు 187 లలిత

అని యానతిచ్చెఁ గృష్ణుఁ డర్జునునితో
ఘని యాతని భజించు వివేకమా ॥ పల్లవి ॥

"భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణులనెల్ల
దీమసాన నే మోచేటిదేవుఁడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుఁడనై
తేమల బండించేటిదేవుఁడ నేను ॥ అని ॥

౧ దీపనాగ్ని నై జీవదేహముల నున్నములు
తీపుల నరగించేటిదేవుఁడ నేను
యేపున నిందరిలోనిహృదయములోన నుండు
దీపింతుఁ దలఁపుమరపై దేవుఁడ నేను ॥ అని ॥

వేదములన్నిటిచేతా వేదాంతవేత్తలచేతా
ఆదికి నెరఁగఁదగినయాదేవుఁడను
శ్రీదేవితోఁ గూడి శ్రీవేంకటాద్రిమీఁద
పాదైనదేవుఁడను భావించ నేను" ॥ అని ॥ 438

౧. 'దీపనాజ్ఞి' రేకు.

గుండక్రియ

తలఁపులో కొట్టఁగొన దైవమే వున్నాఁడు
తలఁచినరూపులెల్లా తా నయ్యీనయ్యా ॥పల్లవి॥

కలలో ప్రపంచము కంటి నే నొకటి
వెలినున్న ప్రపంచవిధివలెనే
కలనున్నవాఁడ నేనే వెలి నున్నవాఁడ నేనే
తెలి(యః) మాబతుకు రెంట దెప్పరములయ్యా ॥తలఁ॥

దేహమీఁద నుండఁగానే దిక్కులకేఁగీ మనసు
దేహముతో దిక్కులెల్లాఁ దిరిగినట్టే
దేహములోవాఁడ నేనే దేహముపైవాఁడ నేనే
వోహో మాజన్మములో నొకటి రెండయ్యా ॥తలఁ॥

కన్నులెదుట శ్రీవేంకటపతిఁ గొలిచెద
కన్నుమూసి యాతవినే కమ్మర భావించెదను
కన్నులలోపల నేనే కన్నులవెలిని నేనే
వున్నతి నీరెండును వొక్కటాయనయ్యా ॥తలఁ॥ 439

శ్రీరాగం

చాలు నిదే నావిరతి సకలసామ్రాజ్యము
నాలోనిపని యెంతైనా నాకుఁ గలదు ॥పల్లవి॥

వడఁబడి పరులిండ్లవాకిలి గాచే నేను
వడి నాలో హరియున్న వాకిలి గాచేను
బడి నొకరిఁ గొలిచి బహురాజ్యమేలేనేను
యెడ నామనోరాజ్యమింతా నేలేను ॥చాలు॥

చేరి యొరులకుఁ బనిసేసి యలసేనేను
సారె నాయోగాభ్యాసాన నలసేను
అరసి నే నడుగఁగ నన్యులిచ్చేయీవులు
తారి పూర్వకర్మాదిదైవమే యిచ్చీవి ॥చాలు॥

అంటు సంతోషమే ఫల మిందు సంతోషమే ఫల-
మందును మాయాకల్పిత మిందును మాయే
అఁదు నిందు శ్రీవేంకటాధీశుఁడే కర్త
అందైతేఁ బరతంత్రుఁ డిందు నే స్వతంత్రుఁడ ॥చాలు॥ 440

సామంతం

నీసొమ్ము చెడకుండ నీవు చూచుకొనవయ్య
దాసుఁడ నే నింతే దైవమవు నీవు ॥పల్లవి॥

లోకము లేఁదువట లోకములోపలినేను
పైకొని నీ వేలినట్టిబంటనేసుమ్మీ
ఆకడ నావుఁ గొంటే నావువెంట దూడయును
జోకఁలఁ గొన్నట్టివారిసొమ్మేకాదా ॥నీసొ॥

చేరి నన్ను నీవే పుట్టించితివట నేఁ జేసే-
మేరతోఁ బుణ్యపాపాలు మీవేసుమ్మీ
ఆరుగ విత్తినవాఁడు ౧ ఆరుగలోపలికంది
ఆరితేరి పండితేను ఆతనిదేకాదా ॥నీసొ॥

శ్రీవేంకటేశ నీవు జీవాంతరాత్మవట
కావించి నాపాలఁ గలవేసుమ్మీ
దైవసమై చందురుఁడు కలువలజాతికెల్ల
భావింప సర్వవిధబంధువే కాఁడా ॥నీసొ॥ 441

౧. ఆరుగలోపలికంటె(?) పూ.ము.పా.

బౌళిరామక్రియ

అన్నిటికి హరి యంతర్యామి మూలము
సన్నకన్నగతులెల్లాఁ వృథా మూలము ॥ పల్లవి ॥

లాలిత వైరాగ్యమూలము మోక్షము
ఆలరి సంసారమూల మతిబంధము
మేలిమి శాంతిమూలమే సుఖము
వీలి క్రోధమూలమే వెడదుఃఖము ॥ అన్ని ॥

కైకొను భవములే కర్మమూలము
శ్రీకాంతుపై భక్తి చిన్మూలము
పైకొన్న ధ్యానమెల్ల భావమూలము
దీకొని లంపటములు దేహమూలము ॥ అన్ని ॥

అదుదై సుజ్ఞాన మాచార్యమూలము
ధరణి జగతెల్లా ధనమూలము
పరము శ్రీవేంకటపతిమూలము
హరి నాకితని శరణాగతి మూలము ॥ అన్ని ॥ 442

దేశగాంధారి

వానికి ముదుల యిచ్చి వద్దని మానుపవే
శ్రీనారాయణ వీనిచేత నే వేసరితి ॥ పల్లవి ॥

నీకల్పితములే యీవిఖిలేంద్రియములు
యీకడ నీయింద్రియాల నెట్టు గెలువఁగవచ్చు
నీకడ విన్నే కొలిచి నీయప్పణ దెచ్చి వానిఁ
బైకొని చోఁపుటగాక బలిమా రాచాజ్ఞతో ॥ వాని ॥

౧. 'ప్రతా' రేకు.

నీపంపునఁగప్పిననిజమైనమాయ యిది
మాపాటివారెల్లా మహి నెట్టు దాఁటవచ్చు
మీపాదలే కొల్చి మీయనుజ్ఞ గొని దాని
పైపైఁ దోయుటగాక బలిమా రాచాజ్ఞతో ॥వాని॥

శ్రీవేంకటేశ నీచిక్కులే యీపుట్టుగులు
నీవు సేసేచేఁతలకు నే నెట్టు దొలఁగవచ్చు
నీవొద్ద శరణంటి నీయానతినే వాని
భావించి తోసితిఁగాక బలిమా రాచాజ్ఞతో ॥వాని॥ 443

రేకు 188 గుండక్రియ

నీవే సేసినచేఁత నీవే చేకొనుటింతే
యీనల నీసొమ్ము నీకే ఇయ్య సిగ్గయ్యీనయ్యా ॥పల్లవి॥

అలు బిడ్డలఁ గని యిటు దవమగనికి
నీలాన సమర్పణ సేయవలెనటవయ్యా
తాలిమిఁ బుణ్యాలు సేసి దైవమా నే నీకు
యేలీల సమర్పించే విందుకే నవ్వు వచ్చీనయ్యా ॥నీవే॥

అంకెలఁ గన్నకొడుకటు దమతండ్రికివి
తెంకి నే నీవాఁడ నని తెలుపఁగవలెనటవయ్యా
లంకె నాలోపలనున్నలక్ష్మీశ నే నీకు
పొంకపు నీ బంట నన్నఁ [1]బునరుక్తయ్యీ నయ్యా ॥నీవే॥

తననీడ యద్దములోఁ దానే యటు చూచి
పనివడి వూరకే భ్రమయవలెనటయ్యా
అనుగుశ్రీవేంకటేశ ఆతుమలోనున్నవిన్ను
గని మని శరణంటేఁ గడఁ బూజించనేలయ్యా ॥నీవే॥ 444

---

౧. 'బునరుక్తైయ్యీ' రేకు. పునరుక్తి+అయ్యీనయ్యా. ఈ సంధులీవాఙ్మయమున కొల్లలు.

బౌళి

అనలము సూర్యుఁడు నన్నిటందు వెలసిన (నా?)
ఘనపవిత్రమైనట్టు ఘనుఁడే పో జ్ఞాని ॥ పల్లవి ॥

కాంచనము అంటువడినఁ గలదా అందు నింద్యము
పెంచు ముట్టంటువడినఁ బెక్కుఁ బదూష్యముగాక
అంచల సుజ్ఞానిఁ బాపమంటునా తాఁ జేసినాను
పంచల నజ్ఞాని నై తేఁ బైకొనీఁగాక ॥ అన ॥

యెఱుకగం ౧నాలిక నింతైనా జిడ్డంటునా
యెఱుకలేనిచేత నింతా జిడ్డంటుఁగాక
కఱతలయోగిని కర్మములివంటునా
చుఱచుఱ జడునై తేఁ జుట్టుకొనుఁగాక ॥ అన ॥

తామెరపాకుల నీరు తగ నందు నంటునా
ఆమేర నెందైనాను నంటుఁగాక
యీమేర శ్రీవేంకటేశునిదాసుఁడు భూమిఁ
గామించి తా నుండినాను గడు మాయలంటునా ॥ అన ॥ 445

చాయానాట

కమ్మంటేఁ గావా కాఁగల వన్నియు
చిమ్ముల మాయలు సేయఁగనేలా ॥ పల్లవి ॥

నరసిజాక్ష నీసంకల్పమాత్రము
అరుదగుఘనబ్రహ్మాండ మిది
అరయఁగ ధరలో నల్పపుఁబనులకు
హరి యవతారం బందితివేలా ॥ కమ్మం ॥

౧. 'నాలికె' రేకు

సతతసురాసురజననమరణములు
మతి నీహంకారమాత్రములు
గతియై యమృతము గల్పించుకొరకును
తతి ఘోరజలధి దచ్చితివేలా ॥ కమ్మం ॥

యిహ వైకుంఠము యీశేషగిరే
మహి నీ దర్శనమాత్ర మిది
విహరింపఁగ శ్రీవేంకటేశ యిటు
ఐహలోకపుకల్పన అపి యేలా ॥ కమ్మం ॥ 446

సామంతం

రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన
యేచి నీకు శరణంటి నిది మానుపవే ॥ పల్లవి ॥

కడు నహంకరించినను తొల్లి ఘనుడు నారదమౌని
బెడిదపుటింతిఁ జేసి నీమాయ అతని బిడ్డలఁ గనిపించెను
అడరి నే ననఁగా నెంతటివాఁడను అది నేఁ గడపఁగలనా
తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండఁగఁ జేయవే
॥ రాచా ॥

మహి మిమ్ము మోచేనని మున్ను మదించినగరుడనివి
సహజపునీహస్తము మోయకుండఁగ శక్తి హరించె నీమాయ
బహుముఖముల, నే నెంతటివాఁడను పాయఁగ నీమాయ
అహిశయనుఁడ నే నీశరణంటిని అది నన్ను దగ్గరకుండఁ
జేయవే ॥ రాచా ॥

పారపు శ్రీవేంకటేశ స్వతంత్రుఁడవు నీవు
గారవపుమాయ నీదే కమ్మి నే నీవాఁడనే
మారుదైవములు లేరు మరి నన్నుఁ గావ నిన్నుఁ
బేరుకొని శరణంటిఁ బెడఁబాపు మాయ ॥ రాచా ॥ 447

మాళవిగౌళ

ఎందుకు విచ్చేయనేల ఇన్నియు నాలోనివే
అంది యివే చేకొనవే ఆరడి నీకేల ॥ పల్లవి ॥

కాముకుఁడవై గోపికలఁ బొందఁ బ్రియమైతే
కాముకత్వము నాయందుఁ గలదెంతైనా
గోమున కంసాదులపై క్రోధమే ప్రియమైతే
నాముల క్రోధ మిదివో నాలో నున్నది ॥ ఎందు ॥

లోకులచీర లీకుండేలోభమే ప్రియమైతే
యీకడ లోభము నాలో హెచ్చినదిదే
మాకులు మద్దులు దొబ్బేమదమే ప్రియమైతే
చేకొను మదము నాలో సేనాసేన ॥ ఎందు ॥

మఱి శిశుపాలునిపై మచ్చరమే ప్రియమైతే
మెఱయుమత్సర మిదే మించీ నాలో
తఱి శ్రీవేంకటపతి దాసులపై మోహము
నెఱి నీకుఁ బ్రియమైతే నేనేకానా ॥ ఎందు ॥ 448

శంకరాభరణం

కావవచ్చె విందులోనే కారుణ్యనరసింహా
తానకమై నీకంటె దాస్యమే పో ఘనము ॥ పల్లవి ॥

యెనసి ప్రహ్లాదుఁడు యెక్కడఁ జూపునోయని
వనిచి లోకమెల్ల నరసింహగర్భములై
పనిపూని వుంటి వటు భక్తపరతంత్రుఁడవై
తనిసి నీ వధికమో దాసులే యధికమో ॥ కావ ॥

మక్కువ బ్రహ్మేంద్రులు మానుపరాని కోపము
ఇక్కువై ప్రహ్లాదుఁడు యెదుట నిలిచితేను
తక్కక మాపితి వట్టే దాసునియాధీనమై
విక్కి నీకింకరుఁడే నీకంటే బలువుఁడు ॥ కాన ॥

అరసి కమ్మర ప్రహ్లాదవరదుఁడని
పేరువెట్టుకొంటి విట్టే బెరసి శ్రీవేంకటేశ
సారె నీశరణాగతజనులకాధీనమైతి-
వీరీతి నీదాసునికే యిదివో మొక్కము ॥ కాన ॥ 449

రేకు 189 ధన్నాసి

అటుగాన మోసపోక హరి నీకే అన్నియును
ఘటియించుటే యెక్కుడు కమలారమణ ॥ పల్లవి ॥

విన్నుఁ జూడనికన్నులు నీచువలకన్నులు
చిన్ని నీకథవిననిచెవులు రాట్నపుఁజెవులు
వున్నతి నీకడకు రాకున్నకాళ్లు మరగాళ్లు
సన్నుతిసేయనిజిహ్వ సరి మసజిహ్వ ॥ అటు ॥

చేరి నిన్నుఁ బూజించనిచేయి దంతెనపుఁజేయి
తారి నీకు మొక్కనట్టితలయే పెడతల
సారె నీముద్రలేనిభుజములు బుద్బుదములు
తేరి నీదాస్యములేనిదేహము సందేహము ॥ అటు ॥

వనమాలలున్నగ్రీవము కంబుగ్రీవము
ఘన మిది దెలియుటే కైవల్యము
యెనయ శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
అనుమానమెల్లఁ బాసె నన్నిటా నాకును ॥ అటు ॥ 450

### సామంతం

అందుకుఁ గాదు నేఁ గొల్చు టామీఁదిపని కింతే
ఇందు నందు నీవే కర్త యిందిరారమణ ॥ పల్లవి ॥

ఇంచుకంత వేలఁ గొండ యెత్తినదేవుఁడవు
ముంచి నాసంసారభారము మోవలేవా
అంచల దేవతలకు నమృతమిచ్చిననీవు
కంచాన నన్నము వెట్టి కాచుట నన్నెంత ॥ అందు ॥

వడి ద్రౌపది ౧ కక్షయవలువలిచ్చిననీవు
బెడఁగునాకుఁ గట్న (ట్టవి?) చ్చి పెంచు టెంత
జడిసి యింద్రాదులకు సంపదిచ్చినట్టినీవు
కడు నాకు నైహికభోగము లిచ్చు టెంత ॥ అందు ॥

పొసఁగ లోకములెల్లఁ బుట్టించఁడవైననీవు
వుసురై నాలోన (నే?) నీవు వుండు టెంత
వసుధ శ్రీవేంకటేశ వరములిచ్చేనీకు
దెస నాకోరికెలెల్లాఁ దీర్చు టెంత ॥ అందు ॥ 451

### గుజ్జరి

అందాఁకాఁ దాఁ దానే అంత కెక్కుడు గాఁడు
ముందు వెన కెంచేనా ముఖ్యుఁడే యతఁడు ॥ పల్లవి ॥

చిత్త మంతర్ముఖము సేసుకొననేర్చినా
అత్తల నతఁడు యోగియనఁబడును
సత్తసత్తనెడిసువిచారంబు గలిగెనా
వుత్తమవివేకియని వూహింపఁబడును ॥ అందాఁ ॥

---

౧. 'అక్షయవలువలు' సమాసదోషము. ఈ పాటచిల్లర సామాసికదోషములకు ఈ వాఙ్మయమున పట్టింపులేదు.

భావము సభావమును పరికించి తెలిసెనా
కైవల్యనిలయుఁడని కానఁబడును
దైవంబుఁ దన్నుఁ మతిఁ దలపోయనేర్చెనా
జీవన్ముక్తుఁడని చెప్పఁబడు నతఁడు. ॥ అందాఁ ॥

అదరి వైరాగ్యధన మార్జించనోపెనా
దిదువై జింతేంద్రియస్థిరుఁ డాతఁడు
జడియు(శ్రీ)వేంకటేశ్వరుదాసుఁ డాయనా
బడిబడిఁ దుదఁ బర(బహ్మ)మే యతఁడు. ॥ అందాఁ ॥ 452

మలహరి

పరమపురుష హరి పరమ పరాత్పర
పరరిపుభంజన పరిపూర్ణ నమో. ॥ పల్లవి ॥

కమలాపతి కమలనాథ కమలాసనవంద్య
కమలహితానంతకోటిఘనసముదయతేజా
కమలామలపత్రనేత్ర కమలవైరివర్ణగాత్ర
౧ కమలషట్క-యోగీశ్వరహృదయం తే హం నమోనమో(?) ॥పర॥

జలవిధిమథన జలనిధిబంధన జలధిమధ్యశయనా
౨ జలధియంతరవిహార మచ్ఛకచ్ఛపయవతారా (?)
జలనిధిజామాత జలనిధిశోషణ జలనిధిసప్తకగమన
జలనిధికారుణ్య నమో తేహం జలనిధిగంభీర నమో నమో ॥ పర ॥.

౧. 'కమలషట్క-యోగీశ్వర హృదయం నమో నమో తేహం నమో నమో.' అని రేకు. తర్వాతి చరణములను చూచి పూర్వపరిష్కర్తలు పై విధముగ సవరించిరేమో. 'కమలషట్క ......హృదయ' అని వుండవచ్చునేమో. 'హృదయం' పాఠములో అర్థము అంత సంగతముకాదు. ౨. జలధియంతర........తారా=జలధిలో సంచరించు చేప తాబేటి యవతారములవాడా ? అని అర్థము కావచ్చు. ఈ పాటలో కొన్నిసంధులు కొన్నిపదముల అర్థములు సుగమములు సాధువులు కావు.

నగధర నగరిపునందిత నగచరయూథపనాథా
నగపారిజాతహర సారసపన్నగపతిరాజశయన (?)
నగకులవిజయ శ్రీవేంకటనగనాయక భక్తవిధేయా
నగధీరా హం తే సర్వేశ్వర నారాయణ నమో నమో ॥ పర ॥ 453

పాడి

అట్టయితే నాయంతర్యామివేలైతివయ్యా
మట్టుమీఱి ముక్తియాస మాననటవయ్యా ॥ పల్లవి ॥

పొలఁతులు లేరా భూమి భోగించే నే లేనా
కలకాల మింద్రియాలకాణాచి లేదా
తొలి యీసంసారము లేదో నాకాంక్షలు లేవో
యెలమి నిన్నుఁ గొలుచు టెందుకటవయ్యా ॥ అట్ట ॥

ధరలోఁ బసిఁడి లేదా తగిలి నాయాస లేదా
సిరులయజ్ఞానపుచీఁకటి లేదా
అరయఁ జవులు లేవా అందుకో నాలికె లేదా
యిరవై నిన్నుఁ గొలుచు టెందుకటవయ్యా ॥ అట్ట ॥

అట్టే సర్వాపరాధి నపరాధా లెంచనేల
గట్టిరాళ్లలో మలిగండ్లేరనేల
నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁ ౧ జూచి కావకుంటే
ఇట్టే నిన్నుఁ గొలుచు టెందుకటవయ్యా ॥ అట్ట ॥ 454

౧. 'చూచి=చూచియును' కావచ్చు.

బౌళి

మరిగితి నేమి సేతు మగిడి నే నెందు వోదు
సరుస దైవమ నీకే శరణుచొచ్చేను ॥ పల్లవి ॥

తల్లి గోపించి మొత్తినఁ దనయుఁడు తల్లికొంగే
యెల్లగాఁ బట్టి పెనఁగి యేడిచినట్టు
వెల్లవిరై హరి నీవు విషయాలఁ జిక్కించితే
ఇల్లిదే నిన్నుఁ దలఁచి ఇటు దూరే నేను ॥ మరి ॥

కన్నతండ్రి బాలునిఁ జంకంబెట్టి దించితేను
౧కొన్నేసి పిలుచు ముద్దుగునిసినట్టు (?)
వున్నతి నాలోనుండి వూరకే మాయ నాపై
బన్నితే నిన్నే పొలసి పగటులాడేను ॥ మరి ॥

దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే
భావించి చేపట్టితే నీ బంట నే వింతే
శ్రీవేంకటేశ నీవు చేకొని రక్షించఁగాను
జీవుఁడనయిననేను చెలఁగి మొక్కేను ॥ మరి ॥ 455

రేకు 190 లలిత

ఎట్టు వలసినఁ జేయు మిన్నియు నీచిత్తమె
౨నెట్టన(నె?) నొకఁడనా నీవే యింతాను ॥ పల్లవి ॥

వేవేలు నీకు విన్నవించేదేమి, తొల్లే
సావధానముగ సర్వసాక్షివి నీవు
అవల నా కిటుసేయుమని చెప్పేదేమి నేమ
దైవికమైనట్టిస్వతంత్రుఁడవు నీవు ॥ ఎట్టు ॥

---

౧. 'కొన్నేసి=కొన్నిసార్లు' పిలుచు కావచ్చునేమో? ౨. 'నెట్టన(నే) నొకఁడనా నీవే యింతాను' అని కావచ్చు. 'నానీవే=నాలోని నీవే' అని వుండవచ్చు.

తగిలి నిన్ను నాలో ధ్యానించేదేమి, తొల్లె
జగతి నీవు పూర్ణుడై తన్ముఁడవు
జిగి నీనామము నోరఁ జిక్కించి నుడిగేదేమి
మగుడి శబ్దాక్షరమంత్రరూపుఁడవు ॥ ఎట్టు ॥

చేవమీర నిరులఁ బూజించేదేమి నిన్ను
శ్రీవేంకటేశ నీవు శ్రీపతివి
దేవదేవ నిన్ను నీవే తేఁకువెల్లా నెంచుకొని
కావుము నీ వొక్కఁడవే కరుణానిధివి ॥ ఎట్టు ॥ 456

బౌళి

ఈతనిమూలమెపో యిలఁగలధనములు
యీతఁడు మాకు గలఁడు యెంత లేదు ధనము ॥ పల్లవి ॥

విరతి మాధనము, విజ్ఞానమే ధనము
మరిగినతత్వమే మాధనము
పరము మాధనము, భక్తే మాధనము మా-
కరిరాజవరదుఁడే కైవల్యధనము ॥ ఈత ॥

శాంతమే మాధనము, సంకీర్తనే ధనము
యెంతైనా విశ్రాంతమే ఇహధనము
అంతరాత్మే మాధనము, హరిదాస్యమే ధనము
యింతటా లక్ష్మీకాంతుఁ డింటిమూలధనము ॥ ఈత ॥

ఆనందమే ధనము, ఆచార్యుఁడే ధనము
నానాటఁ బరిపూర్ణమే ధనము
ధ్యానమే మాధనము, దయే మాధనము
పావనశ్రీవేంకటాద్రిపతియే మాధనము ॥ ఈత ॥ 457

### భపుళి

నీమాయ కల్లగాదు నిజము దెలియరాదు
కామించి హరి నీ వొక్కఁడవే నిజము ॥ పల్లవి ॥

వచ్చేటి దొకమాయ వరిఁ బుట్టేదొకమాయ
మచ్చుమేపులవిరులు మాయలో మాయ
వచ్చేటి దొకమాయ వచ్చిపొయ్యే దొకమాయ
కచ్చుపెట్టి హరి నీ వొక్కఁడవే నిజము ॥ నీమా ॥

పొద్దువొడచేది మాయ పొద్దుగుంకే దొకమాయ
నిద్దురయు మేల్కనేది నిండుమాయ
వొద్దనే సుఖము మాయ వొగి దుఃఖ మొకమాయ
గద్దరిశ్రీహరి నీ వొక్కఁడవే నిజము ॥ నీమా ॥

కూడేటి దొకమాయ కూడి పాసే దొకమాయ
యేద నేర్చితి శ్రీవేంకటేశుఁడ నీవు
వేడుక నీశరణంటి విడిపించు మీమాయ
వోడక వెదకితి నీ వొక్కఁడవే నిజము ॥ నీమా ॥ 458

### దేసాళం

తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురతవిన్నాణరాయ సుగుణకోనేటిరాయ ॥ పల్లవి ॥

సిరులసింగారరాయ చెలువపుతిమ్మరాయ
సరసవైభవరాయ సకలవినోదరాయ
వరవసంతములరాయ వవితలవిటరాయ
గురుతైన ౧ తేగరాయ కొండలకోనేటిరాయ. ॥ తిరు ॥

---

౧. 'తేగరాయ = త్యాగముగలరాజు' కావచ్చు.

గొల్లెతలవుద్దండరాయ గోపాల [1]కృష్ణరాయ
చల్లువేదజాణరాయ చల్లఁబరిమళరాయ
చెల్లుబడిధర్మరాయ చెప్పరావివలరాయ
కొల్లలై నభోగరాయ కొండలకోనేటిరాయ ॥ తిరు ॥

సామసంగీతరాయ సర్వమోహనరాయ
ధామవైకుంఠరాయ దైత్యవిభాళరాయ
కామించి విన్నుఁ గోరితే గరుణించితివి నన్ను
శ్రీమంతుఁడ నీకు జయ శ్రీవేంకటరాయ. ॥ తిరు ॥ 459

తవుళ

అన్నిటా శాంతుఁడైతే హరిదాసుఁడు దానే
సన్నుతిఁ దానేపో సర్వదేవమయుఁడు. ॥ పల్లవి ॥

అత్తల మనసు యింద్రియాధీనమైతేను
చిత్తజుఁడనెడివాఁడు జీవుఁడు దానే
కొత్తగాఁ దనమననే కోపాన కాధీనమైతే
తత్తరపురుద్రుఁడునుఁ దానే తానే ॥ అన్ని ॥

భావము వుద్యోగములప్రపంచాధీనమైతే
జీవుఁడు బ్రహ్మాంశమై చెలఁగుఁ దానే
కావిరి రేయిఁబగలు కన్నుల కాధీనమైతే
ఆవలఁ జంద్రసూర్యాత్మకుఁడుదానే ॥ అన్ని ॥

కోరికఁ దన్నెబదుకు గురువాక్యాధీనమైతే
మోరతోపులేనినిత్యముక్తుఁడు దానే
ఆరయ శ్రీవేంకటేశుఁ డాతుమఅధీనమైతే
ధారుణిలో దివ్యయోగి తానే తానే ॥ అన్ని ॥ 460

1. 'క్రిష్ణ' రేకు.

సాళంగనాట

ఇహమెట్టో పరమెట్టో ఇఁక నాకు
సహజమై హరియే శరణము నాకు ॥ పల్లవి ॥

చిత్తమిది యొకటే చింత వేవేలసంఖ్య
హొత్తుల హరిఁదలఁచఁ బొద్దులేదు
జొత్తుల కన్నులు రెండు చూపులైతే వనంతాలు
తత్తరించి హరిరూపు దగ్గరి చూడలేదు ॥ ఇహ ॥

చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష
యీతల హరిఁబూజించ విచ్చ లేదు
జాతి నాలిక వొకటే చవులు కోటానఁగోటి
రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు ॥ ఇహ ॥

వీను లివి రెండే వినికి కొలఁదిలేదు
పూని హరిభక్తి విన బుద్ధి లేదు
యీనటన శ్రీవేంకటేశుఁ డిటు చూచినను
తానే యేలె నిఁకఁ దడఁబాటు లేదు ॥ ఇహ ॥ 461

రేకు 191 రామక్రియ

వినవమ్మ జానకి నీవిభుఁ డింత సేసినాఁడు
యెనసి యీరఘురాముఁ డిఁక నేమి సేసునో ॥ పల్లవి ॥

వానరులదండు గూడి వారిధి కొండలఁ గట్టె
అవి లంక చుట్టిరా నదే విడిసె
కోనలఁ ద్రికూటమెక్కె గొడగు లన్నియుఁ జెక్కె
యేనెపాన రఘురాముఁ డిఁక నేమిసేసునో ॥ విన ॥

కోరి ఇంద్రజిత్తుఁ జంపె కుంభకర్ణు నిర్జించె
ఘోరదానవులనెల్ల కూలఁగుమ్మెను
మారణహోమము సేసె మతకమింతాఁ జెరిచె
యీరసాన రఘురాముఁ డిఁక నేమిసేసునో ॥ విన ॥

లావున రావణుఁ జంపె లంక విభీషణు కిచ్చె
చేవల నోసీత విన్నుఁ జేకొనెను
భావించి శ్రీవేంకటాద్రిఁ బట్టము దాఁ గట్టుకొనె
యీవలనావల నాతఁ డిఁక నేమిసేసునో ॥ విన ॥ 462

శ్రీరాగం

ఇంతటా హరిసేకాని యెందునను గాన నన్ను
కొంత నాకుఁ దెలుపరో గురువులాల ॥ పల్లవి ॥

తనువూ హరియే తలఁపూ హరియే
వివికి మనికియును విష్ణుఁడే
కనుఁగొనుచూపులు కమలనాథుఁడే
యెనసి జీవునిశక్తి యేడనేడ నున్నదో ॥ ఇంత ॥

లోకమెల్ల మాధవుఁడే లోనెల్లఁ గేశవుఁడే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నేననువాఁడ నేడ నుండువాఁడనో ॥ ఇంత ॥

వెనకను కృష్ణుఁడే వెస ముం దచ్యుతుఁడే
కొనమొదలు నడుము గోవిందుఁడే
యెనయఁగ శ్రీవేంకటేశుమయ మింతాను
అనుగునాస్వతంత్ర మది యేడనున్నదో ॥ ఇంత ॥ 463

లలిత

కలిగె మాకు విది కైవల్యం
కలకాలము హరికథాశ్రవణం ॥ పల్లవి ॥

అచింత్య మద్భుత మానందం
ప్రచురం దివ్యం పావనం
సుచరిత్రం శ్రుతిశోభితం
అచలం బిదివో హరికీర్తనం ॥ కలి ॥

నిరతం నిత్యం నిఖిలశుభకరం
౧ దురితం హర భవదూరం
పరమమంగళం భావాతీతం
కరివరదం నిజకైంకర్యం. ॥ కలి ॥

సులభం సుకరం శోకనాశనం
ఫలదం లలితం భయహరణం
కలితం శ్రీవేంకటపతిశరణం
౨ జలజోదరనిచ్చ స్తోత్రం. ॥ కలి ॥ 464

బౌళి

ఎఱుఁగుటకంటె నెఱుఁగమే మేలు
మఱి తెలివికంటె మఱపే శుభము ॥ పల్లవి ॥

లంపటా లెఱుఁగము లవలవ లెఱుఁగము
పంపులబాల్యమే పరిణామము
యింపులు నెఱుఁగము యెగ్గులు నెఱుఁగము
జంపులనిదురే ౩ సకలసౌఖ్యము ॥ ఎఱు ॥

---

౧. 'దురితంహర' అనునది 'దురితహరం' కావచ్చు. 'దురిత(హరం?)ం హర భవదూరం' పూ. ము. పా. దీనిలో ఒక హర ఎక్కువ ప్రామాదికమై యుండవచ్చు. ౨. 'జలజోదరనిత్యస్తోత్రం' కావచ్చు. ౩. 'సకల' రేకు.

ఆస లివెఱఁగము అలమట లెఱఁగము
మూసినగర్భమే మును సుఖము
వాసులునెఱఁగము వంతులు నెఱఁగము
వేసట పుట్టనివిధమే సుఖము ॥ ఎఱు ॥

పాపము లెఱఁగము బంధము లెఱఁగము
శ్రీపతిదాస్యమే శేఖరము
యేపున శ్రీవేంకటేశ్వరుశరణమే
తీపులుమఱపేటిదివ్యానందము ॥ ఎఱు ॥ 465

లలిత

కలిగె విదె నాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకవిది ॥ పల్లవి ॥

జయ పురుషోత్తమ జయ పీతాంబర
జయ జయ కరుణాజలనిధి
దయ యెఱంగ నే ధర్మము నెఱఁగ నా-
క్రియ యిది నీదివ్యకీర్తనమే ॥ కలి ॥

శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీజనార్దన
పరమ మెఱంగను భక్తి యెఱంగను
విరతము నాగతి నీదాస్యమే ॥ కలి ॥

నమో నారాయణ నమో లక్ష్మీపతి
౧ నమో పుండరీకనయనా
అమిత శ్రీవేంకటాధిప యిదె నా
క్రమమెల్లను ౨ నీకయింకర్యమే ॥ కలి ॥ 466

౧. 'నమః' కావచ్చు. ౨. కయింకర్యమే' వ్రాయసకానివ్యుత్పత్తికావచ్చు.

శంకరాభరణం

హరియు నొక్కఁడే గురి ఆత్మలో నొక్కఁడే గురి
విరివి నెంత చదివినా వేరు గాఁబొయ్యీనా ॥ పల్లవి ॥

అందరిచూపులు నొక్కపైనందుకు గురి
యెందూఁ గొండ కొండేకాక యితరముగాఁ జూచేరా
అందరిరుచులు నొక్క పైనందుకు గురి
చెంది తీపు తీపే కాక చేఁదుగాఁ జేకొనేరా ॥ హరి ॥

వొప్పుగా నందరివూర్పు లొక్కపైనందుకు గురి
కప్పుర మదేకాక కస్తూరిగా మూఁకొనేరా
యెప్పుడూ నిందరివివి కేకమైనందుకు గురి
తిప్పి తిట్టు తిట్టేకాక దీవెనగా వినేరా ॥ హరి ॥

యీరీతి విందరిచిత్త మేకమైనందుకు గురి
మేరతో సూర్యోదయము మించి రేతి రయ్యీనా
తేరి శ్రీవేంకటపతి దేవుఁడై నందుకు గురి
కోరినవారివరాలే కొంగుపైఁడిగాదా ॥ హరి ॥ 467

రేకు 192 బౌళి

విరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే
విరతి నాకొరకే పో నిను సేవించేది ॥ పల్లవి ॥

ముందు సిరులిత్తువని మోక్షము నీ విత్తువని
బందుకట్టుదుదుఃఖములఁ బాపుదువని
యిందలియాసలనేపో యేచిన నాభయభక్తి
యెందును నావల్ల నీకు నించుకంతా లేదు ॥ విరు ॥

జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి
వెవకటినీకథలు వివివిని
వినుపై యీయాసనేవో విన్ను సారెఁ బొగడేది
వానర నీయాసేవో వుపకారగురువు ॥ విరు ॥

లోకులు గొలువఁగాను లోన నీవు వుండఁగాను
దీకొవి గురుఁడు బోధించఁగాను
కైకొవి శ్రీవేంకటేశ కరుణించగా నీవు
దాకొవి యీయాసకే నీదాసినై కొలిచితి ॥ విరు ॥ 468

సాళంగం

నానాభక్తు లివి నరులమార్గములు
యేనెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి ॥ పల్లవి ॥

హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి వొక్కటే ఆనందభక్తి ॥ నానా ॥

అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతనిదాసులసేవే అదియే తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే ౧గతవి వుండు టదివైరాగ్యభక్తి ॥ నానా ॥

అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశుకైంకర్యమే సేసి
తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి ॥ నానా ॥ 469

---

౧. 'గతవి' రేకు. గతి+అవి. ఈసంధుల కొకొల్లలు.

సాళంగనాట

కంటిరా వింటిరా కమలనాథునిశక్తి
వొంటి నితనిశరణ మొకటే వుపాయము ॥ పల్లవి ॥

యీతనినాభిఁ బొడమె యెక్కువై నబ్రహ్మయు
యీతఁడే రక్షించినాఁడు యింద్రాదుల
యీతఁ డాకుమీఁదఁ దేలె నేకార్ణవమునాఁడు
యీతఁడే పో హరి మనకిందరికి దైవము ॥ కంటి ॥

యీతఁడే యసురబాధ లిన్నియుఁ బరిహరించె-
నీతనిమూఁడడుగులే యీలోకాలు
యీతఁడే మూలమంటే నేతెంచి కరిఁ గాచె
నీతనికంటే వేల్పు లిఁక మరి కలరా ॥ కంటి ॥

యీతఁడే వైకుంఠనాథుఁ డీతఁడే రమానాథుఁ-
డీతఁడే వేదోక్తదైవ మిన్నిటాఁ దానె
యీతఁడే [౧] అంతర్యామి యీ చరాచరములకు
నీతఁడే శ్రీవేంకటేశుఁ డిహపరధనము ॥ కంటి ॥ 470

సామంతం

సింగారమూరితివి చిత్తజగురుఁడవు
సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా ॥ పల్లవి ॥

పూవులతెప్పలమీఁద పొలఁతులు నీవు నెక్కి-
పూవు లాకసము మోవఁ బూఁచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధానమగు నీకు సాసముఖా ॥ సింగా ॥

౧. 'అంతరియామి' రేకు.

అంగరంగవైభవాల నమరకామినులాడ
 వింగినుండి దేవతలు విన్నుఁ జూడఁగా
 సంగీతతాళవాద్యచతురతలు మెరయ
 సంగడిఁ దేలేటిమీకు సొసముఖా ॥ సింగా ॥

పరగఁ గోనేటిలోన పసిఁడి మేడనుండి
 అరిది నిందిరయు నీవారగించి
 గరిమ శ్రీవేంకటేశ కమ్మలపండువగాఁగ
 పరవి నోలాడుమీకు సొసముఖా ॥ సింగా ॥ 471

శంకరాభరణం

పట్టలేనిమనభ్రమ గాక
 నెట్టనఁ దాఁ గరుణించవివాఁడా ॥ పల్లవి ॥

హితప్రవర్తకుఁ డీశ్వరుఁడు
 తతి నంతరాత్మ తాఁగాన
 రతి నాతని దూరఁగనేలా
 గతియని తలఁచిన కావనివాఁడా ॥ పట్ట ॥

తెగనిబంధువుఁడు దేవుఁడు
 బగివాయఁ డిహముఁ బరమునను
 అగపడి సందేహములేలా
 తగ నమ్మిన దయదలఁచనివాఁడా ॥ పట్ట ॥

హృదయము శ్రీవేంకటేశ్వరుఁడు
 మొదలనే ఆనందమూర్తిగన
 కదిసి వెలిని వెదకఁగనేలా
 యెదురఁ గనిన వరమియ్యనివాఁడా ॥ పట్ట ॥ 472

గుండక్రియ

తానే తెలియుఁగాక తలఁచఁగ నెట్టువచ్చు
నానాగతుల తననాటకపుమాయ ॥ పల్లవి ॥

అట్టె ౧యేఁబదియైనయక్షరాలలోనట
తిట్టులట వొకకొన్ని దీవెనలటా
మట్టుతో వేదములట మంత్రములట కొన్ని
యిట్టివి చిక్కులు భూమి నిఁకనెన్ని గలవో ॥ తానే ॥

కదిసిన యఱువదిగడియలలోనట
పొదలు నడకలట భోగములటా
విదురట వొకకొంత నేరుపులు కొన్నియట
యెదుట చూడఁగఁ జూడ నిఁక నెన్ని గలవో ॥ తానే ॥

రేవగలు కన్నులివి రెంటిలోనేయట
దైవము జీవులలోనే తానకమట
శ్రీవేంకటాద్రిమీఁద ౨తెలఁగి యా (గెనా?) తఁడే యట
యేవంక నీచేఁతలు యిఁక నెన్నిగలవో ॥ తానే ॥ 473

రేకు 193

దేసాళం

ఇంతటఁ టో కానవచ్చు నెక్కువ తక్కువలెల్ల
దొంతి ఇంద్రియాలకెల్లఁ దొలఁగి వుండేను ॥ పల్లవి ॥

మాటలాడవచ్చుఁగాని మనసులు పట్టరాదు
చాటువకెక్కినయట్టిసతులఁ గండే
కోటి చదువఁగవచ్చు కోపము నిలుపరాదు
జూటరై వొకఁడు దన్ను సోఁకనాడితేను ॥ ఇంత ॥

౧. 'యాఁబది' రేకు ౨. 'తెంగి' కావచ్చు. ద్రుతములపై యడాగమము ఈ వాఙ్మయమున వింతగాదు.

అందరి దూషించవచ్చు నాసలు మానఁగరాదు
కందువైనమించులబంగారు గంటే
అందాల మొక్కఁగవచ్చు హరిభక్తి సేయరాదు
పొందులసంసారపుభోగము గంటేను ॥ ఇంత ॥

మొదలఁ బుట్టఁగవచ్చు మోక్షముఁ బొందఁగరాదు
పొదిగి పుణ్యరాసులభోగము గంటే
యెదుట శ్రీవేంకటేశ ఇదివో నీశరణంటే
కదిసితి విట్టె వో నీకరుణ గంటేను ॥ ఇంత ॥ 474

లలిత

అంతర్యామీ అలసితి సొలసితి
ఇంతట నీశరణిదే చొచ్చితిని ॥ పల్లవి ॥

కోరినకోర్కులు కోయనికట్లు
తీరవు నీవవి తెంచకా
భారపుఁబగ్గాలు పాపపుణ్యములు
నేరుపులఁ బోవు నీవు వద్దనకా ॥ అంత ॥

జనులసంగములఁ జక్కరోగములు
విను విడువవు నీవు విడిపించకా
వినయపుదైన్యము విడువనికర్మము
చనదది నీవిటు ౧ సంతపరచకా ॥ అంత ॥

మదిలో చింతలు మయిలలు మణఁగులు
వదలవు నీవవి వద్దనకా
యెదుటనె శ్రీవేంకటేశ్వర నీ వదె
అదనఁ గాచితివి అట్టిట్టనకా ॥ అంత ॥ 475

౧. సంతపరచు = 'శాంతపరచు' కావచ్చు.

మలహరి

మగఁడు విడిచినా మామ విడువనియట్టు
నెగడిన వేమిసేయు నేనే రోయఁగాని ॥పల్లవి॥

నరకము నను రోసి పరలోకాన విడిచె
నిరయాయుతోన రోసి నేనే విడువఁగాని
పరగ యోనులు రోసి బట్టబాయిట వేసె
సొరిది యోనుల రోసి చొరక నే మానఁగాని ॥మగఁ॥

పాపము రోసి నన్ను బ్రపంచాన విడిచె
పాపము సేయక రోసి పట్టకుండఁగాని నేను
యేపున దేహము రోసి యింద్రలోకాన విడిచె
కైపుసేసి రోయక నేఁ గాయము మోచితిఁగాని ॥మగఁ॥

మాయలెల్ల నన్ను రోసి మనసులోన విడిచె
మాయల నే విడువక మగుడఁ దగిలేఁగాని
౧నాయల(?) నేమి విడిచినాను శ్రీవేంకటేశ
పాయక నన్నేలితి నీభాగ్యము విడువఁగాని ॥మగఁ॥ 476

ధన్నాసి

ఒక్క మనసున నే నుండేఁగాక
యెక్కడిపనులు దానే యెఱఁగఁడా ॥పల్లవి॥

బలుదేహ మిచ్చినవాఁడు ప్రాణము వోసినవాఁడు
తలఁపొసగినవాఁడు దైవమేకాఁడా
వెలుపలిలంపటాలు వేవేలు గడించి తాను
మలసి యింతలో నన్ను మఱచీనా. ॥ఒక్క॥

౧. 'నాయాల' కావచ్చునేమో.

జగము లేలేటివాఁడు సంసారిఁ జేసినవాఁడు
తగులై యుండినవాఁడు తానే కాఁడా
బెగడకుండ దినాలు పెరుగఁజేసేటివాఁడు
నగిట్టు నడపించఁ దా నేరఁడా. ॥ ఒక్క ॥

మొదలై యుండేటివాఁడు ముందరఁ దుదయ్యేవాఁడు
యెదలోవాఁడు శ్రీవేంకటేశుఁడే కాఁడా
చదివించి బుద్ధులిచ్చి చైతన్యమైనవాఁడు
పొదిగి నాదాపుదండై భోగించఁడా ॥ ఒక్క ॥ 477

సాళంగనాట

దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించ వింతటిలో భూభారమెల్ల నణఁగె ॥ పల్లవి ॥

నేఁడు కృష్ణుఁడు జనించె నేఁడే శ్రీజయంతి
నేఁడే రేపల్లెలోన నెలవైనాఁడు
పేఁడుక యశోదకు బిడ్డఁడైనాఁ డిదె నేఁడే
పోఁడిమి జాతకర్మ మొప్పుగ నాయ నేఁడు ॥ దేవ ॥

ఇప్పు డిదె గోవుల నిచ్చెను పుత్రోత్సవము
ఇప్పుడు తొట్టెల నిడి రింతులెల్లాను
చెప్పరాని లలిల సేయఁగలదెల్లాఁ జేసి
కప్పెను విష్ణుమాయలు గక్కన నేఁ డిపుడు ॥ దేవ ॥

ఇదివో వసుదేవుపిఇంటిచెరలెల్లఁ బాసె
ఇదివో దేవకితప మిట్టె ఫలించె
చెదరక తా నిలిచె శ్రీవేంకటాద్రిపై నిదె
మొద నలమేల్మంగ యెక్కివున్న దిదివో ॥ దేవ ॥ 478

బౌళి

హితవే సేసుఁగా కాతఁడేల మానును
మితి నాతని దూరక మెచ్చవలెఁగాక ॥ పల్లవి ॥

ఆగమభోగములకు హరి నాలో నున్నవాఁడు
వేగదీర నాకు మేలే చింతించుఁగాక
సాగినప్రపంచములో సంహారిఁ జేసినవాఁడు
యేగతి రక్షించఁ దానే ఇన్నిటి కౌఁగాక ॥ హిత ॥

భూమిమీఁద దేహమిచ్చి పుట్టించినట్టివాఁడు
ప్రేమతో నన్నపానాలు పెట్టుఁగాక
ఆమని పంచేంద్రియాల నటు పెదరేఁచేవాఁడు
నేమపుఁబుత్రదాంతై విందుకుండుఁగాక ॥ హిత ॥

ఇహపరములకుఁ దా నిరవైనట్టివాఁడు
సహజాన నన్నియును జరపుఁగాక
వహి శ్రీవేంకటాద్రిపై వరములిచ్చేటివాఁడు
మహిమతో మమ్మునేలి మన్నించుఁగాక ॥ హిత ॥ 479

రేకు 194 కన్నడగౌళ

ఎవ్వర నేమనఁగల నెంతబలువుఁడ నేను
నవ్వుచు నీవే యిఁక నన్ను మన్నించవయ్యా ॥ పల్లవి ॥

కామక్రోధములకు కాణాచికాఁపను
ఆమనియింద్రియముల కడిబంటను
దీమసపుటాసలకు తీరని [1]లగ్గస్థుఁడను(?)
యీ మరఁగువాఁడ నిన్ను నెట్టు గొలిచేనయ్యా ॥ ఎవ్వ ॥

---

౧. లగ్గస్థుఁడను = లగ్నస్థుఁడను, తగులుకొన్నవాఁడను (స్వాధీనమైనవాఁడను) అని తాత్పర్యము కావచ్చు; నమ్మకస్థుఁడు అనుమానస్థుఁడు ఇత్యాదులవలె కావచ్చు.

పాయనిసంసారానకు [1] బడివనివాఁడను
కాయపుభోగాల పూఁడిగపువాఁడను
పాయపుమదములకు [2] సంగెమైనవాఁడను (?)
యీ యెడ నీవాఁడ నని యెట్టు గొలిచేనయ్యా ॥ ఎవ్వ ॥

సరిఁ గర్మములకెల్ల చనవరికొడుకను
పొరలేజన్మములయప్పులవాఁడను
అరయ శ్రీవేంకటేశ అంతలో వన్నెలిడివి
యిరవై ఇట్టుండకున్న నెట్టు గొలిచేనయ్యా ॥ ఎవ్వ ॥ 480

## దేసాక్షి

ఎఱఁగువా రెరుఁగుదు రీయర్థము
యెఱఁగనివారి కిది యెఱఁగనియ్యదు ॥ పల్లవి ॥

మొదలఁ గలుగువాఁడే ముందరనుఁ గలవాఁడు
ఆదన నాతఁడే పరమాత్ముఁడు
యెదుటఁ గలిగినదే ఇన్నిటాఁ గలిగినది
పదపడి యిదియే ప్రపంచము ॥ ఎఱఁ ॥

చెడనిదానికి మరి చేటెన్నఁడును లేదు
జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము
పుడివోఁగల దెన్నఁడు పుడివోఁ గలిగినదే
కడగడనే తిరుగు కర్మమార్గము ॥ ఎఱఁ ॥

యెంచి తొల్లి నడచేవే ఇపుడును నడచేవి
మంచి శ్రీవేంకటేశ్వరుమహిమ లివి
అంచ నిపుడు గానని వల్లనాఁడుఁ గాననివే
మంచువంటివిషయపుమాయావాదములు ॥ ఎఱఁ ॥ 481

---

౧. బడి+పనివాడను = ఈ సంధులీ వాఙ్మయమునకొల్లలు. వ్యాకరణసమ్మతములుకూడ.
[2]. సంగెమైనవాఁడను = లంగపడినవాఁడను, లోఁబడినవాఁడనని తాత్పర్యము కావచ్చు.

లలిత

కేశవ దాసినైతి గెలిచితి నన్నిటాను
యీ శరీరపునేరా లిఁకనేలా వెదక ॥ పల్లవి ॥

విచ్చలుఁ గోరికలియ్య నీనామమే చాలు
తెచ్చి పునీతుఁజేయ నీతీర్థమే చాలు
పచ్చిపాపా లణఁచ నీప్రసాదమే చాలు
యెచ్చుకొందువుపాయాలు ఇఁకనేల వెదక ॥ కేశ ॥

ఘనునిఁ జేయఁగను నీకైంకర్యమే చాలు
మొనసి రక్షించను నీముద్రలే చాలు
మనిపి కావఁగఁ దిరుమణిలాంఛనమే చాలు
యెనసెను దిక్కుదెన ఇఁకనేల వెదక ॥ కేశ ॥

నేఁ వైనసుఖమియ్య నీధ్యానమే చాలు
లదాపుదండకు నీయర్చనే చాలు
యిలపై శ్రీవేంకటేశ యిన్నిటా మాకుఁ గలవు
యెలమి నితరములు యిఁకనేల వెదక ॥ కేశ ॥ 482

దేసాళం

కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు
శ్రీవిభుఁడ నీవు మాకుఁ జిక్కేమర్మ మిదివో ॥ పల్లవి ॥

చేపట్టి నీశరను పూజించేఅహమికకంటే
నీపాదాలుపూజించేనేమ మెక్కుడు
మాపుదాఁకా విసుఁగొల్చి మందెమేళమౌకంటే
దాపగునీదాసుల శేషత్వ మెక్కుడు ॥ కైవ ॥

హరి నీప్రసాదజీవినై గర్వించుటకంటే
నరయ నీదాసులలెంకౌ టెక్కుడు
వెరవున నీచెవిలో విన్నపాలు వేయుకంటే
ధర నీవూడిగకాండ్లఁ దలఁపించు టెక్కుడు

జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే
అట్టె నీనామఫలమందు టెక్కుడు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందువంకనే
దిట్టపుమాగురునుపదేశ మెక్కుడు ॥ వైవ ॥ 483

శ్రీరాగం

నావల్ల నీ కేమున్నది నారాయణ నీవు నన్ను
కావించి రక్షించేవుపకార మింతేకాక ॥ పల్లవి ॥

సొమ్ము దినఁబుట్టినట్టిసోమరిబంటలికను
ఇమ్ముల నందుకుఁ బ్రతి యేమిసేసీని
చిమ్ముచు ౧ నాతఁడు నేమించినపనివాటలలో
వుమ్మడిఁ జేసేటివట్టివూడిగాలేకాక ॥ నావ ॥

ఆసపడి వచ్చినట్టిఅతిథి బలిరాజుకు
రాసినేసి యేమిచ్చిన రతికెక్కీని
బేసబెల్లితనమున బ్రియాన నిచ్చకమాడి
మూసి దైన్యపుఁజేతులమొక్కు లింతేకాక ॥ నావ ॥

శరణాగతుఁడ నీకెచ్చట శ్రీవేంకటేశుఁడ
దొరనై యేమిట సరిదూఁగఁగలను
ధరలోన నీవు దయదలఁచి నన్నేలుకోఁగా
పరగు నీమఱఁగున బదుకుదుఁగాక ॥ నావ ॥ 484

౧. 'నాతని' కావచ్చు.

రామక్రియ

అదె శిరశ్చక్రములేనట్టిదేవర లేదు
యిదె హరిముద్రాంకిత మిందే తెలియరో ॥పల్లవి॥

"అనాయుధాసో [1] అసురా అదేవా" యని
వినోదముగ [2] ఋగ్వేదము దెలిపెడి
సనాతనము విష్ణుచక్రధారణకును
అనాదిప్రమాణ మందే తెలియరో ॥అదె॥

[3] "యెచ్చ యింద్రే" యని "యచ్చ సూర్యే" యని
అచ్చుగ తుద కెక్కె(క్క?) పదే పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందునిముద్రాధారణకు
అచ్చమయినప్రమాణ మందే తెలియరో ॥అదె॥

మును "నేమినా [4] తప్త ముద్రాం ధారయే" త్తని
వెనువెంట శ్రుతి యదె వెల్లవిరిసేసీని
మొనసి శ్రీవేంకటేశుముద్రాధారణకు
అనువుగఁ బ్రమాణ మందే తెలియరో ॥అదె॥ 485

రేకు 195 పాడి

ఇట్టి బ్రాహ్మణ్య మెక్కుడు యిన్నిటిలోన
దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము ॥పల్లవి॥

హరిఁగొలిచేవారి కమరు బ్రాహ్మణ్యము
పరమవైష్ణవమే పో బ్రాహ్మణ్యము
హరిణోర్ధ్వపుండ్రదేహంలొ చే బ్రాహ్మణ్యము
తిరుమంత్రవిధులదే తేఁకువ బ్రాహ్మణ్యము ॥ఇట్టి॥

---

౧. 'అసురా' రేకు. ౨. 'ఋగ్గువేదము' రేకు. ౩. 'యచ్చ' కావలె
రేకున్న యతిభంగము. 'తప్తం ముద్రం ధారయ' రేకు.

సతమై చక్రాంకితులచరితే బ్రాహ్మణ్యము
పతిశరణాగతియే బ్రాహ్మణ్యము
వెతలేవి వీరలసాత్త్వికమే బ్రాహ్మణ్యము
తతి ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము ॥ ఇట్టి ॥

అంచఁ బరమభాగవతాధీనము బ్రాహ్మణ్యము
పంచసంస్కారాదులదే బ్రాహ్మణ్యము
యెంచఁగ శ్రీ వేంకటేశుఁ డిదె దేవుఁ డిబ్రాహ్మణ్యుఁడు
ముంచి యీతనివారౌటే మొదలిబ్రాహ్మణ్యము ఇట్టి ॥ 486

మాళవిగౌళ

వీదులవీదులనెల్లా విష్ణుఁడు సంచరించీని
పోదిమాని కన్నగత్తై పొంచుకో రసురలు ॥ పల్లవి ॥

తేరుమీఁద నెక్కి నేఁడు దేవోత్తముఁడు వాఁడె
సారమైన శంఖచక్ర[1] శార్ఙ్గాయుధము లవే
కారుకమ్మి నాకాసాన గరుడధ్వజం బదే
పారరో దానవులాల పంతములు విడిచి ॥ వీదు ॥

దండవెట్టె నల్లవాఁడే దైవాలరాయుఁడు
దండి నెట్టెపుఁజుట్లతపారపుచుంగు లవే
కొండవంటిరథ మదె కొన పైఁడికుండలవే
గుండుగూలి విరుగరో గొబ్బున దైతేయులు ॥ వీదు ॥

విజయశంఖము వట్టె వీఁడె శ్రీవేంకటేశుఁడు
భజన నలమేల్మంగ పలుమారు మెచ్చీ నదె
త్రిజగాన నాతనిఁ జేరినదాసు లిదె వీరె
గజబెజ లిఁక నుడుగరో రాక్షసులు ॥ వీదు ॥ 487

---

౧. 'శాజ్గా' రేకు.

లలిత

కామధేను విదే కల్పవృక్ష మిదే
ప్రామాణ్యముగల ప్రపన్నులకు ॥ పల్లవి ॥

హరినామజపమే ఆభరణంబులు
పరమాత్మవినుతి పరిమళము
ధరణీధరుపాదసేవే భోగము
పరమం బెరఁగిన ప్రపన్నులకు ॥ కామ ॥

దేవునిధ్యానము దివ్యాన్నంబులు
శ్రీవిభుభక్తే జీవనము
ఆవిష్ణుకైంకర్యమే సంసారము
పావనులగుయీ ప్రపన్నులకు ॥ కామ ॥

యేపున శ్రీవేంకటేశుఁడే సర్వము
దాపై యితనివందనమే విధి
కాపుగ శరణాగతులే చుట్టాలు
పైపయి గెలిచిన ప్రపన్నులకు ॥ కామ ॥ 488

మాళవిగౌళ

నీచిత్త మిందరినేరుపునేరమి
తోఁచి కాచి యిటు తుద కీడేర్చె ॥ పల్లవి ॥

దేవతలపాలు తీరనిపుణ్యము
ఆవలఁ బాపం బసురలది
భావింప మనుజులపాలివి రెండును
శ్రీవల్లభ నీసేసినమాయ ॥ నీచి ॥

వేదశాస్త్రములు విజ్ఞానమూలము
ఆది నసత్యము అజ్ఞానమూలము
సాదింప రెండును జగత్తుమూలము
భేదించి యివి నీపెరరేఁపణలు ॥ నీచి ॥

కావింపఁ గర్మము కాయముచేతిది
భావముచేతిది పరమము
తావుల రెండునుఁ దప్పనిప్రకృతివి
శ్రీవేంకటేశ్వర చేఁతలు నీవి ॥ నీచి ॥ 490

దేవగాంధారి

అర్థము చెప్పఁగరాదు అవుఁగాదనఁగరాదు
వొడ్డిన దనుభవించే దోపిక జీవులది ॥ పల్లవి ॥

యీరికలెత్తె జన్మము లిన్ని జంతువులయందు
కోరికలు గొనసాగెఁ గోటానఁగోటి
నారుకొనె సంపదలు నానారూపములై
తీరదేమిటా నీచిక్కు దేవుఁడు వెట్టినది ॥ అర్థ ॥

అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి
వెల్లవిరాయను మాయ వెనకా ముందు
కెల్లరేఁగె దేహమందే కిమ్ములచుట్టరికాలు
వొల్లవో దెన్నఁడు భూమి పుట్టఁగాఁ బుట్టినది ॥ అర్థ ॥

పండెను సంసారము [1]ఫలమైననానాఁటికి
నిండెను నాలికకు నెమ్మదిఁ జవులు
అండనే శ్రీవేంకటేశుఁ డంతర్యామై వుండి
[2]పంద వండనట్లుగ (?) వన్నెకెక్కించినది ॥ అర్థ ॥ 490

---

ఫలమై నానాఁటికి' కావచ్చు. 2. పూ.ము.పా. లోని ప్రశ్నార్థకము బోధపడలేదు.

శంకరాభరణం

ఎంత కెంత యిది యేమని పొగడుట
యింతసేయ నీకు నెదురా వీరు ॥ పల్లవి ॥

పిడుగులఁ బోలెడి పెనునీనఖముల-
కెదయక హిరణ్యుఁ డెట్లుండెనో
పుడికెటిచక్రాయుధము వేఁడికిని
జడియక మకరెటు సహించెనో ॥ ఎంత ॥

శరపరంపరల శిరములు నఱకఁగ
యెరగొని రావణుఁ డేమనెనో
పరియలు వారఁగ బ్రహ్మాండభాండము
ఉరుశంఖరవం బోర్చుట యెట్లో ॥ ఎంత ॥

గాఁటపువిష్ణురగదాహతికి మధు-
కైటభులతలలకత లెట్లో
యీటున శ్రీవేంకటేశ నీకృపను
పాటించి దాసులు బ్రదుకుట యెట్లో ॥ ఎంత ॥ 491

రేకు 196 దేవగాంధారి

నీయంత నీవే యెరిఁగి నిచ్చ నన్నుఁ గాతుగాక
మాయలలోఁ బొరలేవిమ్మరి వాఁడ నేను ॥ పల్లవి ॥

నీసరివాఁడనా నిన్ను దూరేవాఁడనా
దాసుఁడనై కొలిచిన తనుధారిని
వేసరించ నోపుదునా వెరపించఁగలనా
మాసినపాపాలలోని మైల సోఁకినాఁడను ॥ నీయ ॥

విన్నవించేవాఁడనా వీడుకోలువాఁడనా
అన్నిటా శరణుచొచ్చినట్టిజీవిని
యెన్నిటి కుత్తరమిచ్చే యేపవి పేసి మెప్పించే
మున్నిటికర్మములకు ముంగిట నున్నాఁడను ॥ నీయ ॥

యెదురాదేవాఁడనా యెలయించేవాఁడనా
సదరాన నీకు మొక్కేజంతువ నేను
ఇదివో శ్రీవేంకటేశ యెరుక నీ వొసగఁగా
పొదిగి నీమహిమలు పొగడుచున్నాఁడను ॥ నీయ ॥ 492

సాళంగనాట

ఇచ్చినవాఁడు హరి పుచ్చుకొన్నవాఁడ నేను
చెచ్చెరఁ దగవు లింకఁ జెప్పఁగదరో ॥ పల్లవి ॥

విలిచినది జగము విండినది భోగము
కలిగె జీవుల కొక్కకాణాచి
వలయుశాసనాలు పది నాల్గువేదములు
తలపట్టి జాణలు చదువుకోరో ॥ ఇచ్చి ॥

పాతివవి మనసులు పట్టినది జననము
పోరు దీరెఁ గర్మములపొలమేర
కోరికలె సాతులు గుట్టలు త్రిగుణములు
వూరుఁ బేరుఁ దెలుసుక వొడఁబడరో ॥ ఇచ్చి ॥

దక్కినది ధర్మము తప్పనిది భాగ్యము
లెక్కించ మదుటివ్రాలె లిఖితములు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటికి మూలము
చిక్కులు వాపె నితని సేవించరో ॥ ఇచ్చి ॥ 493

రామక్రియ

వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా ॥పల్లవి॥

ముడిచివేసినపువ్వు ముడువయోగ్యము గాదు
కుడిచివేసినపుల్లె కుడువఁగాఁ గాదు
బడి నొకరుచెప్పినఁ బ్రతి చెప్పఁబోతేను
అదరి శ్రీహరి కది అరుహము గాదు ॥వెఱ్ఱు॥

గంపెఁ డుముక దినఁగా నొక్క వరిగింజ
తెఁపువఁ గలసితే తెలియ నెట్టు వచ్చు
జంపులఁ బలవరించఁగ నొక మంచిమాట
ఇంపైతే హరి యందుకిచ్చునా వరము ॥వెఱ్ఱు॥

వుమిసినతమ్మలో నొకకొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల
అమరఁగ ౧ ఛాయాపహారము సేసుక
తమమాట గూర్చితే దైవము నగఁడా ॥వెఱ్ఱు॥

ఏఱికివేసినగింజ చేతఁ బట్టఁగనేల
గబుక తెంగిలిబూరె గడుగఁగ మరి యేల
తొబుకకవిత్వాల దోషాలఁ బొరలితే
దిబుకార నవ్వఁడా దేవుఁడైనాను ॥వెఱ్ఱు॥

మించుచద్దికూటిమీఁద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి మరిచెప్పనేరక
కంచుఁ బెంచు నొక్కగతి వదికితే మట్టు—
పెంచువలెనే చూచు పెరుమాళ్లు వాని ॥వెఱ్ఱు॥

౧. 'ఛాయా' లేదు.

పుచ్చినట్టిపండుబూఁజి లోననే వుండు
ఇచ్చనకవితలు బాఁతిగావు యెందు
ముచ్చుఁ గన్నతల్లి మూల కొదిగినట్టు
ముచ్చిమి నుతులేల మొక్కరో హరికి ॥ వెట్టి ॥

వుల్లిదిన్న కోమ టూరకవున్నట్టు
జల్లెద నావాలు జారిపోయినట్టు
కల్లలు చెప్పి యాకథ కుత్తరమీక
మెల్లనే వుండితే మెచ్చునా దైవము ॥ వెట్టి ॥

నేతిబీరకాయ నేయి అందు లేదు
రాతివీరునికి బీరము ఇంచుకా లేదు
ఘాత బూరుగుఁబండుకడుపులోన దూది
యేతులసుడుగులు యెక్కునా హరికి ॥ వెట్టి ॥

ఇరుగువా రెరఁగరు పొరుగువా రెరఁగరు
గొరబైనమాటలు గొణఁగుచు నుందురు
పరులఁ గాదందురు బాఁతిగారు తాము
విరసు లట్టివారి విడుచు దేవుఁడు ॥ వెట్టి ॥

యెన్నఁగ శ్రీవేంకటేశుఁ దాళ్లపాక
అన్నమాచార్యులు అఖిలదిక్కులు మెచ్చ-
మన్ననతోఁ బాడి రొకఁ డెవ్వఁడో తాను
సన్న నొరసునట సమ్మతా హరికి ॥ వెట్టి ॥ 494

## లలిత

చిరకాలధర్మములు చిపుకు దవ్వఁగఁబోతే
హరిమఱఁగు చొచ్చితి మాతఁడే రక్షించెను ॥ పల్లవి ॥

భువిఁ దొల్లి లేరా పుణ్యము సేసినవారు
జవళిశాస్త్రములెల్లాఁ జదివినవారు లేరా
దివి కెక్కి దేవతలై తేరినవారు లేరా
యివల నే మివి సేసి యెవ్వరిఁ బోలేము ॥ చిర ॥

తగఁ దొల్లి వినమా తపము సేసినవారి
జిగి నన్నియజ్ఞములు సేసినవారి [౧] వినమా
మిగులా సిద్ధిపడసి మించినవారి వినమా
యెగువ నే మింతకంటే యెక్కుడు సేసేమా ॥ చిర ॥

పెక్కుమతములు చూచి బెండుపడ్డవారు లేరా
పక్కన నన్నివిద్యలాఁ బరగినవారు లేరా
వొక్కఁడే శ్రీవేంకటేశుఁ డుల్లములో నుండఁగాను
యెక్కుడితనిఁ గొలువ కెవ్వరిఁ బోలేము ॥ చిర ॥ 495

రేకు 197 శంకరాభరణము

చేపట్టి మమ్ముఁ గావు శ్రీనరసింహా నీ-
శ్రీపాదములే దిక్కు శ్రీనరసింహా ॥ పల్లవి ॥

చెలఁగువేయిచేతుల శ్రీనరసింహా
చిలికేటినగవుల శ్రీనరసింహా
సిలుగులేనిమంచి శ్రీనరసింహా నీ-
చెలిఁ దొడెక్కించుకొన్న శ్రీనరసింహా ॥ చేప ॥

---

౧. ఈ 'వినమ' వ్రా. ప్ర. లో జారిపోయినది.

క్షీరసముద్రమువంటిశ్రీనరసింహా దైత్యుఁ
 జీరినవజ్రపుగోళ్ల శ్రీనరసింహా
 చేరి ప్రహ్లాదుని మెచ్చేశ్రీనరసింహా నుతిం-
 చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా ॥ చేప ॥

శ్రీవనితతో మెఱపు(గు?)శ్రీనరసింహా
 చెపదేరె నీ మహిమ శ్రీనరసింహా
 శ్రీవేంకటాద్రిమీఁది శ్రీనరసింహా సర్వ-
 జీవదయాపరుఁడ వో శ్రీనరసింహా ॥ చేప ॥ 496

సాళంగనాట

నరుఁడా యీతఁడు ఆదినారాయణుఁడుగాక
 ధరణిఁ గీరితికెక్కె దశరథసుతుఁడు ॥ పల్లవి ॥

యీతఁడా తాటకిఁ జంపె నీమారీచసుబాహుల-
 నీతఁడా మదమణఁచె నిందరుఁ జూడ
 యేతులకు హరువిల్లు యీతఁడా విరిచి యట్టె
 సీతఁ బెండ్లియాడెను యీచిన్నరాముఁడా ॥ నరుఁ ॥

చుప్పనాతిముక్కు గోసి సోదించి దైత్యులఁ జంపి
 కప్పు దిప్పె వాలి నేసినాతఁ డీతఁడా
 గుప్పించి కోఁతుల నేలి కొండల జలధి గట్టి
 కప్పి లంక సాధించె నీకౌసల్యానందనుఁడా ॥ నరుఁ ॥

రావణాదులనుఁ జంపి రక్షించి విభీషణుని
 భావించ నయోధ్య నీతఁడు పట్టమేలెను
 శ్రీవేంకటేశుఁ డితఁడే ౧సృష్టి రక్షించె నితఁడే
 యీవల మాపాలనున్న యీరామచంద్రుఁడా ॥ నరుఁ ॥ 497

౧. 'శ్రష్టి' రేకు.

పాడి

అదివో చూడరో అందరు మొక్కరో
గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని ॥ పల్లవి ॥

రవిమండలమున రంజిల్లుతేజము
దివిఁ జంద్రునిలో తేజము
భువి ననలంబునఁ బొడమినతేజము
వివిధంబులైనవిశ్వతేజము ॥ అది ॥

క్షీరాంబుధిలోఁ జెలఁగుసాకారము
సారె వైకుంఠపుసాకారము
యీరీతి యోగీంద్రులెంచుసాకారము
సారెకు జగములసాకారము ॥ అది ॥

పొలసినయాగంబులలో ఫలమును
పలుతపములలో ఫలమును
తలఁచినతలఁపుల దానఫలంబును
బలిమి శ్రీవేంకటపతియే ఫలము ॥ అది ॥ 498

రామక్రియ

ఆతనికంటె పొగడేము ఆతని శరణంటిమి
అతఁడే సర్వజీవుల అంతర్యామి ॥ పల్లవి ॥

పెక్కుబ్రహ్మాండకోట్లు పెక్కుబ్రహ్మకోట్లు
పెక్కురుద్రకోట్లును పెక్కుయింద్రులు
వొక్కొక్కరోమకూపాల నొగి నించుకుండునట్టి-
వొక్కఁడే విష్ణుఁడు వీఁడే వున్నతోన్నతుఁడు ॥ అత ॥

అనంతసూర్యచంద్రులు అనంతవాయువులును
అనంతనక్షత్రసము లనంతమేరువులు
కొనలుసాగి యన్నిటికాటువ(c) గూడుకొన్నట్టి-
అనంతుఁ డొక్కఁడే మించి నాదిమూరితి ॥ అత ॥

అసంఖ్యమహిమలను అసంఖ్యమాయలు
అసంఖ్యశక్తులు వరా లసంఖ్యములు
పొసఁగ నివ్విటిఁ దానే పుట్టించి రక్షించినట్టి-
అసంఖ్యాతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు ॥ అత ॥ 499

దేసాళం

నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము
దైవమవై నీ వుండఁగ తగ మాదె బ్రదుకు ॥ పల్లవి ॥

కోరి వొకరాతివీరుఁ గొల్చి బతికీ నొకఁడు
పైరు వొక్కచెట్టువెట్టి బతికేననీ నొకఁడు
కూరిమిఁ బాము చేఁబట్టుకొని బతికీ నొకఁడు
శ్రీరమణువిదాసులచేతిదేపో భాగ్యము ॥ నీవే ॥

ఇసుమంతమన్ను వట్టి యేచి బతికీ నొకఁడు
పసురము వింటఁ గట్టి బతికేననీ నొకఁడు
పసగా వేశె డినుము పట్టి బతికీ నొకఁడు
వసుధేశ నివు గలవారి కేమిగడమ ॥ నీవే ॥

ఆకు వలముఁ గసవు నంటి బతికీ నొకఁడు
లోకులు పెక్కుపాయాల లోలులై బతికే రదే
యీకడ శ్రీవేంకటేశ ఇవెల్లా నీమహిమలే
చేకొని నీమరఁగుచొచ్చినవారే ఘనులు ॥ నీవే ॥ 500

సామంతం

బయలు మొరంగగుపరమే మాయ ఇది
నయమైన లోనై నమ్ముటగాని ॥ పల్లవి ॥

కలఁడు హరి యొకఁడు కాని జగములకు
కలిగినతఁడు లేక మానఁడు
తెలిసి ఇందరికిఁ దెలియర్థమీ
మలసి యెప్పటి మరతురు గాని ॥ బయ ॥

పుట్టినదెల్లా భోగముకొరకే
పుట్టిన భోగము పో దెపుడు
పట్టి యీమాఁటలే పలుకుదు రిందరు
మట్టులేక ఇది మరతురుగాని ॥ బయ ॥

కర్మము శ్రీవేంకటపతికార్యము
కర్మము దేహికిఁ గాణాచి
ధర్మ మీదేవునిదాస్యం బందురు
మర్మము లోకులు మరతురుగాని ॥ బయ ॥ 501

రేకు 198 శ్రీరాగం

ఎఱిఁగితి నమ్మితి నితఁడు దయానిధి
మఱుఁగులు మొరఁగులు మరి యిఁక లేవు ॥ పల్లవి ॥

వేదోద్ధరణుఁడు విశ్వరక్షకుఁడు
ఆదిమూర్తి శ్రీఅచ్యుతుఁడు
సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె
యేదెస మాపాలి పితఁడే కలఁడు ॥ ఎఱిఁ ॥

పరమపురుషుఁ డాపన్నివారకుఁడు
హరి శాంతుఁడు నారాయణుఁడు
శరణంటె మితఁడు చేకొని కాచెను
తరవాతిపనులఁ దప్పఁ డితఁడు ॥ ఎటే ॥

హృదయాంతరంగుఁడు యీశ్వరేశ్వరుఁడు
ఇదివో శ్రీవేంకటేశ్వరుఁడు
వెదకితి మీతఁడు విడువఁడు మమ్మిఁక
తుదకును మొదలికి దొరకినవాఁడు ॥ ఎటే ॥ 502

మాళవిగౌళ

[1] ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు
బట్టబాయిటనే నీవు పదిరూపు లైతివి ॥ పల్లవి ॥

చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁ గుంగినకొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనువఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి ॥ ఇట్టె ॥

అడుగులు మూఁటనే యఖిలము గొలచితి
బడిబడినే రాచపగ నీఁగితి
బెడిదపులంక విభీషణు నేలించితివి
అడరి పా కపులదిక్కై విలిచితివి ॥ ఇట్టె ॥

త్రిపురకాంతలగుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికిరూపై యున్నాఁడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మానుతులకు విరవైతివి ॥ ఇట్టె ॥ 503

---

౧. ఇందు దశావతారవర్ణనము స్పష్టము.

శంకరాభరణం

ఇతవిప్రసాదమే యిన్నియును
గతి యితనిదేకన కాదనరాదు ॥ పల్లవి ॥

కాయములో నొకఘనసంసారము
ప్రాయంబులతోఁ బ్రబలీని
ఆయ మందుకును హరి దానేపై
దాయక పాయక తగిలున్నాఁడు ॥ ఇత ॥

వొనరినకలలో నొకసంసారము
మనసుతోడనే మలసీని
నవిచి యందుకును నారాయణుఁడై
కొనమొదలై తా గురియైనాఁడు ॥ ఇత ॥

వుడిబడి కోర్కుల నొకసంసారము
బడిబడియాసలఁ బరగీని
విడువక యిది శ్రీవేంకటేశ్వరుఁడే
తొడిఁబడఁ గల్పించి ధ్రువమయినాఁడు ॥ ఇత ॥ 504

ముఖారి

ఊరకే కలుగునా వున్నతపుమోక్షము
శ్రీరమణుకృపచేతఁ జేరు మోక్షము ॥ పల్లవి ॥

కలుషముఁ బెడఁబాసి కర్మగండము గడచి
మలసినప్పుడుగా మరి మోక్షము
చలన మించుకలేక సంసారవారిధి దాఁటి
నిలిచినప్పుడుగా నిజమోక్షము ॥ ఊర ॥

పంచేంద్రియాల మీఱి భక్తి పామీఁదఁ బెట్టి
మంచివాఁడై నప్పుడుగా మరి మోక్షము
అంచల యాసలు మాని ఆచార్య సేవ చేసి
మించినప్పుడుగా ఆమీఁది మోక్షము ॥ ఊర ॥

శాంతమే కూడుగా నుండి సమచిత్తమునఁ బొంది
మంతుకెక్కినప్పుడుగా మఱి మోక్షము
అంతట శ్రీవేంకటేశుఁ డాదరించి మన్నించితే
నంతరంగమున నున్న దనాదిమోక్షము ॥ ఊర ॥ 505

వరాళి

వెదకనేఁటికి నేయి వెన్న చేతఁ బట్టుకొని
మొదలఁ గలిగితేనే మందరాఁ గలుగుట ॥ పల్లవి ॥

తనపూర్వభావము తలఁచి మరవకుంటే
పనివడి తనపుణ్యఫల మబ్బుట
౧ మనసార్తి నానాఁటినూయి చూపెట్టుకుండితే
జనించినతనకు విజ్ఞానసిద్ధి యగుట ॥ వెద ॥

పుట్టినయప్పటితనభోగముఁ దలఁచుకొంటే
కొట్టఁగొన తనకోర్కి కొనసాగుట
వట్టినదిమిజగమునటనఁ దెలుసుకొంటే
గుట్టుతోడిగురుబోధగురుతు చేచిక్కుట ॥ వెద ॥

జీవకళ నంటినట్టిచిక్కు విదిలించుకొంటే
దేవుఁడు తనచేఁ జిక్కి తిరమౌట
శ్రీవేంకటేశుఁ డీతనిఁ జేరి శరణంటేను
ఆవలనీవలఁ దాను అన్నిటా గెలుచుట ॥ వెద ॥ 506

---

౧, మనసు + ఆర్తి.

పాడి

హరి నారాయణ [౧]కృష్ణ అదివో మావిన్నపము
తరవాతిమాట నీవే తలఁచుకోవయ్యా ॥ పల్లవి ॥

సదిఁబడ్డనాతలఁపు చక్కఁగాక వుండినాను
వొడయఁడవు నీకృప వొగిఁ జక్కనే
గుడిగొన్నయే రెంత కొంకరవంకరలైనా
పుడమికి లోఁగానిపోవునటవయ్యా ॥ హరి ॥

కాయకపునాభక్తి కడుఁ గొంచమైనాను
ఆయపునీవరములు అతిఘనమే
యేయెడ గుడి గొంచమయిన గుడిలోదేవుని-
కాయడ మహిమ ఘనమందురు గదవయ్యా ॥ హరి ॥

శ్రీవేంకటేశ నిన్ను జింతించక నే నుండినా
జీవాంతరాత్ముఁడవై చేకొంటి నీవే
ఆవటించి కీలుబొమ్మ అచేతనమై యుండినా
ఆవేళ సూత్రధారుఁ డాడించుఁ గదవయ్యా ॥ హరి ॥ 507

రేకు 199 నాట

ఇదె వీఁడె కంటిమమ్మ యేతులవాఁడు
కదలేసూర్యచంద్రులకన్నులవాఁడు ॥ పల్లవి ॥

పెలవినవ్వులవాఁడు చేకత్తిగోళ్ళవాఁడు
పలుపేగులజంద్యాలపంతాలవాఁడు
యెలమిఁ జెలిఁ దొడపై నిడుకొన్నట్టివాఁడు
చెలఁగిన ఘననారసింహుఁడటే వీఁడు ॥ ఇదె ॥

---

౧. 'క్రిష్ణ' రేకు.

కొండగద్దెమీఁదివాఁడు గొప్పకిరీటమువాఁడు
దిండుపైఁడిచీరకాశ(సె?)తెక్కులవాఁడు
రెండురూపులొకటైనరీతులమాయలవాఁడు
అండఁ బ్రహ్లాదవరదుఁ డాతఁడటే వీఁడు ॥ ఇదె ॥

భవనాసిపొంతవాఁడు భావించఁ దెల్లనివాఁడు
ఇవల శ్రీవేంకటాద్రినిరవైనాఁడు
జవళిపంతాలవాఁడు శంఖుచక్రములవాఁడు
తివిరినఅహోబలదేవుఁడటే వీఁడు ॥ ఇదె ॥ 508

బౌళి

పరమపురుషుఁ డీబాలుఁడట
హరవిరించులు మొక్కే రదివో వాకిటను ॥ పల్లవి ॥

దేవుఁ డితఁడు సర్వదేవతల కొడయఁడు
వేవేలువేదములచే వేద్యుఁ డితఁడు
దేవకీదేవికి వసుదేవునికిఁ గొడుకాయ
యీవిధము నోఁచిర వీ రెంతభాగ్యవంతులో ॥ పర ॥

అంతటాఁ దా నున్నవాఁడు అరయ స్వతంత్రుఁడు
అంతము నాదియులేని ఆదిమూరితి
వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి
దొంతరకొడుకైనాఁడు తొల్లి వీ రేపుణ్యులో ॥ పర ॥

ఇందిరావల్లభుఁడు ఇహపరనాయకుఁడు
కందువ శ్రీవేంకటాద్రిఁ గాపున్నవాఁడు
మందగొల్లెతలకెల్ల మరఁది దా నైనాఁడు
ఇందరు నిందరే వీరి కెన్నటి౧ సంబంధమో ॥ పర ॥ 509

౧. 'సమ్మంధమో' రేకు.

లలిత

ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే ॥ పల్లవి ॥

అదె చంద్రుఁ డుదయించె నచ్యుతుఁడు జనియించె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి ద్విజులు పొలిసిరి రాక్షసులు
సదర మీశిశువుకు శరణనరే ॥ ఎన్నఁ ॥

పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁ డిదె వచ్చె
చండిదుర్యోధనుమూఁక జల్లన వచ్చె
దండి గోకులము నిండె ద్రౌపదితపము పండె
చండప్రతాపున కిట్టె శరణనరే ॥ ఎన్నఁ ॥

రేపల్లె పుణ్యము చేసె శ్రీవేంకటేశుఁడు డాపె
గోపికలమనసుల కొఱత వాసె
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేఁటి కితని శరణనరే ॥ ఎన్నఁ ॥ 510

ముఖారి

అతఁడే గతియని యటీ నన్నిటా మాన్యుఁడు
ఇతరాలు మానఁగానె యీతనికే శలవు ॥ పల్లవి ॥

శ్రీరమణునినిత్యసేవకులకుఁ దొల్లె
వేరులేనికర్మముల వెట్టిమాన్యము
ఆరీతి నితనిభక్తులైనచనవరులకు
అరిలేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు ॥ అతఁ ॥

తక్కక యితనిముద్ర ధరించినదాసులకు
చొక్కుల భవబంధాలసుంక మాన్యము
లెక్కించ నితవికైనలెంకలకు బొడుకల-
కొక్కట విధినిషేధా లూహింప లేవు ॥ అత ॥

సరుస శ్రీవేంకటేశుశరణాగతులకును
పరగ మాయలదొడ్డిబందె మాన్యము
పరమమైనయితనివప్రళ్లమకూటివారికి
ధరలో నేమిటివంకాఁ దప్పులే లేవు ॥ అత ॥ 511

సామంతం

నీచేతలోవారము నివారము
యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము ॥ పల్లవి ॥

ఇన్నిటాఁ బూర్ణుఁడవు నీ వెరఁగనియర్థమేది
విన్నపము నేఁ జేసేవిధమేది
మన్నించిననీమన్న నే మహిమలో మాఁబదుకెల్ల
వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము ॥ నీచే ॥

ఘనదేవుఁడవు నీకుఁ గడమలు మరియేవి
గొనకొని నే విన్నఁ గొసరేదేమి
వొనుగక యేలితివి పుట్టినమాపుట్టుగెల్ల
నవిచి విన్ను నమ్మిననమ్మికే మావ్రతము ॥ నీచే ॥

శ్రీవేంకటేశుఁడ నీవు చిత్తగించనిది యేది
భావించి నేఁ బొందనిభాగ్య మేది
యేవల [1] మాపరభారా లింతయు నీ కెక్కనది
ఆవటించి నే నీశరణన్న దే మావ్రతము ॥ నీచే ॥ 512

౧. పరభారాలు=ఎక్కువైనబరువులు లేక పరలోకవుభారములు కావచ్చు.

పెళాషి

కనియుండి భ్రమసితిఁ గట్టా నేను
యెనలేక గురియైతి నిట్టే నేను ॥ పల్లవి ॥

తోలునెముకలు గట్టి దొరసంటా మురిసేను
ఆలుబిడ్డలమరఁగు ఆహా నేను
గాలి యాసటించుకొని కాలములు గడపేను
వోలిఁ బుణ్యపాపములందు వోహో నేను ॥ కని ॥

పుంటిసంక బదుకౌతా మదియించి మురిసేను
ఇంటిముంగిటనె వుంటి యీహీ నేను
వొంటివాఁడనై వుండి వూరఁగలవెల్లాఁ గోరే
వొంటినియాసలతోడ నూహూ నేను ॥ కని ॥

నూలికోకఁ గట్టువడి నున్ననై నే మురిసేను
యీలాగు నాబదుకెల్ల యేహీ నేను
పాలించి శ్రీవేంకటాద్రిపతి నాకుఁ గలుగఁగ
ఆలరినై గెలిచితి హైహై నేను ॥ కని ॥ 513

రేకు 200 మాళవిగౌళ

నీవు సర్వగుణసంపన్నుఁడవు నే నొకదుర్గుణిని
మానవు నన్నొకయెదురుచేసుకొని మనసుచూడనేలా అయ్యా
॥ పల్లవి ॥

యేలినవాఁడవు నీవు ఇటు నేఁ గొలిచినవాఁడ
పోలింపఁగ నీవే దేవుఁడవు భువి నే నొకజీవుఁడను
పాలించేవాఁడవు నీవు బ్రదికేవాఁడను నేను
తాలిమి నన్నొకసరిచేసుక నసుఁ దప్పు లెంచనేలా అయ్యా ॥ నీవు ॥

అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను
చింతింపఁగ నీవే స్వతంత్రుఁడవు జిగి నేఁ బరతంత్రుఁడను
ఇంత నీవే దయఁగలవాఁడవు యెప్పుడు నే నిర్దయుఁడను
చెంతల నన్నొకమొనసేసుక నాచేఁత లెంచనేలా అయ్యా ॥నీవు॥

శ్రీవేంకటేశ్వరుఁడవు నీవు సేవకుఁడను ఇటు నేను
ఆవలనీవల దాతవు నీవు యాచకుఁడను నేను
నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
కైవశమగు నను ప్రతివెట్టుక నాకథలు యెంచనేలా అయ్యా
॥నీవు॥ 514

నాట

వెడలె వెడలె నదె వీధులవీధుల
తొడికి దైత్యులనుఁ దుంచఁగను ॥పల్లవి॥

కోటిసూర్య లోకకూటువ గూడుక
చాటువ మెరసేటిచక్రము
గాఁటపువేవేలు కాలరుద్రు లటు
నీటునఁ దొలఁకేటినిబిడచక్రము ॥వెడ॥

ప్రళయకాలముల బడబాగ్నులొలుకు-
చలమరిప్రతాపచక్రము
కలకలరవముల కాలభైరవులు
కలసి మెలంగేటిగండచక్రము ॥వెడ॥

యమసహస్రములనంత మేకమై
సమరము గెలిచేటిచక్రము
అమరుచు శ్రీవేంకటాధిపుకరమునఁ
దెమలక యుండేటిదివ్యచక్రము ॥వెడ॥ 515

బౌళి

మొక్కెద మిదివో మూఁడు మూర్తులును
వొక్కరూపమై వొనరెఁ జక్రము ॥ పల్లవి ॥

చెండినరావణుశిరో౧ మాలికల
దండలపూజల తలచుగను
మెండుగఁ గంసుని మెదడు గందముగ
నిండ నలఁదుకొని నిలిచెఁ జక్రము ॥ మొక్కె ॥

చించి ౨హిరణ్యకసిపుపెనురక్తపు -
అంచనర్ఘ్యపాద్యమ్ములను
పంచజనఘనకపాలపుటెముకను -
పంచవాద్యములఁ బరగుచక్రము ॥ మొక్కె ॥

బలుమధుకైటభప్రాణవాయువుల
అలరిననైవేద్యంబులను
యెలమిని శ్రీవేంకటేశుహస్తముల
వెలసి నిలిచె నిదే విజయచక్రము ॥ మొక్కె ॥ 516

సాళంగం

చేకొంటి నిహమే చేరినపరమని
కైకొని నీ విందు కలవేకావ ॥ పల్లవి ॥

జగమునఁ గలిగినసకలభోగములు
తగిననీప్రసాదములే యివి
అగపడునేఁబదియక్షరపంక్తులు
నిగమగోచరపునీమంత్రములే ॥ చేకొం ॥

---

౧. మాలికల=వరుసలే మో? ౨. 'హిరణ్య....పాద్యమ్ములను' వరకుగల సమస్తపదములో 'అంచ' అను-పదము ఇముడ్చుట వింత.

పొదగొని సంసారపుత్రదార లిల
వదలనినీదాసవర్గములే
చెదరక యేపొద్దుఁ జేయునాపనులు
కదిసినం నియ్యాజ్ఞాకైంకర్యములే ॥ చేకొం ॥

నలుగడ మించిననాజన్మాదులు
పలుమరు లిటు నీపంపు లివి
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ నిఁక
వలసినవ్పు డీ వరములు నాకు ॥ చేకొం ॥ 517

లలిత

కానవచ్చీఁ గానరాదు కమలాక్ష నీమాయ
తానే వెంటవెంటఁ దగిలీ నిదివో ॥ పల్లవి ॥

తొల్లి నీవు గలవు తోడనే నేఁను గలను
యెల్లగా నీప్రపంచము యింతాఁ గలదు
కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్లు
చల్లనినేనొకఁడనే జన్మములే వేరు ॥ కాన ॥

వేదములు నాటివే వినుకులు నాటివే
అదినుండి చదివే నదియే నేను
వేదతో వెన్నవట్టి నేయి వెదకఁ బోయినయట్లు
దాదాత నాతెలివి యింతరుల నడిగేను. ॥ కాన ॥

వైకుంఠమూ నున్నది వరములు నున్నవి
యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను
కైకొని పువ్వు మందిరి గక్కునఁ బిందె యైనట్లు
నీకు శరణనఁగాను నేనీడేరితిని ॥ కాన ॥ 518

౧. నీ+అజ్ఞా=నియ్యాజ్ఞ. వింత్రికసంధి.

దేసాళం

కదనుండి చూచేనీకుఁ గనికరమైతేఁగన
బదీ నన్నుఁ గావు నీతో బలిమేలే ॥ పల్లవి ॥

వొదలు మోచినయది యొకయపరాధము
అదరి సంసారినౌటె యపరాధము
బదీ నివి పఱచినపాట్లఁ బడకపోదు(దు?)
యెదనీకు మొరవెట్ట నిఁకఁ జోటేదయ్యా ॥ కద ॥

అన్నపానములు గొన్న దది యొక్కనేరమి
వున్నతి సంపదఁ బొందు టొకనేరమి
యిన్నియు ననుభవించి యిఁక నొల్లనంటేఁ బోదు
విన్నపాలు సేసి నీతో వినుగఁ జోటేది ॥ కద ॥

మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల
అదనఁ గర్మాధికారినౌటొకకల్ల
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గాచితివి
తుద కెక్కితిమి యింకఁ దొలఁగఁగవలెనా ॥ కద ॥ 519

శ్రీః శ్రీః శ్రీః

# 1-వ అనుబంధము

## ఆకారాదిగ రాగ-సంకీర్తన-సంఖ్యాసూచి

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| ఆహిరి | .... | 2, 6, 119, 191. |
| కన్నడగౌళ | .... | 39, 177, 192, 196, 202, 480. |
| కాంబోది | .... | 1, 27, 84, 224, 247, 256, 427. |
| కేదారగౌళ | .... | 165, 210, 213, 255. |
| గుండక్రియ | .... | 54, 56, 71, 74, 88, 127, 139, 168, 238, 338, 339, 340, 389, 416, 424, 426, 431, 433, 435, 439, 444, 473. |
| గుజ్జరి | .... | 22, 138, 189, 236, 346, 381, 382, 384, 452. |
| గౌళ | .... | 57, 104, 124, 201, 264, 276, 277, 297, 336. |
| ఛాయానాట | .... | 446. |
| తెలుఁగుకాంబోది | .... | 403. |
| దేవగాంధారి | .... | 18, 78, 90, 186, 261, 332, 333, 334, 335, 337, 369, 376, 432, 443, 490, 492. |

| రాగము | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| దేశా(సా)క్షి | .... 29, 38, 49, 96, 116, 157, 167, 168, 235, 262, 266, 353, 360, 481, 513. |
| దేసాళం | .... 45, 103, 120, 160, 175, 193, 200, 222, 259, 260, 351, 354, 372, 459, 474, 483, 500, 519. |
| ధన్నాసి | .... 15, 44, 148, 158, 214, 329, 330, 331, 336, 344, 357, 450, 477. |
| నాట | .... 81, 93, 112, 181, 207, 229, 245, 246, 248, 345, 355, 361, 405, 508, 515. |
| నాదరామక్రియ | .... 313, 314, 315, 316, 317, 373. |
| పాడి | .... 19, 32, 35, 66, 99, 111, 121, 123, 141, 195, 204, 219, 225, 244, 281, 406, 454, 486, 498, 507. |
| ప్రతాపనాట | .... 350. |
| బౌళి(భవుళి) | .... 41, 70, 75, 107, 108, 125, 128, 179, 252, 269, 342, 364, 367, 375, 378, 380, 385, 386, 387, 391, 393, 396, 410, 419, 429, 434, 445, 455, 457, 458, 460, 465, 468, 479, 509, 516. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
| --- | --- |
| బౌళిరామక్రియ | .... 217, 348, 442. |
| భూపాళం | .... 40, 60, 117, 166, 267, 326, 327, 328, 359, 436 |
| భైరవి | .... 4, 12, 20, 105, 146, 169, 187, 197, 282, 287, 319, 320, 321, 322, 349. |
| మంగళకౌశి(సి)క | .... 241. 401. |
| మలహరి | .... 10, 17, 21, 51, 69, 101, 118, 132, 170, 190, 323, 324, 325, 356, 453, 476. |
| మాళవి | .... 73, 77, 140, 152, 216, 218, 283, 368, 377, 414, 429. |
| మాళవిగౌళ | .... 82, 135, 184, 288, 430, 448, 487, 489, 508, 514. |
| ముఖారి | .... 5, 16, 30, 62, 88, 89, 106, 122, 126, 171, 173, 198, 231, 237, 265, 268, 286, 303, 304, 305, 306, 307, 422, 505, 511. |
| రామక్రియ | .... 14, 33, 46, 68, 72, 94, 97, 137, 145, 147, 160, 164, 182, 188, 215, 221, 250, 270, 282, 318, 400, 462, 485, 494, 499. |
| రేవగుప్తి | .... 398. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| లలిత | .... 7, 24, 34, 42, 43, 61, 65, 76, 80, 87, 102, 109, 131, 134, 143, 144, 155, 188, 208, 271, 274, 293, 294, 295, 296, 352, 358, 362, 383, 388, 395, 399, 404, 407, 413, 415, 417, 418, 421, 425, 438, 456, 464, 466, 475, 482, 488, 495, 510, 518. |
| వరాళి | .... 25, 36, 174, 180, 212, 258, 285, 374, 506 |
| శంకరాభరణం | .... 31, 50, 55, 85, 115, 129, 159, 172, 185, 206, 223, 226, 253, 254, 263, 272, 278, 402, 411, 449, 467, 472, 491, 496, 504. |
| శ్రీరాగం | .... 23, 58, 64, 67, 95, 100, 114, 133, 142, 149, 161, 176, 199, 209, 251, 273, 279, 291, 308, 309 310, 311, 312, 365, 390, 440, 463, 484, 502. |
| శుద్ధవసంతం | .... 13, 53, 63, 136, 178, 240, 292, 341, 408. |
| సామంతం | .... 8, 11, 48, 59, 92, 98, 130, 156, 161, 205, 211, 234, 257, 280, 284, 290, 298, 299, 300, 301, |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
| --- | --- |
| | 302, 370, 397, 409, 423, 428, 441, 447, 451, 471, 501, 512. |
| సాళంగం | .... 26, 52, 153, 230, 394, 469, 517, |
| సాళంగనాట | .... 3, 9, 28, 37, 47, 79, 86, 91, 110, 113, 154, 162, 194, 208, 220, 227, 228, 239, 243, 249, 275, 289, 347, 363, 371, 379, 392, 412, 437, 461, 470, 478, 493, 497. |
| సౌరాష్ట్రం | .... 242. |
| హిందోళవసంతం | .... 233, 343. |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన రాగ సంఖ్యాసూచి

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంతరంగ | దేసాళం | 259 |
| అంతరాత్మ | లలిత | 388 |
| అంతర్యామీ | లలిత | 475 |
| అంతరు | మలహరి | 17 |
| అందరి | హిందోళవసంతం | 343 |
| అందరిలోనా | నాట | 207 |
| అందరివలె | సామంతం | 48 |
| అందాఁకాఁదాఁదా | గుజ్జరి | 452 |
| అందుకల్లా | రామక్రియ | 183 |
| అందుకుఁగాదు | సామంతం | 451 |
| అందుకే | దేవగాంధారి | 376 |
| అందుకేపో | మలహరి | 325 |
| అందుకేసుమ్మీ | శుద్ధవసంతం | 341 |
| అక్కటా | దేసాళం | 175 |
| అట్టయితే | పాడి | 454 |
| అటుగన | గుండక్రియ | 71 |
| అటుగాన | ధన్నాసి | 450 |
| అద్దము | దేవగాంధారి | 490 |
| అణురేణు | దేవగాంధారి | 482 |
| అతఁడు | నాదరామక్రియ | 313 |
| అతఁడే | ముఖారి | 511 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అతని | లలిత | 294 |
| అతిసులభం బిది | మలహరి | 10 |
| అతిసులభంబిదె | బౌళి | 41 |
| అదినే | శంకరాభరణం | 185 |
| అదియేల | గుండక్రియ | 389 |
| అదియేవిష్ణు | శంకరాభరణం | 402 |
| అదివోచూడ | పాడి | 498 |
| అదివోనిత్య | వరాళి | 25 |
| అదెవచ్చె | సాళంగనాట | 79 |
| అదెశిర | రామక్రియ | 485 |
| అనంతాప | మలహరి | 323 |
| అనరాదు | దేసాళి | 167 |
| అనలము | బౌళి | 445 |
| అవియానతి | లలిత | 438 |
| అన్నిటా నీపెంపు | సాళంగనాట | 249 |
| అన్నిటానీవే | మలహరి | 324 |
| అన్నిటాను | మలహరి | 170 |
| అన్నిటాశాంతుఁడై | భవుళి | 460 |
| అన్నిటాశ్రీహరి | రామక్రియ | 68 |
| అన్నిటికి నొడ | శ్రీరాగం | 64 |
| అన్నిటికి మూల | దేవగాంధారి | 261 |
| అన్నిటికి మూల | సామంతం | 284 |
| అన్నిటికి హరి | బౌళిరామక్రియ | 442 |
| అన్నిటి కెక్కుఁడు | సాళంగనాట | 9 |
| అన్నియునడుగ | గుజ్జరి | 189 |
| అన్నియుమఁదన | దేవగాంధారి | 90 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| అన్నియును హరి | బౌళి | 75 |
| అనుచు దేవ | సాళంగనాట | 154 |
| అనుచు విద్దఱు | రామక్రియ | 14 |
| అనుచు లోక | పాడి | 111 |
| అపరాధి | భూపాళం | 326 |
| అప్పుఁడు | శంకరాభరణం | 50 |
| అప్పుడు | భూపాళం | 117 |
| అయ్యోనేనేకా | లలిత | 80 |
| అయ్యోమాయ | భైరవి | 12 |
| అయ్యోవారి | రామక్రియ | 33 |
| అరుదరుదు | మాళవి | 429 |
| అరుదు | భైరవి | 321 |
| అల్పశక్తి | శ్రీరాగం | 390 |
| అవధారు | లలిత | 295 |
| అవియటు | లలిత | 76 |
| అవియు | గుండక్రియ | 416 |
| అహోబలేశ్వరుఁడ | నాట | 112 |
| అహోబలేశ్వరు | సాళంగనాట | 243 |
| అతఁడే యజ | ముఖారి | 237 |
| అతఁడే విష్ణుండ | భైరవి | 319 |
| అతనిఁ బో | రామక్రియ | 499 |
| అతనిమూలమే | లలిత | 362 |
| ఆతురబందు | గౌళ | 277 |
| ఆనతియ్యఁగ | సామంతం | 301 |
| ఆమీఁది | సాళంగనాట | 37 |
| ఆరసి | సామంతం | 370 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఆర్తుఁడ | గుజ్జరి | 382 |
| అర్పులు | బౌళి | 108 |
| అహాయేమి | శంకరాభరణం | 172 |
| ఇంతకంటేఁదగు | సామక్రియ | 400 |
| ఇంతకంటేనేమి | శంకరాభరణం | 272 |
| ఇంతకంటేనేమున్నది | భైరవి | 197 |
| ఇంతకంటేమరి | దేవగాంధారి | 334 |
| ఇంతటఁబో | దేసాళం | 474 |
| ఇంతటాహరి | శ్రీరాగం | 463 |
| ఇంతదేవుఁడింక | దేశాక్షి | 116 |
| ఇంతయు | శ్రీరాగం | 133 |
| ఇంతిజవ్వన | ముఖారి | 286 |
| ఇంతేకాని | శ్రీరాగం | 199 |
| ఇందరిబుద్ధు | రామక్రియ | 94 |
| ఇందరిబ్రదు | దేసాళం | 193 |
| ఇందరిలో | గుజ్జరి | 138 |
| ఇందరూ | సామంతం | 205 |
| ఇందుకా | సామంతం | 397 |
| ఇందుకే | శంకరాభరణం | 31 |
| ఇందుల | మాళవి | 140 |
| ఇందులో | ఆహిరి | 6 |
| ఇందువల్ల | ముఖారి | 268 |
| ఇచ్చినవాఁడు | సాళంగనాట | 493 |
| ఇటునిను | ముఖారి | 305 |
| ఇటులై | గౌళ | 297 |
| ఇటువంటి | రామక్రియ | 215 |
| ఇట్లానే | సామంత | 234 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇట్టితీపుల | రామక్రియ | 97 |
| ఇట్టి నావెట్టి | ముఖారి | 304 |
| ఇట్టి బ్రాహ్మణ్య | పాడి | 486 |
| ఇట్టివాఁడ | శ్రీరాగం | 311 |
| ఇట్టెమమ్ము | మాళవిగౌళ | 503 |
| ఇతఁడు | మాళవి | 218 |
| ఇతవికితఁడే | నాట | 405 |
| ఇతవిప్రసాద | శంకరాభరణం | 504 |
| ఇతరుల | వరాళి | 174 |
| ఇది యెరుదను | లలిత | 421 |
| ఇదియేఉపాయ | కేదారగౌళ | 210 |
| ఇదియేకావలె | శ్రీరాగం | 209 |
| ఇదియేబుద్ధి | ముఖారి | 171 |
| ఇదివో నా | గుండక్రియ | 340 |
| ఇదివో నీ | నాదరామక్రియ | 314 |
| ఇదివో మా | భూపాళం | 166 |
| ఇదివోవీది | సాళంగనాట | 110 |
| ఇదివోవున్నార | లలిత | 399 |
| ఇదివోనుజ్ఞాన | పాడి | 121 |
| ఇదెవీఁడె | నాట | 508 |
| ఇద్దరు | సామంతం | 92 |
| ఇన్నాళ్లు | కాంబోది | 256 |
| ఇన్నిటా | శంకరాభరణం | 411 |
| ఇన్నిటికి | మాళవిగౌళ | 288 |
| ఇప్పుడే | సామంతం | 302 |
| ఇలజాణ | లలిత | 413 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇవిగో | శుద్ధవసంతం | 292 |
| ఇవిసేయఁగ | భూపాళం | 328 |
| ఇహపర | పాడి | 225 |
| ఇహమెట్టో | సాళంగనాట | 461 |
| ఇహమే | లలిత | 131 |
| ఈడనుండె | లలిత | 65 |
| ఈతఁడు | సాళంగనాట | 208 |
| ఈతఁడే | సాళంగనాట | 371 |
| ఈతనిఁగొలిచి | గౌళ | 57 |
| ఈతనిమరచి | లలిత | 417 |
| ఈతనిమూలమై | బౌళి | 457 |
| ఈరూపమై | పాడి | 244 |
| ఈహిశ్రీ | మలహరి | 69 |
| ఉన్నమంత్రా | సాళంగం | 153 |
| ఉపకారి | గుజ్జరి | 384 |
| ఊరకేకలుగునా | ముఖారి | 505 |
| ఊరకేదొరకునా | గౌళ | 104 |
| ఊరకైతే | సామంతం | 161 |
| ఎంచిచూడరో | దేసాక్షి | 235 |
| ఎంతకతినమో | నాట | 181 |
| ఎంతకత | నాదరామక్రియ | 315 |
| ఎంతకెఁ | శంకరాభరణం | 491 |
| ఎంతచదివి | సామంతం | 98 |
| ఎంత పుణ్యమో | భైరవి | 322 |
| ఎంత బాఁప | బౌళి | 70 |
| ఎంతమహిమో | అహిరి | 191 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంత మాత్రమున | బౌళి | 159 |
| ఎంత లేదు | శ్రీరాగం | 291 |
| ఎంత వలచితి | సామంతం | 290 |
| ఎంత వాటుపడె | శ్రీరాగం | 95 |
| ఎంత సోదించి | దేసాక్షి | 262 |
| ఎందాఁక నిద్ర | భూపాళం | 436 |
| ఎందుకు | మాళవిగౌళ | 448 |
| ఎందునీ | లలిత | 143 |
| ఎక్కడిమతము | సాళంగం | 52 |
| ఎట్టిదోమీ | లలిత | 293 |
| ఎట్టుదోయ | సామంతం | 211 |
| ఎట్టువలపి | లలిత | 456 |
| ఎట్టుసేయఁగ | లలిత | 296 |
| ఎట్టైనాఁగావక | బౌళి | 434 |
| ఎత్తుకొన్న | నాట | 361 |
| ఎదురుమాట | సామంతం | 299 |
| ఎన్నఁడు | లలిత | 510 |
| ఎన్నఁడాకో | లలిత | 102 |
| ఎన్నటికి | లలిత | 188 |
| ఎన్నిపాట్లఁబడ్డా | దేసాళం | 354 |
| ఎఱఁగక | ధన్నాసి | 344 |
| ఎఱిఁగితి | శ్రీరాగం | 502 |
| ఎఱిఁగిన | మలహరి | 356 |
| ఎఱుఁగుట | బౌళి | 465 |
| ఎఱుఁగువారె | దేసాక్షి | 481 |
| ఎవ్వరికి | ముఖారి | 306 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎవ్వరినేమనఁగ | కన్నడగౌళ | 480 |
| ఎవ్వరినేర్పు | భైరవి | 287 |
| ఎవ్వరిభాగ్యంబె | లలిత | 43 |
| ఏఁటిజాణ | వరాళి | 285 |
| ఏఁటిమాట | శ్రీరాగం | 67 |
| ఏకాత్మవాదు | శంకరాభరణం | 253 |
| ఏగతినన్నుద్ద | లలిత | 61 |
| ఏడనుందురో | గౌళ | 124 |
| ఏదిగతి | సామంతం | 300 |
| ఏదివలసె | బౌళి | 128 |
| ఏదుపాయము | ముఖారి | 122 |
| ఏపురాణ | గుండక్రియ | 88 |
| ఏపొద్దూ | దేవగాంధారి | 333 |
| ఏమందురు | వరాళి | 36 |
| ఏమనితలఁచ | సాళంగనాట | 194 |
| ఏమనినుతించ | ప్రతాపనాట | 350 |
| ఏమనిపొగడ | వరాళి | 180 |
| ఏమనివిన్న | కాంబోది | 224 |
| ఏమిచెప్పే | శ్రీరాగం | 251 |
| ఏమిసేతుదైవమా | భైరవి | 105 |
| ఏమిసేయుదు | సామంత | 11 |
| ఏమిసేసే | మలహరి | 51 |
| ఏమీనెఱఁగని | మాళవిగౌళ | 135 |
| ఏరీతినెవ్వరు | ముఖారి | 173 |
| ఏలమమ్మ | రామక్రియ | 145 |
| ఏలోకమంటున్నా | ముఖారి | 89 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏపీనుపాయాలు | దేశాక్షి | 49 |
| ఏవుపాయములు | శుద్ధవసంతం | 408 |
| ఐనట్టయ్యీఁగాక | కాంబోది | 247 |
| ఒకటికొకటి | గుజ్జరి | 346 |
| ఒకటి సుజ్ఞాన | ధన్నాసి | 357 |
| ఒక్కఁడే | దేవగాంధారి | 186 |
| ఒక్కమనసు | ధన్నాసి | 477 |
| ఒడఁబరచు | గౌళ | 201 |
| ఒల్లఁడు | లలిత | 7 |
| కంచూఁగాదు | మలహరి | 21 |
| కంటిమి | సాళంగనాట | 86 |
| కంటిరా | సాళంగనాట | 470 |
| కటకటా | లలిత | 155 |
| కడమండి | దేసాళం | 519 |
| కనియుండి | దేసాక్షి | 513 |
| కన్నులపండుగ | బౌళి | 364 |
| కమలారమణ | కేదారగౌళ | 255 |
| కమ్మంచేఁగావా | ఛాయానాట | 446 |
| కరుణానిధివి | బౌళి | 410 |
| కరుణించు | లలిత | 34 |
| కలదిదివో | గుజ్జరి | 22 |
| కలదియీమూర్తి | శంకరాభరణం | 206 |
| కలశాపురము | మాళవి | 218 |
| కల్లమాడ | దేవగాంధారి | 18 |
| కలిగెనిదె | లలిత | 466 |
| కలిగెమాట | లలిత | 464 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కలిదోషము | ఆహిరి | 119 |
| కలియుగ | మాళవిగౌళ | 430 |
| కలుగుట | గుండక్రియ | 424 |
| కానవచ్చెఁగాన | లలిత | 518 |
| కానవచ్చె | శంకరాభరణం | 449 |
| కామధేనువిదే | లలిత | 488 |
| కామధేనువై | లలిత | 87 |
| కిన్నజానేఽహం | ముఖారి | 83 |
| కేశవదాపి | లలిత | 482 |
| కేశవనారాయణ | శ్రీరాగం | 365 |
| కైవల్యమున | దేసాళం | 483 |
| కొనమొద | మలహరి | 118 |
| కోటానఁగోట్లాయ | దేసాక్షి | 266 |
| కోటిమన్మథా | సామంతం | 280 |
| కోరిమా | మలహరి | 101 |
| కౌసల్యానందన | సాళంగనాట | 275 |
| గట్టిగాఁదెలుసు | గౌళ | 276 |
| గతులన్ని | దేసాళం | 372 |
| గరుడగమన | బౌళి | 391 |
| గుత్తాలఁగట్టి | మాళవి | 152 |
| గోరవై | పాడి | 406 |
| చంచలపడఁగ | పాడి | 281 |
| చాటెద | రామక్రియ | 164 |
| చాలువిదే | శ్రీరాగం | 440 |
| చిక్కువడ్డ | శుద్ధవసంతం | 63 |
| చిత్తగించి | భైరవి | 349 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చిత్తానఁబెట్ట | దేవగాంధారి | 337 |
| చిరకాల | లలిత | 495 |
| చీచీపివేక | శుద్ధవసంతం | 13 |
| చీచీవో | శంకరాభరణం | 115 |
| చూచి మోహించ | తెలుఁగుకాంబోది | 403 |
| చూచేమూపొకటి | పాడి | 141 |
| చూపఁజెప్పఁగల | భూపాళం | 60 |
| చెప్పవేనన్ను | భూపాళం | 327 |
| చెప్పితేఁబాసు | శ్రీరాగం | 312 |
| చెల్లఁబోతియ్యని | సామంతం | 59 |
| చెల్లఁబోయీ | శ్రీరాగం | 23 |
| చెల్లనెక్కి | కాంబోది | 84 |
| చేకొంటి | సాళంగం | 517 |
| చేపట్టి | శంకరాభరణం | 496 |
| చేసినవా | కన్నడగౌళ | 177 |
| చొచ్చితినీకు | శ్రీరాగం | 176 |
| జగన్మోహనా | బౌళి | 375 |
| జగమంతా | గుజ్జరి | 381 |
| జతనము | రామక్రియ | 318 |
| జపము | బౌళి | 342 |
| జయజయ | సాళంగనాట | 289 |
| జయమంగళము | గుండక్రియ | 431 |
| జలజనాభ | ధవళి | 386 |
| జీవునికి | దేసాళం | 103 |
| జీవునికే | సాళంగనాట | 392 |
| జ్ఞానయజ్ఞ | ధన్నాసి | 148 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| జ్ఞానులాల | సాళంగం | 26 |
| ఢోలాయాం | వరాళి | 374 |
| తందనాన | బౌళి | 385 |
| తనలో | కేదారగౌళ | 213 |
| తలఁగరో | లలిత | 144 |
| తలఁచుకో | సౌరాష్ట్రం | 242 |
| తలఁపులో | గుండక్రియ | 439 |
| తానే తెలియుఁగా | గుండక్రియ | 473 |
| తిరుమలగిరి | దేసాళం | 459 |
| త్రికరణశుద్ధి | గుజ్జరి | 236 |
| తుదసమస్తము | లలిత | 42 |
| తెలియరాదు | దేవగాంధారి | 335 |
| తెలిసితే | పాడి | 19 |
| తెలిసినమాట | బౌళి | 179 |
| తెలిసినవాఁడాఁగాను | రామక్రియ | 46 |
| తేళరణ | మంగళకౌశిక | 401 |
| తొల్లి యెట్టుండు | శవుళి | 380 |
| దాఁచుకో | గుండక్రియ | 338 |
| దానవారి | నాట | 229 |
| దిక్కునీవే | సాళంగనాట | 383 |
| దిక్కులు | సాళంగనాట | 239 |
| దినము | శ్రీరాగం | 151 |
| దీనరక్షకుఁడ | శుద్ధవసంతం | 178 |
| దేవతలు | సాళంగనాట | 478 |
| దేవనమో | మాళవి | 377 |
| దేవనీదయ | దేసాక్షి | 38 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దేవనీవు | ముఖారి | 307 |
| దేవనే | ధన్నాసి | 214 |
| దేవశిఖామణి | నాట | 93 |
| దేవుఁడు | శంకరాభరణం | 254 |
| దేవుఁడొక్కఁడే | మంగళకౌసిక | 241 |
| దేవునికి | గుండక్రియ | 426 |
| దేహంబొకటే | బౌళి | 378 |
| దేహమిది | గుండక్రియ | 163 |
| దేహినిత్యుఁడు | బౌళి | 419 |
| దైవమానీపెర | మలహరి | 190 |
| దైవమానీమాయ | భైరవి | 4 |
| దైవమా నీవే | ధన్నాసి | 158 |
| దైవమా నీవొక్కఁడ | శ్రీరాగం | 310 |
| దైవముతోడిదే | పాడి | 204 |
| దొంతివిషయము | లలిత | 407 |
| దొరకె | సాళంగనాట | 3 |
| దోమటి | లలిత | 415 |
| ధరణి | దేసాళం | 260 |
| ధరలో | గుండక్రియ | 435 |
| ధ్రువవరదా | మాళవి | 73 |
| నందగోప | బౌళి | 387 |
| నమఁజూచి | భైరవి | 187 |
| నన్నునింత | కన్నడగౌళ | 39 |
| నన్నేరఁగ | కాంబోది | 427 |
| నమోనమో | బౌళిరామక్రియ | 348 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
| --- | --- | --- |
| నమ్మలేము | దేసాళి | 66 |
| నమ్మవలెఁగాని | గౌళ | 264 |
| నమ్మినదొకటే | గుండక్రియ | 74 |
| నరుఁడా | సాళంగనాట | 497 |
| నాఁటికి | శంకరాభరణం | 85 |
| నాకునందు | సాళంగనాట | 28 |
| నాకునీవు | ముఖారి | 422 |
| నానాభక్తులివి | సాళంగం | 469 |
| నానామార్గముల | బౌళి | 125 |
| నారాయణ | ధన్నాసి | 331 |
| నారాయణాచ్యుతా | గుండక్రియ | 54 |
| నారాయణాచ్యుతా | సామంతం | 423 |
| నావల్లనీ | శ్రీరాగం | 484 |
| నిండె నిన్ని | నాట | 248 |
| నిక్కమైన | సామంతం | 428 |
| నిజము దెలియ | దేసాళి | 166 |
| నిత్యపూజ | మాళవిగౌళ | 82 |
| నిన్నునమ్మి | కన్నడగౌళ | 202 |
| నిన్నూనన్నూ | గుండక్రియ | 139 |
| నిరుహేతుక | ముఖారి | 106 |
| నిరుహేతుకాన | బౌళి | 468 |
| నిర్మలులు | శ్రీరాగం | 114 |
| నీకేలయీ | ముఖారి | 265 |
| నీచిత్తమిందరి | మాళవిగౌళ | 489 |
| నీచిత్తము | శంకరాభరణం | 263 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నీచేతలో | సామంతం | 512 |
| నీదాస్యమొక్కటే | భైరవి | 20 |
| నీమాయ | భవుళి | 458 |
| నీయంతటి | సాళంగనాట | 47 |
| నీయంతనీవే | దేవగాంధారి | 492 |
| నీవుజగన్నాథుఁడవు | భైరవి | 169 |
| నీవు నన్ను | కన్నడగౌళ | 192 |
| నీవు వెట్టినట్టి | దేసాక్షి | 360 |
| నీవు సర్వగుణ | మాళవిగౌళ | 514 |
| నీవు సర్వసముఁడ | శంకరాభరణం | 129 |
| నీవెంత | ధన్నాసి | 330 |
| నీవెరఁగ | రేవగుప్తి | 398 |
| నీవేదయ | ధన్నాసి | 336 |
| నీవేమాకు | ధన్నాసి | 329 |
| నీవేమూలము | సాళంగం | 394 |
| నీవేరక్షింతువు | దేసాళం | 500 |
| నీవేసేసిన | గుండక్రియ | 444 |
| నీవొక్కఁడ | లలిత | 425 |
| నీసొమ్ము | సామంతం | 441 |
| నూఁతులు | సామంతం | 8 |
| నెట్టన | రామక్రియ | 282 |
| నెప్పున | సామంతం | 130 |
| నేననఁగా | దేసాళం | 45 |
| నేనేమిఁజేయఁగ | గుండక్రియ | 433 |
| నేనేమెరిఁగి | నాదరామక్రియ | 373 |

| పంక్తి ప్రథమ మొదలు | రాగము | పంక్తి ప్రథమ సంఖ్య |
|---|---|---|
| నే మేబ్రహ్మ | ముఖారి | 30 |
| నేరఁగల | మాళవిగౌళ | 184 |
| పంటవండు | దేసాళం | 222 |
| పట్టలేవి | శంకరాభరణం | 472 |
| పనిగొన | దేసాళం | 351 |
| పరమపురుష | బౌళి | 367 |
| పరమపురుష | మలహరి | 453 |
| పరమపురుషుఁడీ | బౌళి | 509 |
| పరమాత్ముఁడు | భైరవి | 232 |
| పరమాత్ముఁడొ | శుద్ధవసంతం | 136 |
| పరము విహము | ముఖారి | 231 |
| పరులకై తే | నాదరామక్రియ | 316 |
| పసులఁగాచు | దేవగాంధారి | 332 |
| పాటెల్లా | రామక్రియ | 182 |
| పాపమెఱఁగ | ముఖారి | 62 |
| పావనము | భూపాళం | 359 |
| పురుషుండవి | బౌళి | 252 |
| పురుషులకు | మాళవి | 283 |
| పురుషోత్తముఁడ | శుద్ధవసంతం | 53 |
| పులుఁగు | ముఖారి | 5 |
| పెట్టినవీ | ధన్నాసి | 15 |
| పేరునారాయణుఁడవు | సాళంగనాట | 162 |
| పొరిసీకును | నాట | 246 |
| ప్రపన్నులకు | నాదరామక్రియ | 317 |
| బయలు మొరంగగు | సామంతం | 501 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| బలువుఁడు | మాళవి | 77 |
| బిరుదులన్నియు | శ్రీరాగం | 142 |
| భావించ | దేసాళం | 200 |
| భోగము | లలిత | 274 |
| భోగసహాయులై | పాడి | 99 |
| భోగించఁబుట్టిన | సాళంగం | 230 |
| భ్రమయక | లలిత | 203 |
| మగఁడు విడిచినా | మలహరి | 476 |
| మగటిమిగల | రామక్రియ | 250 |
| మచ్చికఁబ్రపంచపు | బౌళి | 386 |
| మతంగపర్వత | శంకరాభరణం | 223 |
| మనసువమ్మ | లలిత | 352 |
| మన లో | గుండక్రియ | 238 |
| మరిగితి | బౌళి | 455 |
| మర్దమర్ద | నాట | 81 |
| మరియొందూ | భైరవి | 146 |
| మరిహరి | దేసాక్షి | 29 |
| మహినుద్యోగి | వరాళి | 212 |
| మాపులే | దేసాక్షి | 157 |
| మాయకిదె | శుద్ధవసంతం | 240 |
| మిన్ను నేలా | సాళంగనాట | 227 |
| మీరుసాక్షి | కేదారగౌళ | 165 |
| మూఁడేమాటలు | హిందోళవసంతం | 233 |
| మెచ్చుమెచ్చు | రామక్రియ | 150 |
| మేలులేదు | దేవగాంధారి | 78 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మొక్కరే | సాళంగనాట | 379 |
| మొక్కెద | బౌళి | 516 |
| మొదలనే | భూపాళం | 267 |
| రాచాజ్ఞ | సామంతం | 447 |
| రాజీవనేత్ర | శ్రీరాగం | 273 |
| రామారామ | సాళంగనాట | 437 |
| రాముఁడు | పాడి | 219 |
| లావణ్య | శ్రీరాగం | 149 |
| లేదుభయము | శంకరాభరణం | 55 |
| వట్టిలంపటాలఁబడి | శంకరాభరణం | 159 |
| వసుధఁజూడఁబిన్న | బౌళిరామక్రియ | 217 |
| వాఁడెవో | నాట | 355 |
| వాదమేల | దేసాళం | 120 |
| వాదులేల | లలిత | 404 |
| వానికి | దేవగాంధారి | 443 |
| వారిదేపో | దేసాళం | 160 |
| వారివారికర్మ | శ్రీరాగం | 308 |
| వారివారిభాగ్య | రామక్రియ | 270 |
| విచారమెన్నఁడు | లలిత | 271 |
| విచారించు | కాంబోది | 1 |
| విజాతులన్నియు | లలిత | 383 |
| విడువరాదెంతైనా | అహిరి | 2 |
| వినవమ్మ | రామక్రియ | 462 |
| విభుఁడ | పాడి | 66 |
| విఱిగిపారెడి | నాట | 245 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| విటగిరి | సాళంగనాట | 91 |
| వివేకించ | శ్రీరాగం | 58 |
| విష్ణుఁడేయింతా | పాడి | 195 |
| విష్ణుఁడొక్కఁడే | నాట | 345 |
| వీదిలోన | లలిత | 418 |
| వీథుల | మాళవిగౌళ | 487 |
| వెడలె వెడలె | నాట | 515 |
| వెదకనేఁటికి | వరాళి | 506 |
| వెనకేదో | ముఖారి | 16 |
| వెన్నలు | పాడి | 32 |
| వెలుపల మఱవక | రామక్రియ | 137 |
| వెలుపలం వెదకితే | ముఖారి | 198 |
| వై [illegible]ాల | రామక్రియ | 494 |
| వే[illegible]లు | శంకరాభరణం | 278 |
| వైరోకభావన | పాడి | 123 |
| వేవరకు | పాడి | 35 |
| శరణంటి | లలిత | 24 |
| శరణన్న | శంకరాభరణం | 226 |
| శరణుశరణువిభీషణ | సాళంగనాట | 220 |
| శరణుశరణువేద | సాళంగనాట | 347 |
| శ్రీపతినీయాజ్ఞ | రామక్రియ | 147 |
| శ్రీపతినీవు | వరాళి | 258 |
| శ్రీవేంకటేశ్వరుఁడు | బౌళి | 107 |
| శ్రీవేంకటేశ్వరుని | రామక్రియ | 221 |
| షోడశకళానిధి | లలిత | 134 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| సంతలే | కాంబోది | 27 |
| సకలబలంబు | లలిత | 109 |
| సకలమైన | కన్నడగౌళ | 196 |
| సకలలోక | శ్రీరాగం | 279 |
| సకలోపాసకులకు | సాళంగనాట | 412 |
| సత్యము సేయఁగ | బౌళి | 269 |
| సదానందము | దేవగాంధారి | 369 |
| సమబుద్ధే | సామంతం | 409 |
| సరిగాఁడు | సామంతం | 298 |
| సర్వేశ్వరా | ముఖారి | 303 |
| సర్వోపాయముల | మలహరి | 132 |
| సింగారమూరితి | సామంతం | 471 |
| సింగారాల | సాళంగనాట | 228 |
| సిరిఁదొడపై | సాళంగనాట | 113 |
| సేయవివాఁడెవ్వఁడు | రామక్రియ | 72 |
| సౌరిదిమమ్మిట్టే | సామంతం | 257 |
| సోదించి | దేసాక్షి | 353 |
| హరిగోవిందా | గుండక్రియ | 339 |
| హరిదాసుల | ధన్నాసి | 44 |
| హరినారాయణ | పాడి | 507 |
| హరి నీదాసుల | శ్రీరాగం | 309 |
| హరి నీప్రతాప | సామంతం | 156 |
| హరినీవే | లలిత | 395 |
| హరినెఱఁగని | మాళవి | 414 |
| హరిభక్తి | గుండక్రియ | 56 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| హరియవతార | శ్రీరాగం | 100 |
| హరియునొక్కడే | శంకరాభరణం | 467 |
| హరియు సిరియు | గౌళ | 366 |
| హరియే | ముఖారి | 126 |
| హరివార | భూపాళం | 40 |
| హరిసేవొకటే | ధవళి | 420 |
| హరిహరి జగ | భైరవి | 320 |
| హరిహరి నీమహిమ | లలిత | 358 |
| హరిహరి నీమాయా | గుండక్రియ | 127 |
| హాసమీచిన | మాళవి | 368 |
| హితవే | భౌళి | 479 |

# 3-వ అనుబంధము

## సందిగ్ధ పదసమీక్ష

[తాళ్లపాకకవులవాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పది. ప్రత్యేకముగ ఈ పని గొప్పగ సాగవలసియున్నది. దానికుపస్కా-రకముగ, ఈ సంపుటములో నాదృష్టికి వచ్చిన కొన్నిపదములను లఘువుగ చర్చించితిని. నిఘంటువుల కెక్కనివీ, ఎక్కినా అన్యార్థ-ములందు ప్రయోగింపబడినవీ, వ్యాకరణమును పట్టిచూచేవి, ఇతర-భాషానిఘంటుప్రసిద్ధములు మాత్రమే ఇందు చర్చింపబడినవి.]

ఉంబళి : (పాట: 310)

పంచుకొన్నభాగాలు పంచమహాభూతాలు
పంచేంద్రియములే పరివారాలు
యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుపనేమున్నది.

ఉంబళి=పన్ను లేక అనుభవించువస్తువు అని శ. ర. అదియే ఇక్కడ పరిపోవుచున్నది 'ఉమ్మడి' శబ్దము, 'పొత్తం' 'ఒకే సమయమున' ఇత్యాద్యర్థములలో ప్రసిద్ధమగుటచే దీనితో అర్థమున సామ్యము లేదు.

2. కాయకము: (పాటలు: 242, 306)

మాయమౌఁ గొన్నాళ్లకు మానుషకృత్యములెల్లా
మాయముగావివి దైవికమహిమలెల్లా
కాయకములే తమకల్పితము లన్నియును
కాయకము గాక నిల్చుఁ గమలాక్షుమన్నన ॥తలఁ॥

(సంకీర్తన—242)

కాయకము అందరునుఁ గార్యవశపరులే
పాయని నీవకారణబంధుఁడవు
దాయగాం డ్లెవ్వరినైనాఁ దప్పించుకొనేవారే
బాయటనున్నా నీ వాపన్నశరణ్యుఁడవు ॥ ఎవ్వ ॥

(సంకీర్తన—306)

ఈ పదముకూడ సాక్షాత్తుగ నిఘంటువులందు కానరాదు. ప్రకరణములనుబట్టి మాయలు, అశాశ్వతములు అనునర్థమున ప్రయోగించినట్లున్నది.

ఇక—౧. ప్రత్యహవృద్ధి, రోజువడ్డీ (కే. వి.) ౨. రాకట్టు పెట్టిన ౨ అవులు మున్నగువాని నుపయోగించుకొని ఆ రూపముననుఁ బుచ్చుకొనువడ్డీ.

కాయకము = శరీరమునకు సంబంధించినది (పాపాది) అని సూ. ని. ఇచ్చినఅర్థములు ఇందు పొనగవు. 'కాయక' 'కాయిక' 'యకార' 'యికార' ములకు మన అన్నమయ్యలో అంత పట్టింపు లేదు కావున ఈ. సూ. ని. చూపితిమి.

3. కాలానుభాగి : (పాట: 214)

పతిఁ బెండ్లాడినయాలు పక్కమండి నిద్రించితే
కోతికి కాలానుభాగి గానవచ్చునా ?
తతి నేపనికి రాక తామసుఁడై వుండినా
గతియై శ్రీ వేంకటేశ కావకుండవచ్చునా.

కాలానుభాగి = అయాసమయములందు అనుభవమునకు భాగమైన దానిని. ఉంపుడుకత్తెను అని తాత్పర్యము కావచ్చు.

4. కుట్టిచాతనివారికి (పాట: 237)

పట్టిన మృదంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయము సేవకులము
గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే ॥ అతఁ ॥

కుట్టిచాతనివారికి=తక్కువజాతి సాతానివారికి కావచ్చునేమో? లేక కుట్టిసైతాన్ అను క్షుద్రప్రయోగము చేయువారు కావచ్చు. మొదటి అర్థములో కుట్టిశబ్దము నట్టివిశేషణము మాత్రమే. 'చాత్తాదె' అను పదము 'చాతాని' 'సాతాని' అని వ్యవహారములో నున్నది. అది 'చాతని' అను ధాతుజవిశేషణముగ ప్రయోగించినట్లు ఊహింపవచ్చును. జాతితో తక్కువవాడునై, వైష్ణవము పుచ్చుకొన్న బిగువుతో అందరియొద్ద జంకుగొంకులేక తిరుగువాడని తాత్పర్యార్థము కావచ్చు. 'కుట్టిసైతాన్' అను క్షుద్రప్రయోగము చేయువారుకూడ, తానూ పెద్దమంత్రశాస్త్రవేత్తవలె అందరివద్ద జంకుగొంకులేక తిరుగువాడు అను తాత్పర్యముకూడ సరిపోవుచున్నది. ఈ రెండును పాటలోని ప్రధానభావమునకు సరిపడుటలేదు.

5. తండుముండు పడేవారే (పాట: 56)

బిందుఁ జింతాజలధికి పీట్ల దవచిత్తమే
దండి పుణ్యపాపాలే దరులు
కొండలవంటి కరళ్లు కోరికె లెందు చూచినా
తండుముండు పడేవారే దాఁటలే రెవ్వరును ॥ హరి ॥

తండుముండుపడేవారే = దుందుడుకుగా ముందుకు దూకేవారే అని ప్రకరణముతో తోచుచున్నది.

కొండో నుయ్యో కుమతులాల
తండుముండు తట్టుముట్టు కాఁకైనఁ గనుఁడీ ॥ పల్లవి ॥

అధ్యా. సంపుటము-1 (1980) సంకీర్తన 160.

ఇక్కడ ఈ పదము "గడ్డిగాదము, పిల్లాజెల్లా" వలె జంట పదముగా తోచుచున్నది. ఇంకను అర్థము విచార్యము.

6. తలపిడి కొలుపిడి : (పాట: 5)

యిలమీఁద తమ సొమ్ము లెవ్వరివద్దనుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాఁడ
వెలయ నీ సొమ్మనుచు విడిపించుకొనవే ॥ పులు ॥

తలపిడి, కొలుపిడి ఈ పదముల కర్థము నిఘంటువులలో కానరాలేదు. సొమ్ముశబ్దసాహచర్యముతో నే నిట్లూహించుచున్నాను. దండలు మొదలైనవి చేయించునపుడు, ఇన్నిపిళ్ల(పిడుల)కొలత అని చేయించుట నేటికిని సంప్రదాయము. అట్లు చేయించిన సొమ్మును ఎవరైనదొంగిలించి, వారివద్ద పట్టుపడినచో, తలపిడి = తొలుత చేయించిన పిళ్లకొలత, కొలుపిడి = (ఇప్పుడాసొమ్మును పట్టుకొన్నప్పుడు) కొలువగా వచ్చిన పిళ్లకొలత ఒకటే ఐనచో ఇది నా సొమ్మే అని నిర్ధరించి తీసికొనునట్లు అనే అభిప్రాయముగా తోచుచున్నది. ఈ శబ్దమింకను విచార్యము.

7. తిట్టపెట్టి (పాట: 45)

చెట్టుల కెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలానఁ
బుట్టి కాచి పూచి నిండాఁబొదలుమని
గుట్టుతో చైతన్యమై గుణములన్నిటికిని
తిట్టపెట్టి రచించినదేవుఁ డింతేకాక ॥ నేన ॥

తిట్ట పెట్టి = దిట్టముచేసి 'కావచ్చు'. 'ఈవస్తువు స్వభావము ఇట్లా' అని నిర్ణయించుట. 'దిద్దు' నకు 'తిద్దు' ప్రయోగము ఈ వాఙ్మయమున ఎక్కువగ నుండుటచే దిట్టమును 'తిట్ట' అని వ్యవహరించిరేమోయని నా యూహ. అట్లే.

యేడతపము నాకేడజపము నే
వాడికఁ జేయఁగ నీకు వచ్చేవదేమి
బేడిదపుఁబెద్దలెల్లా బెట్టినతిట్టములంటా
యీడుకుఁజేసెగాక యిందేమిగలదు ॥నమ్మి॥
(పాట 74)

అను ప్రయోగముకూడా దీని కాధారమే.

8. దాదాత (పాటలు: 246, 518)

నాదింత వెఱచి సింగినాదా లూదుకొంటాను
సొదించేరంటాఁ గొందరు తోగులైరి
యీదెస శ్రీవేంకటేశ యిన్నియి మాని కొందరు
దాదాత నీ శరణని దాసరులైరి
(పాట—246)

వేదములు నాటివే విముకులు నాటివే
ఆదిమంది చదివే వదియే నేను
వేదతో వెన్నవట్టి నేయి వెదకఁబోయినయట్టు
దాదాత నాతెలివి యితరుల వడిగేను ॥కావ॥
(పాట 518)

ఈ పదము నిఘంటులయందు కానరాలేదు. ప్రకరణమునుబట్టి ఆయాస్థలములందు 'గట్టిగా' 'ఇంచుమించు' ఇత్యాది అర్థములయందు ప్రయోగించినట్లు కానవచ్చుచున్నది. ఇది ఇంకను విచార్యము.

9 నానుడిమాట (పాట: 298)

సరిగాఁడు పీఁడనవలదు జగమునరాజు వలసినది దేవులు
యిరవుగ వందను లోకములోపల యిది నానుడిమాట ॥పల్లవి॥ 29

'నాఁడు' కు సంబంధించిన 'నుడి' 'నానుడి'. నేడు నానుడులనీ, పలుకుబళ్లనీ, జాతీయములనీ, వ్యవహరించు పదములన్నియు ఇంచుమించు ఒకజాతికి చెందినవే. 'ఈ సీమయందు వాడుకొనే మాట' అనవచ్చు. ఇక్కడ మాట శబ్దమునకు పునరర్థము శంకింపరాదు. నానుడి అనునది సమస్తవ్యవహారము, మాటసామాన్య ముగా ప్రయోగించినది. 'నానుడియైన (లోకమున ఈ యర్థమున యీ మాట ప్రసిద్ధము అయిన) మాట. విగ్రహము.

10 బుద్బుజములు : (పాట : 450)

చేరి విన్నుఁ బూజింపవిచేయి దంతెనపుఁజేయి
తారి నీకు మొక్కనట్టితలయే పెడతల
సారె నీముద్రలేనిభుజములు బుద్బుజములు
తేరి నీదాస్యములేనిదేహము సందేహము ॥ అటు ॥

ఇది ఈ యాకారముతో నిఘంటువులందు కానరాలేదు.

"బుద్బుదమనంగఁ దనరును బుద్బుదంబు
లద్దువయనంగ లట్వ చెలంగు చుండు ......"

(ఆం. భా 2-255)

భక్ష్య విశేషమని సూ. ని. ఆ భక్ష్యమేదో తెలియరాలేదు. కొంచెము గుండుగా సుమారుపాటి పొడవైన భక్ష్యవిశేషమైతే ప్రకరణానికి సరిపోతుంది బుద్బుదమునకు బుద్బుజము అవి వ్యావహారికమేమో? ఇది ఇంకను విచార్యము. బుద్బుదము = (A bubble) అవి బ్రౌణ్యము. పెద్దనదులందు, సముద్రములందు, పొడవుగ నేర్పడే బుడగగూడ సరిపోతుంది.

11 బేడలు (పాట : 350)

వేడుక వాల మాకాశవీధితోఁ బెనచినాఁడు
యేడు జలధులు చేసె విదే మోకాళ్లబంటి
వోడక పిడికిలించి పుగ్రదైత్యుల తలలు
బేడలుగాఁ జేసినాఁడు పెద్దహనుమంతుఁడు ॥ ఏమ ॥

రెండుగా చీలిన పప్పుధాన్యములు. కందిబేడలు సెనగబేడలు వగైరా. ఈ బేడలు వ్యవహారము రాయలసీమయందు మాత్రమే ప్రసిద్ధము. సర్కారువారిలో కందిపప్పు సెనగపప్పు అనియే వ్యవహారము. రాయలసీమలో వుడికినదానికే పప్పు అనివ్యవహారము.

12 రళిత (పాట: 81)

కలితసుదర్శనకఠినవిదారణ
కులిశకోటిరవఘోషణా
ప్రళయానలసంభ్రమవిభ్రమకర
రళిత దైత్యగళరక్తవికిరణా ॥ మర్ద ॥

రల—ధాతువు కానరాలేదు. 'లల ఈప్సాయాం' అను ధాతు కృదంతరూపమగు 'లలిత' మునకు 'రలయోరభేదః' అనున్యాయమును జోడించి 'రళిత' వాడినట్లున్నది. 'గలిత' అనుట సహజము. యతిభంగమగునేమో? అయినను అన్నమయ్యసంస్కృతముపై మనమింత చర్చచేయవలసిన పనిలేదు. ఆయన చాల స్వతంత్రుడు.

13. స్వరూపదీక్ష (పాట : 148)

తదియ్యగురుప్రసాదపురోడాశ మిచ్చి
కొదదీర ద్వయమనుకుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షముచేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుఁడు ॥ జ్ఞాన ॥

స్వస్వరూపమును తెలిసికొనెడి దీక్ష. తన నిజస్వరూపమును గుర్తెరిగెడిదీక్ష అని భావము.

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, ॥. 2000.